అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

బుధవారం 17-07-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి: 10 | సంచిక: 198 | Published from Hyderabad,Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల: 6.50



విద్యుత్ కమిషన్ చైర్మెన్‌ను తొలగించాలి

తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీం ఆదేశం

- అంగీకరించిన సర్కార్
- కమిషన్ రద్దు చేయాలన్న కేసీఆర్ పిటిషన్ తిరస్కరణ
- విచారణ జరగాల్సిందేనన్న సుప్రీంకోర్టు
- పదవి నుంచి తప్పుకుంటూ సుప్రీంకు జస్టిస్ నరసింహారెడ్డి లేఖ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

విద్యుత్ ఒప్పందాల్లో అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిషన్ చైర్మెన్‌ను తొలగించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ...15లో



క్షేత్రస్థాయికి వెళ్లండి

సంక్షేమం అభివృద్ధిని బ్యాలెన్స్ చేయండి ... పథకాల అమలులో మానవీయ కోణాన్ని ఆవిష్కరించండి

ఏసీ గదులకే పరిమితమైతే సంతృప్తి ఉండదు

- ప్రజా ప్రభుత్వంలో పారదర్శక ప్రజాహిత పాలనందించాలి
- ఒక శంకరన్, శ్రీధరన్‌లా గుర్తింపు తెచ్చుకోండి : కలెక్టర్లు, ఎస్పీలకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"తెలంగాణను మీ సొంత రాష్ట్రంగా భావించి పని చేయండి. ప్రభుత్వానికి కండ్లు, చెవులు జిల్లా కలెక్టర్లే. ప్రజలకు ప్రయోజనం చేకూరేలా మానవీయ కోణంలో నిర్ణయాలుండాలి. ప్రజా ప్రభుత్వంలో పారదర్శక ప్రజాహిత పాలనందించాలి. సంక్షేమం, అభివృద్ధిని బ్యాలెన్స్ చేస్తూ ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మీపైనే ఉంది. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందే. కేవలం ఏసీ గదులకే పరిమితమైతే మీకూ ఎలాంటి సంతృప్తి ఉండదు.. ఒక శంకరన్, ఒక శ్రీధరన్ మాదిరిగా సామాన్య ప్రజలెప్పుడూ గుర్తు పెట్టుకునేలా పని చేయాలి" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాల యంలో జరిగిన జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్ల సదస్సులో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలపై సీఎం వారికి దిశానిర్దేశం చేశారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైన సమావేశం సాయంత్రం 6గంటల వరకు కొనసాగింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, సీఎస్‌తోపాటు అన్ని శాఖల కార్యదర్శులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఐఏఎస్ అధికారుల కెరీర్లో జిల్లా కలెక్టర్లుగా పని చేయటమే అత్యంత కీలకమైన అవకాశమని అన్నారు. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలుండే బాధ్యతలతో పాటు క్షేత్ర స్థాయిలో అన్ని అంశాలపై అవగాహన వస్తుందని పేర్కొన్నారు. పథకాలను చివరి లబ్దిదారుల వరకు చేరవేసే కీలక బాధ్యత కలెక్టర్లదేనని ముఖ్య మంత్రి గుర్తు చేశారు. ఏ జిల్లాలో ...5లో

విద్య

"ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి పేద విద్యార్థిపై ప్రభుత్వం ప్రతి నెలా రూ.85 వేలు ఖర్చు పెడుతుంది. తెలంగాణ పునర్నిర్మాణంతో పాటు పిల్లల భవిష్యత్తును నిర్దేశించే విద్యా వ్యవస్థను సమర్థంగా తీర్చిదిద్దే చర్యలు చేపట్టాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వసతిగృహాలు ఒకే చోట ఉండేందుకు వీలుగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను 20 నుంచి 25 ఎకరాల్లో ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తున్నాం. రహదారులకు అనుసంధానంగా ఉండే గ్రామాలు, పట్టణాల్లో వాటికి స్థలాల ఎంపిక చేయండి" అని సీఎం అన్నారు. రాష్ట్రంలోని 65 ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా (ఏటీసీ) అప్ గ్రేడ్ చేస్తున్నట్టు ముఖ్యమంత్రి తెలి పారు. కలెక్టర్లు పాఠశాలలను తనిఖీ చేయడంతో పాటు, డీఈవోలు, డిప్యూటీ డీఈవోలు తరచూ పాఠశాలలను తనిఖీ చేసేలా చూడాలని ఆదేశించారు.



పాస్‌బుక్ ఉన్న రైతు కుటుంబానికే రుణమాఫీ

- కుటుంబ నిర్ధారణకే రేషన్ కార్డు : కలెక్టర్ల సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం

వివరాలు 5లో

నిబంధనలు సవరించాలి

'రుణమాఫీ'ని రైతులందరికీ వర్తింపజేయాలి



- జీవోను యథాతథంగా అమలు చేస్తే లక్షలాది మంది అనర్హులవుతారు
- సాగదీత తగదు.. రీషెడ్యూల్ చేసినా వర్తింపజేయాలి
- నిర్వాసితులకు బహిరంగమార్కెట్ ప్రకారం పరిహారం
- సీజనల్ వ్యాధులపై వైద్యారోగ్యశాఖను అప్రమత్తం చేయాలి: సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

కౌలుదారులకు రైతుభరోసా, గుర్తింపు కార్డులివ్వాలి..

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

రుణమాఫీపై సాగదీతకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టు ఉందని, మార్గదర్శకాల్లో రేషన్‌కార్డు ఉంటేనే రుణమాఫీ అనడం సరికాదని, సాగుదారులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. రీషెడ్యూల్ చేసిన ప్రభుత్వమే పునరుద్ధరించిన వారికి వర్తించదనడం ఏమాత్రం సమంజసంగా లేదన్నారు. ఖమ్మం జిల్లా మధిరలోని శ్రీరస్తు ఫంక్షన్‌హాల్‌లో సీపీఐ(ఎం) జిల్లా విద్యా, వైజ్ఞానిక శిక్షణా తరగతుల ముగింపు సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన ప్లీనం సమావేశానికి హాజరైన తమ్మినేని విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రీ షెడ్యూల్ చేసిన రైతులకు కూడా రుణమాఫీ వర్తింపజేయాలన్నారు. రూ.2 లక్షలకు పైబడిన రుణాలను రైతే చెల్లించాలనడం సరికాదని, పెట్టుబడుల సమయంలో రైతు చెల్లించడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. నిబంధనలను సడలించి రైతులందరికీ న్యాయం చేయాలని కోరారు. గ్రామసభల ద్వారా కౌలురైతులను ...15లో

లేబర్ పార్టీ మాజీ నేత

కార్బిన్‌తో ఏచూరి భేటీ

- ప్రవాస భారతీయ కమ్యూనిస్టుల సంఘ సమావేశంలో ప్రసంగం

లండన్: బ్రిటన్‌లో శాంతి, న్యాయం కోసం పోరాడుతున్న లేబర్ పార్టీ మాజీ నేత, సోషలిస్టు జెరిమి కార్బిన్‌తో సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సోమవారం భేటీ అయ్యారు. అట్టడుగు వర్గాల ప్రజల గొంతుకగా కార్బిన్ ప్రపంచానికి తెలుసు. కీర్ స్టార్మర్ నేతృత్వంలోని ముఠా ఆయనను లేబర్ పార్టీ నుంచి గెంటివేసింది. అయినా, ఇస్లింగ్టన్ నార్త్ నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి భారీ మెజార్టీతో పార్లమెంటుకు ఆయన మరోసారి ఎన్నికయ్యారు. 1983 నుంచి కార్బిన్ లేబర్ అభ్యర్థిగా పార్లమెంటుకు గెలుపొందుతూ వస్తున్నారు. 2015- 2020 మధ్య లేబర్ పార్టీకి ఆయన నాయకత్వం వహించారు. పలు సంస్థల ఆహ్వానం మేరకు బ్రిటన్ వెళ్లిన ఏచూరి కార్బిన్‌తో గంటకుపైగా చర్చలు జరిపారు. బ్రిటన్, ఐర్లాండ్‌లోని ప్రవాస భారతీయ కమ్యూనిస్టుల సంఘ సమావేశంలో ఏచూరి ప్రసంగించారు. గ్రేట్ బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి రాబర్ట్ గ్రిఫిత్స్‌ను ఆయన కలుసుకున్నారు.



కార్బిన్‌తో చర్చల్లో పాలస్తీనా ప్రజల సంఘీభావ ఉద్యమం, ఉక్రెయిన్ యుద్ధం గురించి కూడా తామిరువురం చర్చించామని ఏచూరి తెలిపారు. ఈ సందర్భంగా ఏచూరి మాట్లాడుతూ, బ్రిటన్, భారత్ ఎన్నికల మధ్య అనేక సారూప్యతలు ఉన్నాయని చెప్పారు. బ్రిటన్‌లో ఫాసిస్టు నిగెల్ ఫరేజ్ సారథ్యంలోని యూకే రిఫార్మ్స్ పార్టీ 14 శాతానికిపైగా ఓట్లు సాధించడం ఆందోళనకరమైన విషయమని అన్నారు.



(ఫైల్)

కవితకు అస్వస్థత

ఆస్పత్రిలో చికిత్స, డిశ్చార్జి

మళ్లీ తీహార్ జైలుకు తరలింపు


15లో

గురుకుల విద్యార్థిని మృతి

సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలో ఘటన

మృతికి కారణాలపై విచారణ జరపాలి : మంత్రి పొన్నం

15లో



సాయుధపోరాటంలో కళాకారుల పాత్ర గొప్పది

సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి

- సమాజ విశ్లేషణతో ప్రజలు స్ఫూర్తి పొందాలి : సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు
- చైతన్యవంతంగా సుద్దాల హనుమంతు సమగ్ర సాహిత్యం-జీవితం పుస్తకావిష్కరణ

వివరాలు 5లో



21న అఖిలపక్షసమావేశం

23న పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్

వివరాలు 15లో



తుమ్మిడిహెట్టి వద్ద 160 టీఎంసీల నీటి లభ్యత

సీడబ్ల్యూసీ అప్పుడే తేల్చి చెప్పింది

పీసీ ఘోష్ కమిషన్‌కు తెలిపిన వెదిరె శ్రీరామ్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు డిజైన్ చేసినప్పుడు తుమ్మిడిహెట్టి దగ్గర 160 టీఎంసీల నీటి లభ్యత ఉందని కేంద్ర జలసంఘం చెప్పిందని కేంద్ర జల శక్తి శాఖ సలహాదారు, జాతీయ నదుల ...15లో



ఆ పది మందిపై చర్యలు తీసుకోండి

సుప్రీంకోర్టు జోక్యం వరకూ తెచ్చుకోవద్దు

- ఫిరాయింపులపై స్పీకర్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఫిరాయింపులకు పాల్పడిన పది మంది ఎమ్మెల్యేలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకునేంత వరకూ తెచ్చుకోవద్దని ఆయన సూచించారు. మంగళవారం అసెంబ్లీలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, పద్మారావు గౌడ్‌తోపాటు బీఆర్ఎస్‌కు చెందిన ఇతర ఎమ్మెల్యేలతో కలిసి కేటీఆర్ స్పీకర్‌తో భేటీ అయ్యారు. ఫిరాయింపులపై ఆయనకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం కేటీఆర్ విలేకర్లతో మాట్లాడుతూ... సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఫిరాయింపులకు పాల్పడిన వారిపై మూడు నెలల్లోగా స్పీకర్ తన నిర్ణయాన్ని ప్రకటించాలని గుర్తు చేశారు. ఇదే ...15లో

ఇంజినీరింగ్ సీట్లు 1,01,661

అదనంగా పెరిగినవి 3,365 సీట్లు

- కన్వీనర్ కోటాలో 72,741 సీట్లు
- వెబ్‌ఆప్షన్ల నమోదుకు నేడే ఆఖరు
- రేపు సీట్ల కేటాయింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్ కోర్సుల్లో 1,01,661 సీట్లు అందుబాటులో ఉన్నాయి. గతంలో 98,296 సీట్లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అదనంగా 3,365 సీట్లకు అనుమతి ఇవ్వడంతో 1,01,661 సీట్లకు పెరిగాయి. కన్వీనర్ కోటాలో 70,307 సీట్లుంటే తాజాగా 72,741 సీట్లు ఉన్నాయి. మూడు ఇంజినీరింగ్ కాలేజీల్లో ఐదు కొత్త కోర్సులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. సీవీఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (వీఎల్ఎస్ఐ డిజైన్ అండ్ టెక్నాలజీ) (ఈవీఎల్), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఎస్ఎఫ్), స్ఫూర్తి ఇంజినీరింగ్ కాలేజీలో సివిల్ ఇంజినీరింగ్ (సీఐవీ), తీగల కృష్ణారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్) (సీఎస్ఎం), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (డేటాసైన్స్) (సీఎస్‌డీ) కోర్సులకు అనుమతి ఇచ్చామని ఎప్‌సెట్ ప్రవేశాల కమిటీ కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ సైన్స్ అనుబంధ కోర్సుల్లో 70,248 సీట్లుంటే, కన్వీనర్ కోటాలో 49,786 సీట్లున్నాయని వివరించారు. ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజి నీరింగ్ కోర్సుల్లో 20,940 సీట్లకుగాను కన్వీనర్ కోటాలో 15,104 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సివిల్ మెకానికల్ అనుబంధ కోర్సుల్లో 1,283 సీట్లుంటే, కన్వీనర్ కోటాలో 1,046 సీట్లున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరానికిగాను 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రక్రియలో వెబ్‌ఆప్షన్ల నమోదు గడువు బుధవారం వరకే ఉందని తెలిపారు. 95,383 మంది అభ్యర్థులు 61,55,711 వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని వివరించారు. ఓ అభ్యర్థి అత్యధికంగా 1,051 ఆప్షన్లను నమోదు చేశారని తెలిపారు. ఈ నెల 19న తొలివిడత సీట్ల కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు ఇతర వివరాల కోసం https://tgeapcet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

ఇంజినీరింగ్ సీట్ల వివరాలు	
మొత్తం సీట్లు	1,01,661
కన్వీనర్ కోటాలో సీట్లు	72,741

అత్యవసర చికిత్సకు ఉపయోగపడే అంబులెన్స్

- ఏపీ సీఎం చంద్రబాబుకు అందజేత : వివేక్ ఆనంద్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అత్యవసర చికిత్సకు అవసరమైన పరికరాలతో కూడిన అంబులెన్స్‌ను ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు అందజేసినట్టు పర్వతనేని చాబిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి వివేక్ ఆనంద్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సోషలిస్టు నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి పర్వతనేని ఉపేంద్ర పేరుతో ఏర్పడిన సామాజిక సేవా సంస్థ ఈ ట్రస్ట్ అని తెలిపారు. నిర్మాణ సామాగ్రి సంస్థ లీయుగాంగ్ ఇండియా ప్రయి వేట్ లిమి టెడ్ సంస్థ సౌజన్యంతో రోగుల అవసరాల కోసం అంబులెన్స్‌ను అందజేసినట్టు చెప్పారు.

రుణమాఫీ జీవోను సవరించాలి

- రైతులకు న్యాయం చేయాలి
- ఏఐకేఎస్ జాతీయ కమిటీ సభ్యులు జూలకంటి డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన రుణమాఫీ జీఓ నెంబర్ 567ను సవరించి రైతులకు న్యాయం చేయాలని అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. రుణమాఫీకి రూపొందించిన నిబంధనల్లో గల అంశాలను సవరించి రూ.రెండు లక్షల వరకు రుణం పొందిన రైతులకు లబ్ధి కలిగేటట్టు సవరించాలని కోరారు. ప్రభుత్వ జీఓ ప్రకారం రేషన్‌కార్డు ఆధారంగా ఉన్న వారందరికీ ఒకే కుటుంబంగా పరిగణించి, ఒకే వ్యక్తికి రుణమాఫీ వర్తింపజేయడం వల్ల కుటుంబంతో విడిపోయిన వారికి వర్తించ బోదని తెలిపారు. ఆధార్ కార్డు, పాస్‌బుక్ డేటా, పీడీఎస్ స్టేషన్ డేటా ఒకటిగా ఉన్నవారికి వర్తింపజేస్తామనడం సరికాదని పేర్కొన్నారు. ఆధార్ కార్డు, పాస్ బుక్, రేషన్ కార్డు లేని కుటుంబాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయని వివరించారు. పాస్ పుస్తకాల కోసం ధరణిలో 12 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నట్టు ప్రజా పాలన సర్వేలో తేలిందని తెలిపారు. రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారు కూడా లక్షల సంఖ్యలో ఉన్నారని పేర్కొన్నారు. వ్యవసాయం కోసం రుణం తీసుకున్న స్వయం సహాయక బృందాలు (ఎస్‌హెచ్‌జీ), జాయింట్ లయబిలిటీ గ్రూప్, రైతుమిత్ర గ్రూప్, కౌలుదారులకు ఇచ్చిన రుణ అర్హత కార్డు ఉన్నవారికి రుణమాఫీ వర్తించబోదంటూ ప్రకటించడం సరైంది కాదని తెలిపారు. వాస్తవానికి ఈ నాలుగు గ్రూపుల్లోని వారు అత్యంత పేదలే కాక దళిత, గిరిజన వెనుకబడిన వర్గాలలో ఉన్న వారే ఎక్కువని వివరించారు. రీ షెడ్యూల్ చేసిన రుణాలకు కూడా రుణమాఫీ వర్తించబోదంటూ నిబంధన పెట్టడం వల్ల గతంలో కరువు, వరదల వల్ల నష్టపోయిన రైతులకు బ్యాంకులు రుణాలు మూడు నుంచి ఐదేండ్ల వాయిదాలపై షెడ్యూల్ చేశాయని తెలిపారు.

వారికి రుణమాఫీ వర్తించకపోవడంతో అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. రూ.రెండు లక్షలకుపైగా అప్పు తీసుకున్న వారు ఆపైన ఉన్న రుణం చెల్లిస్తేనే రుణమాఫీ వర్తిస్తుందంటూ నిబంధనలు పెట్టడం వల్ల చాలా మందికి అన్యాయం జరుగుతుందని తెలిపారు. పీఎం కిసాన్ డేటాకు రుణమాఫీని జోడించడం వల్ల చాలామంది రైతులు అర్హతను కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 72 లక్షల మంది రైతులు ఉన్నప్పటికీ బ్యాంకులు 43 లక్షల మందికి మాత్రమే అప్పులు ఇచ్చాయని వివరించారు. పీఎం కిసాన్ పథకం కింద 31 లక్షల మందికి వర్తింపజేశారని తెలిపారు అందువల్ల పీఎం కిసాన్ డేటాను వర్తింపజేయడం వల్ల రైతులు రుణమాఫీ పొందలేక పోతారని పేర్కొన్నారు. గతేడాది డిసెంబర్ తొమ్మిది తర్వాత రీ షెడ్యూల్ చేసిన రుణాలకు లేదా బుక్ అడ్జస్ట్‌మెంట్ చేసిన రుణాలకూ రుణమాఫీని వర్తింపజేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందుకనుగుణంగా జీవోను సవరించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

అశాంతి...ఒత్తిడితో సతమతం

- కోచింగ్ పేరిట సమాజానికి దూరంగా జీవనం
- వెంటాడుతున్న ఆర్థిక సమస్యలు
- నీట్ అభ్యర్థుల వెతలు



న్యూఢిల్లీ : నీట్-యూజీ పరీక్ష రాసిన వారందరూ తీవ్రమైన మానసిక అశాంతి, ఒత్తిడికి గురయ్యారు. పరీక్షకు సన్నద్ధమయ్యే పేరుతో సమాజ జీవనానికి దూరమయ్యారు. దీర్ఘకాలం కోచింగ్ తీసుకోవడం ఆర్థికంగా ఇబ్బంది పెట్టింది. కోచింగ్ కేంద్రాల్లో చేరిన వారు అధిక ఫీజులు భరించలేక మధ్యలోనే బయటికి వచ్చేశారు. కొందరైతే తీవ్ర ఒత్తిడికి లోనై మందులు వాడాల్సి వచ్చింది.

నీట్-యూజీ ఫలితాలను అనూహ్యంగా జూన్ 4న ప్రకటించారు. ఈ పరీక్ష కోసం 23 లక్షల మంది పేర్లు నమోదు చేసుకున్నారు. వీరిలో సుమారు 13 లక్షల మంది అర్హత సాధించారు. అయితే అందుబాటులో ఉన్న సీట్లు కేవలం 1,08,940 మాత్రమే. వీటిలో 706 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సుమారు యాభై వేల సీట్లు ఉన్నాయి. అట్టడుగు వర్గాలు, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల నుండి వచ్చిన విద్యార్థులు నీట్‌లో జరిగిన అవకతవకలు, కుంభకోణం కారణంగా అనేక ఇబ్బందులు పడ్డారు. ర్యాంకు వచ్చినప్పటికీ ప్రయివేటు వైద్య కళాశాలలో చదవాల్సి రావడం బలహీన వర్గాల వారికి ఇబ్బందికరమే. ఎందుకంటే అక్కడ ఫీజులు అధికంగా ఉంటాయి. ప్రభుత్వ కళాశాలలో ఎంబీబీఎస్ కోర్సుకు అయ్యే మొత్తం ఖర్చు కేవలం యాభై వేల రూపాయలు మాత్రమే. అదే ప్రైవేటు కళాశాలలో అయితే ఆ భారం యాభై లక్షల రూపాయలకు పైమాటే. చాలా మంది మంచి ర్యాంకులు ఆశించినప్పటికీ ఫలితాలతో నివ్వెరపోయారు. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలు, కుంభకోణమే దీనికి కారణమని పలువురు విద్యార్థులు ఆరోపించారు. ర్యాంకులు తారుమారు కావడంతో ఏం చేయాలో వారికి పాలుపోవడం లేదు. ఇప్పటికే మూడు నాలుగు సార్లు ప్రయత్నించామని, ఇక తమకు ఓపిక నశించిందని చాలా మంది వాపోయారు.

ర్యాంకుల్లో గందరగోళం కారణంగా పలువురు విద్యార్థులు అయోమయంలో పడిపోయారు. ఆరోగ్యం కూడా క్షీణించింది. కలలన్నీ కల్లలయ్యాయి. భవిష్యత్తు అంధకారమయమై పోయింది. వైద్య విద్యను అభ్యసించాలన్న లక్ష్యాన్ని వీడి ఏదో ఒక డిగ్రీలో చేరిపోవడం మంచిదని కొందరు భావిస్తున్నారు. గత ఆరు నెలలుగా రోజుకు 12-14 గంటలు చదివినా ఫలితం దక్కలేదని ఓ విద్యార్థి వాపోయాడు. 'ఈ ఒక్క పరీక్ష కోసం సమాజ జీవనాన్ని త్యాగం చేశాను. ఇలాంటి పరీక్షను పూర్తి భద్రతతో నిర్వహించడం జాతీయ స్థాయి సంస్థకు సాధ్యం కాదా? నేను మోసానికి గురయ్యాను' అని చెప్పాడు.

తన ఓఎంఆర్ నంబర్లు మ్యాచ్ కావడం లేదని మరో విద్యార్థి ఆరోపించాడు. 'నాకు 550 మార్కులు వస్తాయని అనుకుంటే 502 మాత్రమే వచ్చాయి. ఓఎంఆర్ నెంబర్లు తుది స్కోరుతో మ్యాచ్ కావడం లేదు' అని చెప్పాడు. మంచి ర్యాంక్ వచ్చినా ప్రభుత్వ కళాశాలలో సీటు వచ్చే పరిస్థితి లేదని, కాబట్టి మరోసారి పరీక్షకు సన్నద్ధమవక తప్పదని కొందరు విద్యార్థులు తెలిపారు. కొందరు మాత్రం మరోసారి పరీక్ష రాసే ఆలోచన చేయడం లేదు. ఏదైనా మరో డిగ్రీ చేయాలని అనుకుంటున్నారు. అన్ రిజర్వ్‌డ్ కేటగిరీలో కటాఫ్ మార్కులు పెరుగుతున్నాయని, ఈ పరిస్థితుల్లో మరో సంవత్సరాన్ని ఎందుకు వృథా చేసుకోవాలని ఓ విద్యార్థి ప్రశ్నించాడు. మళ్లీ చదవాలంటే కష్టమే అయినప్పటికీ పరీక్షను తిరిగి నిర్వహించాలని కొందరు డిమాండ్ చేస్తున్నారు. నీట్ పరీక్షా ఫలితాలు ప్రకటించిన తర్వాత రాజస్థాన్ కోటాలో కనీసం ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు.

నీట్ యూజీ పేపర్‌లీక్ కేసులో మరో ఇద్దరి అరెస్ట్

నీట్ -యూజీ పేపర్ లీక్ కేసులో మరో ఇద్దరిని సీబీఐ మంగళవారం అరెస్ట్ చేసింది. జార్ఖండ్ హజారీబాగ్‌లోని నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ (ఎన్టీఏ) కార్యాలయం నుంచి ప్రశ్నాపత్రాన్ని దొంగిలించిన కీలక నిందితుడు పంకజ్ కుమార్ అలియాస్ ఆదిత్య సహా మరో నిందితుడిని సీబీఐ అదుపులోకి తీసుకున్నట్టు అధికారులు తెలిపారు. ఈ ఇద్దరి అరెస్ట్‌తో నీట్ పరీక్షా పేపర్ లీకేజీ, మోసం, ఇతర అవకతవకలకు సంబంధించి అరెస్టైన వారి సంఖ్య 14కి చేరిందని అన్నారు. పంకజ్ కుమార్ అలియాస్ ఆదిత్య జంషెడ్‌పూర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటి)లో 2017 బ్యాచ్‌కి చెందిన సివిల్ ఇంజినీర్. బొకారో నివాసి అయిన పంకజ్‌ను పాట్నాలో అరెస్ట్ చేసినట్టు సీబీఐ అధికారులు వెల్లడించారు. నీట్ పేపర్‌ను దొంగిలించడంతో పాటు ఇతర గ్యాంగ్ సభ్యులకు అందించడంలో పంకజ్‌కు సహాయం చేసిన మరో నిందితుడు రాజు సింగ్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. నీట్ ప్రవేశపరీక్షలో అక్రమాలపై విచారణ జరుపుతున్న సీబీఐ ఆరు ఎఫ్ఐఆర్‌లను నమోదు చేసిన సంగతి తెలిసిందే.



అనాథలం.. అయినా!

51 శాతం దరఖాస్తుల తిరస్కరణ

- పీఎం కేర్స్ ఫర్ చిల్డ్రన్ స్కీమ్ తీరిది

న్యూఢిల్లీ : కరోనా మహమ్మారితో అనాథలైన చిన్నారుల కోసం పీఎం కేర్స్ ఫర్ చిల్డ్రన్ స్కీమ్ కింద వచ్చిన సుమారు 51 శాతం దరఖాస్తులను తిరస్కరించినట్టు అధికారులు మంగళవారం తెలిపారు. అధికారిక సమాచారం ప్రకారం.. 33 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని (యూటీఎస్) 613 జిల్లాల నుంచి మొత్తం 9,331 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో కేవలం 32 రాష్ట్రాలు, యూటీఎస్‌ల్లోని 558 జిల్లాల నుంచి 4,532 దరఖాస్తులను ఆమోదించారు. 18 దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచగా, 4,781 దరఖాస్తులను తిరస్కరించినట్టు మహిళా, శిశుసంక్షేమ మంత్రిత్వ శాఖ తెలిపింది. అయితే వాటిని ఏ కారణంగా తిరస్కరించారన్న అంశంపై స్పందించలేదు. రాజస్థాన్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ నుంచి అత్యధికంగా 1,553, 1,511, 1,007 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో మహారాష్ట్ర నుంచి 855, రాజస్థాన్ నుంచి 210, యూపీ నుంచి 467 దరఖాస్తులను మాత్రమే ఆమోదించినట్టు తెలిపింది.భారత్‌లో కరోనా కేసులు గరిష్టంగా ఉన్న 2021, మే 29న ఈ స్కీమ్‌ను ప్రారంభించారు. 2020 మార్చి 11 నుంచి 2023 మే 5 మధ్య కరోనాతో తల్లిదండ్రులను, చట్టపరమైన సంరక్షకులను, దత్తత తీసుకున్న తల్లిదండ్రులను, సంరక్షిస్తున్న తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు నగదు సాయం అందించడం ఈ పథకం లక్ష్యం. పిల్లలకు 23 ఏండ్ల వయస్సు వచ్చే వరకు ఆరోగ్య బీమా, విద్యా సాధికారత, ఆర్థిక సాయాన్ని అందించడం, నిరంతరం సమగ్ర సంరక్షణ, భద్రత కల్పించడం లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందించింది.

సర్వోన్నత న్యాయపీఠంపై

తొలిసారి మణిపూర్‌కు ప్రాతినిధ్యం

- సుప్రీంకోర్టు జడ్జిగా జస్టిస్ కోటీశ్వర్ సింగ్
- జస్టిస్ మహదేవన్‌కు పదోన్నతి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

భారత సర్వోన్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో తొలిసారి మణిపూర్‌కు ప్రాతినిధ్యం దక్కింది. ఆ రాష్ట్రానికి చెందిన జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. సర్వోన్నత న్యాయస్థానంలో మణిపూర్ వ్యక్తి న్యాయమూర్తి కావడం ఇదే తొలిసారి. జస్టిస్ కోటీశ్వర్ సింగ్‌తో పాటు ఆర్ మహాదేవన్ కూడా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. వీరు ఇరువురికి పదోన్నతి కల్పిస్తూ సుప్రీంకోర్టు కొలీజియం ఇటీవలే ప్రతిపాదనలు చేసింది. ఇద్దరు న్యాయమూర్తుల నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొత్త నియామకాలతో సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 34కు చేరింది.

జస్టిస్ కోటీశ్వర్ సింగ్ ప్రస్తుతం జమ్మూకాశ్మీర్, లడఖ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నారు. ఆయన మణిపూర్ తొలి అడ్వకేట్ జనరల్ ఎన్ ఇబోటోంబి సింగ్ కుమారుడు. 1986లో న్యాయవాదిగా కెరీర్ ప్రారంభించిన కోటీశ్వర్ సింగ్ కూడా మణిపూర్ అడ్వకేట్ జనరల్‌గా చేశారు. గౌహతి, మణిపూర్ హైకోర్టుల్లో పని చేశారు.

జస్టిస్ మహాదేవన్ ప్రస్తుతం మద్రాసు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నారు. చెన్నైలో జన్మించిన మహాదేవన్ మద్రాసు న్యాయ కళాశాలలోనే న్యాయ విద్య పూర్తి చేశారు. న్యాయవాదిగా దాదాపు తొమ్మిది వేల కేసులను ఆయన వాదించారు. తమిళనాడు అదనపు ప్రభుత్వ ప్లీడర్‌గా చేశారు. 2013లో మద్రాసు హైకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొంది సేవలందించారు. ఇప్పుడు సుప్రీంకోర్టు జడ్జిగా పదోన్నతి పొందారు.

వ్యాక్సినేషన్‌లో భారత్ పూర్

- లక్షలాది మందికి ఒక్క డోసూ అందలేదు
- గాలిలో కలుస్తున్న ప్రాణాలు
- డబ్ల్యూహెచ్ఓ-యూనిసెఫ్ తాజా నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ : చిన్నారుల్లో రోగనిరోధక శక్తిని మెరుగుపరచేందుకు భారత్‌లో జరుగుతున్న ప్రయత్నాలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వడం లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ-యూనిసెఫ్ తాజా నివేదిక తెలిపింది. బాలల్లో రోగనిరోధకత రేటును పెంచేందుకు చేసిన ప్రయత్నాలు కోవిడ్ సమయంలో...అంటే 2020లో ఫలించలేదు. 2020, 2021 సంవత్సరాల్లో ఈ రేటు తగ్గిపోయింది. అయితే 2022లో పరిస్థితి కొంత ఆశాజనకంగా కన్పించినప్పటికీ 2023లో మళ్లీ మొదటికి వచ్చింది. చిన్నారులకు ఆశించిన స్థాయిలో వ్యాక్సినేషన్ ఇవ్వకపోవడమే దీనికి కారణం.

రెండు వ్యాధులకు కనీసం ఒక్క డోసు వ్యాక్సిన్ కూడా తీసుకోని చిన్నారుల సంఖ్య అధికంగా ఉన్న దేశాల్లో భారత్ కూడా ఒకటని డబ్ల్యూహెచ్ఓ-యునిసెఫ్ నివేదిక తెలియజేసింది. రోగనిరోధకత రేటు తగ్గడం వల్ల శిశుమరణాలు, పిల్లల్లో అనారోగ్యాలు అధికంగా ఉంటున్నాయి. 2022లో మన దేశం చిన్నారులకు అన్ని రకాల వ్యాక్సిన్లను సంతృప్తికర స్థాయిలో అందించగలిగింది. కానీ 2023లో సీను రివర్స్ అయింది. గత సంవత్సరం పిల్లలకు బీసీజీ, డీటీపీ (రెండు డోసులు), హెపటైటిస్, తట్టు (మొదటి డోసు), రోటా వైరస్ (డయేరియా) తదితర వ్యాక్సిన్లు తక్కువగా అందించారు. వీటిలో చాలా టీకాల వినియోగం ఇప్పటికీ కోవిడ్‌కు ముందున్న స్థాయికి చేరలేదు.

టీకాల వినియోగం తగినంతగా లేకపోవడంతో దేశంలోని చిన్నారులు పలు వ్యాధుల బారిన పడుతున్నారు. వీటిలో తట్టు ఒకటి. 2023 అక్టోబర్-2024 మార్చి మధ్యకాలంలో దేశంలో 15,590 తట్టు కేసులు నమోదయ్యాయి. ప్రపంచంలోని చిన్నారుల్లో మూడో వంతు మంది ఈ వ్యాధికి గురవుతున్నారు. వ్యాక్సినేషన్ తక్కువగా జరగడమే దీనికి కారణమని నివేదిక స్పష్టం చేసింది. రోగ నిరోధకత రేటు తగ్గడమే కాదు... ఎక్కువ మంది పిల్లలు కనీసం ఒక్క డోసు కూడా వేసుకోలేదు. గత సంవత్సరం దేశంలో 16 లక్షల మంది చిన్నారులకు ఒక్క డోసు డీటీపీ వ్యాక్సిన్, తట్టు వ్యాక్సిన్ కూడా వేయలేదు. 2022లో ఈ సంఖ్య 11 లక్షలుగా ఉంది.

తట్టు వ్యాధి నివారణకు ఒక్క డోసు వ్యాక్సిన్ కూడా తీసుకోని పిల్లల సంఖ్య విషయంలో నైజీరియా, డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో తర్వాతి స్థానం మన దేశానిదే. డీటీపీ వ్యాక్సిన్ తొలి డోసు తీసుకోని చిన్నారుల సంఖ్య నైజీరియా తర్వాత భారత్‌లోనే ఎక్కువగా ఉంది.

బలమైన శక్తిగా ఇండియా బ్లాక్

- ఆర్ఎస్ఎస్‌కు వ్యతిరేకంగా సైద్ధాంతిక ప్రచారోద్యమం : సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ప్రతిపక్ష పార్టీల మధ్య సీట్ల పంపకం, పరస్పర అవగాహన ఉంటే, ఇండియా బ్లాక్ మరింత మెరుగ్గా పని చేయగలదని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా తెలిపారు. ఇండియా బ్లాక్ భవిష్యత్తులో మరింత బలపడుతుందని, తమ పార్టీ దాని కోసం కృషి చేస్తుందని అన్నారు. సీపీఐ జాతీయ కౌన్సిల్ సమావేశం జులై 13 నుంచి 15 వరకు జరిగింది. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు బంత్ సింగ్ బ్రార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డి.రాజా రాజకీయ, ఆర్థిక వ్యవహారాలు, పార్లమెంట్ ఎన్నికల సమీక్ష నివేదికను సమర్పించారు. దీనిపై సభ్యులంతా సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలకు సంబంధించిన 11 తీర్మానాలను ఆమోదించారు. అనంతరం మంగళవారం నాడిక్కడ సీపీఐ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డి.రాజా మాట్లాడుతూ బీజేపీకి పూర్తిస్థాయి మెజార్టీ రాకుండా, ప్రతిపక్ష ఇండియా ఫోరాన్ని ప్రధాన ప్రతిపక్షంగా మార్చడంతో రాజ్యాంగాన్ని మార్చాలనే బీజేపీ ఆలోచనను దేశ ప్రజలు ఓడించారని అభినందించారు. దేశవ్యాప్తంగా ఆర్ఎస్ఎస్‌కు వ్యతిరేకంగా సైద్ధాంతిక ప్రచారోద్యమం చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. ప్రతిపక్ష నాయకులను వేధించడానికి, అసమ్మతిని అణిచివేయడానికి ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయడానికి కొత్త క్రిమినల్ చట్టాలు అమలు చేస్తున్నారని విమర్శించారు. వామపక్షాలకు కేవలం తొమ్మిది సీట్లు రావడం పట్ల సీపీఐ ఆందోళన వ్యక్తం చేసిందని, పార్టీని, ఉద్యమాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. 2024 డిసెంబర్ 26 నుంచి పార్టీ ఆవిర్భవించి వందేండ్లకు అడుగు పెడుతున్నందున.. పార్టీని, ఉద్యమాన్ని మళ్లీ చైతన్యవంతం చేసేందుకు పలు కార్యక్రమాలను ప్రారంభించాలని నిర్ణయించారు. రాజ్యాంగంలోని లౌకిక, ప్రజాస్వామ్య రక్షణలో అన్ని లౌకిక, ప్రజాస్వామ్య, వామపక్ష శక్తుల సహకారాన్ని బలోపేతం చేయడం తమ ప్రాథమిక కర్తవ్యమని, ఈ లక్ష్యాన్ని నెరవేర్చడానికి తాము పార్లమెంటు లోపల, పార్లమెంటు వెలుపల ఇండియా బ్లాక్‌కు మద్దతును కొనసాగిస్తామని అన్నారు.

ప్రజల జీవనోపాధి సమస్యలపై పార్టీ స్వతంత్రంగా, అలాగే ఇతర వామపక్ష పార్టీలతో కలిసి నిరంతర పోరాటం చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఇలాంటి పోరాటాలు సైద్ధాంతికంగా, రాజకీయంగా ప్రాంతీయ పార్టీలపై ప్రభావం చూపుతాయని అన్నారు. పాలస్తీనా ప్రజలతో సంఘీభావ ప్రచారం, నాటోకు వ్యతిరేకంగా అంతర్జాతీయ పరిణామాలపై పార్టీ ప్రచారాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలలో వివిధ రూపాల్లో బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లకు వ్యతిరేకంగా ప్రచారం చేయనున్నట్టు తెలిపారు. ప్రజాస్వామ్య, మానవ హక్కుల పరిరక్షణకు ప్రజలు, కార్మికులు, రైతులు, మహిళలు, యువత, విద్యార్థుల స్వతంత్ర, ఐక్య పోరాటాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మహారాష్ట్ర, జార్ఖండ్, హర్యానా, జమ్మూకాశ్మీర్‌లో త్వరలో జరగనున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలతోపాటు స్థానిక సంస్థల ఎన్నికలకూ ఇప్పటి నుంచే రాజకీయంగా, సంస్థాగతంగా సన్నద్ధం కావాలని పిలుపునిచ్చినట్లు తెలిపారు. పార్టీ శతాబ్ది ఉత్సవాల కార్యక్రమం ఫ్రేమ్‌వర్క్‌లో భాగంగా కార్యకలాపాలను నిర్వహించాలని పిలుపిచ్చారు.

సాంస్కృతిక, సామాజిక రంగాల్లోనూ పోరాటాలు

బీజేపీని ఓడించడమే సీపీఐ(ఎం) ప్రధాన లక్ష్యం

- భారత రాజ్యాంగాన్ని మార్చటమే..బీజేపీ లక్ష్యం
- రాష్ట్రంలో ఆశించిన స్థాయిలో లేని కాంగ్రెస్ పాలన : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



నవతెలంగాణ-మధిర/బోనకల్

బీజేపీకి వ్యతిరేకంగా సాంస్కృతిక, సామాజిక రంగాల్లో కూడా క్షేత్రస్థాయిలో పోరాటాలు నిర్వహించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో భారత రాజ్యాంగాన్ని మార్చటమే లక్ష్యంగా.. బీజేపీ 370 ఎంపీ స్థానాల లక్ష్యంతో బరిలోకి దిగిందని, కానీ ఓడిపోయిం దన్నారు. ఒకరకంగా బీజేపీపై ఇండియా బ్లాక్ విజయం సాధించిందన్నారు. ఖమ్మం జిల్లా మధిర మండలం దెందుకూరు గ్రామంలోని శ్రీరస్తు ఫంక్షన్ హాల్‌లో సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా ప్లీనాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బుగ్గవీటి సరళ, భూక్య వీరభద్రం, పొన్నం వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తమ్మినేని పాల్గొని మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో బీజేపీని ఓడించడమే సీపీఐ(ఎం) ప్రధాన లక్ష్యమని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పరిపాలన ఆశించిన స్థాయిలో లేదన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో గతం కంటే కాంగ్రెస్ బలం పెరిగిందన్నారు. కేంద్రంలో బీజేపీ బలం తగ్గినా పరిపాలనలో ఏమాత్రం తేడా ఉండదని అన్నారు. బీజేపీ లౌకికతత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని విమర్శించారు. పార్లమెంటు ఎన్నికల్లో ఎన్డీఏ కూటమిలోని ప్రాంతీయ పార్టీలు ఓడిపోగా, ఇండియా బ్లాక్‌లోని ప్రాంతీయ పార్టీల బలం పెరిగిందన్నారు. గతంలో బీజేపీ ఉత్తర భారతదేశంలో బలంగా ఉండేదని, కానీ ఇటీవల జరిగిన ఎన్నికల్లో బాగా బలహీన పడిందని, కానీ దక్షిణాది రాష్ట్రాల్లో బలం పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ బలం తగ్గటంతో బీజేపీ బలం పెరిగిందన్నారు. ఇది తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఎంతో ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి బీజేపీ మతోన్మాద ప్రమాదం పొంచి ఉందని, దాన్ని పెరగకుండా చేయటమే సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ లక్ష్యంగా పెట్టుకుందని స్పష్టంచేశారు. దీనికోసం రాష్ట్రంలో కమ్యూనిస్టుల బలం పెరగాల్సి ఉందన్నారు.

రైతులకు రూ.2 లక్షల రుణమాఫీలో కాంగ్రెస్ ప్రభుత్వం కొర్రీలు పెడుతున్నదని, ఎటువంటి షరతులు లేకుండా మాఫీని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రూ. 2 లక్షల కంటే ఎక్కువ రుణం ఉన్న రైతులు ముందుగా ఎక్కువగా ఉన్న రుణాన్ని చెల్లించిన తర్వాత ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని చెప్పటం రైతులను మోసం చేయడమేనని అన్నారు. రుణమాఫీలో కౌలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నష్టం కలిగిస్తుందని విమర్శించారు. అన్ని వర్గాల ప్రజల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాల అవలంబిస్తే మాత్రం సీపీఐ(ఎం) వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. భవిష్యత్తులో పోరాటాలు ఉధృతమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. అందుకనుగుణంగా సీపీఐ(ఎం) శ్రేణులు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో ప్రజలను అంటిపెట్టుకొని పోరాటాలు నిర్వహించాలని తెలిపారు. రాష్ట్రంలో ప్రజాతంత్ర సంఘటనను నిర్మించవలసిన అవసరం ఉందన్నారు. ముందుగా వామపక్షాల ప్రజా సంఘాల ఐక్యవేదిక నిర్మించాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించినట్టు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు సెప్టెంబర్, అక్టోబర్‌లో జరిగే అవకాశం ఉందని, పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని తెలిపారు. గెలుపే లక్ష్యంగా రాజకీయ విశ్వాసం కలిగిన పార్టీ అభ్యర్థులను పోటీలోకి దింపాలని వివరించారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కళ్యాణం వెంకటేశ్వరరావు, చింతలచెరువు కోటేశ్వరరావు, మాచర్ల భారతి, బొంతు రాంబాబు, యనమదల విక్రమ్, జిల్లా కమిటీ సభ్యులు, జిల్లా ఫ్రాక్షన్ కమిటీ సభ్యులు, మండల కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శులు, పూర్తి కాలం కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'రేషన్ కార్డు' నిబంధన సరికాదు

- ఆ పేరుతో రైతులకు అన్యాయం చేయొద్దు
- అందరికీ రుణమాఫీ చేయాల్సిందే : మాజీమంత్రి హరీశ్‌రావు డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రేషన్‌కార్డులు ఉన్నవారికే రుణమాఫీ చేస్తామంటూ ప్రభుత్వం ప్రకటించటం సరికాదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ...కొత్త రేషన్ కార్డులు జారీ చేయకపోవటానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని వ్యాఖ్యానించారు. రుణమాఫీకి రేషన్ కార్డు కాకుండా పాస్‌బుక్కును మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలని సూచించారు. గతంలో తమ ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా రైతులందరి రుణాలను మాఫీ చేసిందని గుర్తు చేశారు. పీఎం కిసాన్ సమ్మాన్ పథకం అనేది రాష్ట్రంలో సగం మంది రైతులకు కూడా అందలేదని తెలిపారు. అలాంటి నిబంధనలతో రేవంత్ సర్కార్ రైతులకు అన్యాయం చేసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. గతంలో ప్రకటించిన మేరకు రైతు భరోసా నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో తమ పార్టీ తరఫున రుణమాఫీపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. అధికారంలోకి రావటానికి ముందు కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను ప్రకటించిందనీ, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటిని ప్రభుత్వం అమలు చేయలేదనే విషయాన్ని తాను గతంలోనే చెప్పానని గుర్తు చేశారు. అన్నదాతలకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం, అందుకు భిన్నంగా వారి ఆత్మహత్యలకు కారణవుతోందని హరీశ్ ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సమస్యలపై సర్కారు స్పందించకపోతే తమ ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

బంగ్లాలు ఖాళీ చేయండి

- 200 మంది మాజీ ఎంపీలకు నోటీసులు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీలోని అధికారిక బంగ్లాలు ఖాళీ చేయాలని 200 మందికిపైగా మాజీ లోక్‌సభ సభ్యులకు నోటీసులు జారీ అయ్యాయి. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వర్గాలు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం అనధికారికంగా ప్రభుత్వ బంగ్లాలో ఉండేవారిని ఖాళీ చేయించడానికి ఉద్దేశించిన చట్టం ప్రకారం ఈ నోటీసులను జారీ చేశారు. వీరు త్వరగా ఖాళీ చేయకపోతే, బలవంతంగా ఖాళీ చేయించేందుకు అధికారులను పంపిస్తారు. నిబంధనల ప్రకారం, గత లోక్‌సభ రద్దయిననాటి నుంచి ఒక నెలలోగా ఎంపీలు తమ అధికారిక బంగ్లాలను ఖాళీ చేయాలి. అయితే వీరిలో ఎన్నికల్లో ఓటమి చెందిన వారు, అలాగే రాజ్యసభ సభ్యులుగా పదవీకాలం ముగిసిన వారూ ఉన్నారు.

వలస కార్మికులపై ఇంత నిర్లక్ష్యమా?

- 4 వారాల్లో వెరిఫికేషన్ పూర్తి చేయాలి
- రాష్ట్రాలకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ : వలస కార్మికులకు రేషన్ కార్డుల జారీ విషయంలో రాష్ట్రాల నిర్లక్ష్య ధోరణని సుప్రీంకోర్టు తీవ్రంగా ఆక్షేపించింది. వెరిఫికేషన్ పేరుతో జరుగుతున్న జాప్యంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. నాలుగు వారాల్లోగా వెరిఫికేషన్‌ను పూర్తి చేయాలని ఆదేశించింది. రేషన్ కార్డుల కోసం ఇ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న వలస కార్మికుల వెరిఫికేషన్ ప్రక్రియను ఆలస్యం చేస్తుండటం చాలా దురదృష్టకరమని వ్యాఖ్యానించింది. ఈ ప్రక్రియను నాలుగు వారాల్లోగా పూర్తి చేయాలని రాష్ట్రాలను ఆదేశించింది. జాతీయ ఆహార భద్రత చట్టం కింద కోటాతో సంబంధం లేకుండా వలస కార్మికులకు రాష్ట్రాలు రేషన్ అందించాలంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. ఇ-శ్రమ్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న దాదాపు 8 కోట్ల వలస కార్మికులకు రేషన్ కార్డులు జారీ చేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను గతంలోనే సుప్రీంకోర్టు ఆదేశించింది. అయితే, ఇప్పటివరకు తెలంగాణ, బీహార్ రాష్ట్రాలు మాత్రమే వారికి రేషన్ కార్డుల జారీ కోసం 100శాతం వెరిఫికేషన్ పూర్తి చేశాయి. పిటిషన్‌పై మంగళవారం విచారణ సందర్భంగా ఈ విషయాన్ని సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. కార్డులు జారీ అయినప్పటికీ కొన్ని రాష్ట్రాలు కార్మికులకు రేషన్ అందజేయడం లేదని తెలిపారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం నుంచి అదనపు రేషన్ రావట్లేదని ఆయా రాష్ట్రాలు చెబుతున్నట్టు పేర్కొన్నారు. దీంతో ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. 'ఇది చాలా దురదృష్టకరమైన విషయం. నాలుగు నెలలైనా వెరిఫికేషన్ ప్రక్రియను ఎందుకు పూర్తిచేయలేదు.

సంపాదకీయం

పంచపాండవులు..మంచం కోళ్లు!



పంచపాండవులంటే.. మంచం కోళ్లలా... మూడు చూపించబోయి.. సామెతలా ఉంది రుణమాఫీ మార్గదర్శకాలు. రేవంత్ సర్కారు రుణమాఫీకి సంబంధించిన విధివిధానాలను విడుదల చేసింది. అప్పు, వడ్డీ మొత్తం కలిపి కుటుంబానికి రూ.రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రుణమాఫీ మొత్తాన్ని డైరెక్టుగా లబ్ధిదారుల రుణ ఖాతాలకు నగదు బదిలీ పద్ధతిలో జమ చేస్తామని కూడా చెప్పింది. రుణమాఫీ పొందాలంటే ఆధార్, ఆహార భద్రతా కార్డు, పట్టా పాసు పుస్తకాలకు లింకు పెట్టడంతో గొళ్లాలు పడ్డాయి.

ప్రభుత్వ జీవోను పరిశీలిస్తే ఆదార్‌కార్డు, పాస్‌బుక్ డేటా, రేషన్‌కార్డు డేటా ఒకటిగా ఉన్న వారికే రుణమాఫీ వర్తింప చేసింది. అయితే ఈ కార్డులేవీ లేని కుటుంబాలు రాష్ట్రంలో లక్షల్లో ఉన్నాయి. గత పదేండ్ల నుండి రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వనే లేదు. మరి ఈ పదేండ్లలో పెండ్లి చేసుకొని వేరు కుటుంబాలు పెట్టుకున్న వారి పరిస్థితేంటీ? అలాగే పహనీ ఉన్నప్పటికీ పాసు పుస్తకం ఉంటేనే రుణమాఫీ వర్తిస్తుందని కూడా మరో లింకు పెట్టారు. ఇప్పటికే పాసు పుస్తకాల కొరకు ధరణిలో 12 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నట్లు ప్రభుత్వ ప్రజాపాలన సర్వేలో తేలింది. అవి ఏండ్ల నుండి అలాగే పెండింగ్‌లో ఉన్నాయి. ఇక రేషన్‌కార్డుల కొరకు దరఖాస్తు చేసుకున్న వారు కూడా లక్షల్లో ఉన్నారు. కానీ ప్రభుత్వ జీవో ప్రకారం రుణమాఫీ మాత్రం ఆధార్‌కార్డు, పాస్‌బుక్, రేషన్‌కార్డు ఉన్న వారికే వర్తింపజేశారు. ఈ షరతుల వల్ల చిన్న, సన్నకారు, కౌలు రైతులే ఎక్కువగా నష్టపోతున్నారు.

> ఇప్పటికే రైతుల, రైతు సంఘాల ఆందోళన గమనించిన రాష్ట్ర సర్కారు ఆహార భద్రతా కార్డుతో సంబంధం లేకుండా రైతులందరికీ రుణమాఫీ వర్తింప చేస్తామని చెప్పింది. అయితే దీన్ని నిజంగా అమలు చేస్తారో లేదో అనే అను మానం మాత్రం రైతుల్లో ఉంది. కనుక ఈ విషయాన్ని జీవోలో వెంటనే పొందుపరచాలి. అలాగే రాష్ట్ర ప్రభుత్వం నిజంగా రైతులకు మేలు చేయాలనుకుంటే వాస్తవ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని రైతు సంఘాలు కోరినట్టు జీవోలో పేర్కొన్న సమస్యలకు వెంటనే సవరణలు చేయాలి.

అలాగే వ్యవసాయం కోసం రుణం తీసుకున్న సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్స్ (స్వయం సహాయక బృందాలు) జాయింట్ లయబిలిటీ గ్రూప్, రైతు మిత్ర గ్రూప్, కౌలుదారులకు ఇచ్చిన లోన్ ఎలిజిబిలిటీ కార్డు ఉన్న వారికి రుణమాఫీ వర్తించదని ప్రకటించారు. వాస్తవానికి ఈ నాలుగు గ్రూపుల్లోని వారు అత్యంత పేదలే కాక దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల నుండి వచ్చిన వారే ఎక్కువ. రీషెడ్యూల్ చేసిన రుణాలకు కూడా రుణమాఫీ వర్తించదని మరో నిబంధన చెబుతున్నది. గతంలో కరువులు, వరదల వల్ల నష్టపోయిన రైతులకు బ్యాంకులు మూడు నుండి ఐదేండ్ల వాయిదాలపై రుణాలు రీషెడ్యూల్ చేశాయి. ఈ లెక్క ప్రకారం వీరికి కూడా రుణమాఫీ వర్తించదు. అలాగే రెండు లక్షలకు మించి రుణం తీసుకున్నవారు, రెండు లక్షలకు పైన ఉన్న అప్పు చెల్లిస్తేనే మాఫీ వర్తిస్తుందనే నిబంధన కూడా పెట్టారు.

గత పదేండ్లుగా బ్యాంకులు రుణాలివ్వకపోవడం వల్ల అసలుకు మించి వడ్డీలు పెరిగాయి. చాలామంది రైతులకు రూ.2 లక్షలకు పైగా బాకీలు ఉన్నప్పటికీ గతంలో ప్రకటించిన 2014, 2018 రుణమాఫీ పథకాలు వారికి వర్తించలేదు. అలాంటి వారికి రుణం రెండు లక్షలకు పైగా ఉంది. వారంతా ఇప్పుడు ఆ అప్పు చెల్లించలేని స్థితిలో ఉన్నారు. అలాగే కొంత మంది రైతులు బంగారం తాకట్టు పెట్టి రుణాలు తీసుకున్నారు. అలాంటి రైతుల గురించి కూడా జీవోలో ఎక్కడా ప్రస్తావించలేదు. ప్రస్తుతం వానాకాలం మొదలయ్యింది. కానీ పంటలు వేసేందుకు పెట్టుబడి లేక రైతులు, కౌలు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రెండు లక్షలకు మించి ఉన్న అప్పు చెల్లించడం వారికెలా సాధ్యమో ప్రభుత్వమే చెప్పాలి. అంటే వాటిని తీర్చడం కోసం మళ్లీ అప్పులు చేయమనేగా..!

అలాగే పీఎం కిసాన్ డేటాకు రుణమాఫీని జోడించడం వల్ల చాలా మంది రైతులు రుణమాఫీ అర్హత కోల్పోయే అవకాశం ఉంది. వాస్తవానికి రాష్ట్రంలో 72 లక్షల మంది రైతులు ఉంటే బ్యాంకులు 43 లక్షల మందికి మాత్రమే అప్పులిచ్చాయి. పీఎం కిసాన్ పథకం కింద 31 లక్షల మందికే వర్తింపజేశారు. అందువల్ల పీఎం కిసాన్ డేటాను వర్తింపజేయడం వల్ల అర్హత కలిగిన వారు రుణమాఫీ పొందలేకపోతారు. 2018 డిసెంబర్ నుండి, 2023 డిసెంబర్ వరకు ప్రకటించిన రుణమాఫీని వర్తింపజేయడానికి కొన్ని బ్యాంకులు జనవరి 2024 నుండి రుణాలను కొత్త రుణాలుగా రీషెడ్యూల్ చేశాయి. గతం నుండి బ్యాంకులు 'బుక్ అడ్జెస్ట్‌మెంట్' ద్వారా రైతులకు రుణాలు పెంచుకుంటూ వస్తున్నాయి. అందువల్ల 2023, డిసెంబర్ తర్వాత రీషెడ్యూల్ చేసిన రుణాలకు లేదా బుక్ అడ్జెస్ట్‌మెంట్ చేసిన రుణాలకు రుణమాఫీని వర్తింపజేయాలని కూడా రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఇప్పటికే రైతుల, రైతు సంఘాల ఆందోళన గమనించిన రాష్ట్ర సర్కారు ఆహార భద్రతా కార్డుతో సంబంధం లేకుండా రైతులందరికీ రుణమాఫీ వర్తింప చేస్తామని చెప్పింది. అయితే దీన్ని నిజంగా అమలు చేస్తారో లేదో అనే అను మానం మాత్రం రైతుల్లో ఉంది. కనుక ఈ విషయాన్ని జీవోలో వెంటనే పొందుపరచాలి. అలాగే రాష్ట్ర ప్రభుత్వం నిజంగా రైతులకు మేలు చేయాలనుకుంటే వాస్తవ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని రైతు సంఘాలు కోరినట్టు జీవోలో పేర్కొన్న సమస్యలకు వెంటనే సవరణలు చేయాలి. అప్పుడే అన్నదాతలందరికీ న్యాయం జరిగే అవకాశముంది.

ఏకోపాధ్యాయులతో విద్యాబోధన ఇంకెంతకాలం?



ఏ దేశ భవిష్యత్తు అయినా నిర్దేశించేది తరగతి గది అని ప్రముఖ విద్యావేత్త కొఠారి పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడానికి ప్రాథమిక పాఠశాలలు మొదటి స్తంభాలు. బాలలందరికీ ప్రాథమిక విద్య సజావుగా సమకూరితే ఆ జాతికి ఆర్థికాభ్యున్నతి చేకూరుతుంది. కానీ మన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఉచిత విద్య లభిస్తున్న అందులో నాణ్యత నేతిబీర చందంగా మారింది. విద్యా హక్కు చట్టం - 2009 నిర్దేశించిన లక్ష్యాలను అందుకోవడానికి అదేపనిగా పాఠశాలలను విస్తరించుకుంటూ పోయిన మన ప్రభుత్వాలు గుణాత్మక విద్యకు తొలిమెట్టు అయిన ప్రాథమిక పాఠశాలల్లో నాణ్యతను గాలికి వదిలేసాయి. మౌలిక వసతులు కల్పించకపోవడం తరగతికి ఒక ఉపాధ్యాయుని నియమించకపోవడం వలన పునాది చదువులు నిస్సారమవుతున్నాయి.

రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ యాజమాన్యాల కింద మొత్తం 30023 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు ఉన్నాయి.అందులో 18 వేలకు పైగా ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. 2021-22 యు డైస్ లెక్కల ప్రకారం మన రాష్ట్రంలో 6392 ప్రాథమిక పాఠశాలలు ఒక ఉపాధ్యాయుడితో నడుస్తున్నాయి. గత ఏడేళ్లలో ఒక టీచర్‌ను కూడా నియమించని రాష్ట్రాల్లో తెలంగాణ కూడా ఒకటి. గత రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థ పట్ల నిర్లక్ష్యం వహించడం వలన శాశ్వత ప్రాతిపాదికన ఉపాధ్యాయులను నియమించ లేదు. పాఠశాల విద్యలో పునాది అయిన ప్రాథమిక విద్యా వ్యవస్థలో ఒక్క ఉపాధ్యాయుడు అయిదు తరగతులకు సంబంధించి 18 సబ్జెక్టులను బోధించడం అసాధ్యమైన పని. అలాగే 90కు పైగా విద్యార్థులు ఉన్న బడుల్లో 2-3 ఉపాధ్యాయులు మాత్రమే పని చేస్తున్న పాఠశాలలు 15 శాతం వరకు ఉన్నాయి. ఈ లెక్కన ప్రాథమిక పాఠశాలల్లో గుణాత్మక విద్య అందని ద్రాక్షగా మారింది. మరోవైపు ప్రయివేటు బడులు పల్లెలకు సైతం వాహనాలను సమకూర్చి తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నాయి. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమిస్తున్నాయి. ఫలితంగా సర్కారు బడుల్లో పిల్లల సంఖ్య క్రమేపి తగ్గిపోతున్నది. అసలే ఉపాధ్యాయులు లేక అల్లాడుతున్న ప్రాథమిక పాఠశాలలో ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా అంతర్గత హేతుబద్ధీకరణ జరిపి దాదాపుగా 2624 ఉపాధ్యాయ పోస్టులను చూపెట్టలేదు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల నుండి నాణ్యమైన బోధన ఎలా ఆశించగలం?

ఇటీవల రాష్ట్రంలో జరిగిన బదిలీలు పదోన్నతుల్లో భాగంగా ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న 50808 సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల్లో 25036 బదిలీ అయ్యారు కానీ కేవలం బదిలీ అయిన ఉపాధ్యాయుల్లో 50శాతం మంది మాత్రమే స్థానచలనం పొందినారు. రాష్ట్ర ప్రభుత్వం 2021 లో జారీచేసిన హేతుబద్ధీకరణ మార్గదర్శకాల ప్రకారం ఉపాధ్యాయులు బదిలీ అయిన రిలీవ్ కాని పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలలో, మారుమూల గిరిజన ప్రాంతాల్లో ఉపాధ్యాయులు పనిచేయడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో ఎక్కువ మొత్తంలో ఖాళీలు ఏర్పడుతున్నవి. ఈ పరిస్థితుల్లో ప్రతి జిల్లాలో జిల్లా , మండల కమిటీలు ఏర్పాటు చేసి ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తున్నారు. ఇటీవల నిర్వహించిన ఎస్జీటీ బదిలీల్లో భాగంగా విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయులను హేతుబద్దీకరణ చేశారు. కానీ విద్యార్థులు ఎక్కువగా ఉన్న బడుల్లో మాత్రం సంఖ్యకు తగ్గ ఉపాధ్యాయులను ఇవ్వలేదు. దీంతో ఇటువంటి పాఠశాలలో కూడా విద్యార్థుల సంఖ్య అంతకంతకు తగ్గుతోంది.

రాష్ట్రంలో వారం రోజుల్లో జరగనున్న డీఎస్సీ ద్వారా దాదాపు 11వేల మంది టీచర్లు రానుండటం శుభపరిణామం. అయినా ఇటువంటి ప్రాథమిక బడుల్లో ఇంకా ఎక్కువ మొత్తంలో ఉపాధ్యాయులు అవసరం. రాష్ట్ర ప్రభుత్వం 2021 ఆగస్టు నెలలో జారీచేసిన జీవో ఎంఎస్ 21హేతుబద్ధీకరణ మార్గదర్శకాలను మార్చాలి. 20 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులను 20-50 మంది ఉన్న పాఠశాలలకు ముగ్గురు ఉపాధ్యాయులతో పాటు ఒక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని కేటాయించాలి. 50 మంది కంటే ఎక్కువ విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుని నియమిస్తూ ఒక ఎల్ ఎఫ్ ఎల్ హెచ్ ఎంను నియమిస్తే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుంది. అలాగే గ్రామీణ ప్రాంతాలలో మారుమూల ప్రాంతాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయు లకు ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పిస్తే అన్ని వర్గాల విద్యార్థులకు విద్యను అందించవచ్చు. పునాది బలంగా లేని ఇల్లు మన్నిక ప్రశ్నార్థకం అయినట్లే పాఠశాల విద్యలో పునాది అయిన ప్రాథమిక విద్యను విస్మరిస్తే చదువులు బలహీనపడుతాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దీనిపై సత్వరమే విధానపరమైన కీలక నిర్ణయాలను ప్రకటించాలి. బాలల బంగారు భవితను ఆవిష్కరించే దిశలో వడివడిగా అడుగులు వేయాలి.

- అంకం నరేష్, 6301650324

అమెరికా ప్రజాస్వామ్యానికి ముప్పు ఎవరి నుంచి?



ఎం కోటేశ్వరరావు
8331013288

"అమెరికా మీద దాడి జరుగుతోంది, ముట్టడిలో ఉంది, ప్రజాస్వామ్యాన్ని హతమార్చేందుకు చూస్తున్నారు. చీకటి అధ్యాయానికి నాంది" మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హత్యాయత్నంపై వెలువడిన తక్షణ వ్యాఖ్యలివి.అతగాడు ప్రాణాపాయం నుంచి కొద్దిలో తప్పించుకున్నాడు. శనివారం నాడు అమెరికాలోని పెన్సిల్వేనియా రాష్ట్రం బట్లర్ అనే పట్టణంలో ఎన్నికల సభలో ప్రసంగిస్తుండగా ఒక దుండగుడు జరిపిన కాల్పులో ట్రంప్‌కు కుడి చెవి దగ్గర బుల్లెట్ గాయం తగిలింది. దుండగుడి కాల్పుల్లో సభికుల్లో ఒకరు మరణించారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. హంతకుడిని వెంటనే భద్రతా దళాలు కాల్చి చంపాయి. సభ సమీపంలోని ఒక భవనంపై మాటువేసి కాల్పులు జరిపినట్లు వెల్లడైంది. ఈ ఉదంతం తరువాత అమెరికా రాజకీయాలు, ఎన్నికల్లో ఏం జరగనుందనే చర్చ మొదలైంది.దీనికి ముందు డెమోక్రటిక్ అభ్యర్థి జోబైడెన్ వృద్ధాప్యం గురించి, పోటీ నుంచి తప్పుకొని ఉపాధ్యక్షురాలు కమలాహారిస్ లేదా మరొకరికి అవకాశం ఇవ్వాలనే చర్చ జరుగుతోంది. హత్యాయత్నంతో సానుభూతి తలెత్తి ట్రంప్ విజయావకాశాలు మెరుగుపడినట్లు సర్వేలు పేర్కొంటున్నాయి. ప్రజాస్వామ్యంలో పార్టీల నేతలు, ఎన్నికల్లో అభ్యర్థులపై జరిగే దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలి. ఎన్నికల్లో ప్రత్యర్థి జో బైడెన్ వెంటనే ఖండించాడు. ట్రంప్‌పై దాడిని వివిధ దేశాల నేతలు ఖండించారు. దుండగుడు ఇరవై ఏండ్ల థామస్ మాథ్యూ క్రూక్స్ రిపబ్లికన్ పార్టీ మద్దతుదారుగా నమోదై ఉన్నాడు. గతంలో డెమోక్రటిక్ పార్టీకి విరాళం ఇచ్చిన దాఖలా కూడా వెల్లడైంది. ఎందుకు కాల్పులు జరిపాడో వెంటనే తెలియలేదు. క్రూక్స్‌కు తొలిసారిగా ఓటు హక్కు వచ్చింది. తాను ట్రంప్‌ను, రిపబ్లికన్ పార్టీని కూడా వ్యతిరేకిస్తున్నట్లు అతడు చెప్పాడన్న వార్తలు కూడా వచ్చాయి. కేవలం ఈ మాత్రానికే దాడికి పాల్పడతాడా? దీని వెనుక డెమోక్రటిక్ పార్టీ,ట్రంప్ మరోసారి అధికారానికి రాకూడదని కోరుకుంటున్న ప్రభుత్వంలోని వారు, రష్యా చైనా, ఇరాన్, ఉత్తర కొరియా దేశాల హస్తం ఉండవచ్చా అనే సందేహాలను కూడా కొందరు లేవనెత్తినట్లు చెబుతున్నారు. దుండగుడికి ఎలాంటి నేర చరిత్ర లేదని న్యూయార్క్ టైమ్స్ పేర్కొన్నది.ఉగ్రవాదం నుంచి కూడా పెట్టుబడిదారులు ఎలా లాభాలు పొందుతారో ట్రంప్‌పై కాల్పుల ఉదంతం వెల్లడించింది. ఈ ఉదంతం తరువాత ట్రంప్ మీడియా మరియు టెక్నాలజీ గ్రూపు కంపెనీల వాటాల ధరలు సోమవారం నాడు 55శాతం పెరిగాయి, ఒక దశలో 71శాతాన్ని తాకాయి. ఈ కారణంగా ట్రంప్ సంపద విలువ ఒక్క రోజులోనే రెండు బిలియన్ డాలర్లు పెరిగింది. ఈ కంపెనీ ట్రంప్ సామాజిక మాధ్యమ ప్రచారాన్ని నిర్వహించే ట్రూత్ సోషల్ వేదికను కూడా నిర్వహిస్తున్నది. అనేక కంపెనీల వాటాల ధరలు కూడా పెరిగాయి. దీని అర్ధం ఏమిటి ? ట్రంప్ ఎన్నిక అవకాశాలు పెరిగినట్లు పెట్టుబడిదారులు భావించటమే దీనికి కారణం. ట్రూత్ సోషల్‌ను అనుసరించే వారు కూడా గణనీయంగా పెరగటంతో నష్టాల్లో ఉన్న ఈ కంపెనీ రానున్న రోజుల్లో లాభాల బాట పట్టినట్లే. తుపాకులు, తూటాలు తయారు చేసే కంపెనీల వాటాల ధరలు కూడా పెరిగాయి.

ట్రంప్‌పై దాడి గురించి ఆందోళన వ్యక్తం చేస్తున్న వారిలో కొందరు మూడు సంవత్సరాల క్రితం 2021జనవరి ఆరవ తేదీన అమెరికా అధికార కేంద్రంపై దాడికి తన మద్దతుదార్లను పంపిన డోనాల్డ్ ట్రంప్ నిర్వాకాన్ని విస్మరించారు. ట్రంప్‌పై దాడి వ్యక్తిగతం, కానీ అతగాడి మద్దతుదార్ల చర్య మొత్తం అమెరికా అధికార, ప్రజాస్వామిక వ్యవస్థనే అపహాస్యం పాలు చేసిందనే అంశాన్ని మరిచిపోరాదు. అమెరికా, దాని ప్రజాస్వామ్యం మీద అసలైన దాడి అది.అమెరికాలో నలుగురు అధ్యక్షులను తుపాకి తూటాలు బలితీసుకున్నాయి. కొంతమంది అధ్యక్షులు తృటిలో తప్పించుకున్నారు, ఇటీవలి కాలంలో రాజకీయపరమైన దాడులు మరింతగా పెరుగుతున్నాయి. కానీ దేశ అధికార కేంద్రంపై ట్రంప్ నాయకత్వంలో జరిగిన దాడి చరిత్రలో అదే మొదటిది. తాను ఓడిపోతే ఫలితాలను అంగీకరించేది లేదని ముందుగానే అపర ప్రజాస్వామికవాది ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఓడిపోయిన తరువాత విజేతను అధికారికంగా ప్రకటించేందుకు ఏర్పాటు చేసిన పార్లమెంటు ఉభయ సభల సమావేశాన్ని జరగకుండా చూసేందుకు, జో బైడెన్ గద్దెనెక్కకుండా చేసేందుకు ట్రంప్ చేసిన కుట్రలో భాగమది. అంతే కాదు దేశీయ ఉగ్రవాదం అనే కోణంలో ఎఫ్‌బిఐ, ఇతర చట్టాన్ని అమలు జరిపే సంస్థలు చూశాయి. దాడికి ముందు అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌కు కొద్ది దూరంలో తన మద్దతుదారులతో సమావేశం జరిపిన ట్రంప్ కాపిటోల్‌ను ఆక్రమించాలని, ఎన్నిక నిర్ధారించే పత్రాన్ని ఇవ్వకుండా అడ్డుకోవాలని రెచ్చగొట్టి పంపించాడు. ఈ కేసులో కొంత మందికి శిక్షలు పడినప్పటికీ డోనాల్డ్ ట్రంప్‌పై విచారణ కొనసాగుతూనే ఉంది. ఎన్నికలలోపు పూర్తయ్యే అవకాశం లేదు, ఒకవేళ ట్రంపు గెలిస్తే అసలు విచారణే ఉండకపోవచ్చు, ఓడితే వచ్చే



> ట్రంప్‌పై దాడి వ్యక్తిగతం, కానీ అతగాడి మద్దతుదార్ల చర్య మొత్తం అమెరికా అధికార, ప్రజాస్వామిక వ్యవస్థనే అపహాస్యం పాలు చేసిందనే అంశాన్ని మరిచిపోరాదు. అమెరికా, దాని ప్రజాస్వామ్యం మీద అసలైన దాడి అది. అమెరికాలో నలుగురు అధ్యక్షులను తుపాకి తూటాలు బలితీసుకున్నాయి. కొంతమంది అధ్యక్షులు తృటిలో తప్పించుకున్నారు, ఇటీవలి కాలంలో రాజకీయపరమైన దాడులు మరింతగా పెరుగుతున్నాయి. కానీ దేశ అధికార కేంద్రంపై ట్రంప్ నాయకత్వంలో జరిగిన దాడి చరిత్రలో అదే మొదటిది. తాను ఓడిపోతే ఫలితాలను అంగీకరించేది లేదని ముందుగానే అపర ప్రజాస్వామికవాది ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఓడిపోయిన తరువాత విజేతను అధికారికంగా ప్రకటించేందుకు ఏర్పాటు చేసిన పార్లమెంటు ఉభయ సభల సమావేశాన్ని జరగకుండా చూసేందుకు, జో బైడెన్ గద్దెనెక్కకుండా చేసేందుకు ట్రంప్ చేసిన కుట్రలో భాగమది.

ఏడాది జరగవచ్చు.

ట్రంప్‌పై దాడి ప్రపంచానికి చూపుతున్నదేమిటి ? అమెరికాలో రాజకీయ విభజన కారణంగా రాజకీయ హింస కూడా పెరుగుతున్నది. దాడి వెనుక మూడు కారణాలున్నట్లు ఒక అభిప్రాయం. ఒకటి, ట్రంప్ గెలవకూడదని కోరుకుంటున్న ప్రభుత్వం లోని వారి హస్తం, ట్రంప్ వంటి పచ్చిమితవాది అధికారానికి రాకూడదని కోరుకుంటున్న వామపక్ష తీవ్రవాద శక్తులు, ఎవరితో ప్రమేయం లేకుండా ట్రంప్ మీద తలెత్తిన వ్యక్తిగత ఆగ్రహం కారణంగా కాల్పులు జరిపి వుండవచ్చని చెబుతున్నారు. ఈ కారణాలతో రానున్న రోజుల్లో మరిన్ని ప్రయత్నాలు జరగవచ్చున్న హెచ్చరికలు వెలువడ్డాయి. అమెరికా చరిత్రలో రాజకీయ హింసాకాండ నేతలపై దాడి జరగడం ఇదే మొదటిసారి కాదు. అమెరికా తొలి అధ్యక్షుడు అబ్రహం లింకన్. 1865 ఏప్రిల్ 14న జాన్ విల్కెస్ బూత్ కాల్చి చంపాడు. నల్ల జాతీయుల హక్కులకు మద్దతు ఇవ్వడమే లింకన్ హత్యకు కారణం. బాధ్యతలు స్వీకరించిన ఆరు నెలలకే అమెరికా 20వ అధ్యక్షుడైన అమెస్ గార్‌ఫీల్డ్‌ను హత్య చేశారు. 1881 జూలై 2న వాషింగ్టన్ రైల్వే స్టేషన్‌లో నడుస్తుండగా ఛార్లెస్ గిటౌ అనే వ్యక్తి కాల్పులు జరిపాడు. ప్రజలతో కరచాలనం చేస్తుండగా అమెరికా 25వ అధ్యక్షుడైన విలియం మెకిన్లే 1901 సెప్టెంబర్ 1న న్యూయార్క్‌లోని బఫెలోలో హత్యకు గురయ్యారు. 28 సంవత్సరాల నిరుద్యోగ వైద్యుడు కాల్పులు జరిపాడు. 1965 నవంబర్‌లో 35వ అధ్యక్షుడైన జాన్ ఎఫ్ కెన్నడీ తన సతీమణి జాక్విలిన్‌తో కలిసి డల్లాస్‌లో పర్యటిస్తుండగా హంతకుడు లీ ఆర్వీ ఆస్వాయిడ్ తుపాకీతో కాల్చి చంపాడు. ఈ హత్య గురించి తలెత్తిన అనుమానాలు ఇంతవరకు తీరలేదు, అదొక రహస్యంగా ఉండిపోయింది.

రెండుసార్లు దేశాధ్యక్షుడిగా పనిచేసి, మూడోసారి పోటీకి దిగిన థియొడోర్ రూజ్‌వెల్ట్‌పై ప్రచార సందర్భంగా 1912లో మిల్వాకీలో కాల్పులు జరిగాయి. అయితే ఆయనకు తీవ్రమైన గాయాలేవీ కాలేదు. అమెరికా 32వ అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ 1933 ఫిబ్రవరిలో మియామీలో ప్రసంగిస్తుండగా కాల్పులు జరిగాయి. ఈ ఘటన నుండి రూజ్‌వెల్ట్ తప్పించుకున్నప్పటికీ చికాగో మేయర్ ఆంటన్ సెర్మాక్ చనిపోయాడు. 1950లో 33వ అధ్యక్షుడు హారీ ఎస్. ట్రూమన్ నివసిస్తున్న బ్లార్ హౌస్‌లోకి ఇద్దరు సాయుధులు ప్రవేశించి కాల్పులు జరిపారు. ట్రూమన్ తప్పించుకున్నప్పటికీ ఎదురు కాల్పుల్లో అధ్యక్ష భవనం పోలీసు, ఒక దుండగుడు చనిపోయాడు. డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన రాబర్ట్ కెన్నడీని లాస్ ఏంజెల్స్ హోటల్‌లో హత్య చేశారు. 1972లో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిత్వం కోసం పోటీపడిన జార్జ్ వాలస్‌పై కాల్పులు జరిగాయి. 1975లో 38వ అధ్యక్షుడైన ఫోర్డ్ కొన్ని వారాల వ్యవధిలోనే రెండు హత్యాయత్నాల నుండి తప్పించుకున్నారు. 40వ అధ్యక్షుడైన రోనాల్డ్ రీగన్ 1981 మార్చిలో వాషింగ్టన్ డీసీలో జనంలో ఉన్న జాన్ హింక్లీ జూనియర్ కాల్పులు జరిపాడు. ఆయన కోలుకున్నప్పటికీ ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. అమెరికాకు 43వ అధ్యక్షుడిగా పనిచేసిన జార్జ్ బుష్ 2005లో జార్జియా అధ్యక్షుడు మిఖాయిల్ సాకష్విలీతో కలిసి ఓ ర్యాలీకి హాజరు కాగా ఆయనపై చేతి గ్రెనేడ్ విసిరారు. అయితే అది పేలకపోవడంతో ఎవరూ గాయపడలేదు. అమెరికా రాజకీయ ముఖచిత్రాన్ని చూసినట్లయితే కొన్ని అంశాలలో తేడాలున్నప్పటికీ డెమోక్రటిక్, రిపబ్లికన్ పార్టీలు రెండూ అక్కడి కార్పొరేట్ల ప్రయోజనాల కోసం పాటుపడేవే. ఇటీవలి కాలంలో రెండు పార్టీల వైఫల్యాలు గతం కంటే ఎక్కువగా జనం నోళ్లలో నానుతున్నాయి. ప్రపంచంలో అమెరికా పెత్తనాన్ని సాగించేందుకు ఎదురుదెబ్బలు తగులుతున్నాయి, పరువు పోతున్నది. ఎన్నికల సమయంలో వ్యక్తిగత బలహీనతలు, అవినీతి అక్రమాలను బయటపెట్టుకోవటం ఇటీవలి కాలంలో పెరుగుతున్నది. విధానపరమైన వైఫల్యాలు రెండు పార్టీల్లో ఉండటమే దీనికి కారణం. ఈ పూర్వరంగంలోనే మూడవ అభ్యర్థికి మద్దతు ఇవ్వటం గురించి అమెరికా సమాజంలో చర్చ ప్రారంభమైంది. కాల్పులు జరిగిన వెంటనే రక్తం కారుతున్న ట్రంప్‌ను భద్రతా సిబ్బంది తీసుకువెళుతుండగా ట్రంప్ చేయెత్తి

> ట్రంప్ ప్రాజెక్టు 2015పేరుతో ముందుకు తెస్తున్న అజెండా కార్మికవర్గం మీద దాడికి ఉద్దేశించిందని పురోగామి రాజకీయ బృందం హెచ్చరించింది. పౌరహక్కులకు ముప్పు ఏర్పడిందని ఆఫ్రో-అమెరికన్ల కార్మిక సంఘాలు హెచ్చరించాయి. ట్రంప్ కోరిక మేరకు మితవాద హెరిటేజ్ ఫౌండేషన్ దీన్ని రూపొందించింది. దీన్ని అమలు జరిపేందుకు ట్రంప్ నియంతగా మారే అవకాశం ఉందని కూడా పేర్కొన్నది. తాను తిరిగి అధికారానికి వస్తే రాజ్యాంగంలోని కొన్నిసెక్షన్లను తొలగిస్తానని ఏడాది క్రితమే ట్రంప్ చెప్పిన అంశాన్ని గుర్తు చేసింది.

తనకేమీ కాలేదన్న సంకేతం ఇచ్చిన ఫొటోను చూపి కొందరు ట్రంప్ అభిమానులు తమనేత దేశం కోసం ఒక హీరో మాదిరి నిలబడిన తీరును చూపుతున్నదని ప్రచారం చేస్తున్నారు. ఎన్నికలు మరో నాలుగు నెలల్లో జరగనున్నందున ప్రచారం మరింత తీవ్రం కానుంది. గురువారం నాడు జరిగే ఒక సమావేశంలో ట్రంప్ అభ్యర్థిత్వాన్ని లాంఛనంగా పార్టీ ప్రకటించనుంది. ప్రతిదాన్నీ సొమ్ము చేసుకొనేందుకు ఎదురు చూసే కొందరు గాయపడిన ట్రంప్ బొమ్మను ముద్రించిన టీ షర్టులను అందుబాటులోకి తెచ్చారు.


ట్రంప్ ప్రాజెక్టు 2015పేరుతో ముందుకు తెస్తున్న అజెండా కార్మికవర్గం మీద దాడికి ఉద్దేశించిందని పురోగామి రాజకీయ బృందం హెచ్చరించింది. పౌరహక్కులకు ముప్పు ఏర్పడిందని ఆఫ్రో-అమెరికన్ల కార్మిక సంఘాలు హెచ్చరించాయి. ట్రంప్ కోరిక మేరకు మితవాద హెరిటేజ్ ఫౌండేషన్ దీన్ని రూపొందించింది. దీన్ని అమలు జరిపేందుకు ట్రంప్ నియంతగా మారే అవకాశం ఉందని కూడా పేర్కొన్నది. తాను తిరిగి అధికారానికి వస్తే రాజ్యాంగంలోని కొన్నిసెక్షన్లను తొలగిస్తానని ఏడాది క్రితమే ట్రంప్ చెప్పిన అంశాన్ని గుర్తు చేసింది. తొమ్మిది దశాబ్దాల క్రితం చేసిన జాతీయ కార్మిక సంబంధాల చట్టాన్ని వెనక్కు తీసుకుంటామని ట్రంప్ తొలిసారి అధికారంలో ఉన్నపుడు నియమించిన బోర్డులో అత్యధికులు కార్మిక వ్యతిరేకులు ఉన్నారు. సోషలిజం విఫలమైందని గతంలో అమెరికా చెప్పింది. కానీ అదే అమెరికాలో ఇప్పుడు పెట్టుబడిదారీ విధానం విఫలమైందనే భావం విస్తరిస్తోంది.

చైనా, వియత్నాం వంటి సోషలిస్టు దేశాలతో పోల్చి వేస్తున్న ప్రశ్నలకు సమాధానం లేదు. అక్కడ ధనిక-పేద వ్యత్యాసం పెరిగిపోతోంది. మధ్యతరగతి వర్గం కనుమరుగు అవుతోంది. ఆర్థిక, వలసకార్మికులను అనుమతించే విధానాలపై అసంతృప్తి పెరుగుతున్నది. ఈ పూర్వరంగంలోనే సామాజిక వైరుధ్యాలు పెరుగుతున్నాయి. ఎవరు ఎవరిని ఎప్పుడు ఎందుకు కాల్చిచంపుతారో తెలియదు. తుపాకి లేకుండా జనాలు బయటకు వెళ్లే పరిస్థితి లేదు. తుపాకి సంస్కృతిని పెంపొందించటం, వాటిని తయారు చేసే కార్పొరేట్లకు లాభాలు సమకూర్చటంలో డెమోక్రాట్లు, రిపబ్లికన్లు ఎవరూ తక్కువ తినలేదు. పామును పాలుపోసి పెంచిన చేతినే అది కాటువేస్తుంది. అందువలన ఆ తుపాకులకు ఎప్పుడు ఎవరు బలౌతారో చెప్పలేని అయోమయ స్థితి నేడు అమెరికాలో ఉంది. ఒక దుండగుడు కాదు, అలాంటి వారిని తయారు చేసిన వ్యవస్థ, దాన్ని కాపాడుతున్నవారే ప్రజాస్వామ్యానికి అసలైన ముప్పు. 2021 జనవరి ఆరున తన గుంపును అమెరికా అధికార కేంద్రం మీద దాడికి ఉసిగొల్పిన ట్రంప్ నుంచే అసలైన ముప్పుకు నాంది. ఇలాంటి ట్రంపు, అతగాడి ఇతర వెర్రి వేషాలను కూడా అక్కడి మీడియా జనానికి చెప్పటం లేదు. ఇది కూడా అమెరికాకు ముప్పు తెచ్చేదే !

అంబానీ..అంబానీ..అంబానీ

ఎటు చూసినా ముకేశ్ అంబానీ కొడుకు పెండ్లి మాటే. ఏ వార్తపత్రిక చూసినా, ఏ టీవీ ఛానెల్ చూసినా ప్రపంచకుబేరుల్లో ఒకడు ముకేశ్ అంబానీ కొడుకు పెండ్లి ముచ్చటే. అనంత్ అంబానీ పెండ్లి హడావిడి మూడు నెలల ముందునుంచే మొదలైనది. మొదటి ప్రీ వెడ్డింగ్ గుజరాత్‌లోని జాంనగర్‌లో జరిగింది. ఆహూతులందరినీ ప్రయివేటు జెట్ ప్లేన్ల ద్వారా పిలిపించారనీ, ప్రపంచ ప్రసిద్ధ పాప్ గాయని రిహానా హాజరై పాట పాడిందనీ పత్రికలూ రాశాయి డబ్బు నీళ్లలా ఖర్చయిందని సమాచారం. రెండవ ప్రీ వెడ్డింగ్ ఇటలీలో జరిగింది. మొదటి ప్రీ వెడ్డింగ్‌కి రూ.1000 కోట్లు ఖర్చయితే, రెండవ ప్రీ వెడ్డింగ్స్‌కి రూ.3వేల కోట్లు ఖర్చయిందని సమాచారం. ఆ తరువాత ఈ నెల 12 న వివాహ మహోత్సవనానికి దేశంలోని సెలెబ్రిటీలతో పాటు ప్రపంచంలోని సెలెబ్రిటీలు కూడా హాజరయ్యారు. భారతదేశ సినీ జగత్తులోని హేమమేమీలు ఆ వివాహానికి హాజరయ్యారు. పెండ్లికి ముందు హల్దీ, మెహందీ, లేడీస్ సంగీత్ అని రక రకాల ఈవెంట్లు జరిగాయి. చేతికి బోమిక లేకుండా ఖర్చయిందని అంటారు. ఈ పెళ్లే ఓ పాతికేళ్ల క్రితం జరిగి ఉంటే వార్తా పత్రికలు ఇంతింత దుబారా ఖర్చు ఎందుకని ఘాటుగా విమర్శించి ఉండేవి. కానీ ఈనాటి పత్రికలు చాలావరకు కార్పొరేట్ల చేతుల్లో ఉన్నాయి. అవి ఇలా దుబారని విమర్శించాడికి బదులుగా ఆ పెళ్లి గురించి అతి గొప్పలు చెబుతున్నాయి. అయితే ఇంత డబ్బు ఎక్కడినుండి వచ్చింది. నిజంగా కష్టపడ్డ డబ్బేనా? న్యాయంగా వ్యాపారంచేసి సంపాదించిందేనా? అంటే ఎవరు ఏమీ చెప్పరు... అయితే జనాల్లో ఓ టాక్ ఉంది.. "అ ఏముంది.. అదంతా మన డబ్బే కదా... మొన్న పెరిగిన టెలికామ్ ధరలతో ఇంతకు ఇంత సంపాదించుకుంటాడు"అని.

ఈ మధ్యనే అన్ని టెలికామ్ సర్వీసుల ధరలు 15శాతం నుంచి 25శాతం వరకు పెరిగాయి. నిజానికి ఇది అకారణమైన పెరుగుదల. ఇప్పటికే, అధిక ధరలతో బాధ పడుతున్న ప్రజలకి మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు ఉంది. టెలికామ్ రేగులటరీ అథారిటీ అఫ్ఇండియా (ట్రాయ్) వాళ్ల 5జి ఇస్తున్నారు కదా, దానికి ఖర్చులు ఉంటాయి కదా అని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు.5జి వాడుకలోకి వొచ్చి ఏడాది దాటింది. ఏ సర్వీస్ ప్రొవైడర్‌కి కూడా నష్టం వాటిల్లలేదు. అయినావీళ్లకి మరిన్ని లాభాలు చేకూర్చి పెట్టాడనికి ఈ టెలికామ్ ధరల పెరుగుదల. ఈ పెరుగుదలని బేరీజు వేస్తే, మొబైళ్లు వాడుతున్న ప్రతి ఒక్కరికి నెలకి 29 రూపాయలు పెరుగుతాయి. అంబానీ జియోని సుమారు 43 కోట్ల మంది, మిత్తల్ ఎయిర్‌టెల్‌ని 27 కోట్లకి పైగా వినియోగిస్తున్నారు. ఇప్పుడు ఒక లెక్క జియోది చూద్దాం. 43 కోట్లమంది నెలకి రూ.1256 కోట్లు, ఏడాదికి 15072 కోట్లు చెల్లిస్తున్నారు. ఇది కేవలం ఒక సంవత్సరానికి.



> ఈ మధ్యనే ప్రధాన మంత్రి మోడీ రష్యా వెళ్లిన సంగతి అందరికీ తెలుసు. రష్యా అధ్యక్షుడు పుతిన్ మోడీని చాలా అభిమానంతో చూసి, ఆయనకు రష్యా అతి పెద్ద పౌర పురస్కారంతో సన్మానించారు. ఈపురస్కారానికి కారణం భారతదేశం రష్యా నుంచి కొన్ని మిలియన్ బ్యారెళ్ల ముడిచమురు కొనుగోలు చేసింది.పేరు ఇండియాదే అయినా దానివల్ల భారతదేశంలో పెట్రోలు ధరలు ఏమీ తగ్గలేదు. ఎందుకంటే ముడి చమురుని వాస్తవంగా కొన్నది ముకేశ్ అంబానీ రిలయన్స్ కంపెనీ కోసం. ఈ రిలయన్స్ కంపెనీయే ముడి చమురుని తమ రిఫైనరీల్లో శుద్ధి చేసి 67 బిలియన్ డాలర్ల పెట్రోలుని యురోపియన్ దేశాలకి అమ్మింది.

ఈ మధ్యనే ప్రధాన మంత్రి మోడీ రష్యా వెళ్లిన సంగతి అందరికీ తెలుసు. రష్యా అధ్యక్షుడు పుతిన్ మోడీని చాలా అభిమానంతో చూసి, ఆయనకు రష్యా అతి పెద్ద పౌర పురస్కారంతో సన్మానించారు. ఈపురస్కారానికి కారణం భారతదేశం రష్యా నుంచి కొన్ని మిలియన్ బ్యారెళ్ల ముడిచమురు కొనుగోలు చేసింది.పేరు ఇండియాదే అయినా దానివల్ల భారతదేశంలో పెట్రోలు ధరలు ఏమీ తగ్గలేదు. ఎందుకంటే ముడి చమురుని వాస్తవంగా కొన్నది ముకేశ్ అంబానీ రిలయన్స్ కంపెనీ కోసం. ఈ రిలయన్స్ కంపెనీయే ముడి చమురుని తమ రిఫైనరీల్లో శుద్ధి చేసి 67 బిలియన్ డాలర్ల పెట్రోలుని యురోపియన్ దేశాలకి అమ్మింది. ఈ విధంగా ప్రస్తుత ప్రభుత్వం ఇటు అంబానీకి లాభం చేకూర్చడంతో పాటు పుతిన్‌కి సాంత్వన కలిగించింది. ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే రష్యా, ఉక్రెయిన్ యుద్ధం తరువాత అమెరికాతో పాటు యురోపియన్ దేశాలన్నీ రష్యానుండి ముడి చమురుతో పాటు ఇతర ఇంధన వనరుల కొనుగోలుని నిషేధించాయి.ఇతర దేశాలని కూడా కొనవొద్దని హెచ్చరిక చేసాయి. ఈ నిషేధాన్ని ఉల్లఘించినందుకు అమెరికా, యురోపియన్ దేశాలుఏమైనా చర్య తీసుకుంటే భవిష్యత్‌లో అది భారత ప్రజలు అనుభవించాల్సి వస్తుంది. రిలయెన్స్ కాదు.

కేంద్ర ప్రభుత్వం దేశంలోని విద్యుత్ ఉత్పత్తి సంస్థలు ఉత్పత్తి కోసం తాము వాడే బొగ్గులో 10 శాతం బొగ్గు విదేశాలనుండి తెప్పించుకోవాలని ఒక ఆదేశాన్ని జారీ చేసింది. మన వద్దే కావలిసినంత బొగ్గు, బొగ్గు గనులుండగా విదేశాలనుండి తెప్పించుకోవాల్సిన అవసరం ఏముంది? ఇదీ మళ్లీ కార్పొరేట్ల లాభం కోసమే. మారో ధన కుబేరుడు గౌతమ్ అదానీకి విదేశాల్లో బొగ్గు గనులున్నాయి. ఆ బొగ్గునే వాడాలని ఆదేశం. ఈ విదేశీ బొగ్గు మన దేశంలో దొరికే ధరకన్నా పదిరెట్లు ఎక్కువ. దాంతో అనివార్యంగా విద్యుత్తు బిల్లులు పెరుగుతాయి. ప్రజలు చెల్లించిన డబ్బు అదానీకి చేరుతుంది. ఈమధ్య అయన నాసిరకం బొగ్గుని, మేలైన బొగ్గుగా అమ్మాడు అని, దానిపై ఎంక్వయిరీ నడుస్తున్నది. ఒక ఎన్నికల సభలో రాహుల్ గాంధీ ఈ విషయాన్నే ప్రస్తావించాడు. మరో సభలో అయన పేదలు మరింత పేదలవుతున్నారని, ధనికులు మరింత ధనికులవుతున్నారని అంటాడు. ఆమాటే మన ప్రధానమంత్రిని కొందరు విలేకరులడిగితే, ధనికులని కూడా పేదలని చేయాలా' అని ఎదురు ప్రశ్నిసాడు. నిజానికి జరుగుతున్నది అదే. పదేళ్లకు ముందు దేశంలో 102 మంది కుబేరులంటే ప్రస్తుతానికి వారిసంఖ్య 166కి చేరింది. ఇది దేనికి సంకేతం?

2021-22 ఆక్స్‌ఫామ్ రిపోర్టు ప్రకారం మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి, పేదలు, అత్యంత పేదలుగా ఉన్న 50శాతం ప్రజలు 64శాతం జీఎస్టీ కడుతున్నారు. ఎగువ మధ్యతరగతి, ధనికులు, మరింత ధనికులాగా ఉన్న 40 శాతం ప్రజలు 33శాతం జీఎస్టీ కడితే అత్యంత ధనిక వర్గానికి చెందిన పది శాతం ప్రజలు కేవలం మూడు శాతం జీఎస్టీ కడుతున్నారు. వార్షిక నికరాదాయాల్లో ఈ అసమానత కనిపిస్తుంది. ఆక్స్‌ఫామ్ వార్షిక నికరాదాయాల రిపోర్టు కూడా ప్రచురించింది. దాని ప్రకారం బాగా పై లెవెల్లో ఉన్న ఒక శాతం ప్రజల నికరాదాయం సంవత్సరానికి రూ.53 లక్షలు, ఆ తరువాత లెవల్లో ఉన్న 10 శాతం ప్రజల ఆదాయం 13.56 లక్షలు, కింద ఉన్న 40 శాతం ప్రజల ఆదాయం 1.65 లక్షలు, నెలకి 13,750/- పూర్తిగా దిగువ ఉన్న 50 శాతం ప్రజల ఆదాయం 71,163 అంటే నెలకి 6 వేలతో ఈ 50 శాతం ప్రజలు జీవనం గడుపుతున్నారు. ఇవన్నీ ఆక్స్‌ఫామ్ ఇచ్చిన లెక్కలే. పెరుగుతున్న ధరలతో పోల్చితే ఈ 6 వేలు కాని, 13,500 కానీ సముద్రంలో కాకి రెట్టలాంటిదే.

- పి.జయప్రకాష్, 8374851426



డ్రగ్స్ రహిత సమాజానికి
కృషి చేయాలి

మత్తుతో పేదల జీవితాలు చిన్నాభిన్నం

- గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావు, ఏసీపీ రమేష్ కుమార్
- యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి : పట్నం సంస్థ రాష్ట్ర కార్యదర్శి డిజి.నర్సింహారావు

నవతెలంగాణ - ముషీరాబాద్

డ్రగ్స్, మత్తు పదార్థ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావు, చిక్కడపల్లి ఏసీపీ రమేష్ కుమార్, పట్నం సంస్థ రాష్ట్ర కార్యదర్శి డిజి.నర్సింహారావు అన్నారు. ప్రజానాట్యమండలి ప్రచార కార్యక్రమం "డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం.. సమాజాన్ని మేల్కొలుపుదాం"లో భాగంగా హైదరాబాద్ రాంనగర్ డివిజన్ సెయింట్ పాయిస్ స్కూల్‌లో మంగళవారం డ్రగ్స్, మత్తు పదార్థాలపై అవగాహనా సదస్సు, ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించారు.

ఈ సందర్భంగా గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావు మాట్లాడుతూ.. డ్రగ్స్, మత్తు పదార్థాలు వాడటం వల్ల పేదల జీవితాలు చిన్నాభిన్నం అవుతున్నాయన్నారు. డ్రగ్స్ రహిత సమాజంగా మార్చడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. మత్తు పదార్థాలు సేవించడం ద్వారా అనారోగ్య సమస్యలతో పాటు విలువైన జీవితం అంధకారం అవుతుందని చెప్పారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు, యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాలు సేవించే వ్యక్తులు మానసికంగా కుంగిపోతారని, నాడీ వ్యవస్థ మొత్తం దెబ్బతిని ఆరోగ్యం క్షీణిస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల వ్యవహార శైలిని గమనిస్తూ ఉండాలని, మత్తు పదార్థాల వైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏసీపీ మాట్లాడుతూ.. సమాజంలో యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పాశ్చాత్య సంస్కృతికి, చెడు అలవాట్లు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్నం సంస్థ రాష్ట్ర కార్యదర్శి డిజి.నర్సింహారావు మాట్లాడుతూ.. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ సమాజ హితం కోసం కృషి చేయాలన్నారు. మత్తు పదార్థాలు సేవిస్తే ఏ విధమైన దుష్ప్రభావాలు కలుగుతాయో యువతకు వివరిస్తూ, వాటికి దూరంగా ఉండే విధంగా ప్రోత్సహించడంలో తల్లిదండ్రులు ముఖ్యపాత్ర పోషించాలని కోరారు.

చెడు అలవాట్లకు యువత దూరంగా ఉంటూ సమాజంలో అత్యున్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ లిండ, పట్నం సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షులు కామేష్ బాబు, ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు ఎస్.మారన్న, సహాయ కార్యదర్శి కళ్యాణ్, కోశాధికారి మహారాజు, సెయింట్ పాయిస్ స్టాఫ్ సెక్రటరీస్ రీటా, జయంతి, రెజీనా, సునిత, రఘు, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిటీ స్థానంలో ఐటీ, విద్యా, ఉపాధి అవకాశాల కల్పన

- ధరణి పోర్టల్ రాష్ట్ర చైర్మెన్ కోదండరెడ్డి
- కందుకూరు ఆర్డీవో కార్యాలయంలో రైతుల అభిప్రాయ సేకరణ



నవతెలంగాణ-కందుకూరు

ఫార్మాసిటీ స్థానంలో ఐటీ, విద్యా ఉపాధి అవకాశాలను ప్రభుత్వం కల్పిస్తుందని ధరణి పోర్టల్ రాష్ట్ర చైర్మెన్ కోదండ రెడ్డి అన్నారు. మంగళవారం వికారాబాద్ జిల్లా కందుకూరు ఆర్డీవో కార్యాలయంలో ఐటీ, విద్యా, ఉపాధి, అవకాశాలపై రైతుల అభిప్రాయాల సేకరణ కార్యక్రమాన్ని ఆర్డీవో సూరజ్ కుమార్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వేనెంబర్ 112, 113, 114, 118, 119లో రైతుల భూ సేకరణ విషయమై భూ నిర్వాసితులకు న్యాయం చేస్తామన్నారు. ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో మాట్లాడి రైతులకు పరిహారం చెల్లిస్తామని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి రైతుల పక్షాన ఉండి రైతులకు న్యాయం చేస్తారని చెప్పారు. ఫార్మాసిటీ విషయమై మరోసారి పునరాలోచిస్తామ న్నారు. అనంతరం ఫార్మాసిటీ భూములను పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, కాంగ్రెస్ ప్రచార రాష్ట్ర కమిటీ సభ్యులు ఏనుగు జంగారెడ్డి, నాయకులు కృష్ణ నాయక్, ఆర్డీవో సిబ్బంది, రైతులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

దంపతుల ఆత్మహత్య

- తమపై దుష్ప్రచారంతోనే..
- సూసైడ్ చేసుకుంటున్నట్టు వాట్సాప్‌లో స్టేటస్
- ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా గుర్తించిన పోలీసులు



నవతెలంగాణ-నవీపేట్/పోతంగల్

'ఏడాది క్రితం ఓ తప్పు చేశా. నా తప్పును భర్తతో పాటు అత్తామామలు అంగీకరించి ఏమీ అనలేదు. అయితే మా పిన్ని మాపై దుష్ప్రచారం చేస్తుంది. అందరికీ చెప్తుండటంతో మేము బయట మొహం చూపించలేకపోతున్నాం. ఆ వేధింపులు తట్టుకోలేక రెండు వారాల క్రితం నా భర్త పురుగుల మందు తాగిండు. అయినా మా పిన్ని దుష్ప్రచారం ఆపడం లేదు. మా చావుకు కారణం మా పిన్నే' అంటూ దంపతులు సూసైడ్ వీడియో తీసి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విషాదకర ఘటన నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలంలోని మిట్టపూర్ రైల్వే గేటు సమీపంలో సోమవారం రాత్రి జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం హెగ్డోలి గ్రామానికి చెందిన బండారి శైలజ(22), బండారి అనిల్ కుమార్(25)కు ఏడాదిన్నర క్రితం వివాహమైంది. కుటుంబ తగాదాలు, ఇతరత్రా కారణాల కారణంగా ఆత్మహత్య చేసుకుంటున్నామని వీడియో తీసి తమ వాట్సాప్‌లో స్టేటస్ పెట్టుకున్నారు. గమనించిన కుటుంబ సభ్యులు కోటగిరి ఎస్ఐకు సమాచారం ఇవ్వగా వారి ఫోన్‌కాల్ నవీపేట్ లొకేషన్‌లో చూపించడంతో ఎస్ఐ నవీపేట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దాంతో హుటాహుటిన నవీపేట్ ఎస్ఐ రాత్రి 11 గంటల సమయంలో తన సిబ్బందితో బాసరకు వెళ్లి ఫోన్ సిగ్నల్ ఆధారంగా మిట్టాపూర్ రైల్వే గేటు వద్దకు చేరుకోగా.. అప్పటికే వారు మృతి చెందారు. వెంటనే పోలీసులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం మేరకు రైల్వే ఎస్ఐ సాయ రెడ్డి సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి, పంచనామా నిర్వహించారు. మృతదేహాలను జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. దంపతుల ఆత్మహత్యకు కుటుంబ కలహాలు లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే కోణంలో ఆరా తీస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

క్షేత్రస్థాయికి వెళ్లండి..



(మొదటిపేజీ తరువాయి)

పని చేసినా అక్కడి ప్రజల మదిలో చెరగని ముద్ర వేయాలని సూచించారు. రాష్ట్రంలో కొన్నిచోట్ల టీచర్లు బదిలీపై వెళుతుంటే విద్యార్థులు వాళ్లకు అడ్డుపడి కన్నీళ్లు పెట్టుకున్న సంఘటనలు మీడియాలో చూసినట్లు సీఎం చెప్పారు. జిల్లాల్లో కలెక్టర్లు బదిలీ అయినా ప్రజల నుంచి అలాంటి స్పందన వచ్చేలా పనితీరుండాలని అభిప్రాయపడ్డారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఐఏఎస్ అధికారులు తెలంగాణలో పని చేస్తున్నారనీ, విధి నిర్వహణలో భాగంగా ఇక్కడి, భాషతో పాటు తెలంగాణ సంస్కృతిలో భాగస్వామ్యం కావాలని వారికి సూచించారు. ప్రభుత్వానికి కండ్లు, చెవులు జిల్లా కలెక్టర్లేననీ, ప్రజలకు ప్రయోజనం చేకూరేలా మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకోవాలని సీఎం కలెక్టర్లకు అంశాల వారీగా మార్గనిర్దేశం చేశారు.

మహిళా శక్తి

ఇప్పటికే ప్రకటించిన ఆరు గ్యారంటీలను రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయాలనేది ప్రభుత్వ ధ్యేయమని సీఎం పునరుద్ఘాటించారు. గృహజ్యోతికి 5.89 లక్షల మంది, రూ. 500కు గ్యాస్ సిలిండర్ పథకానికి 3.32 లక్షల మంది సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు వివరించారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని సీఎం ప్రకటించారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనేది ప్రభుత్వ సంకల్పమని సీఎం ప్రకటించారు. ఐదేండ్లలో రూ.లక్ష కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలందించే లక్ష్యంతో పని చేయాలన్నారు. మహిళా సంఘాలు చేపట్టే వ్యాపారాలకు తమ వినూత్న ఆలోచనలు కూడా జోడించాలని కలెక్టర్లకు సూచించారు.

ధరణి

పెండింగ్‌లో ఉన్న ధరణి సమస్యలను వీలైనంత తొందరగా పరిష్కరించాలని కలెక్టర్లను సీఎం ఆదేశించారు. "ధరణి సమస్యల పరిష్కారానికి మార్చి 1 నుంచి మార్చి 15 వరకు రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ నిర్వహించింది. ఇప్పటికే ధరణి సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి ఇప్పటివరకు 1,61,760 దరఖాస్తులను ప్రభుత్వం పరిష్కరించింది. కొత్తగా 1,15,308 దరఖాస్తు చేసుకున్నారు" అని అధికారులు సీఎంకు వివరించారు. ధరణిలో దరఖాస్తులను తిరస్కరిస్తే అధికారులు తిరస్కరణకు కారణాన్నికూడా తప్పకుండా నమోదు చేసేలా చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఆగస్టు 15లోగా పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను పరిష్కరించాలని గడువు నిర్ణయించారు.

ఆరోగ్యశ్రీ

ఆరోగ్యశ్రీపై అధికారులకు సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. రేషన్ కార్డుకు, ఆరోగ్యశ్రీ కార్డుకు లింకు పెట్టొద్దని పేర్కొన్నారు.. తెలంగాణలో అందరికీ ఆరోగ్యశ్రీ కార్డులందించేలా చర్యలు తీసుకోవాలన్న సీఎం. రాష్ట్రంలో ప్రతీ ఒక్కరికీ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపొందించాలని సూచించారు.. రాష్ట్రంలో ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ ఇవ్వాలన్న డిమాండ్‌ను అధ్యయనం చేసి కొత్త జీవో ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని ఆదేశించారు. వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగించేలా చర్యలు చేపట్టాలన్నారు. రూరల్ ఏరియాలో పనిచేసే వైద్యులకు పారితోషికం ఎక్కువ అందించి ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని సూచించించారు. గిరిజన ప్రాంతాల్లో సరైన వైద్య సదుపాయం అందేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాని పేర్కొన్నారు..

వనమహోత్సవం

వనమహోత్సవం కార్యక్రమాన్ని రాష్ట్రంలో పెద్దఎత్తున చేపట్టినట్టు కలెక్టర్లకు సీఎం చెప్పారు. అటవీ భూముల్లో పండ్ల మొక్కలు నాటడం వలన ఓ వైపు గిరిజనులకు ఆదాయం, మరో వైపు పచ్చదనం పెంపొందుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. వికారాబాద్ హవా.. టీబీకా దవా అనే (వికారాబాద్ గాలి.. టీబీకి మందు) నానుడి ఉందనీ, కానీ ఇప్పుడు వికారాబాద్ అటవీ ప్రాంతం చాలా వరకు ఖాళీగా ఉందన్నారు. అక్కడ గతంలోలా ఔషధ మొక్కలు నాటించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పులుల సఫారీకి తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు మహారాష్ట్రలోని తడోబా అటవీ ప్రాంతానికి వెళుతున్నారని పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాలోనూ అటవీ ప్రాంతం ఉన్నా పులులు సంచారం లేదనీ, వాటికి అవసరమైన ఆవాసం, నీటి సౌకర్యం కల్పిస్తే అటవీ పర్యాటకం పెంపొందించవచ్చని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

శాంతి భద్రతలు

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో రాజీపడొద్దని పోలీసు అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ బాధితులతోనే కానీ నేరస్థులతో కాదనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. పబ్బులు విషయంలో టైమింగ్ పెట్టొచ్చనీ, ఆంక్షల పేరుతో రాత్రి వేళల్లో స్ట్రీట్ ఫుడ్ పెట్టుకునే వారిని ఇబ్బంది పెట్టవద్దని హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనర్‌లకు ముఖ్యమంత్రి సూచించారు. డ్రగ్స్, సైబర్ నేరాలపై ఉక్కుపాదం మోపాలని పోలీసులను ముఖ్యమంత్రి ఆదేశించారు. డ్రగ్స్ విషయంలో పోలీసు, ఎక్సైజ్, టీజీ న్యాబ్ అధికారులు సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని సూచించారు. డ్రగ్స్‌తో పట్టుపడిన వారిని డీఅడిక్షన్ సెంటర్లో ఉంచాలనీ, ఇందుకోసం చర్లపల్లి ఓపెన్ ఎయిర్ జైలులో కొంత భాగాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

వ్యవసాయం

కల్తీ పురుగు మందులు, ఎరువులు, విత్తనాల విషయంలో కఠినంగా వ్యవహరించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. రాష్ట్రానికి అవసరమైన ఎరువులు, యూరియా సిద్ధంగా ఉన్నాయని, సరఫరాలో సమస్యలు తలెత్తకుండా ముందుగానే కలెక్టర్లు జాగ్రత్త వహించాలని మంత్రి అన్నారు. కొన్ని సార్లు కృత్రిమ కొరత సృష్టించి ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే ప్రయత్నం చేస్తారని, అటువంటివి జరగకుండా జాగ్రత్త పడాలని హెచ్చరించారు.

పాస్‌బుక్ ఉన్న రైతు కుటుంబానికే రుణమాఫీ

భూమి పాస్‌బుక్కుపై రుణం ఉన్న ప్రతి రైతు కుటుంబానికి రూ.2 లక్షల రుణమాఫీ వర్తిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర సచివాలయంలో కలెక్టర్లతో మంగళవారం నిర్వహించిన సదస్సులో రుణమాఫీపై సీఎం పలు విషయాలు వెల్లడించారు. కేవలం కుటుంబ నిర్ధారణకే రేషన్ కార్డును వాడుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో 90 లక్షల రేషన్ కార్డులు ఉంటే రుణాలు ఉన్న రైతు ఖాతాల సంఖ్య 70 లక్షలేనన్నారు. రేషన్ కార్డులు లేని 6.36 లక్షల మందికి రుణాలు ఉన్నాయనీ, వారికీ రుణమాఫీ వర్తిస్తుందని తెలిపారు. రేషన్ కార్డులు లేనంత మాత్రాన ఆ రైతులకు అన్యాయం జరగనివ్వబోమని స్పష్టం చేశారు. కలెక్టర్లు జిల్లా బ్యాంకర్లతో గురువారం సమావేశాన్ని నిర్వహించాలని ఆదేశించారు. రుణమాఫీకి ప్రభుత్వం విడుదల చేసే నిధులను రైతు రుణమాఫీకే వాడాలనీ, వ్యక్తిగత, ఇతర రుణాల మాఫీకి వినియోగించొద్దని సూచించాలన్నారు. గతంలో కొందరు బ్యాంకర్లు అలా చేస్తే కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. బ్యాంకర్లు మళ్లీ అదే విధంగా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. 18న సాయంత్రం నాలుగు గంటలకు రూ.లక్ష వరకు రుణమాఫీ నిధులు రైతుల ఖాతాల్లో జమవుతాయని తెలిపారు. రుణమాఫీ జరిగే రైతులను రైతు వేదికల వద్దకు తీసుకురావాలనీ, ఆయా జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు రైతులతో ఆ సంతోషాన్ని పంచుకోవాలని సూచించారు. రైతు రుణమాఫీకి సంబంధించి సచివాలయంలో రెండు జిల్లాలకు (ఉమ్మడి జిల్లాల చొప్పున) ఒక ఉన్నతాధికారిని అందుబాటులో ఉంచుతామనీ, కలెక్టర్లకు ఏవైనా సందేహాలు వస్తే వారితో సంప్రదించి నివృత్తి చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ సూచించారు.

వర్షాల నేపథ్యంలో ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలు

- వచ్చే ఐదురోజుల పాటు రాష్ట్రంలో వానలు
- పలుజిల్లాల్లో అక్కడక్కడా భారీ, అతి భారీ వర్షాలు పడే సూచనలు
- కుంచవెల్లిలో అత్యధికంగా 13.43 సెంటీమీటర్ల వాన

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చే ఐదు రోజుల పాటు వర్షాలు పడుతున్నాయనీ, పలు జిల్లాల్లో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వానలు పడే సూచనలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న తెలిపారు. ఈ నేపథ్యంలోనే పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలు జారీ చేసినట్టు పేర్కొన్నారు.

గ్రేటర్ హైదరాబాద్‌లో వచ్చే 48 గంటల పాటు ఆకాశం మేఘావృతమై తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశముందని తెలిపారు. 18,19, 20 తేదీల్లో ఆదిలాబాద్, కొమ్రం భీం అసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం మహబూబాబాద్, నిజామాబాద్, జగిత్యాల, జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పలుచోట్ల పడే సూచనలున్నాయి.

ఈ నేపథ్యంలో ఆ జిల్లాలకు వాతావరణ శాఖ అధికారులు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. 17,18,19,20 తేదీల్లో పైజిల్లాలతో పాటు ఖమ్మం, వరంగల్, నల్లగొండ, హన్మకొండ, సిద్దిపేట, జనగాం, నిర్మల్, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్, నారాయణపేట, సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో పలుచోట్ల భారీ వర్షాలు పడే సూచనలున్నాయి.

మంగళవారం ఉదయం 8:30 గంటల నుంచి రాత్రి 10:30 గంటల వరకు రాష్ట్రంలో 234 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. 55 ప్రాంతాల్లో మోస్తరు వర్షపాతం రికార్డయింది. కొమ్రం భీమ్ అసిఫాబాద్ జిల్లా దహేగాం మండలం కుంచవెల్లిలో 13.43 సెంటీమీటర్ల అతి భారీ వర్షం కురిసింది. మంచిర్యాల జిల్లా కన్నెపల్లిలో 8 సెంటీమీటర్లు, ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం సోనాలలో 7.93 సెంటీమీటర్ల భారీ వాన పడింది.

మాన్సూన్‌లో అప్రమత్తంగా ఉండాలి

- శానిటేషన్ నిర్వహణ సవ్యంగా జరగాలి
- అధికారులు, కార్పొరేటర్లు సమన్వయంతో పనిచేయాలి : జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



నవతెలంగాణ-సిటీబ్యూరో

మాన్సూన్ సీజన్‌లో క్షేత్రస్థాయిలో జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. ఈ మాన్సూన్ సీజన్‌లో ఒక్క ప్రాణనష్టమూ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం శేరిలింగంపల్లి జోన్ - యూసుఫ్‌గూడ సర్కిల్ బోరబండ డివిజన్‌కు సంబంధించిన అభివృద్ధి పనులపై అధికారులు, ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్, వాటర్ వర్క్స్, ఎంటమాలజీ, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ అధికారులు, బోరబండ కార్పొరేటర్ మహమ్మద్ బాబా ఫసియుద్దీన్‌తో కలిసి మేయర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై దృష్టి సారించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పని చేస్తూ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. బోరబండ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, సీసీ రోడ్డు పనులు, బోరబండ ప్రధాన రోడ్డు పని, వీధి దీపాలు, శానిటేషన్ నిర్వహణ తదితర అంశాలపై ఆయా విభాగాల అధికారులకు పలు సూచనలు చేశారు. వర్షాకాలంలో షార్ట్ సర్క్యూటయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ట్రాన్స్‌ఫార్మర్స్ వద్ద ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గుర్తించిన డార్క్ ఏరియాల్లో వీధి లైట్లు ఏర్పాటు చేయాలన్నారు.

గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కు పాదం మోపాలని, అందుకు పోలీసు శాఖ సహకారంతో అనుమానిత ఏరియాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సూచించారు. మంచి నీటి కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలని, నీటిని వృథా చేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. చెరువుల్లో గుర్రపు డెక్కను తొలగించాలన్నారు. రోడ్ల పెండింగ్ పనులు ప్రాధాన్యతాపరంగా చేపట్టడానికి మంజూరైన, పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలు ఇవ్వాలని డీసీకి సూచించారు. వర్షాల నేపథ్యంలో డి-సిల్టింగ్ చేయడం రెగ్యులర్ ప్రక్రియగా జరగాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగితే సహించబోమని సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాటర్ వర్క్స్‌కు సంబంధించిన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వాటర్ స్టాగ్నేషన్ పాయింట్స్ వద్ద నీటిని ఎప్పటికప్పుడూ తొలగించాలని చెప్పారు. జీవీపీల వద్ద గార్బేజ్ ఉండొద్దన్నారు. స్టెరిలైజ్ చేసిన కుక్కలను వెంటనే వదలకుండా రెండు మూడ్రోజులు గమనించాలని వెటర్నరీ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో యూసుఫ్‌గూడ డిప్యూటీ కమిషనర్ సేవ ఇస్లావత్, వాటర్ వర్క్స్ జీఎం హరి శంకర్, డీజీఎం వాహెబ్, మేనేజర్‌లు శ్రీనివాస్, రాజేందర్, జీహెచ్ఎంసీ ఈఈ రాజ్‌కుమార్, ఏఈ భరత్, ఏఎమ్‌హెచ్‌ఓ కవిత, యూసీడీపీడీ వెంకటకృష్ణ, సీపీడీసీసీల్ ఏఈలు సాయి, వేణు, టౌన్ ప్లానింగ్ ఇంజినీర్స్ రాకేష్, అవినాష్, ఎంటమాలజి సావిత్రి తదితరులు పాల్గొన్నారు.



సాయుధపోరాటంలో
కళాకారుల పాత్ర గొప్పది

- సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి
- సమాజ విశ్లేషణతో ప్రజలు స్ఫూర్తి పొందాలి : సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు
- చైతన్యవంతంగా సుద్దాల హనుమంతు సమగ్ర సాహిత్యం-జీవితం పుస్తకావిష్కరణ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రైతాంగ సాయుధపోరాటంలో కళాకారులది గొప్ప పాత్ర అని సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి అన్నారు. మహత్తరమైన ఆ ఉద్యమంలో నాలుగువేల మంది అమరులయ్యారనీ, లక్షలాదిమంది ప్రజలు భూస్వాములు, నైజాం పాలనకు వ్యతిరేకంగా చైతన్యవంతం అయ్యారని చెప్పారు. నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ ప్రచురించిన 'ప్రజాకవి సుద్దాల హనుమంతు సమగ్ర సాహిత్యం-జీవితం' పుస్తకాన్ని మంగళవారంనాడిక్కడి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం (ఎస్వీకే), ప్రజానాట్యమండలి, తెలంగాణ ప్రజానాట్యమండలి, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం (టీపీఎస్కే), అభ్యుదయ రచయితల సంఘం (అరసం) తెలంగాణ సాహితి, సుద్దాల ఫౌండేషన్ నిర్వహించాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో సురవరం మాట్లాడారు. ఇటీవలి కాలంలో తెలంగాణ సాయుధ పోరాటాన్ని సమర్థించకపోగా, దాన్ని ముస్లిం రాజుకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంగా బీజేపీ చరిత్రను వక్రీకరిస్తున్నదని చెప్పారు. తెలంగాణ సాయుధ పోరాటంలో వేర్వేరు కారణాలతో అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారనీ, దానిలో ప్రధానమైంది వెట్టిచాకిరి అనీ, సబ్బండ వర్గాలన్నీ దానిలో బాధితులుగా ఉన్నారని విశ్లేషించారు. సాయుధపోరాటంలో సుద్దాల హనుమంతు పాత్ర చాలా గొప్పదనీ, కళాకారుడిగా ఆయన ప్రజల్ని కదిలించడంతో పాటు ప్రత్యక్షంగానూ పోరాటంలో భాగస్వాములు అయ్యారని చెప్పారు. కేంద్రంలో ఫాసిస్టు ప్రభుత్వం నడుస్తున్నదనీ, మతోన్మాదంతో విభజించి పాలించే చర్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీన్ని తిప్పికొట్టేందుకు ఐక్యపోరాటాలు చేయాలన్నారు. సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలు సమాజాన్ని మార్చాలని కోరుకుంటాయని చెప్పారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో సాంస్కృతిక రంగానికి ప్రాధాన్యత ఉన్నదనీ, దానిలో సుద్దాల హనుమంతుకు ముఖ్యమైన స్థానం ఉందన్నారు. సాంస్కృతిక రంగం భూమిని దున్నితే, దానిలో రాజకీయరంగం విత్తనాలు వేయాలని విశ్లేషించారు. సాంస్కృతిక జాతీయవాదం పేరుతో హిందుత్వ శక్తులు ప్రజల మధ్య విభజన సృష్టించే ప్రయత్నం చేస్తున్నాయని చెప్పారు. కళాకారులు సమాజాన్ని విశ్లేషించి, ప్రజలకు చెప్తూ, వారిని చైతన్యవంతుల్ని చేయాలని అన్నారు. దోపిడీ ధ్వంసం అయ్యేవరకు, అణచివేతకు ఆయుష్షు మూడేవరకు సుద్దాల హనుమంతు ప్రజల హృదయాల్లో ఉంటారని తెలిపారు. ఆయన స్వీయ స్వరాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు అందిస్తే మరింత స్ఫూర్తివంతంగా ఉంటుందని సూచించారు. అరుణోదయ సాంస్కృతిక సంస్థ ప్రతినిధి విమలక్క మాట్లాడుతూ దేశంలోని ప్రస్తుత పరిస్థితుల్ని ప్రజలకు అర్థమయ్యేలా చెప్పేందుకు సాంస్కృతికోద్యమం ఒక్కతాటిపైకి రావాలని ఆకాంక్షించారు. సినీ నటుడు, సుద్దాల హనుమంతు మనుమడు ఉత్తేజ్ మాట్లాడుతూ తాతలోని పోరాట లక్షణాలు, ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ సుద్దాల హనుమంతు విప్లవోద్యమానికి స్ఫూర్తి అని చెప్పారు. కార్యక్రమానికి నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ సంపాదకులు కే ఆనందాచారి అధ్యక్షత వహించారు. ప్రముఖ కవి, విమర్శకులు కోయి కోటేశ్వరరావు, సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, ఎస్వీకే మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయకుమార్, రాపోలు సుదర్శన్ (అరసం), పల్లెనర్సింహ (తెలంగాణ ప్రజా నాట్యమండలి) బుచ్చిరెడ్డి (ఎస్వీకే) మోహనకృష్ణ (తెలంగాణ సాహితి), కిష్టారెడ్డి (నవతెలంగాణ బుక్ హౌస్) తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు టీపీఎస్కే ప్రతినిధి భూపతి వెంకటేశ్వర్లు అతిధులను వేదికపైకి ఆహ్వానించారు. నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ జనరల్ మేనేజర్ ఆర్ వాసు వందన సమర్పణ చేశారు. కార్యక్రమ ప్రారంభంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికుల్ని అలరించాయి.

యధావిధిగా 19న
చలో హైదరాబాద్

- పదో నెంబర్ జీవోను రద్దు చేయాల్సిందే
- పెన్షన్ పెంచి వీఆర్ఎస్ సౌకర్యం కల్పించాలి
- పాతపద్ధతిలోనే ప్రమోషన్లు ఇవ్వాలి
- అంగన్‌వాడీలకిచ్చిన హామీలను అమలు చేయాలి
- మంత్రి సీతక్కకు తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పదో నెంబర్ జీవోను రద్దు చేయాలనీ, అంగన్‌వాడీలకు రాష్ట్ర ప్రభుత్వమిచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 19న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమం యధావిధిగా ఉంటుందని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.ఈశ్వర్‌రావు, రాష్ట్ర కార్యదర్శి కె.రమేశ్ స్పష్టం చేశారు. ఉద్యోగవిరమణ ప్రయోజనాలను, పెన్షన్‌ను పెంచి వీఆర్ఎస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి దనసరి అనసూయ(సీతక్క)కు వారు వినతిపత్రాన్ని అందజేశారు. ఉద్యోగ విరమణ ప్రయోజనాల కింద టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్లకు లక్ష రూపాయలకు పెంచుతామనటం వరకే పరిమితం కాకుండా తక్షణమే కొత్త జీవో విడుదల చేయాలని కోరారు. హెల్పర్లకు పాత పద్ధతిలోనే ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని విన్నవించారు. అంగన్‌వాడీలను పర్మినెంట్ చేసి కనీస వేతనం రూ.26 వేలు, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత సౌకర్యాలను కల్పించాలని విజ్ఞప్తి చేశారు. 24 రోజుల సమ్మె కాలం నాటి హామీలన్నింటినీ అమలు చేయాలని కోరారు. ప్రతి నెలా ఐదో తేదీ లోపే వేతనాలివ్వాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు గ్రాట్యూటీ చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఐసీడీఎస్‌లో ఆన్‌లైన్ యాప్‌లన్నింటినీ రద్దు చేయాలనీ, ఒకే యాప్ ఉండే విధంగా ఉత్తర్వులివ్వాలని కోరారు. ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచి బలోపేతం చేయాలనీ, పక్కా భవనాలు, మౌలిక వసతులు కల్పించాలని విన్నవించారు. ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కారుణ్య నియామకాలు అమలు చేయాలని కోరారు. జీవో నెంబర్ 14, 8 లను సవరించాలని డిమాండ్ చేశారు.

'న్యాక్' గుర్తింపునకు సంస్కరణలు

- వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు
- అన్ని కాలేజీలకూ అక్రిడిటేషన్ తప్పనిసరి
- కేంద్ర విద్యాశాఖ సమాలోచన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) గుర్తింపునకు సంబంధించి సంస్కరణలు తేవాలని కేంద్ర విద్యాశాఖ భావిస్తున్నది. ప్రస్తుతం న్యాక్ నిబంధనలను మార్చి కొత్త నిబంధనలు అమల్లోకి తెచ్చే ఆలోచన చేస్తున్నది. ఇందుకోసం ఐఐటీ కాన్పూర్ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్మెన్ డాక్టర్ కె రాధాకృష్ణన్ అధ్యక్షతన కేంద్రం కమిటీని నియమించింది. ఈ కమిటీలో 45 మంది విద్యాశాఖ అధికారులు, విద్యావేత్తలు, నిపుణులు ఉంటారు. న్యాక్ గుర్తింపునకు సంబంధించి తేవాల్సిన సంస్కరణల గురించి ఆ కమిటీ అధ్యయనం చేసి సిఫారసులను చేయనుంది. జాతీయ నూతన విద్యావిధానం-2020కి అనుగుణంగా చర్చించి పలు నిర్ణయాలు తీసుకుంటుంది. ఆ నిబంధనలు వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమల్లోకి వస్తాయి. దేశంలో అన్ని కాలేజీలూ, విశ్వవిద్యాలయాలకూ న్యాక్ గుర్తింపును తప్పనిసరి చేయాలని కేంద్ర విద్యాశాఖ భావిస్తున్నది. ప్రస్తుతం న్యాక్ గుర్తింపు పొందిన విద్యాసంస్థలు ఉన్నాయి. అక్రిడిటేషన్ ఉన్న విద్యాసంస్థలు, అక్రిడిటేషన్ కోసం ఎదురుచూస్తున్న విద్యాసంస్థలు, అక్రిడిటేషన్ లేని విద్యాసంస్థలుగా విభజిస్తారు. ప్రస్తుతం దేశంలో విశ్వవిద్యాలయాలు, కాలేజీలకు ఒకే విధమైన నిబంధనల ప్రకారం న్యాక్ గుర్తింపు ఇస్తున్నారు. వాటిలో మార్పు తేవాలని విద్యాశాఖ భావిస్తున్నది. విశ్వవిద్యాలయాలు, అటానమస్ కాలేజీలు, గుర్తింపు పొందిన కాలేజీలకు వేర్వేరుగా న్యాక్ నిబంధనలను తయారు చేస్తారు. వాటి ఆధారంగా న్యాక్ గుర్తింపును ఇస్తారు. విశ్వవిద్యాలయాలకు మౌలిక వసతులు, అధ్యాపకులు, పరిశోధనలు, అంతర్జాతీయ, జాతీయ జర్నల్స్‌కు ప్రాధాన్యత ఉంటుంది. అటానమస్ కాలేజీలు, గుర్తింపు పొందిన కాలేజీలకు మౌలిక వసతులు, అధ్యాపకుల వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని న్యాక్ గుర్తింపును ప్రకటిస్తారు.

వంద ప్రభుత్వ డిగ్రీ కాలేజీలకు న్యాక్

రాష్ట్రంలో 135 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలున్నాయి. వాటిలో వంద ప్రభుత్వ డిగ్రీ కాలేజీలకు న్యాక్ గ్రేడ్ వచ్చింది. మిగిలిన కాలేజీలకూ న్యాక్ గుర్తింపు వచ్చేలా ప్రభుత్వం కృషి చేస్తున్నది. న్యాక్ గుర్తింపునకు దరఖాస్తు చేసుకుంటే మౌలిక వసతుల కల్పన కోసం ఉన్నత విద్యామండలి రూ.లక్ష ఇస్తుంది. రాష్ట్రంలో ఇంజినీరింగ్, వృత్తి విద్యాకాలేజీలు సహా డిగ్రీ కాలేజీలతో కలిపి మొత్తం 1,988 కాలేజీలుంటే, వాటిలో 65 అటానమస్ కాలేజీలున్నాయి. ఇందులో జేఎన్టీయూ హైదరాబాద్ పరిధిలో 34, ఓయూ పరిధిలో 23, మిగిలిన 12 కాలేజీలు వివిధ వర్సిటీల పరిధిలో ఉన్నాయి.

న్యాక్ గ్రేడ్ ఇచ్చేదిలా...

న్యాక్‌లో ఏ++, ఏ+, ఏ, బీ++, బీ+, బీ, సీ గ్రేడ్‌లున్నాయి. బోధన అంశాలకు 150 మార్కులు, బోధన, అభ్యసన, మూల్యాంకనానికి 200 మార్కులు, పరిశోధన, ఆవిష్కరణలకు 250 మార్కులు, మౌలిక వసతులకు 100 మార్కులు, విద్యార్థుల ప్రగతికి 100 మార్కులు, సుపరిపాలన, నాయకత్వ ప్రతిభకు 100 మార్కులు, విద్యాసంస్థలో విలువలు, అవార్డులకు 100 మార్కుల చొప్పున మొత్తం 1000 మార్కులుంటాయి. న్యాక్ బృందం విశ్వవిద్యాలయం లేదా కాలేజీని సందర్శించి ఆ అంశాలను పరిశీలిస్తుంది. వెయ్యి మార్కులను నాలుగు క్యుములేటివ్ గ్రేడ్ పాయింట్ యావరేజ్ (సీజీపీఏ)గా కుదించి గ్రేడ్‌ను కేటాయిస్తారు. 3.76 నుంచి 4 పాయింట్లు సాధిస్తే ఏ++ గ్రేడ్, 3.51 నుంచి 3.75 పాయింట్లు సాధిస్తే ఏ+ గ్రేడ్, 3.01 నుంచి 3.50 పాయింట్లు వస్తే ఏ గ్రేడ్ వస్తుంది. న్యాక్ గ్రేడ్ ఐదేండ్లపాటు ఉంటుంది.

అన్ని కాలేజీలకూ న్యాక్ గ్రేడ్ ఉండేలా ప్రోత్సాహం : లింబాద్రి

రాష్ట్రంలోని అన్ని కాలేజీలకూ న్యాక్ గ్రేడ్ ఉండేలా ప్రోత్సహిస్తామని ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి చెప్పారు. న్యాక్ గ్రేడ్ వల్ల కలిగే ప్రయోజనాలను కాలేజీ యాజమాన్యాలకు అవగాహన కల్పిస్తామని అన్నారు. కొత్త నిబంధనలను కేంద్ర విద్యాశాఖ రూపొందిస్తున్నదని వివరించారు. న్యాక్ గ్రేడ్ ఉన్న కాలేజీలు, న్యాక్ గ్రేడ్ లేని కాలేజీలుగా విభజిస్తామని చెప్పారు.

ఎనిమిది కొత్త మెడికల్ కాలేజీల్లో 872 పోస్టుల భర్తీకి అనుమతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎనిమిది కొత్త మెడికల్ కాలేజీల్లో బోధనా సిబ్బంది నియామకానికి ప్రభుత్వం ఒకే చెప్పింది. బోధనా సిబ్బంది కొరతతో కొత్త మెడికల్ కాలేజీలకు అనుమతులు వస్తాయా? రావా? అన్న విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో రాష్ట్ర వైద్యవిద్య సంచాలకుల పరిధిలో కొత్తగా ఏర్పాటు చేయనున్న 8 మెడికల్ కాలేజీల్లో ఒక్కో కాలేజీలో 109 పోస్టుల చొప్పున కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేసేందుకు ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జోగులాంబ గద్వాల, నారాయణపేట్, ములుగు, నర్సంపేట్, మెదక్, యాదాద్రి భువనగిరి, మహేశ్వరం, కుత్బుల్లాపూర్‌లలో కొత్త మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఒక్కో కాలేజీలో 25 మంది ప్రొఫెసర్లు, 28 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 56 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ల చొప్పున భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖను కోరింది. నెలకు ప్రొఫెసర్లకు రూ.1,90,000, అసోసియేట్ ప్రొఫెసర్లకు రూ.1,50,000, అసిస్టెంట్ ప్రొఫెసర్లకు రూ.1,25,000 చొప్పున పారితోషికం ఇవ్వనున్నారు. ఈ కాంట్రాక్టు వచ్చే ఏడాది మార్చి 31 నాటికి లేదా రెగ్యులర్ పోస్టులు భర్తీ చేసే వరకు అమల్లో ఉంటుంది.

పేదలకు ఉచిత సీట్ల కేటాయింపుపై వివరాలివ్వండి : హైకోర్టు

నవతెలంగాణ -హైదరాబాద్

విద్యా హక్కు చట్టం ప్రకారం జిల్లాల్లో ఉచిత విద్యను ఎంతమందికి అందజేసింది జిల్లాల వారీగా నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. 'కేంద్ర ప్రభుత్వం తెచ్చిన పిల్లల ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టం- 2009ను రాష్ట్రంలో పూర్తిగా అమలు కావడం లేదు' అంటూ లాయర్ యోగేష్ వేసిన పిల్‌ను చీఫ్ జస్టిస్ అలోక్ అరాథే బెంచ్ విచారించింది. ఆ చట్టంలో 12(1)సీ ప్రకారం ప్రయివేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లను ఉచితంగా కేటాయించేలా ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. 12(1)సీ అమలు చేస్తేనే అనుమతి ఇచ్చేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్నారు. పేద విద్యార్థులకు సర్కారీ బడుల్లో 100 శాతం ఉచితంగా విద్యాబోధన జరుగుతోందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. రిపోర్టు రెండు వారాల్లో ఇవ్వాలని కోరిన హైకోర్టు విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

సివిల్ కేసుల విచారణ అధికారం లేదు : హైకోర్టు

ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఏజెన్సీల్లోని సివిల్ కేసులను విచారణ చేయడానికి వీల్లేదని హైకోర్టు స్పష్టం చేసింది. మారిన చట్టం ప్రకారం ఆ విధంగా చేయరాదని జస్టిస్ శరత్ చెప్పారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో పీవో విచారణ చేపట్టిన కేసుల వివరాల జాబితాను అందజేయాలని ఆదేశించింది. ఇదే అంశంపై కలెక్టర్ నుంచి నివేదిక తెప్పించాలని హైకోర్టు రిజిస్ట్రీకి ఉత్తర్వులు జారీ చేశారు. ఒక సివిల్ వివాదంలో పత్రాలను చేతి రాత నిపుణులకు పంపాలన్న వినతిని ఐటీడీఏ పీవో తిరస్కరిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలంటూ ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం హస్నాబాద్‌కు చెందిన చవన్ ప్రకాశ్ పిటిషన్ వేశారు. 2022 నాటి జీవో 274 ప్రకారం ప్రభుత్వం తరపున అదనపు ఏజెంట్‌గా పీవో వ్యవహరించడం చెల్లదని పిటిషనర్ వాదన. విచారణ ఆగస్టు 2కు వాయిదా పడింది.

జూబ్లీహిల్స్ పోలీసుల కస్టడీకి మాజీ డీసీపీ

- కోర్టు ఆదేశాలు జారీ

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రూ.కోట్ల భూ వివాదం కేసులో నగర టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు ను రెండ్రోజుల పాటు కస్టడీలోకి తీసుకొని విచారించటానికి జూబ్లీహిల్స్ పోలీసులకు నాంపల్లి కోర్టు మంగళవారం అనుమతించింది. ఇప్పటికే ఫోన్‌ట్యాపింగ్ కేసులో అరెస్టయిన రాధాకిషన్‌రావు.. చంచల్‌గూడ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న విషయం తెలిసిందే. ఈ సందర్భంలోనే జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో దాదాపు రూ.150 కోట్ల విలువైన భూ వ్యవహారంలో రాధాకిషన్‌రావు అక్రమాలకు పాల్పడి బాధితులకు ఇబ్బందులను కలిగించినట్టు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో రాధాకిషన్‌రావు నుంచి మరిన్ని వివరాలను రాబట్టటానికి పది రోజుల పాటు తమ కస్టడీకి ఇవ్వాలంటూ జూబ్లీహిల్స్ పోలీసులు నాంపల్లి కోర్టులో కస్టడీ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను పరిశీలించిన న్యాయమూర్తి కేవలం రెండ్రోజులు మాత్రమే రాధాకిషన్‌రావును విచారించటానికి జూబ్లీహిల్స్ పోలీసులకు అనుమతించారు. దీంతో రాధాకి షన్‌రావును బుధవారం జూబ్లీహిల్స్ పోలీసులు తమ కస్టడీలోకి తీసుకోనున్నారు

అభిషేక్ బోయినపల్లి కేసు నుంచి తప్పుకున్న సుప్రీం జడ్జి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కేసులో నిందితుడు అభిషేక్ బోయినపల్లి మధ్యంతర బెయిల్‌ను సుప్రీంకోర్టు పొడిగించింది. అయితే ఈ బెయిల్ పిటిషన్‌పై విచారణ నుంచి సుప్రీం న్యాయమూర్తి జస్టిస్ పీవీ సంజీవ్ కుమార్ తప్పుకున్నారు. భార్య అనారోగ్య కారణాలపై అభిషేక్ బోయినపల్లి మధ్యంతర బెయిల్ పొందారు. తాజా పరిణామాలతో ఈ బెయిల్‌ను పొడిగించారు. మరోవైపు ఇదే కేసులో ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఈడీ, సీబీఐలకు సుప్రీంకోర్టు నోటీసులిచ్చింది. తదుపరి విచారణ ఈనెల 29కి వాయిదా వేసింది.

డిగ్రీ కాలేజీల్లో 1.20 లక్షల మంది రిపోర్టు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బీఏ, బీఎస్సీ, బీకాం, బీకాం ఒకేషనల్, బీకాం ఆనర్స్, బీఎస్‌డబ్ల్యూ, బీబీఏ, బీసీఏ, బీబీఎం, బీసీఏ కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్)కు సంబంధించి ఇప్పటి వరకు 1,20,286 మంది విద్యార్థులు డిగ్రీ కాలేజీల్లో రిపోర్టు చేశారు. ఈ మేరకు దోస్త్ కన్వీనర్, ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి మంగళవారం తనను కలిసిన విలేకర్లతో మాట్లాడారు. ఇంజినీరింగ్ మొదటి విడత సీట్ల కేటాయింపు తర్వాత దోస్త్ మరో విడత ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేస్తామని వివరించారు.

అంగన్‌వాడీలకు రిటైర్‌మెంట్ బెన్‌ఫిట్

టీచర్లకు రూ.2లక్షలు, హెల్పర్స్‌కు లక్ష



- త్వరలో కొత్త జీవో
- సీఎంతో చర్చించి నాలుగైదు రోజుల్లో చర్యలు
- ఆందోళన చెందొద్దు : మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- ఫలించిన తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పోరాటం

నవతెలంగాణ-సిటీబ్యూరో/జూబ్లీహిల్స్

రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద అంగన్‌వాడీ టీచర్లకు రూ.2 లక్షలు, సహాయకులకు రూ.లక్ష చొప్పున అందిస్తామని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. తమకు తీవ్ర నష్టదాయకమైన జీవో 10ని రద్దు చేయాలంటూ తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో పది రోజులకుపైగా నిరాహార దీక్షలు, కలెక్టరేట్ల ముట్టడి, పెద్దఎత్తున ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల ముట్టడి నేపథ్యంలో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి పైవిధంగా స్పందించారు. రాష్ట్రంలో ఉద్యోగ విరమణ విషయంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఎలాంటి ఆందోళన చెందొద్దని త్వరలో రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచుతూ కొత్త జీవో జారీ చేస్తామని మంత్రి ప్రకటించారు.



హైదరాబాద్ ఖైరతాబాద్ ప్రాజెక్టు పరిధిలోని రహమత్‌నగర్ సెక్టర్‌లోని ఎస్ఎస్‌బీ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో 'అమ్మమాట-అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. అంతకుముందు భావితరాలకు మొక్కల విలువ తెలియజేస్తూ 'నా మొక్క- నా భవిష్యత్' అనే భావన ప్రతి ఒక్కరిలోనూ రావాలని అంగన్వాడీ కేంద్రంలో మొక్క నాటారు. తరువాత పిల్లలు, తల్లులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రితో చర్చించి నాలుగైదు రోజుల్లో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్ కు రిటైర్మెంట్ బెన్‌ఫిట్స్ పెంచే అంశానికి సంబంధించిన కొత్త జీవో జారీ చేసేలా చూస్తామని తెలిపారు. అంగన్‌వాడీ సిబ్బందికి కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుందని చెప్పారు. పిల్లలు అమ్మ ఒడిలో ఎంత సురక్షితంగా ఉంటారో.. అంగన్‌వాడిలోనూ అంతే సురక్షితంగా ఉండేలా డిపార్టుమెంట్ సేవలందిస్తుందని చెప్పారు. తల్లిదండ్రులు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకోవడానికి పంపించాలని సూచించారు. అందరికీ అనుకూలంగా ఉండేలా సిలబస్ ప్రకారం ప్రభుత్వం పాఠాల రూపకల్పన చేయించిందని, ప్రస్తుతం పిల్లలకు యూనిఫామ్స్ ఇవ్వాలనే ఆలోచనలోనూ ఉన్నామని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూడీఅండ్‌సీడబ్ల్యూ సెక్రెటరీ వాకాటి కరుణ, డైరెక్టర్ కాంతి వెస్లీ, జిల్లా సంక్షేమాధికారి ఈ.అక్కేశ్వర్‌రావు, రెహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, బస్తీ నాయకులు, సీడీపీవో, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

చిత్తశుద్ధి ఉంటే ఒకేసారి రుణమాఫీ చేయాలి

- ఆచరణకు నోచని కాంగ్రెస్ మ్యానిఫెస్టో చిత్తుకాగితంతో సమానం : ఈటల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే రైతులకు ఒకేసారి రుణమాఫీ చేయాలని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ సవాల్ విసిరారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వమిచ్చిన ఆరు గ్యారంటీలు, 66 హామీలు, 420 రకాల పనులు అమలులో సాధ్యం కావని తేల్చిచెప్పారు. అవి అమలు కావాలంటే రూ.2 లక్షల కోట్లు కావాలన్నారు. రాష్ట్ర అప్పుల వడ్డీలకే నెలకు రూ. 7 వేల కోట్లు పోతున్నాయని సీఎం రేవంత్ రెడ్డినే చెబుతున్నారనీ, అలాంటప్పుడు వాటిని ఎలా నెరవేరుస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ సర్కారు జారీ చేసిన రుణమాఫీ నియమనిబంధనలు రైతులకు ఉరితాళ్లలాంటివన్నారు. రాష్ట్రంలో పదేండ్ల నుంచి పేదలకు తెల్ల రేషన్ కార్డులివ్వలేదనీ, అలాంటప్పుడు ఆ నిబంధన ఎలా పెడతారని ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఆర్టీసీ కార్మికులు, రిటైర్డ్ ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, సింగరేణి కార్మికులకు రేషన్ కార్డులుండవనీ, దీంతో వారు ప్రభుత్వ పథకాలకు అనర్హులుగా మిగిలిపోయే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు.

వరి పంటకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి అధికారంలోకి రాగానే సన్నవడ్లకే అనటం దారుణమన్నారు. తెలంగాణ ప్రజలు ఆకలినైనా భరిస్తారుగానీ అవమానాన్ని, మోసాన్ని భరించరనే విషయాన్ని రేవంత్‌రెడ్డి గుర్తుంచుకోవాలని సూచించారు. అమలుకు నోచుకోని కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో చిత్తుకాగితంతో సమానమని విమర్శించారు. ఒక పార్టీ గుర్తుపై గెలిచి ఇతర పార్టీల్లోకి వెళ్లేవారి సభ్యత్వాన్ని రద్దుచేస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పొందుపర్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పుడు అధికారంలోకి రాగానే ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకుంటున్నారని విమర్శించారు.

ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్



నవతెలంగాణ-జనగామ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ అన్నారు. మంగళవారం జనగామ జిల్లాలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎండీ అబ్బాస్ పాల్గొని మాట్లాడారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుండా యువతను పక్కదారి పట్టించేలా పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న ప్రధాని నరేంద్ర మోడీ గారడీ మాటలు తప్ప చేసిందేమీ లేదన్నారు. దేశంలో రోజురోజుకు నిత్యవసర సరుకుల ధరలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంక్షేమాన్ని కేంద్ర ప్రభుత్వం విస్మరించిందని, పంటలకు మద్దతు ధర అందించడంలో విఫలమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలన్నింటినీ అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఇండ్ల నిర్మాణానికి ఇస్తామన్న రూ.5లక్షలు అందని ద్రాక్షగా మారిందన్నారు. జనగామ జిల్లా కేంద్రంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రుణమాఫీ ఇవ్వాలని అన్నారు. లేదంటే పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి రాజు, సాంబరాజు యాదగిరి, ఈ. అహల్య, సింగారపు రమేష్, జనగామ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, సుంచు విజేందర్, బెల్లంకొండ వెంకటేష్, బోడ నరేందర్, రమేష్, పోతుకునూరి ఉపేందర్, మండల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత గిరిజన కుటుంబానికి రూ.5 లక్షలిస్తాం

పిల్లలిద్దర్నీ చదివించే బాధ్యత నాదే

- మానవతా దృక్పథంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.50 లక్షలివ్వాలి : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని 16 చింతల్ తండాలో ఉన్మాది చేతిలో దారుణ హత్యకు గురైన గిరిజన కుటుంబానికి రూ. 5 లక్షలు ఇస్తామనీ, పిల్లలిద్దర్నీ చదివించే బాధ్యత తనదేనని బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారకరామారావు ప్రకటించారు. ఉన్మాది నాగరాజు చేసిన దాడిలో తల్లిదండ్రులిద్దరూ (శ్రీనివాస్, సుగుణ) చనిపోవటంతో వారిద్దరి పిల్లలు దీపిక, మదన్ అనాథలైన విషయం విదితమే. దాడిలో వారూ తీవ్రంగా గాయపడి చికిత్స అనంతరం కోలుకున్న సంగతీ తెలిసిందే. మంగళవారం ఆ పిల్లలను మాజీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి సుదర్శన్ రెడ్డి కేటీఆర్ వద్దకు తీసుకొచ్చారు. వారిద్దరినీ చూసి కేటీఆర్ చలించిపోయారు. ఆరోగ్యం గురించి వాకబు చేశారు. ధైర్యం చెప్పారు. చదువు బాధ్యత తానే తీసుకుంటాననీ, అండగా ఉంటామని భరోసానిచ్చారు. సుగుణ బీఆర్ఎస్ క్రియాశీల కార్యకర్త, వార్డు మెంబర్ అనీ, ఆ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని చెప్పారు.

దాడికి గురైన ఆ పిల్లలిద్దరూ దీర్ఘకాలం చికిత్స తీసుకోవాల్సిన అవసరమున్న నేపథ్యంలో మానవతా దృక్పథంతో రూ.50 లక్షల ఆర్థిక సహాయం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. నిందితుడు నాగరాజుకు కఠిన శిక్ష పడేలా డీజీపీకి ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు.

భుజాలు తడుముకోకు కేసీఆర్

- సుప్రీంకోర్టు మార్చమన్నది జడ్జినే
- విచారణ కమిషన్ ముందు హాజరు కాక తప్పదు : టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మెన్ మధుయాష్కీ గౌడ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సుప్రీంకోర్టు తీర్పుపై భుజాలు తడుముకోవద్దని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మెన్ మధుయాష్కీగౌడ్ మాజీ సీఎం కేసీఆర్‌కు సూచించారు. సుప్రీం కోర్టు మార్చమన్నది జడ్జినే కానీ విచారణ కమిషన్‌ను కాదని గుర్తు చేశారు. విచారణ కమిషన్ ముందు హాజరు కాకతప్పదని హెచ్చరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందంలో తప్పు చేయనప్పుడు విచారణ కమిషన్ ముందు హాజరు కావొచ్చుగా అని సూచించారు. కల్వకుంట్ల కుటుంబం పదేండ్లలో రూ.80వేల కోట్ల అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. గతంలోనే విద్యుత్ కొనుగోళ్లలో అవినీతి జరిగిందంటూ తాను చెప్పినట్టు గుర్తు చేశారు. ఆ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే విద్యుత్ ఒప్పందాల పేరిట కేసీఆర్, హరీశ్‌రావు రూ. 133 కోట్ల కమిషన్ తీసుకున్నారని ఆరోపించారు. భారీ మొత్తంలో కమిషన్ తీసుకున్న విషయం తెలిసి వ్యాపారవేత్తలే వాపోయారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి దమ్ముంటే ఒప్పందాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలంటూ మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, హరీశ్‌రావు అసెంబ్లీలో సవాల్ విసిరారని గుర్తు చేశారు. వారి సూచనమేరకే విచారణ చేపడుతుంటే, కోర్టులను ఆశ్రయించి అడ్డుకట్ట వేస్తున్నారని విమర్శించారు. తాను అవినీతి చేయలేదంటూ సుప్రీంకోర్టుకు చెప్పలేదన్నారు. కొత్త జడ్జి వచ్చిన తర్వాత అన్నీ బయటకొస్తాయన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించలేదనీ, చట్టబద్ధంగానే కేసీఆర్‌ను జైల్లో పెడతామన్నారు. గ్రీన్ ఛాలెంజ్ అంటూ హడావిడి చేసే చెట్ల సంతోష్‌రావు పత్తా లేకుండా పోయారని ఎద్దేవా చేశారు. ఆయన భార్య పేరిట నర్సరీ పెట్టి కోట్ల రూపాయలను దోచుకున్నారనీ, దానిపై కూడా విచారణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

త్యాగనిరతికి ప్రతీక మొహరం : సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

త్యాగనిరతికి, అనిర్వచనీయ సహనానికి మొహరం ప్రతీకగా నిలుస్తుందని సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ముహమ్మద్ ప్రవక్త మనవడు హజ్రత్ ఇమామ్ హుస్సేన్ బలిదానాన్ని సంస్మరణగా మొహరం జరుపుకుంటారని తెలిపారు. తరతరాలుగా తెలంగాణ గ్రామాల్లో హిందూ, ముస్లింలు కలిసి పీర్ల ఊరేగింపు నిర్వహిస్తారని గుర్తు చేసుకున్నారు. రాష్ట్రంలో గంగా జమున తెహజీబ్‌కి గొప్ప నిదర్శనం పీర్ల ఊరేగింపు అని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా ప్రజల మధ్య సఖ్యతకు, ఐక్యతకు వారధిగా మొహరం నిలుస్తుందని తెలిపారు.


రుణమాఫీపై సర్కారుకు స్పష్టమైన ఆలోచనలు

- రైతులు గందరగోళ పడొద్దు : అన్నదాతలకు కోదండరెడ్డి, అన్వేష్‌రెడ్డి విజ్ఞప్తి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రుణమాఫీ విషయంలో రైతులను బీఆర్ఎస్ గందరగోళానికి గురి చేస్తోందంటూ కాంగ్రెస్ కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షులు కోదండరెడ్డి, రాష్ట్ర చైర్మెన్ అన్వేష్‌రెడ్డి విమర్శించారు. రుణమాఫీపై కాంగ్రెస్ పార్టీకి, రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టమైన ఆలోచనలు ఉన్నాయని చెప్పారు. రైతులు గందరగోళ పడొద్దని విజ్ఞప్తి చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో వారు విలేకర్లతో మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలు రుణమాఫీ విషయంలో రైతులను పరేషాన్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గులాబీ నేతలు తమకు పాఠాలు నేర్పాల్సిన అవసరం లేదనీ, దేశంలో మొదటిసారి రుణమాఫీ చేసింది కాంగ్రెస్ సర్కారేనని గుర్తు చేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఆ పథకాన్ని తీసుకొచ్చారని చెప్పారు. ఆ పథకానికి సంబంధించిన ప్రతిపాదనలను అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఎదుట ఆయన పెట్టారనీ, దాన్నే అప్పటి యూపీఏ సర్కార్ దేశవ్యాప్తంగా అమలు చేసిందని వారు గుర్తు చేశారు.

పార్లమెంట్‌లో గళమెత్తుతాం




- ఎంపీ కిరణ్ కుమార్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

బీఆర్ఎస్ ప్రభుత్వ చేతగానితనం వల్లే ఇప్పటివరకూ సమస్యలు పరిష్కారం కాలేదని, తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలుగా పార్లమెంట్‌లో రాష్ట్ర సమస్యలపై గళమెత్తుతామని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. బీజేపీ నుంచి గెలిచిన ఎంపీలు కూడా సమస్యలపై దృష్టి పెట్టాలని కోరారు. మంగళవారం నాడిక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి వివిధ శాఖలకు చెందిన 31 అంశాలు కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఇటీవల ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెండింగ్ అంశాలపై కేంద్రమంత్రులతో మాట్లాడారని అన్నారు. అంతేకాక "బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ సమస్య చాలా రోజులుగా పెండింగ్‌లో ఉంది. విభజన హామీల్లో మొదటగా ఇచ్చిన హామీ ఇది. తెలంగాణకు సైనిక్ స్కూల్ కేటాయించాలి. వరంగల్, కరీంనగర్‌లను స్మార్ట్ సిటీలుగా చేస్తామని కేంద్రం ప్రకటించింది. కానీ ఆ విషయాన్ని అంగీకరించటం లేదు. వెనకబడిన జిల్లాలకు స్పెషల్ అలవెన్స్ కింద రూ.450 కోట్లు కేటాయిస్తామని కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటించింది. ఆ నిధులను తెలంగాణకు ఇవ్వాలి. పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ అంశాన్ని కూడా పార్లమెంట్‌లో లేవనెత్తుతాం. సింగరేణిని ప్రయివేట్ పరం చేయాలని కేంద్రం చూస్తోంది. దాన్ని అడ్డుకుంటాం. హైదరాబాద్‌లో ఐటిఐఆర్ ఏర్పాటు చేయాలి. దీని కోసం 49వేల ఎకరాల భూమి ఇస్తామని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే కేంద్రానికి చెప్పింది. భువనగిరిలో హ్యాండ్లూమ్ పార్కు, రాష్ట్రంలో ఐఐఎం ఏర్పాటు చేయాలి. గత ఆరు నెలలుగా తెలంగాణలో స్వేచ్ఛ పాలన సాగుతోంది. మేము ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం" అని అన్నారు. రుణమాఫీపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని, నిజమైన రైతుకి మాత్రమే మాఫీ అందించేందుకు కొన్ని షరతులు పెట్టినటుట్టు ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి చెప్పారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ గుండు సున్నాగా మారుతోందని ఎద్దేవా చేశారు. స్వయంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే వచ్చి కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. ఎమ్మెల్యేలను బెదిరించి పార్టీలో చేర్చుకున్నట్లు గులాబీ నేతలు ఆరోపిస్తున్నారని, దానికి సంబంధించిన ఆధారాలు ఉంటే చూపించాలని అన్నారు.

ఉప్పల్‌లో కుంగిన జాతీయ రహదారి

- కారుకు తప్పిన ప్రమాదం



నవతెలంగాణ -ఉప్పల్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్‌లో భారీ వర్షానికి వరంగల్ జాతీయ రహదారి ఓ చోట కుంగింది. రహదారిపై నిర్మిస్తున్న ఎలివేటడ్ కారిడార్ రెండు పిల్లర్ల పక్కన రోడ్డు కుంగిపోగా మంగళవారం ఓ కారు చక్రం అందులో దిగింది. కారులో ఉన్న వారెవరికీ ఎలాంటి గాయాలూ కాలేదు. వాహనాన్ని బయటకు తీశారు. వర్షం ధాటికి పిల్లర్ చుట్టూ ఉన్న మట్టి భూమిలోకి కూరుకుపోవడంతో చీలికలు ఏర్పడినట్టు తెలుస్తోంది. ఆ గుంతను పూడ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అయితే, గతంలో అక్కడ నాలా ఉన్నప్పటికీ దాన్ని సరిగా పూడ్చకుండా.. ఎలాంటి జాగ్రత్తలూ తీసుకోకుండానే ఎలివేటెడ్ కారిడార్ పనులను ప్రారంభించారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డు కుంగిపోయిందని, ఇకనైనా అధికారులు ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అధ్యాపకుల బదిలీల మార్గదర్శకాలను సవరించాలి

- తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్ల సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, అధ్యాపకుల బదిలీల కోసం జారీ చేసిన మార్గదర్శకాలను సవరించాలని తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ కనకచంద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్పౌజ్, మెడికల్‌కు సంబంధించిన కొన్ని విషయాలను విద్యాశాఖ విస్మరించిందని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇష్టానుసారంగా బదిలీల మార్గదర్శకాలను జారీ చేసిందని పేర్కొన్నారు. సుదీర్ఘకాలంగా ఒకే కాలేజీలో పనిచేస్తున్న అధ్యాపకులు బదిలీలకు అర్హత కోల్పోయే అవకాశం ఏర్పడిందని వివరించారు. మెడికల్, స్పౌజ్‌ల విషయంలో రెండేండ్ల సర్వీసు నిబంధన తప్పనిసరి కాదని తెలిపారు. వారికి ఏడాది సర్వీసు ఉన్నా బదిలీలకు అవకాశం కల్పించాలని కోరారు.

ఐకేపీ వీఓఏలకు కనీస వేతనమివ్వాలి

- గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా చూడాలి
- మంత్రి సీతక్కకు ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం వినతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఐకేపీ వీఓఏలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలనీ, గ్రేడింగ్ పద్ధతిని ఎత్తేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజ్‌కుమార్, ఎస్వీ.రమ డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని మహాత్మాజ్యోతిభా పూలే ప్రజాభవన్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ(సీతక్క)కు వినతిపత్రం అందజేశారు. ఐకేపీ వీఓఏల సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. నిత్యావసర సరుకుల ధరలు పెరిగిన నేపథ్యంలో రూ.5 వేల గౌరవ వేతనంతో ఎలా బతకాలో చెప్పాలని అడిగారు. నేరుగా వారి ఖాతాల్లోనే ప్రతినెలా వేతనాలను జమ చేయాలని కోరారు. స్త్రీనిధి ఇన్సెంటీవ్ పెంచి వీఓఏలకు ఇవ్వాలనీ, అర్హులైన వీఓఏలకు సీసీలుగా ప్రమోషన్లు ఇవ్వాలని విన్నవించారు. సెర్ప్ నుంచి రూ.5 వేల గౌరవవేతనంతో పాటు మహిళా సంఘాల గ్రూపుల నుంచి రూ.3 వేలు ఇవ్వాలనే నిబంధన ఎక్కడా అమలు కావడం లేదని వాపోయారు. గ్రామ సంఘం పుస్తక నిర్వహణ కోసం ఎంపిక చేసిన వీఓఏలను ఎస్‌హెచ్‌జీ వీఓ అకౌంటింగ్, ఎన్ఆర్ఎల్ఎం యాప్, లఖుపతి దీదీ లోకోస్ యాప్‌లలో ఆన్‌లైన్ పనులు చేయిస్తూ పనిభారం మోపుతున్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వారికి ల్యాప్‌టాప్‌లు ఇవ్వాలని కోరారు. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. రూ.10 లక్షల సాధారణ బీమా సౌకర్యం, ఆరోగ్య బీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వీలైనంత మేరకు సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ కోశాధికారి సుమలత, ఉపాధ్యక్షులు నగేశ్, రాష్ట్ర నాయకులు మల్లన్న, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

స్థానికుల సమస్యలు పరిష్కరించటంలో జీహెచ్ఎంసీ విఫలం : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రజలు తమ కాలనీల్లో సమస్యలున్నాయంటూ ఎన్ని ఫిర్యాదులు చేసినా జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోకపోవటంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేసిన వెంటనే సమస్యను పరిష్కరించే విషయంలో జీహెచ్ఎంసీ ఎందుకు విఫలమవుతుందని ప్రశ్నించారు. తమ కాలనీలో చెట్లు భారీగా పెరిగిపోవటం, చెత్త చెదారం కారణంగా పాముల బెడద ఉందంటూ జీహెచ్ఎంసీ మేయర్ కు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేదంటూ ఓ వ్యక్తి కేటీఆర్ కు ట్విట్టర్ ద్వారా తెలిపారు. దీనిపై ఆయన స్పందిస్తూ ప్రజల సమస్యలు పరిష్కరించాలని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని కోరారు. గతంలో జీహెచ్ఎంసీ పరిధిలో ఏ సమస్యనైనా ఒక్క ట్వీట్ చేస్తే దాన్ని పరిష్కరించేవాళ్లమని గుర్తు చేశారు. ప్రస్తుతం కార్పొరేటర్ల పార్టీ ఫిరాయింపులపై మాత్రమే ఈ ప్రభుత్వం దృష్టి పెట్టటంతో ప్రజలు ఇబ్బంది పడే పరిస్థితి వచ్చిందని తెలిపారు. ఇకనైనా ప్రజా సమస్యలపై మేయర్ సహా ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు. 48 గంటల్లో సమస్య పరిష్కారం కాకపోతే స్థానికులతో కలిసి తామే శ్రమ దానం చేసుకుని సమస్య పరిష్కరించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

సవరణ

గౌరవ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, హైదరాబాద్ బెంచ్ వారి సమక్షంలో
కంపెనీల చట్టం, 2013, కంపెనీస్ (కాంప్రమైజెస్, అరేంజిమెంట్స్ & అమాల్గమేషన్స్) రూల్స్, 2016 యొక్క రూల్ 3తో చదువబడే కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్లు 230 నుండి 232 మరియు ఇతర వర్తించు నియమాల విషయంలో
మరియు
ఎనెర్గాన్ పెట్రోప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్
(సిఐఎన్: యు23203టిజి2012పిటిసి084745)
(విలీనమైన కంపెనీ)
మరియు
ఎనెర్గాన్ కంటైనర్స్ ప్రైవేట్ లిమిటెడ్
(సిఐఎన్: యు63030టిజి2020పిటిసి144336)
(రిజల్టింగ్ కంపెనీ-1)
మరియు
ఎనెర్గాన్ గ్యాస్ ప్రైవేట్ లిమిటెడ్
(సిఐఎన్: యు40200టిజి2020పిటిసి143951)
మరియు
వాటి సదరు వాటాదారులు మరియు ఋణదాతలు
(కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్లు 230 నుండి 232 మరియు ఇతర వర్తించు నియమాల క్రింద)
సిపి (సిఎఎ) నం.21/230/హెచ్‌డిబి/2024
ఇన్
సిఎ(సిఎఎ) 11/230/హెచ్‌డిబి/2024 విషయంలో
నోటీసు విచారణ

ఎనెర్గాన్ పెట్రోప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (డిమెర్జ్‌డ్ కంపెనీ) మరియు ఎనెర్గాన్ కంటైనర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (రిజల్టింగ్ కంపెనీ-1) మరియు ఎనెర్గాన్ గ్యాస్ ప్రైవేట్ లిమిటెడ్ (రిజల్టింగ్ కంపెనీ-2) మరియు వారి సదరు వాటాదారులు& ఋణదాతలు ("ది స్కీమ్") మధ్య స్కీమ్ ఆఫ్ అరేంజిమెంట్ (విలీనంతోసహా) యొక్క మంజూరు కొరకు కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 230 నుండి 232 క్రింద పిటీషన్‌ను 11 జులై 2024న విచారించుటకు 2 జులై, 2024న పిటీషనర్ కంపెనీలచేత ప్రవేశపెట్టబడినది మరియు సదరు పిటీషన్ గౌరవ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, హైదరాబాద్ బెంచ్ వారి సమక్షంలో విచారించుటకు 22 ఆగస్టు, 2024గా నిర్ణయించబడినది. సదరు పిటీషన్‌ను మద్దతించు లేదా వ్యతిరేకించు ఎవరైనా వ్యక్తి అతని లేదా అతని అడ్వకేట్ సంతకంచేసి మరియు పిటీషనర్ అడ్వకేట్‌కు దానిని పిటీషన్ విచారణకొరకు నిర్ణయించిన తేదీకి రెండు రోజుల ముందుగా ఆలస్యం కాకుండా అతని పేరు& చిరునామా వ్రాసి పంపించవలెను మరియు పిటీషన్‌ను వ్యతిరేకించదలచిన, వ్యతిరేకతకుగల కారణం చూపుతూ అఫిడవిట్‌ను అట్టి నోటీసుతో సమర్పించవలెను.
సదరు స్కీమ్ ఆఫ్ అరేంజిమెంట్ కాపీని కంపెనీ యొక్క రిజిస్టర్డు ఆఫీసు వద్ద లేదా వారి అడ్వకేట్ కార్యాలయం వద్ద ఉచితంగా పొందవచ్చును.

తేది: 15.07.2024
ప్రదేశం: హైదరాబాద్

నరేశ్ కుమార్ సంగం
పిటీషనర్ కంపెనీ తరఫున అడ్వకేట్స్
12-10-586/3/ఎ, మేడిబావి,
సీతాఫల్‌మండి, సికింద్రాబాద్-500061.

డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ బెంగళూరు -(డిఆర్‌టి-2)
బిఎస్ఎన్ఎల్ బిల్డింగ్, 4వ అంతస్తు, టెలిఫోన్ హౌస్, రాజ్‌భవన్ రోడ్, బెంగళూరు-560001.
I.A.No. 2174/2023, I.A.No. 2175/2023, I.A.No. 2176/2023, I.A.No. 2177/2023, in OA No : 1592/2023

మధ్య : కెనరా బ్యాంక్ ..... అప్లికేంట్
వర్సెస్
జగీష్ బాలకృష్ణన్ & ఇతరులు ...... డిఫెండెంట్స్

టు : డి 1 : జగీష్ బాలకృష్ణన్, వయసు : 47 సం॥లు, తండ్రి : బాలకృష్ణన్, వద్ద :- నెం. 3/336, పడిక్కల్ మీతల్ సోనా నిలయం, కోరోడ్ ముత్తుంగల్ పోస్టు, వడకర-కోజికోడ్, కేరళ-673106. మొబైల్ నెం. 8296176483.
డి 2 : భాస్కర మురళీధర, వయసు : 40 సం॥లు, తండ్రి : మురళీధర్‌రావు, నెం. 1534, 39వ క్రాస్, 4వ టి బ్లాక్, జయనగర్, బెంగళూరు-560041, మొబైల్ నెం : 9035800079.
డి 10 : అంబరీష్ కుమార్, తండ్రి : సుధీర్ మిశ్రా, నెం. బి-408, లోధా మెరీడియన్, కూకట్‌పల్లి, హైదరాబాద్, తెలంగాణ-500072, మొబైల్ నెం: 93430112666.

నోటీసు

1. ఎక్కడైతే, ఈ ట్రిబ్యునల్‌కు దరఖాస్తులు చేసియున్నారు. దానియొక్క కాపీని ఇక్కడ జతపరుచుచున్నాం. కోరిన రిలీఫ్ ఎందుకు మంజూరు చేయలేదో, ఈ నోటీసు ద్వారా తెలియజేయుచున్నాం. ట్రిబ్యునల్ తన సౌలభ్యత ప్రకారం చెప్పబడిన దరఖాస్తును 20.08.2024 న ఉ.10.30 గం.కు లేదా సదరు సమయానికి వెంటనే విచారణ చేపట్టనున్నది.
2. పైన చెప్పబడిన సమయానికి వ్యక్తిగతంగా లేదా ప్లీడర్/న్యాయవాది ద్వారా హాజరు కావాలని మరియు మీ యొక్క సమాధానం ఏదైనా ఫైల్ చేయాలని సూచిస్తున్నాం.
3. ఇక్కడ పేర్కొన్న రోజున మీరు హాజరుకాని యెడల, మీరు గైర్హాజరైనట్లు గుర్తించి విచారణ కొనసాగింపబడునని గమనించగలరు.

నా చేతి కింద మరియు ట్రిబ్యునల్ యొక్క ముద్రతో **తేది 05, జూన్, 2024న ఈ ఆదేశాలివ్వబడినవి.**
సమన్లు జారీ చేయు అధీకృత అధికారి సంతకంతో.

సం./- రిజిస్ట్రార్,
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్-II బెంగళూరు.

డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ బెంగళూరు -(డిఆర్‌టి-2)
బిఎస్ఎన్ఎల్ బిల్డింగ్, 4వ అంతస్తు, టెలిఫోన్ హౌస్, రాజ్‌భవన్ రోడ్, బెంగళూరు-560001.
OA No : 1592/2023

మధ్య : కెనరా బ్యాంక్ ..... అప్లికేంట్
వర్సెస్
జగీష్ బాలకృష్ణన్ & ఇతరులు ...... డిఫెండెంట్స్

టు : డి 1 : జగీష్ బాలకృష్ణన్, వయసు : 47 సం॥లు, తండ్రి : బాలకృష్ణన్, వద్ద :- నెం. 3/336, పడిక్కల్ మీతల్ సోనా నిలయం, కోరోడ్ ముత్తుంగల్ పోస్టు, వడకర-కోజికోడ్, కేరళ-673106. మొబైల్ నెం. 8296176483.
డి 2 : భాస్కర మురళీధర, వయసు : 40 సం॥లు, తండ్రి : మురళీధర్‌రావు, నెం. 1534, 39వ క్రాస్, 4వ టి బ్లాక్, జయనగర్, బెంగళూరు -560041, మొబైల్ నెం : 9035800079.
డి 10 : అంబరీష్ కుమార్, తండ్రి : సుధీర్ మిశ్రా, నెం. బి-408, లోధా మెరీడియన్, కూకట్‌పల్లి, హైదరాబాద్, తెలంగాణ-500072, మొబైల్ నెం: 93430112666.

డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ (ప్రొసీజర్) రూల్స్ 1993 యొక్క రూల్ 23 (VIII) కింద సమన్లు జారీ

ఎక్కడైతే, రికవరీ ఆఫ్ డెట్స్ & బ్యాంకిరప్టసీ యాక్ట్, 1993 యొక్క సెక్షన్ 19 కింద దరఖాస్తుదారు మీకు వ్యతిరేకంగా దరఖాస్తు చేసియున్నారు. మొత్తం **రూ.1,27,67,508.02 పైసలు** (రూపాయలు ఒక కోటీ, ఇరవై ఏడు లక్షల, అరవై ఏడు వేల, ఐదు వందల ఎనిమిది మరియు రెండు పైసలు) మాత్రమే, ప్రస్తుత మరియు భవిష్యత్ వడ్డీ, ఖర్చులు మరియు ఇతర ఉపశమనాలతోపాటు రాబట్టుకొనుటకు.
అందువల్ల, పైన పేర్కొన్న ప్రతివాదిని ఈ ట్రిబ్యునల్ ముందు వ్యక్తిగతంగా లేదా న్యాయవాది ద్వారా లేదా అధీకృత ఏజెంట్ల ద్వారా వారి యొక్క డిఫెన్స్‌కు మద్దతుగా కారణాలను చూపేందుకు ఇది ప్రచురించిన 30 రోజుల్లోగా లేదా **20/08/2024 ఉ. 10.30** న హాజరు కావాల్సిందిగా ఆదేశించడమైనది. కోరిన రిలీఫ్ మంజూరు చేయనందున. ఈ దరఖాస్తు విషయంలో డిఫాల్ట్ అయినచో, మీ యొక్క గైర్హాజరీని గుర్తించి విచారించబడునని గమనించగలరు. నా చేతి కింద మరియు ట్రిబ్యునల్ యొక్క ముద్రతో **తేది 05, జూన్, 2024**న ఈ ఆదేశాలివ్వబడినవి.

ట్రిబ్యునల్ ఆదేశం ద్వారా,
సం./- రిజిస్ట్రార్,
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్-II బెంగళూరు.

TIERRA AGROTECH LIMITED

CIN:L01119TG2013PLC090004
Registered Office: 1st , Floor, Sravana Complex, Kamalapuri Colony Lane, Next to L V Prasad Hospital, Road No.2, Banjara Hills, Hyderabad, Telangana-500034.

30.06.2024తో ముగిసిన త్రైమాసికం కొరకు ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాల సారాంశం (రూ.లక్షల్లో)

క్ర. సం.	వివరాలు	కన్సాలిడేటెడ్			
		ముగిసిన త్రైమాసికం 30.06.2024 ఆడిట్‌చేయనివి	ముగిసిన త్రైమాసికం 30.06.2023 ఆడిట్‌చేయనివి	ముగిసిన త్రైమాసికం 31.03.2024 ఆడిట్‌చేసినవి	ముగిసిన సంవత్సరం 31.03.2024 ఆడిట్‌చేసినవి
1	పూర్తి ఆదాయం	5,020.03	4,399.84	1,087.42	7324.26
2	నికర లాభం (పన్ను, మినహాయింపుగల మరియు/ లేదా అసాధారణ ఐటంలకు ముందు)	662.45	583.09	(557.78)	(1,265.99)
3	పన్నుకు ముందు నికర లాభం (మినహాయింపుగల మరియు/ లేదా అసాధారణ ఐటంల తరువాత)	662.45	583.09	(557.78)	(1,265.99)
4	పన్ను తరువాత నికర లాభం (మినహాయింపుగల మరియు/ లేదా అసాధారణ ఐటంల తరువాత)	498.93	477.69	(374.13)	(920.79)
5	పూర్తి సమగ్ర ఆదాయం (పన్ను తరువాత కంప్రైసింగ్ లాభం మరియు పన్ను తరువాత ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత))	498.93	477.69	(365.54)	(912.20)
6	చెల్లించిన ఈక్విటీ వాటా మూలధనం (ఈక్విటీ వాటాకు రూ.10/- చొప్పున)	6,559.37	5,593.24	5,593.24	5,593.24
7	రిజర్వులు (ముగిసిన గత సంవత్సరం యొక్క బ్యాలెన్స్ షీటులో చూపినట్లుగా రివ్యాల్యూషన్ రిజర్వు మినహాయించి)			4175.33	
8	వాటా ఒక్కింటికి రాబడులు (రూ.10/- చొప్పున) (వార్షికం కానిది) ఎ) బేసిక్	0.81	0.85	(0.68)	(1.77)
	బి) డైల్యూటెడ్	0.81	0.85	(0.68)	(1.77)

1) పై పేర్కొన్న ఆర్థిక ఫలితాలు ఆడిట్ కమిటీచే సిఫారసు చేయబడినవి మరియు 15 జులై, 2024న నిర్వహించబడిన బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో పరిగణించబడినవి మరియు ఆమోదించబడినవి.
2) టియెర్రా అగ్రోటెక్ లిమిటెడ్ వారి స్టాండ్‌అలోన్ ఆర్థిక ఫలితాలకు సంబంధించి కీ డాటా దిగువ విధంగా ఉంది.

క్ర. సం	వివరాలు	స్టాండ్‌అలోన్			
		ముగిసిన త్రైమాసికం 30.06.2024 ఆడిట్‌చేయనివి	ముగిసిన త్రైమాసికం 30.06.2023 ఆడిట్‌చేయనివి	ముగిసిన త్రైమాసికం 31.03.2024 ఆడిట్‌చేసినవి	ముగిసిన సంవత్సరం 31.03.2024 ఆడిట్‌చేసినవి
1	పూర్తి ఆదాయం (రూ.లక్షల్లో)	5,013.26	4,363.19	1,045.07	7,171.97
2	పన్నుకు ముందు లాభం (రూ.లక్షల్లో)	660.50	610.01	(531.33)	(1,167.06)
3	పన్ను తరువాత లాభం (రూ.లక్షల్లో)	496.99	504.61	(406.62)	(880.80)
4	పన్ను తరువాత పూర్తి సమగ్ర ఆదాయం (రూ.లక్షల్లో)	496.99	504.61	(407.59)	(881.77)

గమనిక: సెబీ (లిస్టింగ్ అండ్ అదర్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్ఛేంజితో దాఖలుచేయబడిన త్రైమాసికం ఆర్థిక ఫలితాల వివరణాత్మక ఫార్మాట్ యొక్క సారాంశం పై విధంగా ఉన్నది. త్రైమాసికం ఆర్థిక ఫలితాల పూర్తి వివరాలు కంపెనీ యొక్క వెబ్‌సైట్: https://www.tierraagrotech.com పై /మరియు స్టాక్ ఎక్ఛేంజి వెబ్‌సైట్: ww.bseindia.com నందు అందుబాటులో ఉంటాయి.

బోర్డు ఆఫ్ డైరెక్టర్ల తరఫున మరియు కొరకు
సం/-
విజయ్ కుమార్ దీకొండ
పూర్తికాలిక డైరెక్టర్
DIN:06991267

ప్రదేశం: హైదరాబాద్
తేది: 15-07-2024

కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్

Can Fin Homes Ltd
బ్రాంచ్: నెం.1-7-96/2, 1వ అంతస్తు, మహేష్ నగర్, ఇసిఐఎల్ పోస్ట్, ఎ.ఎస్.రావు నగర్, హైదరాబాద్-500062. టి.ఎస్. టెలి నెం.: 7625079248.
ఇ-మెయిల్: asraonagar@canfinhomes.com, CIN No. L85110KA1987PLC008699

స్వాధీనత నోటీసు [రూల్ 8(1)] [స్థిరాస్తి కొరకు]

ఎవరైతే, దిగువ సంతకందారుడు అయిన కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి సదరు చట్టం మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002, మరియు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూర్డ్ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద అతనికి ఇవ్వబడిన అధికారాలను వినియోగిస్తూ **08-04-2024 తేదీన డిమాండ్ నోటీసు** జారీ చేయబడింది. పిలువబడిన ఋణగ్రహీతలు: **శ్రీమతి సంతోషిణి గరికపోగుల భర్త శ్రీ లేట్ రవి శంకర్ జోలేటి మరియు ఇతర చట్టబద్ద వారసులందరు** నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని **రూ.36,30,952/- (రూపాయలు ముప్పై ఆరు లక్షల ముప్పై వేల తొమ్మిది వందల యాభై రెండు మాత్రమే)** మరియు **రూ. 9,07,595/- (రూపాయలు తొమ్మిది లక్షల ఏడు వేల ఐదు వందల తొంభై ఐదు మాత్రమే)** రియలైజేషన్ తేది వరకు ఒప్పందం రేటు వద్ద తదుపరి వడ్డీతో సదరు నోటీసు తేది నుండి **60 రోజులలోపు** మొత్తాన్ని తిరిగి చెల్లించాలని తెలపడమైనది.
ఋణగ్రహీత మొత్తాన్ని తిరిగిచెల్లించుటలో విఫలమైనారు, ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా అధీకృత అధికారి అతనికి అందించిన అధికారాలను అధ్యయనం చేస్తూ సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002లోని రూల్ 8తో చదువుతూ సెక్షన్ 13(4) క్రింద దిగువ వివరించిన ఆస్తిని **15 జులై 2024న తేదీన** దిగువ సంతకందారుడు స్వాధీనపరుచుకున్నాడు.
ఋణగ్రహీత జాగ్రత్త వహించవల్సింది ఏమనగా సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను ఆహ్వానించడమైనది.
ముఖ్యంగా ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా సదరు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు **సిఎఫ్‌హెచ్‌ఎల్‌కు రూ.36,30,952/- (రూపాయలు ముప్పై ఆరు లక్షల ముప్పై వేల తొమ్మిది వందల యాభై రెండు మాత్రమే)** మరియు **రూ.9,07,595/- (రూపాయలు తొమ్మిది లక్షల ఏడు వేల ఐదు వందల తొంభై ఐదు మాత్రమే)** దానిపై వడ్డీతో సహా చెల్లించి జరుపవచ్చు.

స్థిరాస్తి యొక్క వివరణ:
తెలంగాణ-500094, మేడ్చల్-మల్కాజ్‌గిరి (జి), కీసర (మం), చీర్యాల్ (గ్రా మరియు గ్రా.పం.) ఈశ్వరీపురి కాలనీ వద్ద ఉన్న సర్వే నెం.లు 136/ఎ14/1, 139/ఎ3/1, 137/4/1, 136/ఎ14/2, 137/4/2, 137/ఎ3/2, 137/6, 140/ఎ9, 141/ఎ8, 136/ఎ19, 141/ఎ12, 141/ఎ16/1, 142/ఎ6,141/ఎ7, 140/ఎ7, 136/9/1, 137/5లలో 140 చ. గజాల విస్తీర్ణం గల ప్లాట్ నెం. 6పై గల ఇండిపెండెంట్ నివాస గృహం యావదాస్తి. సరిహద్దులు: ఉత్తరం వైపు : ప్లాట్ నెం. 7, దక్షిణం వైపు: ప్లాట్ నెం. 9, తూర్పు వైపు: 25' రోడ్డు, దక్షిణం వైపు: ప్లాట్ నెం. 5.

తేది: 15.07.2024, ప్రదేశం: హైదరాబాద్ — సం/- అధీకృత అధికారి, కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్

HDFC BANK — హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్

బ్రాంచ్: నాల్గవ అంతస్తు, ఎంఎస్ఆర్ బ్లాక్, క్రిష్ సఫైర్, హైటెక్ సిటీ మెయిన్ రోడ్, మాదాపూర్, హైదరాబాద్ - 500 081. ఫోన్: 040-64807999.
CIN L65920MH1994PLC080618 Website: www.hdfcbank.com

స్వాధీనతా ప్రకటన

ఎవరైతే, హెచ్‌డిఎఫ్‌సి లిమిటెడ్ (గతంలో హెచ్‌డిఎఫ్‌సి లిమిటెడ్‌గా తెలిసినది తేది.17 మార్చ్, 2023నాటి ఉత్తర్వు ఆధారంగా గౌరవ ఎన్‌సిఎల్‌టి ముంబయి ద్వారా ఆమోదించిన స్కీమ్ ఆఫ్ అమాల్గమేషన్ వర్తూ ద్వారా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌తో అమాల్గమేట్ చేయబడినది) (హెచ్‌డిఎఫ్‌సి) యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడు సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో సదరు చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు జారీచేసి, దిగువ ఋణగ్రహీత(లు)/చట్టబద్ద వారసులు మరియు చట్టబద్ద ప్రతినిధులను సదరు నోటీసు/లుగల తేదీ నుండి **60 రోజుల్లోగా** చెల్లించు మరియు/ లేదా పరిపూర్తత తేదినాటికి ఇన్సిడెంటల్ వ్యయాలు, ఖర్చులు, చార్జీలు మొ॥వాటితోసహా సదరునోటీసుల్లో పేర్కొన్న వర్తించు రేటుతో దానిపైవడ్డీతోపాటు వారిసంబంధిత పేర్లకుఎదురుగా పేర్కొన్నమొత్తాలను చెల్లించవలసిందిగా కోరబడినది.

క్ర. సం	ఋణగ్రహీత(ల) పేరు	బాకీపడిన మొత్తం	డిమాండ్ నోటీసు తేది	స్వాధీనతా తేది	స్థిరాస్తి(లు)/ హామీచూపిన ఆస్తి(ల) వివరణ
1	శ్రీ శాస్త్రి కె ఎస్ అలియాస్ కావూరి సుబ్రమణ్య శాస్త్రి (ఋణగ్రహీత) & శ్రీమతి కాంతి శ్రీ కె అలియాస్ కావూరి కాంతి	30 నవంబర్, 2023 నాటికి బకాయిలు రూ.17,80,015/- (రూపాయలు పదిహేడు లక్షల ఎనభైవేల పదిహేను మాత్రమే)	01-JAN-2024	11 జులై, 2024 (లాంఛనప్రాయ స్వాధీనతా)	మల్లికార్జున కాలనీ, పాత బోవెన్‌పల్లి గ్రామం, బాలానగర్ మండలం, కూకట్‌పల్లి మునిసిపాలిటీ, రంగారెడ్డి జిల్లాలోని 175.83 చ.గ.లు లేదా 147.00 చ.మీ.ల విస్తీర్ణపు సర్వే నెం.87లోని ప్లాట్ నెం.82పై గల ఇంటి నెం.8-5-139/8 (పాత నెం.5-62/82) మొత్తం భాగం మరియు ఈ క్రింది విధంగా సరిహద్దులుగా ఉన్నాయి: **ఉత్తరం:** 30'-0"వెడల్పాటి రోడ్డు; **దక్షిణం:** పొరుగువారి ఇల్లు; **తూర్పు:** పొరుగువారి ఇల్లు; **పడమర:** మందిరం.
2	శ్రీ (సహ-ఋణగ్రహీత) శ్రీ ఎన్ సుధాకర్ (ఋణగ్రహీత) & శ్రీమతి నడుపల్లి రాజేశ్వరి (సహ-ఋణగ్రహీత)	31 డిసెంబర్, 2023 నాటికి బకాయిలు రూ.2,42,21,327/- (రూపాయలు రెండుకోట్ల నలభైరెండు లక్షల ఇరవైఒకవేల మూడువందల ఇరవైఏడు మాత్రమే)	09-FEB-2023	16 జులై, 2024 (భౌతికంగా స్వాధీనతా)	హైదరాబాద్ నాలెడ్జ్ సిటీ,రాయదుర్గ్, పన్మక్త గ్రామం, శేరిలింగంపల్లి మండలం, రంగారెడ్డిజిల్లా, తెలంగాణ రాష్ట్రంలోని సర్వే నెం.83/1లోగల ప్లాట్ నెం.లు 22 నుండి 24 & 31నుండి 33 పార్ట్ కలిగిన 72029.44 చ.మీ.లకు సమానమైన 17.80 ఎకరాలకుగాను 57.27చ.గ.లకు సమానమైన 47.88చ.మీ.ల విస్తీర్ణపు విడదీయలేని స్థలభాగంతో "హై హోమ్ భూజా"గా తెలిసిన హై-రైజ్ మల్టీ స్టోరీడ్ నివాసిత అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లోని 03 కార్ పార్కింగ్స్ (బేస్‌మెంట్-1లోని నెం.లు82, 83& 102 కలిగిన)తోపాటుగా బ్లాక్ నెం.ఎఫ్ టవర్ నెం.4లోని గ్రౌండ్ ఫ్లోర్‌లోఅపార్ట్‌మెంట్/ఫ్లాట్ నెం.004 గల ఉమ్మడి ఏరియాతో కలిపి సూపర్ బిల్టప్ ఏరియా యొక్క 3430చ.అ.లకు సమానమైన 318.66చ.మీ.ల విస్తీర్ణపు నివాసిత అపార్ట్‌మెంట్/ ఫ్లాట్ మొత్తం భాగం మరియు అపార్ట్‌మెంట్ సరిహద్దులుగా ఉంది: **ఉత్తరం:** ఓపెన్ టు స్కై, **దక్షిణం:** ఓపెన్ టు స్కై, **తూర్పు:** ఓపెన్ టు స్కై, **పడమర:** ఉమ్మడి కారిడార్ & ఓపెన్ టు స్కై.

*చెల్లించు మరియు/ లేదా పరిపూర్తత తేదినాటికి చెల్లించవలసిన ఇన్సిడెంటల్ వ్యయాలు, ఖర్చులు, చార్జీలు మొ॥వాటితో వర్తించు తదుపరి వడ్డీతో.
అయితే, పైన పేర్కొన్న ఋణగ్రహీత/లు/ చటబద్ద వారసు(లు)/ చట్టబద్ద ప్రతినిధులు బాకీ మొత్తాలను తిరిగిచెల్లించుటలో విఫలం చెందిన కారణంగా, ఇందుమూలంగా ప్రత్యేకంగా పైన పేర్కొన్న ఋణగ్రహీత/లు/ చటబద్ద వారసు(లు)/ చట్టబద్దప్రతినిధులు మరియు సాధారణ ప్రజలకు నోటీసుఇవ్వడమేమనగా, హెచ్‌డిఎఫ్‌సి యొక్క అధీకృత అధికారి/లు పైన పేర్కొన్న తేదీలలో సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదువగల సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి/వారికి సంక్రమించిన అధికారాలతో పైన వివరించిన స్థిరాస్తి/ హామీచూపిన ఆస్తులను స్వాధీనంలోకి తీసుకున్నారు.
ప్రత్యేకంగా పైన పేర్కొన్న ఋణగ్రహీత/లు/ చటబద్ద వారసు(లు)/ చట్టబద్ద ప్రతినిధులు మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, పైన చెప్పిన స్థిరాస్తి(లు)/హామీచూపిన ఆస్తులతో ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని మరియు సదరు స్థిరాస్తి(లు)/హామీచూపిన ఆస్తులతో ఏవేని లావాదేవీలు జరుపదలచిన వారుహెచ్‌డిఎఫ్‌సి యొక్క బాకట్టు ఆధారంగా లావాదేవీలు జరుపవచ్చును. హామీచూపిన ఆస్తుల విమోచనానికి సమయం అందుబాటులోవున్నందున, చట్టంలోని సెక్షన్ 13యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాల పైఋణగ్రహీత/లు/ చటబద్దవారసు(లు)/చట్టబద్ద ప్రతినిధులు దృష్టి పెట్టవలసిందిగా కోరబడుచున్నది.

ప్రదేశం: హైదరాబాద్
తేది: 16 జులై, 2024
రిజిస్టర్డు ఆఫీసు: హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోయర్ ప్యారెల్(వెస్ట్), ముంబయి-400013
హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ తరఫున, అధీకృత అధికారి

JM FINANCIAL — జెఎం ఫైనాన్షియల్ అస్సెట్ రికన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్

కార్పొరేట్ గుర్తింపు నెంబర్: U67190MH2007PLC74287
రిజిస్టర్డ్ కార్యాలయం: 7వ అంతస్తు, సినెర్జీ, అప్పాసాహెబ్ మరాఠే మార్గ్, ప్రభాదేవి, ముంబయి-400025.
సంప్రదించాల్సిన వ్యక్తి: 1) దుర్గా విజయ ప్రసాద్ వనవర్ల-9493330003, 2) ఆర్.రోహన్ సావంత్- 9584966653, 3) సింధుజా పిళ్లై-022-62241676, వెబ్‌సైట్: www.jmfinancialarc.com

ఇ-వేలం అమ్మకపు ప్రకటన-తదుపరి అమ్మకం

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002లో ("SARFAESI యాక్ట్")లోని సెక్షన్ 5 (1)(బి) ప్రకారం పిరామల్ క్యాపిటల్ అండ్‌హౌసింగ్ ఫైనాన్స్‌లిమిటెడ్ వారు ఋణం యొక్క పూలింగ్‌ను కేటాయిస్తూ దీనితో పాటుగా (దిగువ పేర్కొన్న ఋణాలతోకలిపి) సెక్యూరిటీ ఇంటరెస్ట్‌ను సృష్టించి అన్ని ఋణాల హక్కులు, టైటిల్ మరియు ఇంటరెస్ట్‌తో పాటుగా కలుపుకొని JMFARC(JM) వారితో 29, మార్చి,2023 తేదీన ('డిఅసైన్‌మెంట్ అగ్రిమెంట్')ఒప్పందం కుదుర్చుకున్నారు (ఇకమీదట వీరిని అసైనీగా పేర్కొనాలి) JMFARC-అరణ్య-ట్రస్ట్ వారు ట్రస్టీ సామర్థ్యంలో కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా పిసిహెచ్‌ఎఫ్ఎల్ వారు అధీకృతులు సర్వీస్ ప్రొవైడర్/కలెక్షన్ ఏజెంట్‌గా వ్యవహరిస్తూ అసైన్‌మెంట్/సర్వీస్ అగ్రిమెంట్ రూపంలో సదుపాయాలను కల్పిస్తూ కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు.
దిగువ పేర్కొన్న విధంగా సెక్యూర్డ్ ఆస్తిని అధీకృత అధికారి స్వాధీనం చేసుకున్న తర్వాత ఇందుమూలంగా సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అధీకృత అధికారి SARFAESI యాక్ట్, 2002 ప్రకారం ఋణగ్రహీత(లు) నుంచి బకాయిఉన్న మొత్తాన్ని తిరిగిరాబట్టేందుకు వీలుగా దిగువ పేర్కొన్న సంతకందారు ద్వారా సిరాస్తి కొనుగోలుకు సంబంధించి ఆఫర్లను ఆహ్వానిస్తున్నారు. దిగువ పేర్కొన్న విధంగా, భౌతికంగా స్వాధీనం చేసుకున్న సదరు ఆస్తిని "ఎక్కడ ఎలా ఉందో అలాగే" & "ఏదైతే ఉన్నదో అదే" మరియు "ఏదైతో ఎలా ఉందో అలాగే" ప్రాతిపదికన ఇ-వేలం ద్వారా విక్రయించనున్నారు.

లోన్ కోడ్/బ్రాంచ్/ ఋణగ్రహీత(లు)/ సహ-ఋణగ్రహీత(లు)/ హామీదారుడు(లు)	డిమాండ్ నోటీసు తేదీ మరియు మొత్తం	ఆస్తి చిరునామా-ఫైనల్	రిజర్వ్ ధర	ధరావత్తు (ఇఎండి) (ఆర్‌పిలో 10%)	బకాయి ఉన్న మొత్తం (09-07-2024)
లోన్ కోడ్ నెం. 08500007209, హైదరాబాద్ మెట్రో (బ్రాంచ్), అనురాధ గంధం (ఋణగ్రహీత), విశాల్ గంధం (సహ-ఋణగ్రహీత 1) శ్రీ లక్ష్మి సిల్క్స్ (సహ-ఋణగ్రహీత 2)	తేది:06-05-2021, రూ. 3,00,32,975/- (రూపాయలు మూడుకోట్ల ముప్పైరెండు వేల తొమ్మిది వందల డెబ్బైఐదు మాత్రమే)	హస్తిన్‌గంజ్, సుల్తాన్ బజార్, ఆంధ్రా బ్యాంక్ ప్రక్కన, కోఠి, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రంలోని 218 చ.గ.ల పూర్తి విస్తీర్ణపు స్థల ఏరియాలోని గ్రౌండ్ ఫ్లోర్, 1వ అంతస్తు, రెండవ అంతస్తు & మూడవ అంతస్తులోని ఆరు షాపులు కలిగియున్న మున్సిపల్ నెం.లు 4-5-64 నుండి 4-5-88 ఆస్తి కలిగిన మొత్తం భాగం మరియు సరిహద్దులు: ఉత్తరం: పొరుగువారు, దక్షిణం: శ్రీమతి బి.అనురాధ ఇల్లు (కొనుగోలుదారు ఆస్తి), తూర్పు: పొరుగువారు, పడమర: లేన్	రూ. 2,29,00,000/- (రూపాయలు రెండుకోట్ల ఇరవైతొమ్మిది లక్షలు మాత్రమే)	రూ. 22,90,000/- (రూపాయలు ఇరవై రెండు లక్షల తొంభైవేలు మాత్రమే)	రూ. 4,73,02,814/- (రూపాయలు నాలుగు కోట్ల డెబ్బైమూడు లక్షల రెండువేల ఎనిమిది వందల పద్నాలుగు మాత్రమే)

దిగువ పక్షాలు ఋణగ్రహీత మరియు పిరమల్ క్యాపిటల్ &హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌పై కేసులను దాఖలు చేశాయని మరియు ఎటువంటి ప్రతికూల ఆదేశాలు లేకుండా పెండింగ్‌లో ఉన్నాయని దయచేసి గమనించండి. అందువల్ల, బిడ్ ఫారమ్‌ను సమర్పించే ముందు అవసరమైన విచారణను నిర్వహించవలసిందిగా మిమ్మల్ని అభ్యర్థించడం జరిగింది.

పార్టీల పేరు	కేసు నెంబరు	జిల్లా	కోర్టు
మహ్మద్ షౌకత్ ఖాన్	OS 4099/2022	హైదరాబాద్	సిటి సివిల్ కోర్ట్, హైదరాబాద్
మహ్మద్ ఫరీద్	OS 4098/2022	హైదరాబాద్	సిటి సివిల్ కోర్ట్, హైదరాబాద్
మహ్మద్ సర్వర్	OS 4100/2022	హైదరాబాద్	సిటి సివిల్ కోర్ట్, హైదరాబాద్
1) మహ్మద్ ఫరీద్ 2) మహ్మద్ షౌకత్ ఖాన్ 3) మహ్మద్ సర్వర్	CRLRC /611/2023	హైదరాబాద్	హై కోర్ట్ ఆఫ్ తెలంగాణ

ఇ-వేలం తేది: 08-08-2024, ఉ.11-00గం.ల నుండి మ.02-00 గం.ల వరకు (5 నిమిషాల చొప్పున అపరిమిత పొడిగింపుతో).
బిడ్ సమర్పణకు చివరి తేది: 07-08-2024, సా.4-00గం.ల లోపు
అమ్మకానికి సంబంధించిన షరతులు మరియు నిబంధనల కోసం దయచేసి https://www.jmfinancialarc.com/Home/Assetsforsale లో లేదా https://www.bankauctions.in లో కల్పించిన లింక్‌ను రిఫర్ చేయండి

ఋణగ్రహీత/ హామీదారుడు/ తాకట్టుదారులకు SARFAESI చట్టం క్రింద చట్టబద్ధమైన 15 రోజుల అమ్మకపు ప్రకటన
పైన పేర్కొన్న ఋణగ్రహీత/హామీదారుడికి ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా పైన సెక్షన్ 13(2)ప్రకారం బకాయి ఉన్నమొత్తాన్ని వడ్డీతో పాటుగా వేలం తేదీ కంటే ముందుగా తిరిగిచెల్లించాలి, విఫలం చెందినట్లయితే ఆస్తి మొత్తం వేలం నిర్వహించబడును/విక్రయించబడును మరియు మిగతాబకాయి ఏదేనిఉన్నచో ఋణగ్రహీత/హామీదారుడి నుంచి బకాయిఉన్నమొత్తాన్ని వడ్డీ మరియు ఖర్చులతో పాటుగా రాబట్టబడును.

తేది: 17-07-2024
ప్రదేశం: ఏపి
సం/- (అధీకృత అధికారి) (అరణ్య- ట్రస్ట్)

COROMANDEL INTERNATIONAL LIMITED

Coromandel — murugappa
Regd. Office: "Coromandel House", 1-2-10, Sardar Patel Road, Secunderabad – 500 003, Telangana
Email ID: investorsgrievance@coromandel.murugappa.com, Website: www.coromandel.biz
CIN: L24120TG1961PLC000892, Tel No.: +91-40-6699 7000 / 7300 / 7500

62వ వార్షిక సర్వసభ్య సమావేశపు ప్రకటన

ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా 62వ వార్షిక సర్వసభ్య సమావేశపు నోటీసులో పేర్కొన్నట్లుగా వ్యాపార నిర్వహణకు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ మరియు సెక్యూరిటీస్ అండ్ఎక్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా మరియు ఇతర వర్తించు చట్టాలచే జారీచేసిన సంబంధిత సర్క్యులర్లను అనుసరించి మరియు నియమాల ప్రకారం వీడియో కాన్ఫరెన్సింగ్ ("వీసి") లేదా ఇతర ఆడియో విజువల్ మీన్స్ (ఓఎవిఎం) ద్వారా కంపెనీ యొక్క **62వ వార్షిక సర్వసభ్య సమావేశం** (ఏజిఎం) బుధవారం, 07 ఆగస్టు, 2024న మ.3.30గం.లకు నిర్వహించుటకు షెడ్యూల్ చేయబడినది.
ఆర్థిక సంవత్సరం 2023-34 (ఏజిఎం పత్రాలు) కొరకు ఇంటిగ్రేటెడ్ వార్షిక రిపోర్టుతో సహా ఏజిఎం నోటీసును 62వ ఏజిఎం నోటీసు డిపాజిటరీ పార్టిసిపెంట్స్ (డిపిలు)/ కంపెనీయొక్క రిజిస్ట్రార్స్ మరియు షేర్ ట్రాన్స్‌ఫర్ ఏజెంట్ ('ఆర్టీఏ'), కెఫిన్ టెక్నాలజీస్ (కెఫిన్)తో ఇమెయిల్ అడ్రస్‌ను రిజిస్టర్‌చేసిన అట్టి సభ్యులకు ఎలక్ట్రానిక్ విధానం ద్వారా **మంగళవారం, 16 జులై, 2024**న పంపబడినది.
సభ్యులు గమనించాల్సిందేమనగా ఏజిఎం పత్రాలు కంపెనీ యొక్క వెబ్‌సైట్: www.coromandelbiz.com పై మరియు స్టాక్ ఎక్ఛేంజీల వెబ్‌సైట్ అనగా, బిఎస్ఇ లిమిటెడ్ (www.bseindia.com) మరియు నేషనల్ స్టాక్ ఎక్ఛేంజి ఆఫ్ ఇండియా లిమిటెడ్ (www.nseindia.com) నందు మరియు ఇ-ఓటింగ్ సర్వీస్ ప్రొవైడ్ వెబ్‌సైట్: www.evotingnsdl.com వద్ద కూడా అందుబాటులో ఉంటాయి.
ఎలక్ట్రానిక్ విధానం (ఇ-ఓటింగ్) ద్వారా ఏజిఎం నోటీసులో పేర్కొన్నట్లుగా వ్యాపారాలపై ఓటువేయుటకు వసతిని కంపెనీ దీని సభ్యులకు కంపెనీ కల్పిస్తున్నది. దిగువ పేర్కొన్న తేదీలలో (రిమోట్ ఇ-ఓటింగ్) పై రిమోట్లీ వారి ఓటును సభ్యులు వినియోగించుకోవచ్చును.
సభ్యులకు రిమోట్ ఇ-ఓటింగ్/ ఇ-ఓటింగ్ వసతిని కల్పించుటకు నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డిఎల్) సేవలను కంపెనీ ఏర్పాటుచేసింది. సభ్యులచే రిమోట్ ఇ-ఓటింగ్ విధానం ఏజిఎం నోటీసులో ఇవ్వబడినది. రిమోట్ ఇ-ఓటింగ్ వసతి దిగువ కాలవ్యవధిలో అందుబాటులో ఉంటాయి.

రిమోట్ ఇ-ఓటింగ్ ప్రారంభం: ఆదివారం, 04 ఆగస్టు, 2024న ఉ.9.00గం.లు ఐఎస్టీకి
రిమోట్ ఇ-ఓటింగ్ ముగింపు: మంగళవారం, 06 ఆగస్టు, 2024న సా.5.00గం.లు ఐఎస్టీకి

పైన పేర్కొన్న తేదీ మరియు సమయం మరియు రిమోట్ ఇ-ఓటింగ్‌కు అనుమతి ఉండదు మరియు రిమోట్ ఇ-ఓటింగ్ ముగిసిన తర్వాత మాడ్యూల్ ఎన్ఎస్‌డిఎల్ ద్వారా నిలిపివేయబడుతుంది.

సభ్యులు గమనించాల్సిందేమనగా:
ఎ) సభ్యులు ఒక్కసారి తీర్మానంపై ఓటును వినియోగిస్తే, తరువాత సభ్యులు దానిని మార్చలేరు.
బి) ఏజిఎం సమయంలో ఓటింగ్ కొరకు వసతి అందుబాటులో ఉంటుంది మరియు విసీ వసతి ద్వారా ఏజిఎంలో హాజరు అవుతున్న అట్టి సభ్యులు, రిమోట్ ఇ-ఓటింగ్ ద్వారా తీర్మానాలపై వారి ఓటును వినియోగించని మరియు అలా చేయకుండా నిరోధించబడిన వారికి ఏజిఎంసమయంలో ఇ-ఓటింగ్ సిస్టం ద్వారా ఓటుకు అనుమతి ఉంటుంది.
సి) ఏజిఎంకు ముందుగా రిమోట్ ఇ-ఓటింగ్‌చే వారి ఓటును వినియోగించిన సభ్యులు ఏజిఎంకు హాజరు కావచ్చును కానీ మళ్లీ ఓటుకు అనుమతి ఉండదు.
డి) కటాఫ్ తేది అనగా బుధవారం, 31 జులై, 2024 నాటికి డిపాజిటరీల ద్వారా నిర్వహించబడుతున్న సభ్యుల రిజిస్టర్‌లో లేదా బెనిఫిషియల్ ఓనర్స్ రిజిస్టర్‌లో పేరు రికార్డుకాబడిన వ్యక్తులు మాత్రమే రిమోట్ ఇ-ఓటింగ్ లేదా ఇ-ఓటింగ్ వసతిని పొందుటకు అనుమతి ఉంటుంది. సభ్యుల ఓటింగ్ హక్కులు కటాఫ్ తేది నాటికి కంపెనీయొక్క చెల్లించిన ఈక్విటీ వాటామూలధనంయొక్క వారి వాటాల నిష్పత్తిలో ఉంటాయి. ఏజిఎం నోటీసు మరియు వార్షిక రిపోర్టు డిస్పాచ్ తరువాత కంపెనీ యొక్క సభ్యుడిగా మారినా కానీ కటాఫ్ తేది నాటికి వాటాలను కలిగియున్న వారు కెఫిన్ టెక్నాలజీస్ (కెఫిన్) einward.ris@kfintech.comకు లేదా కంపెనీకి investorsgrievance@coromandel.murugappa.com వద్ద యూజర్ ఐడి&పాస్‌వర్డ్ అభ్యర్థిస్తూ వ్రాత పూర్వకంగా తెలియ జేయవచ్చును.

ఏజిఎంలో పాల్గొనుటకు విధానం:
ఎన్ఎస్‌డిఎల్: https://www.evoting.nsdl.com/ చే కల్పించిన వీసి/ఓఎవిఎం వసతి ద్వారా ఏజిఎంకు సభ్యులు హాజరు కావచ్చును. వీసి/ఓఎవిఎం ద్వారా ఏజిఎంలో పాల్గొనుటకు ఏజిఎంన ఓటీసులో ఇచ్చిన వివరణాత్మక గైడ్‌లైన్స్‌ను దయచేసి సభ్యులు రిఫర్ చేయండి.

ఇ-మెయిల్ అడ్రస్ రిజిస్టరింగ్/ అప్‌డేటింగ్:
సభ్యులు ఎవరైతే వారి ఇమెయిల్ అడ్రస్‌లను నమోదుచేయని వారిని సంబంధిత డిపాజిటరీ పార్టిసిపెంట్స్‌తో వారి ఇమెయిల్ అడ్రస్‌లను రిజిస్టర్ చేసుకోవాలి మరియు భౌతిక విధానంలో వాటాలను కలిగియున్న సభ్యులు einward.ris@kfintech.com కు ఇమెయిల్ పంపించుచే కెఫిన్‌తో వారి ఇమెయిల్ అడ్రస్‌ను అప్‌డేట్ చేసుకోవాలి. ఈ విషయంలో వివరణాత్మక గైడ్‌లైన్స్ కొరకు ఏజిఎం నోటీసును సభ్యులు రిఫర్ చేసుకోవచ్చును.
ఏవేని విచారణల విషయంలో, వాటాదారుల కొరకు తరచుగా అడిగిన ప్రశ్నలు (ఎఫ్ఏక్యూలు) మరియు www.evoting.nsdl.com యొక్క డౌన్‌లోడ్ సెక్షన్ వద్ద లభించు వాటాదారుల కొరకు ఇ-ఓటింగ్ యూజర్ మ్యాన్యువల్ రిఫర్ చేసుకోచ్చును లేదా కాల్ చేయండి 022-4886 7000 లేదా evoting@nsdl.com వద్ద శ్రీమతి ప్రజక్తా పావ్లేకు అభ్యర్థనను పంపండి.

పుస్తక ముగింపు మరియు రికార్డు తేది సమాచారం
ఏజిఎం నిమిత్తం కంపె యొక్క సభ్యుల రిజిస్టర్ మరియు వాటా బదిలీ పుస్తకాలు **శనివారం, 27 జులై, 2024 నుండి బుధవారం, 07 ఆగస్టు, 2024 వరకు (రెండు రోజులతోసహా)** మూసివేయబడతాయి. తుది డివిడెండ్ జరగబోయే ఏజిఎంలో వాటాదారులచే ఆమోదించబడితే, **శుక్రవారం, 26 జులై, 2024,** రికార్డు తేది నాటికి కంపెనీ యొక్క సభ్యులుగాఉన్న వాటాదారులకు చెల్లించబడును.

కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కొరకు
బి షణ్ముగ సుందరం
కంపెనీ సెక్రటరీ

ప్రదేశం: సికింద్రాబాద్
తేది: 16 జులై, 2024

లాంఛనప్రాయ స్వాధీనతా ప్రకటన

ICICI Bank
బ్రాంచ్ ఆఫీసు: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రీ టవర్, బొమ్మనహళ్లి హెబాసర్ మెయిన్ రోడ్, బెంగళూరు- 560068.

క్రింది సంతకందారులు ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొన్న మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ దిగువ పేర్కొన్న ఋణగ్రహీతలకు డిమాండ్ నోటీసులు జారీచేయబడినవి.
ఋణగ్రహీత బకాయి మొత్తాలను తిరిగిచెల్లించుటలో విఫలం చెందినకారణంగా, ఇందుమూలంగా ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ-పేర్కొన్న తేదీలలో సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువగల సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలతో క్రింది సంతకందారు దిగువ వివరించిన ఆస్తిని దిగువ పేర్కొన్న తేదీలలో లాంఛనప్రాయంగా స్వాధీనం చేసుకొన్నారు. ప్రధానంగా ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, సదరు ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఏవేని లావాదేవీలు జరుపదలచిన వారు ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ వారికి చెల్లించుటకులోబడి ఉంటుందని తెలియజేయడమైనది.

క్ర. సం.	ఋణగ్రహీత పేరు / ఋణ ఖాతా నెంబర్	ఆస్తి వివరణ/ లాంఛనప్రాయంగా స్వాధీనతా తేది	డిమాండ్ నోటీసు తేది/ డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తం (రూ.)	బ్రాంచ్ పేరు
1.	గోగినేని అడ్వర్టైజింగ్స్, బాల కృష్ణ గోగినేని & బేబీ లక్ష్మీ ప్రసన్న గోగినేని/ యూనిట్ నెం.501, జిహెచ్ఎంసి నెం.8-2-626/5/501, 5వ అంతస్తు, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-500033/ 018305008582 & 631205032388.	**ఆస్తి నెం.1:** రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-టి.ఎస్ వద్దగల మున్సిపల్ నెం.8-2-626/5 కలిగిన ఆవరణలోని (రోడ్డు విస్తరణ ఏరియా తగ్గించిన తరువాత) 26 చ.గ.లు లేదా 21.7 చ.మీ.ల విస్తీర్ణపు విడదీయలేని స్థలభాగంతోపాటుగా సెల్లార్‌లోని ఒక కార్ పార్కింగ్‌తోసహా (ఉమ్మడి ఏరియాతోకలిపి) 1775చ.అ.ల సూపర్ బిల్టప్ ఏరియాతో "రిలయన్స్ క్లాసిక్"గా తెలిసిన కాంప్లెక్స్‌లోని (మున్సిపల్ నోమన్‌క్లేచర్ ప్రకారం) ఐదవ అంతస్తులోని జిహెచ్ఎంసి నెం.8-2-626/5/501 (పిటిఐఎన్ నెం.1100847674) కలిగిన యూనిట్‌నెం.501 మొత్తం. సరిహద్దులు: ఉత్తరం: ఆఫీసు యూనిట్ నెం.303, దక్షిణం: సెట్‌బ్యాక్ & పొరుగువారి ఆస్తి, తూర్పు: 100-0" వెడల్పు రోడ్డు, పడమర: ఆఫీస్ యూనిట్ నెం.502. **ఆస్తి నెం.2:** రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-టి.ఎస్ వద్దగల మున్సిపల్ నెం.8-2-626/5 కలిగిన ఆవరణలోని (రోడ్డు విస్తరణ ఏరియా తగ్గించిన తరువాత) 26 చ.గ.లు లేదా 21.7 చ.మీ.ల విస్తీర్ణపు విడదీయలేని స్థలభాగంతోపాటుగా సెల్లార్‌లోని ఒక కార్ పార్కింగ్‌తోసహా (ఉమ్మడి ఏరియాతోకలిపి) 1775చ.అ.ల సూపర్ బిల్టప్ ఏరియాతో "రిలయన్స్ క్లాసిక్"గా తెలిసిన కాంప్లెక్స్‌లోని (మున్సిపల్ నోమన్‌క్లేచర్ ప్రకారం) ఐదవ అంతస్తులోని జిహెచ్ఎంసి నెం.8-2-626/5/502 (పిటిఐఎన్ నెం.1100847675 కలిగిన యూనిట్‌నెం.502 మొత్తం. సరిహద్దులు: ఉత్తరం: ఆఫీసు యూనిట్ నెం.303 & కారిడార్, దక్షిణం: సెట్‌బ్యాక్ & పొరుగువారి ఆస్తి, తూర్పు: ఆఫీసు యూనిట్ నెం.501, పడమర: ఆఫీస్ యూనిట్ నెం.502ఎ. **ఆస్తి నెం.3:** రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-టి.ఎస్ వద్దగల మున్సిపల్ నెం.8-2-626/5 కలిగిన ఆవరణలోని (రోడ్డు విస్తరణ ఏరియా తగ్గించిన తరువాత) 26 చ.గ.లు లేదా 21.7 చ.మీ.ల విస్తీర్ణపు విడదీయలేని స్థలభాగంతోపాటుగా సెల్లార్‌లోని ఒక కార్ పార్కింగ్‌తోసహా (ఉమ్మడి ఏరియాతోకలిపి) 1775చ.అ.ల సూపర్ బిల్టప్ ఏరియాతో "రిలయన్స్ క్లాసిక్"గా తెలిసిన కాంప్లెక్స్‌లోని (మున్సిపల్ నోమన్‌క్లేచర్ ప్రకారం) ఐదవ అంతస్తులోని జిహెచ్ఎంసి నెం.8-2-626/5/501 (పిటిఐఎన్ నెం.1100841074) కలిగిన యూనిట్‌నెం.502ఎ మొత్తం. సరిహద్దులు: ఉత్తరం: లిఫ్ట్, లాబీ& మెట్లు, దక్షిణం: సెట్‌బ్యాక్ & పొరుగువారి ఆస్తి, తూర్పు: ఆఫీసు యూనిట్‌నెం.502, పడమర: సెట్ బ్యాక్ & పొరుగువా ఆస్తి. లాంఛనప్రాయ స్వాధీనతా తేది: 11 జులై, 2024	'26-03-2024 Rs. 5,66,00,975/-	హైదరాబాద్

ఇందుమూలంగా పైన పేర్కొన్న ఋణగ్రహీత(లు)/ హామీదారు(ల)కు మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా 30 రోజుల ప్రకటన ఇవ్వబడుతుంది, లేనిచో సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8 మరియు 9 క్రింద నియమాల ప్రకారం, ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 30 రోజులు ముగిసిన తరువాత సదరు తాకట్టుపెట్టిన ఆస్తులు విక్రయించబడును.

తేది: జులై 17, 2024
ప్రదేశం: హైదరాబాద్ & సికింద్రాబాద్
అధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్

బిజినెస్

కృత్రిమ మేధాపై ఐసిఎఐ దృష్టి

- ఎఐ సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం
- ఐసిఎఐ సిఎ జిపిటి ఆవిష్కరణ
- ఆ సంస్థ ప్రెసిడెంట్ రంజిత్ కుమార్ వెల్లడి



హైదరాబాద్ : కృత్రిమ మేధా (ఎఐ)ను అందిపుచ్చుకోవడంపై కీలక దృష్టి సారించినట్లు ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా (ఐసిఎఐ) వెల్లడించింది. మంగళవారం హైదరాబాద్‌లో ఐసిఎఐ రెండు రోజుల ఎఐ ఇన్నోవేషన్ సమ్మిట్-ఎఐఎస్ 2024 ప్రారంభమైంది. ఇందులో ప్రపంచ ఎఐ నిపుణులచే ప్యానెల్ చర్చలను ఏర్పాటు చేసింది. జులై 16, 17 తేదిల్లో 'ట్రాన్స్‌ఫార్మింగ్ అకౌంటింగ్, ఆడిట్, టాక్స్, గవర్నెన్స్' అనే నినాదంతో దీన్ని నిర్వహిస్తుంది. ఆయా రంగాలలో ఎఐ ఆవిష్కరణలు, అనివార్యం గురించి నిపుణులు చర్చించారు.

ఐసిఎఐ ప్రెసిడెంట్ రంజిత్ కుమార్ అగర్వాల్ సమ్మిట్‌ను ప్రారంభించి మాట్లాడుతూ.. సిఎ విద్యార్థుల కోసం జులై ఒక్కటో తేదిన ఐసిఎఐ సిఎ చాట్ జిపిటిని అందుబాటులోకి తెచ్చామన్నారు. దీన్ని తమ 9.85 లక్షల విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్నామన్నారు. తమ సభ్యుల కోసం ప్రత్యేకంగా సర్టిఫికెట్ కోర్సు ఆన్ ఎఐని కూడా ప్రవేశపెట్టామన్నారు. ఇది ఎఐపై ప్రాథమిక అవగాహనను పెంచడానికి దోహదం చేస్తుందన్నారు. సాంకేతిక నైపుణ్యాలను పెంచడం ఈ కోర్సు ప్రధాన లక్ష్యమన్నారు.

కేంద్ర ఎలక్ట్రానిక్స్ మంత్రిత్వ శాఖతో కలిసి అకౌంటెన్సీ ఫిర్యాదుల పరిష్కారానికి ఆడిట్ టూల్‌ను అందుబాటులోకి తేనున్నామన్నారు. ఇది సమస్యల పరిష్కారానికి, మోసాలను గుర్తించడానికి మద్దతు చేస్తుందన్నారు. ఇది చార్టర్డ్ ఎకౌంట్స్ సభ్యుల బాధ్యతను మరింత పెంచనుందన్నారు.

ఐసిఎఐ వైస్ ప్రెసిడెంట్ చరన్‌జోత్ సింగ్ నందా మాట్లాడుతూ.. టెక్నాలజీ ఇంటిగ్రేషన్‌లో ఐసిఎఐ ముందంజలో ఉందన్నారు. ముఖ్యంగా ఎఐని స్వీకరించడం, అమలు చేయడంపై ప్రధాన దృష్టి సారించామన్నారు. ప్రస్తుతం దేశంలో 60 శాతం కంపెనీలు ఎఐని అందిపుచ్చుకుంటున్నాయన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడంలో తాము నిబద్ధతో ఉన్నామన్నారు. ఈ సమావేశంలో ఎఐ ఇన్ ఐసిఎఐ ఛైర్మన్ దయానివాస్ శర్మ, వైస్ ఛైర్మన్ ఉమేష్ శర్మ సహా ఐసిఎఐ సెంట్రల్, రీజినల్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు

క్యూఐపితో రూ.700 కోట్ల నిధులు

- పిటిసి ఇండస్ట్రీస్ వెల్లడి

PTC INDUSTRIES
ASPIRE • INNOVATE • ACHIEVE

హైదరాబాద్ : ఏరోస్పేస్, రక్షణ రంగ ఉత్పత్తుల తయారీ కంపెనీ పిటిసి ఇండస్ట్రీస్ తాజాగా రూ.700 కోట్ల నిధులు సమీకరించాలని నిర్ణయించింది. ఇందుకోసం తమ కంపెనీ బోర్డు ఆమోదం తెలిపిందని పిటిసి ఇండస్ట్రీస్ వెల్లడించింది. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్లేస్‌మెంట్ (క్యూఐపి) ద్వారా ఈ ఫండ్స్‌ను పొందాలని నిర్ణయించినట్లు ఆ సంస్థ రెగ్యూలేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. దీనికి కంపెనీ సభ్యుల ఆమోదం, అవసరమైన ఇతర నియంత్రణ, చట్టబద్ధమైన సంస్థల ఆమోదాలు లభించాల్సి ఉంటుందని పేర్కొంది.

పంట బీమా సుకృతి సులభతరం

- క్షేమ జనరల్ ఇన్సూరెన్స్ వెల్లడి

హైదరాబాద్ : తమ క్షేమ ప్లాట్‌ఫారమ్‌ను నవీకరించినట్లు క్షేమా జనరల్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ తెలిపింది. తద్వారా ఈ ఖరీఫ్ సీజన్ కోసం పంట బీమా ఉత్పత్తి అయిన 'సుకృతి'ని కొనుగోలు చేసే ప్రక్రియను మరింత సులభతరం చేస్తుందని పేర్కొంది. ఖరీఫ్ పంటను ప్రమాదాల నుండి రక్షించుకోవాలని చూస్తున్న కోట్లాది మంది రైతులకు సేవలను మెరుగుపరుస్తాయని తెలిపింది. ఈ ఖరీఫ్‌లో పంట భీమా ప్రీమియం ఎకరానికి రెండు ప్రమాదాల వరకు సరసమైన ప్రారంభ ధర రూ.499గా ఉంటుందని పేర్కొంది.

ఫెలిక్స్‌తో శ్రేష్ట ఫిన్‌వెస్ట్ మరో ఒప్పందం

హైదరాబాద్: ఫైనాన్షియల్ సొల్యూషన్స్ సంస్థ శ్రేష్ట ఫిన్‌వెస్ట్ లిమిటెడ్‌తో తమ బంధాన్ని మరింత బలోపేతం చేసుకున్నట్లు ఫెలిక్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఫెలిక్స్) వెల్లడించింది. ఇప్పటికే తమ మధ్య ఉన్న వ్యాపార ఏర్పాటుకు కొనసాగింపుగా మరోసారి ఒప్పందాలు చేసుకున్నట్లు ప్రకటించింది. పునరుత్పాదక ఇంధనం, సుస్థిర అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని స్వచ్ఛమైన నీటికి సంబంధించిన తమ ప్రాజెక్టులకు రుణాలు అందించడానికి శ్రేష్ట ముందుకు వచ్చిందని తెలిపింది. ప్లాంట్ ఇన్‌స్టాలేషన్, మూలధన పని కోసం ఫెలిక్స్ దాదాపు రెండు దశల్లో మొత్తం 50 మిలియన్ల (రూ.417 కోట్లు) నిధులు అందుకోనుందని పేర్కొంది.

రేపటినుంచి డీఎస్సీ రాతపరీక్షలు

- ఆగస్టు 5 వరకు ఆన్‌లైన్‌లో నిర్వహణ
- 2.79 లక్షల మంది దరఖాస్తు
- రాష్ట్రవ్యాప్తంగా 56 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందే గేట్లు మూసివేత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జిల్లా నియామక కమిటీ (డీఎస్సీ) రాతపరీక్షలు గురువారం నుంచి ప్రారంభమవుతాయి. వచ్చేనెల ఐదో తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా కంప్యూటర్ ఆధారిత విధానం (సీబీఆర్టీ)లో పాఠశాల విద్యాశాఖ నిర్వహిస్తుంది. ఈ పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మొదటి సారిగా డీఎస్సీ రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. డీఎస్సీ రాతపరీక్షల నిర్వహణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా 56 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. www.schooledu.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా డీఎస్సీకి దరఖాస్తు చేసిన అభ్యర్థులు ఈనెల 11 నుంచి డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు సుమారు 2.50 లక్షల మంది అభ్యర్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారు. డీఎస్సీకి 2,79,957 దరఖాస్తులొచ్చిన విషయం తెలిసిందే. ఇంకా డౌన్‌లోడ్ చేసుకోని అభ్యర్థులు వెంటనే చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 29న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. గురువారం నుంచి వచ్చేనెల ఐదో తేదీ వరకు రోజూ రెండు విడతల్లో రాతపరీక్షలను నిర్వహిస్తారు. మొదటి విడత ఉదయం తొమ్మిది నుంచి 11.30 (స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ మినహా) గంటల వరకు జరుగుతుంది. రెండో విడత మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4.30 (స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ మినహా) గంటల వరకు నిర్వహిస్తారు. మొదటి విడతకు ఉదయం 7.30 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులకు అనుమతి ఉంటుంది. ఉదయం 8.45 గంటలకు గేట్లను మూసేస్తారు. రెండో విడతకు మధ్యాహ్నం 12.30 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులకు అనుమతి ఉంటుంది. మధ్యాహ్నం 1.45 గంటలకు గేట్లను మూసేస్తారు. పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందే గేట్లను మూసేస్తామని అధికారులు స్పష్టం చేశారు. మొదటి విడతలో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో విడతలో మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉంటుంది. డీఎస్సీ అభ్యర్థులకు బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తారు. అందుకే పరీక్ష ప్రారంభానికి గంటన్నర ముందు నుంచే అభ్యర్థులకు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి ఉంటుంది. అభ్యర్థులు హాల్‌టికెట్‌తోపాటు ఫొటో గుర్తింపు కార్డును వెంట తెచ్చుకోవాలని అధికారులు సూచించారు. కాలిక్యులేటర్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, లాగరిథమ్ టేబుళ్లు, పేజర్లు, సెల్‌ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను పరీక్షా కేంద్రాల్లోకి తెచ్చుకోవడం నిషేధమని స్పష్టం చేశారు.

బొగ్గు వినియోగదారులతో సమన్వయానికి ప్రత్యేక సెల్

- ఇతర కంపెనీలతో పోలిస్తే ఎన్నో వెసులుబాట్లు
- వినియోగదారుల సూచనలపై తక్షణ చర్యలు :ఈ-వేలం వినియోగదారుల సమావేశంలో సింగరేణి చైర్మెన్, ఎమ్‌డీ ఎన్.బలరామ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వినియోగదారుల పట్ల స్నేహపూరితంగా ఉంటామనీ, వారిని ప్రగతి భాగస్వాములుగా గుర్తిస్తూ ప్రత్యేక సమన్వయసెల్‌ను ఏర్పాటు చేస్తున్నామని సింగరేణి సంస్థ చైర్మెన్, ఎమ్‌డీ ఎన్.బలరామ్ ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో ఈ వేలం వినియోగదారులు, వ్యాపారుల సమావేశం జరిగింది. అందులో 80 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారి నుంచి పలు సూచనలను సీఎమ్‌డీ స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఈ-వేలం వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక సెల్ దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలోని ఏ ఇతర బొగ్గు సంస్థల్లోనూ లేనివిధంగా సింగరేణిలో ఈ-వేలం వినియోగదారులకు అనేక వెసులుబాట్లను కల్పించామన్నారు. కోలిండియాలో ఈవేలం సేల్ ఆర్డర్ కాలపరిమితి 45 రోజులే ఉండగా సింగరేణిలో 90 రోజులుందని చెప్పారు. వినియోగదారులెవరైనా సమంజసమైన కారణాలు చూపితే దాన్ని మరో 90 రోజులు పెంచే వెసులుబాటును కల్పించామన్నారు. ఈ-వేలం తర్వాత పూర్తి సొమ్ము చెల్లించడానికి ఇతర సంస్థల్లో 13 రోజుల కాలపరిమితి ఉండగా తమ సంస్థలో 27 పనిదినాలుగా నిర్ణయించామని తెలిపారు. ఈ-వేలం వినియోగదారులు సేల్ ఆర్డర్‌ను ఆన్‌లైన్‌లో రద్దు చేసుకున్నా అంగీకరిస్తామనీ, వెంటనే డిపాజిట్‌ను వెనక్కి తిరిగి ఇచ్చేస్తున్నామని చెప్పారు. ఇతర సంస్థల్లో విద్యుత్తేతర వినియోగదారులకు రిజర్వ్ ప్రైస్ 20 శాతముండగా తమ సంస్థలో అది ఐదు శాతమే ఉందన్నారు. సింగరేణి సంస్థ ద్వారా ఎస్ఏపీ ద్వారా లావాదేవీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వినియోగదారులు తమ ఇంటి వద్ద నుంచే సేల్ ఆర్డర్‌లు పొందడం, సొమ్ము చెల్లించడం, బొగ్గు పొందటం వంటివి చాలా సులువుగా సింగిల్ విండో పద్ధతిలో చేసుకునే అవకాశం ఉందని వివరించారు. తమ సంస్థ ఏటా ఉత్పత్తి చేస్తున్న 700 లక్షల టన్నుల బొగ్గులో ఎక్కువ శాతం థర్మల్ విద్యుత్ కేంద్రాలకు వెళ్తున్నదని తెలిపారు. మిగిలిన దానిలో ప్రధానంగా సిమెంటు, స్పాంజ్ ఐరన్, ఎరువులు, మందులు, పేపర్, సిరమిక్స్ వంటి కర్మాగారాలకు సరఫరా చేస్తున్నామని వివరించారు. ఈ వేలం ప్రక్రియ ద్వారా ఏటా సగటున 25 లక్షల టన్నుల బొగ్గును అమ్ముతున్నామని చెప్పారు. సమావేశంలో సింగరేణి జనరల్ మేనేజర్ (మార్కెటింగ్) జి.దేవేందర్, అడిషనల్ జనరల్ మేనేజర్ ఎస్.వి.రాజశేఖర్‌రావు, డిప్యూటీ జనరల్ మేనేజర్ రవివాస్తవ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు భూ హక్కును పరిశీలిస్తాం : మంత్రి సీతక్క

- సాగు భూమి రిజిస్ట్రేషన్ చార్జిలో వారికి 50 శాతం రాయితీనివ్వండి
- మంత్రి సీతక్కను కలిసి మహిళా రైతు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధుల వినతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహిళలు భూ యజమానులయ్యేలా ప్రోత్సహించేందుకుగానూ వారికి సాగు భూమి రిజిస్ట్రేషన్, మ్యూటేషన్, స్టాంప్ డ్యూటీ చార్జీల్లో 50 రాయితీ ఇచ్చే అంశాన్ని తమ ప్రభుత్వం పరిశీలిస్తున్నదని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) స్పష్టం చేశారు. మహిళా సాధికారత కోసం ఇప్పటికే పలు పథకాలను అమలు చేస్తున్నట్టు వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మహిళా రైతుల హక్కుల కోసం పనిచేసే 'మహిళా కిసాన్ అధికార్ మంచ్' ప్రతినిధులు డాక్టర్ ఉషా సీతా, సీతా మహాలక్ష్మి, డాక్టర్ వి రుక్మిణి రావు, ఎస్.ఆశాలత తదితరులు మంత్రి సీతక్కతో భేటీ అయ్యారు. మహిళలకు భూయాజమాన్య హక్కుల అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 'దేశ వ్యవసాయ రంగంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నా వారి చేతిలో భూములు పెద్దగా లేవు. తెలంగాణ వ్యవసాయంలో 50 శాతం మేర మహిళలకు భాగస్వామ్యం ఉంది. కానీ, వారి చేతిలో 22 శాతం భూములు మాత్రమే ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. భూమి అనేది కేవలం ఆర్థిక వనరే కాదు. భూమి అంటే ఆత్మ గౌరవం, సమాజంలో హెూదా. భూమి అంటే అధికారం. అంతటి ప్రాధాన్యత ఉన్న భూమిపై మహిళలకు యాజమాన్య హక్కులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం' అని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. అయితే పదెకరాల వరకే రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలన్న డిమాండ్ ఊపందుకున్న నేపథ్యంలో కుటుంబ సభ్యుల మధ్య భూ పంపకాలు జరిగే అవకాశాలున్నాయని 'మకాం' ప్రతినిధులు మంత్రి సీతక్కకి వివరించారు. సాగు భూమి రిజిస్ట్రేషన్ల చార్జిలో 50 శాతం రాయితీలు ఇస్తూ విధానపరమైన నిర్ణయం తీసుకునే అంశంపై క్యాబినెట్‌లో చర్చిస్తామని హామీనిచ్చారు.

మాకంటే వారే ఎక్కువా?

- ఓడిపోయినోళ్లకే ప్రాధాన్యతనిస్తున్నారు : 'ప్రొటోకాల్'పై స్పీకర్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిర్యాదు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజా ప్రతినిధులమైన తమకంటే ఎక్కువగా కాంగ్రెస్ నేతలకే, అదీ తమ చేతిలో ఓడిపోయిన వారికే అధికారులు ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాల్లో ప్రొటోకాల్ నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారని వారు వాపోయారు. ఈ మేరకు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, పద్మారావు గౌడ్ తదితరులు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో వారు విలేకర్లతో మాట్లాడుతూ...తమ చేతిలో ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థులు ఆ పార్టీ కండువాలను వేసుకుని మరీ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని తెలిపారు.

దీనిపై అధికారులకు ఫిర్యాదు చేస్తే 'సర్దుకుపోవాలి' అంటూ సూచిస్తున్నారని అన్నారు. ఇదేం పద్ధతంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాపాలన, ఇందిరమ్మ రాజ్యమంటే ఇదేనా..? అని ప్రశ్నించారు. ఈ విషయంలో తమ హక్కులను కాపాడాలంటూ స్పీకర్‌కు విజ్ఞప్తి చేశామని అన్నారు. ఒకవేళ ఆయన పట్టించుకోకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామంటూ హెచ్చరించారు.

ఎప్పుడైనా ప్రొటోకాల్ పాటించారా?

- ఓడిపోయిన ఎమ్మెల్యేతో శంకుస్థాపన చేయించలేదా?
- గులాబీ నేతలకు దానిపై మాట్లాడే అర్హత ఉందా? : టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి ప్రశ్న



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రేవంత్‌రెడ్డి మల్కాజిగిరి ఎంపీగా ఉన్న సమయంలో ఎప్పుడైనా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రొటోకాల్ పాటించిందా? అని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి కేటీఆర్, హరీశ్‌రావును ప్రశ్నించారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌కుమార్ ఎమ్మెల్యేలుగా ఉన్నప్పుడు వారిని అసెంబ్లీకి రాకుండా కుట్ర చేసినప్పుడు ప్రొటోకాల్ గుర్తుకు రాలేదా? అని నిలదీశారు. సంగారెడ్డిలో తనపై ఓడిపోయిన మాజీ ఎమ్మెల్యేతో శంకుస్థాపనలు చేయించలేదా? వీటన్నింటికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రేవంత్ విషయంలో ప్రొటోకాల్ పాటించని బీఆర్ఎస్ నేతలకు దానిపై మాట్లాడే అర్హత ఉందా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డికి ఇవ్వాల్సిన గౌరవమిచ్చామనీ, గౌరవం దక్కనప్పుడు అధికారులను అడగాలని సూచించారు. మర్యాద లోపముంటే తప్పు పట్టాలని కోరారు. ఎంపీ ఈటల రాజేందర్ మల్కాజ్‌గిరిలో ప్రభుత్వ కార్యక్రమానికి వెళ్లకుండా ప్రభుత్వంపై బురదజల్లేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ప్రొటోకాల్ లేకుండా కొంత మంది బీఆర్ఎస్ నేతలు బతకలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఒత్తిడి లేకుండా పని చేస్తున్నామంటూ సెక్రటేరియట్ ఉద్యోగులు చెబుతున్నారని గుర్తు చేశారు. పదేండ్లలో బీఆర్ఎస్ సర్కారు ఒక్క రేషన్ కార్డైనా ఇచ్చారా? అని ప్రశ్నించారు. 'కాంగ్రెస్ వచ్చాకే రేషన్ కార్డులు ఇస్తున్నది. పార్టీలు మారడం కామన్. ఇది సీరియస్ మ్యాటర్ కాదు. ఎమ్మెల్యేలు పార్టీ మారడాన్ని ప్రజలు కూడా సీరియస్‌గా తీసుకోవడం లేదు. పార్టీ మార్పుపై మాట్లాడటం అవసరమే లేదు. పదేండ్ల అనుభవంలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్ అ,ఆ లు కూడా నేర్చుకోలేకపోయారు' అని గుర్తు చేశారు. పదేండ్లలో అధికార, ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు కేసీఆర్ అపాయింట్‌మెంట్ ఇచ్చారా? అని ప్రశ్నించారు.

కండక్టర్ నిజాయితీ అభినందించిన అధికారులు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీ బస్సు కండక్టర్ నిజాయితీ చాటుకున్నారు. తోటి ప్రయాణీకురాలు కూడా తనకు దొరికిన పర్సును నిజాయితీగా కండక్టర్‌కు అప్పగించి మంచి గుణాన్ని చాటింది. ఈనెల 13వ తేదీ మియాపూర్-2 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణీకురాలు పర్సు మర్చిపోయి దిగి వెళ్లిపోయింది. ఇది గమనించిన తోటి ప్రయాణీకురాలు మరొకరు ఆ పర్సును బస్సు కండక్టర్ రమేష్ (ఈ-213445)కు అప్పగించారు. ఆయన దాన్ని డిపో మేనేజర్‌కు అందచేశారు. ఆ పర్సులో నాలుగు తులాల బంగారు ఆభరణాలు, ఆధార్ కార్డు, పట్టా పాస్‌బుక్ ఉన్నాయి. మంగళవారం పర్సు పోగొట్టుకున్న ప్రయాణీకురాలిని డిపోకు రప్పించి, ఆ పర్సును అందచేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ కండక్టర్ రమేష్‌తో పాటు పర్సును అందచేసిన తోటి ప్రయాణీకు రాలిని కూడా డిపోకు పిలిపించి, సన్మానించారు. ఈ సందర్భంగా పర్సు పోగొట్టుకున్న ప్రయాణీకురాలు ఆర్టీసీ సిబ్బందికీ, తోటి ప్రయాణీకురాలికి కృతజ్ఞతలు తెలిపారు.

ఫెరిఫెరియల్ డాక్టర్లకు న్యాయం చేయాలి

- తెలంగాణ ప్రభుత్వ బోధనా వైద్యుల సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఫెరిఫెరియల్ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న డాక్టర్లకు బదిలీల్లో న్యాయం చేయాలని తెలంగాణ ప్రభుత్వ బోధనా వైద్యుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఆ సంఘం సెక్రెటరీ జనరల్ డాక్టర్ కిరణ్ మాదాల ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వైద్యవిద్య సంచాలకుల పరిధిలో స్టేట్ క్యాడర్ పోస్టులు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో జీవో నెంబర్ 80ను అమలు చేసే క్రమంలో ఈ విభాగంలో ఉన్న వైవిధ్యతను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. దీర్ఘకాలంగా ఫెరిఫెరియల్ మెడికల్ కాలేజీల్లో పనిచేసే వారికి ఉపయోగపడే విధంగా కొత్త మార్గదర్శకాలు రూపొందించుకునే అవకాశాన్ని ప్రభుత్వం శాఖాపరమైన కమిటీకీ అప్పగించిందని గుర్తుచేశారు. కమిటి విచక్షణ అధికారాన్ని ఉపయోగించి న్యాయం చేయొచ్చని స్పష్టం చేశారు. అయితే వారం గడుస్తున్నా ఉన్నతాధికారులు విధివిధానాలపై స్పష్టత ఇవ్వకుండా ఆర్డర్లు నేరుగా ఇస్తాం అంటున్నారు. ఇది ఎంత వరకు న్యాయం? అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికే ఫెరిపెరియల్ కాలేజీల్లో పని చేసే వారికి న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేకపోతే డాక్టర్లు కొత్త వైద్య కళాశాలలకు ఎలా వెళతారని ప్రశ్నించారు. యూనియన్ నాయకుల గోడును ఉన్నతాధికారులు వినడానికి ఇష్టపడటం లేదని విమర్శించారు. దీంతో నాలుగేండ్లుగా ఇలాంటి కళాశాలల్లో పని చేసే వారిలో 80 మంది డాక్టర్లలో కనీసం ఐదుగురికి కూడా న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదని తెలిపారు. ఉన్నతాధికారుల తీరుతో 40 శాతంతో ఎవరికి లాభం? అని ఆయన ప్రశ్నించారు.

సీఎం ఏకాదశి శుభాకాంక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తొలి ఏకాదశి (జులై 17) పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆషాఢంలో వచ్చే ఏకాదశిని తెలంగాణ ప్రజలందరూ ఏడాదిలో వచ్చే పండుగలకు ఇదే మొదటి పండుగగా జరుపుకుంటారని ముఖ్యమంత్రి తెలిపారు. తొలి ఏకాదశి రాష్ట్ర ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు, సకల శుభాలు కలిగించాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రార్థించారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.రెండు లక్షల రైతుల రుణమాఫీకి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రైతు కుటుంబాలన్నీ రుణ విముక్తి పొందాలనీ, ఏకాదశి పండుగను ప్రతి ఇంటా ఆనందంగా జరుపుకోవాలని ముఖ్యమంత్రి తన ఆకాంక్షను వ్యక్తం చేశారు.

ప్రజావాణికి 535 దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 535 దరఖాస్తులు అందాయని నోడల్ అధికారి దివ్య తెలిపారు. రెవెన్యూ సమస్యలకు సంబంధించి 116, పౌరసరఫరాల శాఖకు సంబంధించి 88, విద్యుత్ శాఖకు సంబంధించి 62, హౌజింగ్‌కు సంబంధించి 57 దరఖాస్తులు, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 36, ఇతర శాఖలకు సంబంధించి 176 దరఖాస్తులు అందినట్టు పేర్కొన్నారు.

సీఎం రేవంత్‌ను కలిసిన ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీఎం రేవంత్‌రెడ్డిని మంగళవారం సచివాలయంలో ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి ఛత్తీస్ ఘడ్ మాజీ ముఖ్యమంత్రి భూపేష్ భగేల్ మర్యాదపూర్వకంగా కలిశారు.

పదేండ్ల నిరీక్షణ ఫలితమే రుణమాఫీ

- చనగాని దయాకర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఏకకాలంలో రుణమాఫీ కోసం రైతులు పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో నిరీక్షించారనీ, ఈనాడికి అది నెరవేరబోతున్నదని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ తెలిపారు. ఈమేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రైతు రుణమాఫీ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని క్యాబినెట్ తీసుకున్న రుణమాఫీ నిర్ణయాన్ని రైతులు ఎన్నటికీ మర్చిపోలేరని ఆకాంక్షించారు. రైతన్న సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం గొప్ప కార్యం చేపట్టడం అసాధారణ విషయమేనని పేర్కొన్నారు. రైతుల కష్టాలకు చలించి అధికారంలోకి రాగానే సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ అమలు చేస్తున్నారని తెలిపారు. వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో ఇచ్చిన హామీమేరకు రుణమాఫీ అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. పదేండ్లుగా కేసీఆర్ నాలుగు దశల్లో రూ.28వేలు కోట్లు మాత్రమే చేశారని గుర్తు చేశారు. రుణమాఫీ విషయంలో బీజేపీ కూడా ప్రభుత్వంపై ఎన్నో విమర్శలు చేసిందనీ, ఇప్పుడు ముఖాలు ఎక్కడ పెట్టుకుంటారని ప్రశ్నించారు. రేషన్ కార్డు ఉంటేనే రైతు రుణమాఫీ అనేది తప్పుడు సమాచారమనీ, ఆ కుటుంబాన్ని పరిగణించడం కోసమేనని పేర్కొన్నారు.

మహిళలకు సురక్షిత ప్రయాణం కల్పిస్తాం

- టీజీఎస్ఆర్టీసీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహిళలకు సురక్షిత ప్రయాణం కల్పిస్తామంటూ ఆర్టీసీ యాజమాన్యం తెలిపింది. ఫరుఖ్‌నగర్ డిపోనకు చెందిన ఓ కండక్టర్ ప్రయాణ సమయంలో తనతో ప్రవర్తించిన తీరు సరిగా లేదని ఒక యువతి సోషల్ మీడియా ద్వారా టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం దృష్టికి తీసుకువచ్చింది. ఈ ఘటనపై తక్షణమే సమగ్ర విచారణకు ఆదేశించినట్టు ఆ సంస్థ యాజమాన్యం తెలిపింది. విచారణ నివేదిక ఆధారంగా బాధ్యులపై శాఖపరమైన సంస్థ చర్యలను తీసుకుంటుందని పేర్కొన్నది. టీజీఎస్ఆర్టీసీ మహిళా భద్రత విషయంలో ఏమాత్రం రాజీపడటం లేదని పేర్కొన్నది. ప్రతి రోజూ సగటున 35 లక్షల మందికి పైగా మహిళలకు సురక్షితమైన ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తోందని తెలిపింది.

గాంధీభవన్‌లో ఆషాడం బోనాలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం గాంధీభవన్‌లో మహిళా కాంగ్రెస్ బోనాల పండుగను నిర్వహించారు. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు సునీతారావు నేతృత్వంలో నిర్వహించిన ఆషాడం బోనాల పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. గాంధీభవన్ నుంచి భూ లక్ష్మమ్మ గుడి వరకు పెద్ద ఎత్తున డప్పు, వాయిద్యాల మధ్య శివశక్తులతో వెళ్లి బోనాన్ని సమర్పించారు. అన్ని జిల్లాల నుంచి పెద్ద ఎత్తున మహిళా కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా సునీతారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, పాడిపంటలతో అష్టైశ్వర్యాలతో తులతూగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ మహిళలకు పెద్దపీట వేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ల చైర్మెన్లు బండ్రు శోభారాణి, కల్వ సుజాత, అధికార ప్రతినిధులు భవానీ రెడ్డి, ఇందిరా, మహిళా కాంగ్రెస్ ఇన్‌చార్జి కోఆర్డినేటర్ నీలం పద్మ, ఉపాధ్యక్షులు సదాలక్ష్మి, అధికార ప్రతినిధులు, ఆయా జిల్లాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ఎస్ దరఖాస్తు గడువు ఆగస్టు 31

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీం (ఎన్ఎంఎంఎస్ఎస్)కు 2024-25 విద్యాసంవత్సరంలో ఎంపికైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునే గడువు వచ్చేనెల 31వ తేదీ వరకు ఉన్నది. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ (ఎన్ఎస్‌పీ) ద్వారా దరఖాస్తుల పునరుద్ధరణ, ఆన్‌లైన్‌లో దరఖాస్తులను అప్‌లోడ్ చేసే గడువు వచ్చేనెల 31 వరకు ఉందని తెలిపారు. సకాలంలో దరఖాస్తు చేసేలా విద్యార్థులకు వివరించాలని సంబంధిత విద్యాసంస్థల యాజమాన్యాలను కోరారు. విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు https://scholorships.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

సీఎం వ్యాఖ్యలకు జూడా ఖండన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అర్హత లేని నకిలీలకు శిక్షణనిచ్చి సర్టిఫికెట్ ఇచ్చే విషయమై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (టీజూడా) ఖండించింది. ఈ మేరకు మంగళవారం టీజూడా అధ్యక్షులు డాక్టర్ సాయిహర్ష, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.ఐజాక్ న్యూటన్ తదితరులు ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హత లేని వారితో ప్రజారోగ్యం ప్రమాదంలో పడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నేషనల్ మెడికల్ కౌన్సిల్ యాక్ట్‌ను అమలు చేయాలని కోరారు. మెడికల్ సీట్లు పెరిగిన నేపథ్యంలో ప్రజారోగ్య పరిరక్షణకు అర్హులైన వైద్యుల సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు.

ప్రభుత్వానికి ధన్యవాదాలు

- తెలంగాణ నర్సెస్ అసోసియేషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సహజ ప్రసవాలను చేయడంలో ప్రతిభ కనబరిచిన నర్సింగ్ ఆఫీసర్లకు ప్రోత్సాహకం విడుదల చేసినందుకు తెలంగాణ (ప్రభుత్వ) నర్సెస్ అసోసియేషన్ ధన్యవాదాలు తెలిపింది. ఈ మేరకు మంగళవారం అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ లక్ష్మణ్ రుఢావత్ ఒక ప్రకటన విడుదల చేశారు. నర్సింగ్ ఆఫీసర్లను ఈ దిశగా ప్రోత్సహిస్తున్నందుకు సీఎం రేవంత్ రెడ్డికి, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలి

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలోని ప్రతి మండలంలో ఉన్న ప్రభుత్వ భూములను అన్యక్రాంతం కాకుండా చూడాలని మేడ్చల్-మల్కాజిగిరి అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి మండలంలో సర్వే ల్యాండ్ కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ భూములను పర్యవేక్షించే బాధ్యత మీపై ఉందన్నారు. ప్రతి మండలంలో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించాలన్నారు. సెంటు భూమిని కూడా అన్యక్రాంతం కాకుండా చూడాలని సర్వేలకు ఆదేశించారు. ఈ సమావేశంలో సర్వే ల్యాండ్ రికార్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్, సర్వేయర్‌లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అమ్మ మాట అంగన్వాడీ బాట : సూపర్వైజర్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

"అమ్మ మాట అంగన్వాడి బాట"అని చిన్నారులకు ప్రాథమిక విద్య నేర్పేది అంగన్వాడి కేంద్రాలేనని రంగారెడ్డినగర్ సెక్టార్ సూపర్వైజర్ ఎస్.తిరుమల అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గిరినగర్ ప్రాంతంలో గల1, 2, 3,అంగన్వాడి కేంద్రాల ఆధ్వర్యంలో గిరినగర్, చెన్నారెడ్డినగర్, బాబు జగ్జీవన్ రామ్ నగర్ ప్రాంతాలలో చిన్నారులు,వారి తల్లులు,ఆయాలతో కలిసి పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. చిన్నారులకు ఓనమాలు నేర్పే దేవాలయం అంగన్వాడి కేంద్రమని ఆమె అన్నారు. చిన్నారులను తప్పక అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించాలని నినాదాలు చేస్తూ ర్యాలీ కొనసాగించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ఎస్.నీరజ,నసీమా, కే.వాణి, సి.సునీత, ఆశా వర్కర్లు, ఆయాలు, ఏ.ఎల్.ఎం.సి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగొద్దు



- కమిషనర్ తాజ్ మోహన్ రెడ్డి
- కార్పొరేటర్లు గండి రాంచందర్, నవీన్ కుమార్

నవ తెలంగాణ -జవహర్ నగర్

తెలంగాణ రాష్ట్రంలో అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్న బోనాల పండుగను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగవద్దని మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్ రెడ్డి శానిటేషన్ అధికారులకు సూచించారు. మంగళవారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 10 మరియు 25వ డివిజన్ల లో కార్పొరేటర్లు గండి రామచందర్, జమాల్పూర్ నవీన్ కుమార్ లతో కలిసి పలు కాలనీలో పర్యటించారు. వర్షాల కారణంగా కోతలకు గురైన రోడ్లను పరిశీలించి, మహిళలు కుటుంబ సభ్యుల తో కలసి బోనాలు ఎత్తుకొని అమ్మవారి దేవాలయాలకు వెళ్లే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, కావలిసిన మరమ్మత్తులు చేయాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్పెక్టర్ క్రిష్టప్ప, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్యాన్స్ మాస్టార్ రిమాండ్



నవతెలంగాణ-బోడుప్పల్

మేడిపల్లి పీఎస్ పరిధిలోని బోడుప్పల్ కిరణ్ స్కూల్‌లో జరిగిన చిన్నారిపై లైంగిక దాడి కేసులో స్కూల్లో పనిచేసే డ్యాన్స్ మాస్టర్ పై కేసు నమోదు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. మేడిపల్లి సీఐ ఆర్.గోవింద్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని కిరణ్ ఇంటర్నేషనల్ స్కూల్లో ఒకటో తరగతి చదవుతున్న ఓ చిన్నారిపై అదే పాఠశాలలో డ్యాన్స్ మాస్టర్‌గా పనిచేసే సార రవికుమార్ (33) అసభ్యంగా ప్రవర్తించాడని వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పోక్సో చట్టం, భారతీయ న్యాయ సంహిత చట్టాల క్రింద కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండుకు తరలించినట్టు తెలిపారు. మహిళల పట్ల, చిన్న పిల్లల పట్ల జరిగే నేరాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని , ఎలాంటి సంఘటన జరిగినా వెంటనే నిర్భయంగా పోలీసులకు సమాచారం అందించాలని, అట్టి నేరస్తుల పట్ల పోలీసులు చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు.

రాష్ట్రవ్యాప్త ఉద్యమాలకు కార్యచరణ సిద్ధం

- ఎస్‌పీఐ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శివరాత్రి సురేష్



నవతెలంగాణ-బోడుప్పల్

పాలకులు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధాలపై ప్రజా ఉద్యమాలకు సిద్ధం కావాలని సోషలిస్టు పార్టీ(ఇండియా) మేడ్చల్ జిల్లా అధ్యక్షులు శివరాత్రి సురేష్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాడంలో పూర్తి స్థాయిలో విఫలం అయ్యాయని అన్నారు. రాష్ట్రంలో రేవంత్ సర్కార్ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడం పక్కన పెట్టి ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకోవడంపై దృష్టి సారించిందన్నారు. హైదరాబాద్ మహనగరానికి అనుకుని ఉన్న మేడ్చల్ నగరంలో పేద మధ్యతరగతి ప్రజల కోసం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని నిలపెట్టుకోవాలని కోరారు. అదేవిధంగా యువతి యువకులు ఆటలు ఆడేందుకు వీలుగా క్రీడా స్టేడియం ఏర్పాటుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు రోగం వస్తే కార్పోరేట్ హస్పిటల్స్ తప్ప వైద్యం అందించేందుకు ప్రభుత్వ అస్పత్రులు లేవని ముందుగా ప్రభుత్వ అస్పత్రులలో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేయాలని కోరారు. ఉన్నత విద్యకు పేద విద్యార్థులు దూరం కాకుండా ఉండేందుకు జూనియర్, డీగ్రి కళశాలలను ఏర్పాటు చేయాలని లేని పక్షంలో దశల వారికి ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సుమన్ వర్మ సూ రోజు,రాష్ట్ర కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు

టీపీసీసీ లేబర్ సెల్ కూకట్ పల్లి అధ్యక్షులుగా సప్పిడి భాస్కర్



నవతెలంగాణ - కూకట్ పల్లి

నగరంలో జరిగిన టీపీసీసీ లేబర్ సెల్ గ్రేటర్ సమావేశంలో, కూకట్ పల్లి నియోజకవర్గం మూసాపేట్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సప్పిడి భాస్కర్‌ను టీపీసీసీ లేబర్ సెల్ కూకట్‌పల్లి నియోజకవర్గం అధ్యక్షులుగా నియమించారు.ఈ సందర్భంగా నియామక పత్రాన్ని టీపీసీసీ లేబర్ సెల్ ఛైర్మెన్ ఆర్.ప్రకాష్ గౌడ్ సప్పిడి భాస్కర్‌కు అందజేశారు. అనంతరం సప్పిడి భాస్కర్ మాట్లాడుతూ తనపై నమ్మకం తో ఈ పదవి ఇచ్చిన ఆర్.ప్రకాష్ గౌడ్ కు ప్రత్యేక కతజ్ఞతలు తెలియజేశారు. నియోజకవర్గం పరిధిలో లేబర్ సెల్ ను బలోపేతం చేస్తూ, సంఘటిత,అంఘటిత రంగాలకు చెందిన కార్మికుల సమస్యల పరిష్కారానికిషి చేస్తానని తెలిపారు. సంక్షేమ పథకాలు కార్మికులకు అందే విదంగా కషి చేస్తానన్నారు. తన నియామకాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్,,లేబర్ సెల్ గ్రేటర్ హైదరాబాద్ ఛైర్మెన్ సంజీవరెడ్డికి, గ్రేటర్ కార్యదర్శి కర్కనాగరాజు కు ప్రత్యేక కతజ్ఞతలు తెలియజేసారు. కార్యక్రమంలో కర్క నాగరాజు, నాయకులు శ్రీధర్, యూత్ కాంగ్రెస్ నాయకులు, సప్పిడి వినీత్,అఖిలేష్, వీరేష్, మహేష్ పాల్గొన్నారు.

ఘనంగా కార్పొరేటర్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావు జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం మైసిగండి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డివిజన్ అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్ కేక్ కటింగ్ చేయించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సప్పిడి శ్రీనివాస్ రావు, ఉమాకాంత్, అశోక్ రెడ్డి, భాస్కర్ రావు, సుశీల్ కుమార్, సంతు, శ్రవణ్, మన్మద్ రావు, నర్సింగ్ రావు, రవి, లక్ష్మి శారద, సుభాషిణి, లత, ప్రేమలత, తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతిని చాటేలా పండుగలు జరుపుకోవాలి



నవతెలంగాణ - కూకట్ పల్లి

సంస్కృతి సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు చాటి చెప్పేలా పండుగలు జరుపుకోవాలని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. దశాబ్ది బోనాల ఉత్సవాల సందర్భంగా శేరిలింగంపల్లి నియజకవర్గం పరిధిలో ఉన్న అమ్మవారి ఆలయాలకు చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని మియపూర్ ముఖ్య అతిథులుగా ఆది శ్రీనివాస్, ఆల్విన్ కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, మియపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ లు పాల్గొని లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజలు బోనాల ఉత్సవాలు జరుపుకొనేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. దశాబ్ది బోనాల ఉత్సవాలు ఘనంగా జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది కంటే ఎక్కువ ఫండ్‌ను అందించడం మంచి విశేషమన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్ళు, ఆలయాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలి

- ఎమ్మెల్యే కష్ణారావు



నవతెలంగాణ - కూకట్ పల్లి

బోనాల పండగ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కష్ణా రావు కూకట్ పల్లి చిత్తారమ్మ దేవాలయాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బోనాల రోజు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, తగు జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, రంగా రావు, చిన్న తులసి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎమ్మెల్సీ



- ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సంక్షేమ సంఘాల సభ్యులు ఎమ్మెల్సీని శంభీపూర్ లోని తన కార్యాలయం లో మర్యాదపూర్వకంగా కలిసి వారి ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. అలాగే పలువురు ఆహ్వాన పత్రికలు అందజేశారు. సమస్యలపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్టు తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహిస్తే సహించబోమని ఆయన హెచ్చరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

జగద్గిరిగుట్టను ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తా

- కార్పొరేటర్ కొలుకుల జగన్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

జగద్గిరిగుట్టను డివిజన్ ప్రజల సహకారాలతో గ్రేటర్‌లోనే ఆదర్శవంతంగా అభివద్ధి చేస్తానని కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. డివిజన్ పరిధిలోని అవుట్ పోస్ట్ చౌరస్తా సర్కిల్ ప్రాంగణంలో దాదాపు రూ.48 లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన రోడ్డు వెడల్పు పనులను మంగళవారం గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ మల్లారెడ్డితో కలసి ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవుట్ పోస్ట్ సర్కిల్ చౌరస్తా వద్ద ఉదయం, సాయంత్రం వేళల్లో విపరీతంగా వాహనాల రద్దీ పెరగడంతో ట్రాఫిక్ జామ్ వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారని అధికారుల దష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. ప్రధానంగా రోడ్డు వెడల్పు చేయడంతో పాటు డివైడర్ వెయ్యాలని అప్పుడు ట్రాఫిక్ కొంతమేరకు నియంత్రించవచ్చని అధికారులు సూచించినట్టు చెప్పారు. డివిజన్ అభివద్ధి కోసం తాను శాయశక్తుల కషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ డివిజన్‌లోని ప్రతి ప్రాంతంలో మౌలిక వసతుల కల్పన కోసం ప్రజా సేవకుడిగా పని చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఈ.తిరుపతి, విద్యుత్ శాఖ ఏఈ. రాధాకష్ణారెడ్డి, అధికారులు గజేంద్ర బాబు, రవికుమార్, స్థానిక నాయకులు మల్లేష్ గౌడ్, వేణుయాదవ్, గిరిబాబు, పాపిరెడ్డి, పెండ్లి సత్తిరెడ్డి, దోపతి సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షరతుల్లేకుండా రైతు రుణమాఫీ అమలు చేయాలి



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

ముఖ్యమంత్రి రేవంత్ రైతు రుణమాఫీ చేస్తానని మెదక్ చర్చి సాక్షిగా, ఏడుపాయల దుర్గమ్మ సాక్షిగా ప్రమాణం చేసి ఈ రోజున రైతు రుణమాఫీకి మెలిక పెట్టడం విడ్డూరంగా ఉందని బీఆర్‌ఎస్ 129 సూరారం డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ అన్నారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 70 లక్షల పైగా ఉన్న రైతులకు రుణమాఫీ చేయాల్సింది ఉండగా ఆహార భద్రత కార్డు తప్పనిసరి అని మెలిక పెట్టి కనీసం సగం మంది రైతులకు కూడా రైతు రుణమాఫీ అందకుండా చేయడం, అదేవి ధంగా రెన్యువల్ చేసుకున్నటు వంటి రుణాలు వర్తించకపో వడం లాంటి షరతులు పెట్టడం సరికాదన్నారు. తక్షణమే రైతులందరికీ రుణమాఫీ చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అటు రైతాంగానికి సాగునీరు అందించకపోగా, రైతుబంధు విషయంలోనూ, రైతుల రుణమాఫీ విషయంలో వ్యవహరిస్తున్న తీరు రైతులను నడ్డి విరిచే విధంగా ఉందన్నారు. ప్రభుత్వం రైతులకు అందవలసిన నిధులను ఆదా చేసుకొని పబ్బం గడిపే ప్రయత్నంలో ఉందన్నారు. రైతంగానికి కరెంటు, సాగునీరు, తాగునీరు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుంద న్నారు. కనీసం ఇప్పటికైనా రైతులకు ఎటువంటి షరతులు లేకుండా రైతు రుణమాఫీ చేయాలని అంతేకాకుండా నిరుద్యోగులపై వ్యవహరిస్తున్నటువంటి కఠినమైన తీరును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

లే అవుట్లకు రైతుబంధు



- మొన్న ఘట్కేసర్, నేడు శామీర్‌పేట్
- ఒక్కొక్కటిగా వెలుగులోకి

నవతెలంగాన-సిటీబ్యూరో

రైతుబంధు పక్కదారి పడుతోంది. సాగు యోగ్యమైన భూములతోపాటు సాగేతర భూములకూ పెట్టుబడి సాయం అందుతోంది. సాగు భూముల కె రైతుబంధు అందించాలనే నిబంధనలు ఉన్నా.. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అమలుకు నోచుకోవడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా వక్ఫ్, ఆలయ భూములు, చెరువులు, గుట్టలు, లే అవుట్లకు సైతం రైతుబంధు అందుతోంది. రోజుకో చోట రైతుబంధు లీలలు బయటకు వస్తున్నాయి. రైతు బంధు రూపంలో రూ.కోట్లు ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం అవుతోందని చెప్పడానికి ఈ రెండు ఘటనలే నిదర్శనం. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, ఘట్ కేసర్ మండలం పోచారం గ్రామానికి చెందిన యాదగిరి రెడ్డి అనే వ్యక్తి నుంచి అక్రమంగా పొందిన రూ.16 లక్షల రైతు బంధును తిరిగి చెల్లించాలని నోటీసులు జారీ చేసిన విషయం విదితమే. ఇది జరిగి వారం రోజులు కూడా గడవక ముందే తాజాగా శామీర్ పేటలో మరో ఘటన వెలుగులోకి వచ్చింది. ఇలా రైతు బంధు లక్ష్యం నీరుగారుతుంది.

జీపీ లే అవుట్ కు రైతు బంధు

శామీర్ పేట గ్రామ రెవెన్యూ పరిధిలోని సెలబ్రిటీ రిసార్ట్ పక్కన సర్వే నెంబర్ 1211, 1213, 1214,1215,1216,1217 లలో 11 ఎకరాల 26 గుంటల వ్యవసాయ పట్టా భూమి ఉండేది. 2003లో జయ ఈశ్వర్ రెడ్డి, మహేష్ రెడ్డి, రాజ వెంకటరెడ్డి లు రైతుల వద్ద కొనుగోలు చేసి, ప్రయివేటు డెవలపర్ల సహాయంతో గ్రామ పంచాయతీ నుంచి లే అవుట్ అనుమతి పొందారు.. లే అవుట్ కు కావాల్సిన అనుమతులు లేకుండానే ప్రక్రియ పూర్తి చేశారు. తర్వాత ప్లాట్లను అనేక మందికి విక్రయించారు. ఇలా ప్రయివేటు వ్యాపారం చేస్తూ డబ్బులు సంపాదిస్తూనే.. వ్యవసాయేతర భూమికి తప్పుడు పత్రాలు సమర్పించి ప్రభుత్వం నుంచి నుంచి రైతు బంధు నిధులను రూ. లక్షల్లో పొందారు. 2021 నుంచి 2024 వరకు మూడేండ్ల పాటు రూ.1,61,375 తీసుకున్నారు. అక్రమంగా పొందిన పాస్ బుక్ లను రద్దు చేయడంతోపాటు రైతు బంధు సొమ్మును ప్రభుత్వం రికవరీ చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం



- ప్రముఖ సినీ హీరో సుమన్ తల్వార్ బ్రోచర్ విడుదల

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రతి మనిషి ఆత్మ రక్షణకు కరాటే దోహదపడుతుందని ప్రముఖ సినీ హీరో, కరాటే మాస్టర్ సుమన్ తల్వార్ అన్నారు మంగళవారం జగద్గిరిగుట్ట పరిధి ఆస్బెస్టాస్ కాలనీ సాయిబాబా దేవాలయ సమీపంలోని ఆడిటోరియం లో డ్రాగన్ కుంగ్ ఫు మార్షల్ ఆర్ట్స్ అకాడమీ నేతత్వంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆగస్టు 11 న ఇంటర్నేషనల్ టోర్నమెంట్ నగరంలోని గచ్చిబౌలి స్టేడియంలో జరగనున్న నేపథ్యంలో డ్రాగన్ కుంగ్ ఫూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ,తెలంగాణ సమూరయ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరగబోయే చాంపియన్‌షిప్ ట్రోఫీ తోపాటు బ్రోచర్ ను ఆయన చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే వల్ల ఆత్మస్థైర్యంతో పాటు శారీరక దేహదారుఢ్యం, మానసికోల్లాసం పెంపొందుతుందనితెలిపారు. ఆత్మరక్షణ లేక ఎంతోమంది అభం శుభం తెలియని చిన్నారులతోపాటు వద్దులు,మహిళలు మానవ మగాల ఆకత్యాలకు బలవుతున్నారన్నారు. అందుకు కరాటే ఇప్పటితరం పిల్లలకు నేర్పించే బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలన్నారు. ఎంతో మంది విద్యార్థులను కరాటే లో శిక్షణనిస్తూ మనోధైర్యం నింపుతున్న ఈ కార్యక్రమ కార్యనిర్వాహకులు మాస్టర్ భీమా ఉదయ్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నరేష్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి, అమ్మవారి ఆలయ అధ్యక్షులు శివకేశవ్ ,గ్రాండ్ మాస్టర్ శ్రీకాంత్, మహారాష్ట్ర అధ్యక్షులు సత్తార్ అన్సారీ, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల అధ్యక్షులు సాయికుమార్,సంగారెడ్డి సమూరయ్ ఫెడరేషన్ మాస్టర్ సంతోష్ కుమార్,నాయకులు మహేష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వివేక్‌గర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని వివేక్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షు డుగా ముత్యపాగ శ్రీనివాస్ .. దూగురి ప్రకాష్ పై విజయం సాధించగా ప్రధాన కార్యదర్శిగా వోల్లురి అనిల్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోశాధికారిగా లింగాల రవీందర్.. దూగూరి సురేష్ పై విజయం సాధించారు. అనంతరం అధ్యక్షులుగా విజయం సాధించిన ముత్య పాగ శ్రీనివాస్ మాట్లాడుతూ తనను గెలిపించిన వివేక్‌నగర్ ప్రజలకు కతజ్ఞతలు తెలిపారు. వివేక్‌నగర్ లో ఉన్న సమస్యలను పూర్తిగా పరిష్కరిస్తానన్నారు. అనంతరం వారిని పూలమాలలతో, శాలువాలతో సన్మానించారు.



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పటిష్టతకు కృషి చేయాలని పన్నాలకు కేటీఆర్ సూచించారు. -నవతెలంగాణ,కాప్రా

గంజాయి విక్రయదారుల అరెస్టు



నవతెలంగాణ-ఉప్పల్

గుట్టు చప్పుడు కాకుండా ఒరిస్సా నుండి గంజాయి తీసుకొచ్చి ఉప్పల్ పరిసర ప్రాంతాలలో గంజాయి విక్రయిస్తున్న విక్రయిదారులను ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఎక్సైజ్ సూపరిండెంట్ ముకుంద రెడ్డి, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఓంకార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సా బార్డర్‌లో నుంచి అక్రమంగా తీసుక వచ్చి హైదారాబాద్‌లో ఉప్పల్, నాచారం, మల్లాపూర్‌లో అమ్మకానికి తీసుకవస్తున్న గంజాయిని మాల బస్తి, భరత్ నగర్, ఉప్పల్ లో గంజాయిని అమ్మకాలు జరుపుతున్నారనే సమాచారం మేరకు ఇద్దరు వ్యక్తులని పట్టుకున్నారు. ఏ1 మహమ్మద్ అబ్దుల్ ముజీబ్, ఏ2గా ఏ. శంకర్ నుంచి 13.116 కేజీల గంజాయి, మొబైల్, హెూండా స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్‌లి పి. నరేష్ రెడ్డి, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్‌లి. ఉప్పల్ ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు..



ఓల్డ్ అల్వాల్ లోని పోచమ్మ తల్లి ఘటంను వాడవాడలా ఊరేగింపు చేశారు. ముందుగా కుమ్మరి వారు ఈ ఘటమును ఊరేగింపు చేయుట ఆనవాయితీగా వస్తుందని కుమ్మరి రామన్ కోల్ వీరేశం తెలిపారు. అల్వాల్ ప్రజలందరినీ చల్లగా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సత్యనారాయణ, ఆర్ లక్ష్మణ్ దశరథ ,చిన్న సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ, అల్వాల్

బోనాల చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఆలయ కమిటీలకు సీతాఫల్ మండి లోని మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం బోనాల ఉత్సవాల చెక్కులను ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, జీహెచ్ఎంసి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు హేమ సామల, కంది శైలజ, రాసురి సునీత, కాంగ్రెస్ సికింద్రాబాద్ ఇన్‌చార్జి ఆదం సంతోష్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-కంటోన్మెంట్

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో మంగళవారం ఓల్డ్ బోయిన్‌పల్లి 119 డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ డివిజన్‌కు సంబంధించిన 67 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలనగర్ తాసిల్దార్ శ్రీనివాస్, ఆర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

11 గంటలకూ తెరుచుకోని గేట్లు..!

- రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేత
- ఉద్దేశ్యపూర్వకంగా ఇలా చేయడం తగదు : ప్రిన్సిపాల్ ప్రో.సత్యనారాయణ





నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు మంగళవారం ఉదయం 11 గంటల వరకు కళాశాల ప్రధాన గేట్లకు తాళం వేసి ఉందని, ప్రిన్సిపాల్ , హెడ్ ఎవరూ అప్పటి వరకు రాలేదని, గత 2 నెలల నుండి ఆచార్యులు కళాశాలకు వచ్చి ప్రాక్టికల్, క్లాస్‌లు తీసుకోలేదని, సీనియర్ అధ్యపకురాలు బోధించడం లేదని మంగళవారం ఓయూ రిజిస్ట్రార్ ప్రో.లక్ష్మీ నారాయణకు ఎంపీఈడీ విద్యార్థులు వినతిపత్రం అందజేశారు. అయితే రిజిస్ట్రార్ కళాశాలను సందర్శించిన సమయంలో కూడా తాళం వేసి ఉండటం గమనార్హం. ఈ సందర్భంగా విద్యా ర్థులు మాట్లాడుతూ రెగ్యులర్ ప్రాక్టికల్స్ అండ్ థియరి తరగతులు నిర్వహించాలని, నిత్యావసర సౌకర్యాలు కల్పించాలని కోరారు. స్కాలర్ షిప్స్ ఫామ్స్ సంబంధించిన విభాగలను పంపించి అవి వచ్చేలా చేయాలన్నారు. కళాశాలకు పూర్వవైభవం వచ్చేలా చేయాలని, ఫిజికల్ కార్యకలాపాలతో జరిపిం చాలని, విద్యార్థులు చందర్, జంపన్న, లింగస్వామి, సతీష్, హసిఫ్ బాబాలు రిజిస్ట్రార్ ను కోరారు.

పీటీఎల్ అభ్యర్థులు వినతిపత్రం

ఇదిలా ఉండగా పీటీఎల్ ఫలితాలు విడుదల చేయాలని కోరుతూ రిజిస్ట్రార్‌కు పీటీఎల్ అభ్యర్థులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో పార్ట్ టైం లెక్చరర్ నియామకంలో ఎన్నో అవకతవకలపై జరిగాయని, దీనిపై పలుమార్లు ఓయు మాజీ వీసీ, రిజిస్ట్రార్, ఓఎస్డీలకు అధికారులకు తెలియ జేసినట్టు తెలిపారు. ఇప్పటికీ అన్ని డిపార్టుమెంట్లలో పీటీఎల్‌లను నియామకం చేశారు కానీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్‌లో 6 పోస్టులకు గాను నోటిఫికేషన్ జారీ చేసి నేటి వరకు ఫలితాలు విడుదల చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు ప్రత్యేక చొరవతో కేవలం ఇద్దరినీ మాత్రమే తీసుకున్నారుని.. అందులో ఒకరిని నోటిఫికేషన్ ఎగ్జామ్ రాయనివారిని కూడా నియామకం చేసుకున్నారని యం.సతీష్, వి. అశోక్ , ఎస్.వినోద్ , పి.శ్రవణ్‌లు ఆరోపించారు. నోటిఫికేషన్ జారీ చేసిన ప్రకారం 3 ప్రాక్టీకల్, 3 థియరి లాలో మెరిట్ ప్రకారం ఫలితాలు విడుదల చేసి వెంటనే నియామకం చెయ్యగలరని కోరారు. ఇక్కడ ప్రొపెసర్స్ మధ్య సఖ్యత లేదని, గ్రూప్స్ గా విడిపోయి ఇలా కళశాల ప్రతిష్టాత్మకను దిగజారుస్తున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు.



నేను లివ్ లో ఉన్నా...
వాచ్ మెన్ రావడం లేదు..

నేను మంగళవారం ఒకరోజు లివ్‌లో ఉన్నాను. ఉన్న వాచ్‌మెన్ రావడం లేదు. విద్యార్థులకు వరుస సెలవులు కావడంతో డీఎస్సి కి ప్రిపరేషన్ కోసం ఇళ్లకు వెళ్లారు. 18 తరువాత ఆలూమినక్ రూపొందించి 3వ,సెమిస్టర్ తరగతులు నిర్వహిస్తాం. ఈ నెల 10న, 2 అండ్ 4 సెమిస్టర్స్ ముగిశాయి. వరస సెలవుల్లో విద్యార్థులు ఇండ్లకు వెళ్లారు. తరగతుల నిర్వహణతో విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తాను.కొందరు ఉద్దేశం పూర్వకంగా కళశాల ప్రగతిని నిర్వీర్యం చేయడం సమంజసం కాదు. 3వ సెమిస్టర్ ఆలూమినాక్ ను త్వరలోనే ప్రకటించనున్నట్టు హెడ్ ప్రో.సునీల్ కుమార్ చెప్పారు. ఇప్పటి వరకు 2 & 4వ,తరగతులు, పరీక్షలు సకాలం లో నిర్వహించాము

- ప్రిన్సిపాల్.. ప్రో.సత్యనారాయణ

వర్షాలతో ఎమర్జెన్సీ బృందాలు అప్రమత్తం

- ఎప్పటికప్పుడు నీరు తొలగింపు
- రంగంలోకి మాన్సూన్, స్టాటిక్ బృందాలను





నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్‌లో వాతావరణ శాఖ వర్ష సూచన జారీ చేయడంతో క్షేత్ర స్థాయిలో మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు అప్రమత్తమయ్యాయి. గ్రేటర్‌లో వర్షాలు కురిసిన సమయంలో వాటర్ లాగింగ్ పాయింట్స్ వద్ద నీరు నిలిచి ఉంటోంది. దాంతో వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ జామ్ అవుతున్న నేపథ్యంలో జీహెచ్ఎంసీ కమిషనర్, జోనల్ కమిషనర్లు ఎప్పటికప్పుడు మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలను, క్షేత్రస్థాయిలో సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. అంతేకాకుండా సమీక్షలు నిర్వహించి నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో క్షేత్ర స్థాయిలో మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు ఎప్పటికప్పుడు నీటిని తొలగిస్తున్నాయి.

రంగంలోకి మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు, స్టాటిక్ బృందాలు

ఎప్పటికప్పుడు వర్షం నీటిని తొలగించేందుకు జీహెచ్ఎంసీ మాన్సూన్, స్టాటిక్ బృందాలను రంగంలోకి దించారు. జీహెచ్ఎంసీ వ్యాప్తంగా 254 మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు, 238 స్టాటిక్ బృందాలు ఏర్పాటు చేశారు. వీరితో పాటు సీఆర్ఎంపీ 29, ఈవీడీఎం 30 బృందాలు పనిచేస్తున్నాయి. వరద కాలువలో ఫ్లోటింగ్ మెటీరియల్‌ను తొలగించి వరద నీరు నేరుగా వెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నాయి. దానితో పాటు వర్షపు నీటి ద్వారా వచ్చిన ఇసుక, మట్టిని తొలిగించి రోడ్డును శుభ్రం చేస్తున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో వరద వలన ప్రజలకు ఇబ్బంది కలగకుండా జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి నిర్దిష్టమైన చర్యలు తీసుకున్నారు.



కంటోన్మెంట్ బోర్డు సీఈఓతో ఎమ్మెల్యే భేటీ

నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ సమస్యల పరిష్కారం కోసం మంగళవారం ఎమ్మెల్యే శ్రీ గణేష్ కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్, ఇతరువిభాగాల అధికారులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కంటోన్మెంట్ బోర్డ్‌లో ఇప్పటివరకు ఏం పనులు పూర్తి చేశారు.. ఇంకా ఎలాంటి పనులు పెండింగ్‌లో ఉన్నాయి అన్న వివరాల ఆరా తీశారు. అలాగే ఎంత బడ్జెట్ కావాలి అనే అంశంపై చర్చించారు. కార్యక్రమంలో ఇంజినీరులు, శానిటైజర్ డిపార్ట్మెంట్ అధికారులు పాల్గొన్నారు.

మా పోరాటాలకు మద్దతివ్వండి

- ఎమ్మెల్యే పద్మారావుకు అంగన్వాడి టీచర్స్ హెల్పర్స్ యూనియన్ వినతి



నవతెలంగాణ-ఓయూ

అంగన్వాడీ టీచర్ల సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను సాధించడానికి తాము చేస్తున్న పోరాటాలకు మద్దతు ఇవ్వాలని కోరుతూ ఎమ్మెల్యే టీ.పద్మారావుకు అంగన్వాడి టీచర్స్ హెల్పర్స్ యూనియన్ హైదరాబాద్ సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మెమోరాండం అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి అసెంబ్లీలో మాట్లాడతానని హామీ ఇచ్చారు. యూనియన్ నగర నాయకులు టీ.మహేందర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, మంత్రికి, ఐసీడీఎస్, రాష్ట్ర అధికారులకు అనేకసార్లు వినతి పత్రాలు, నిరసనల ద్వారా విజ్ఞప్తులు చేసినా సమస్యలు పరిష్కారం చేయలేదన్నారు. పైగా 48 సంవత్సరాలు కలిసి పనిచేసిన సోదరీమణులను 65 సంవత్సరాలు నిండిన అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్‌ను అతి తక్కువ డబ్బులు చెల్లించి జూలై 1 నుంచి ఇంటికి పంపించాలని నిర్ణయించిందన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఓట్లేసి గెలిపించిన ఎమ్మెల్యేలకు బాధలు విన్నవించుకుందామని మెమొరాండం ఇచ్చామన్నారు.రాష్ట్రంలో పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ కార్మికుల్లో భాగమేనని.. సమస్యలు పరిష్కారం కాకపోతే పోరాటం చేసే హక్కు కార్మికులకు ఉందన్నారు. ఈ హక్కులో భాగంగానే పోరాటంలో పాల్గొన్నారని తెలిపారు. కానీ అధికారులు ఈ అంశానికి భిన్నంగా మెమో ఇవ్వడం అన్యాయమన్నారు. మెమోలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని కోరారు. అలాగే జీఓ నెంబర్ 10ను రద్దు చేసి రిటైర్మెంట్ బెనిఫిట్ టీచర్లకు రూ.2 లక్షలు, ఆయాలకు రూ. లక్ష రూపాయలు ఇవ్వాలని, పెన్షన్, వీఆర్‌యస్ సౌకర్యం కలిపిస్తూ కొత్త జీవో తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సమ్మ,ఈశ్వరి.లక్ష్మి లు పాల్గొన్నారు.

కేర్ ఆస్పత్రిలో క్లిష్టమైన శస్త్ర చికిత్స విజయవంతం

- ప్రవాస భారతీయునికి శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తి చేసిన కేర్ వైద్యుల బృందం



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఓ ప్రవాస భారతీయ రోగికి క్లిష్టమైన శస్త్ర చికిత్స ద్వారా వైద్యులు అవసరమైన చికిత్సలు నిర్వహించి, మూడు నెలల పాటు శ్రమించి ఆరోగ్యవంతుడిగా వెళ్లేలా మార్గాన్ని ఏర్పాటు చేసినట్టు కేర్ ఆస్పత్రి వైద్యుల బృందం వెల్లడించింది. ఈ సందర్భంగా వైద్య బృందం మాట్లాడుతూ... "క్లిష్టమైన హృద్రోగ సమస్యతో పాటు శరీరంలోని పలు అవయవాల పనితీరు మందగించటంతో ఆస్ట్రేలియాలో నివసిస్తున్న భారత సంతతికి చెందిన భాస్కర్ పొనుగంటి బంజారాహిల్స్ లోని కేర్ ఆస్పత్రిలో 3 నెలల క్రితం చేరారు. అతను కొంతకాలంగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. శ్వాస ఆడకపోవడంతో పాటు తీవ్రమైన హృద్రోగ సమస్యతో ఆయన ఆస్పత్రిలో చేరగా రోగికి అవసరమైన వైద్య పరీక్షలు వైద్యులు నిర్వహించారు. ఆ రోగి బృహద్ధమని కవాటానికి సంబంధించిన "ఇన్ఫెక్టివ్ ఎండోకార్డిటిస్" వ్యాధితో బాధపడుతున్నట్టు గుర్తించారు.ఇలాంటి తీవ్రమైన ఇన్‌ఫెక్షన్ వల్ల రోగికి మూత్రపిండాల వైఫల్యం, ఎడమవైపు పక్షవాతం కలిగించే మెదడు పోటు బ్రెయిన్ స్ట్రోక్ కలిగి రోగి ఆరోగ్యం క్షీణించిందని, తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఉన్న రోగి వెంటిలేటర్ పై ఉన్నప్పటికీ అతని బృహద్ధమని కవాటానికి అత్యవసర శస్త్ర చికిత్స చేయడమే సరైన మార్గమని ఆస్పత్రి క్లినికల్ డైరెక్టర్, కార్డియాలజీ విభాగాధిపతి డా. వి.సూర్యప్రకాశరావు నేతృత్వంలోని వైద్య బృందం నిర్ధారించింది. క్లిష్టమైన శస్త్ర చికిత్సను (హై రిస్క్ సర్జరీ) నిర్వహించేందుకు రోగి కుటుంబ సభ్యులు అనుమతించిన అనంతరం ఆస్పత్రికి చెందిన సీనియర్ కార్డియోథొరాసిక్, హార్ట్ ట్రాన్స్ ప్లాంట్ సర్జన్ డా.నగేష్ ఆధ్వర్యంలో వైద్య బృందం "మెకానికల్ వాల్వ్" వైద్యవిధానం ద్వారా రోగి బృహద్ధమని కవాట మార్పిడిని విజయవంతంగా నిర్వహించింది. దీంతో రోగి ఆరోగ్యం కుదుటపడింది. అనంతరం రోగికి అవసరమైన మరో శస్త్ర చికిత్స నిర్వహించిన తరువాత రోగి అకస్మాత్తుగా బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యారు. అతని ఆరోగ్య పరిస్థితి క్లిష్టంగా మారడంతో ఐసీయులో ఆస్పత్రి అసోసియేట్ క్లినికల్ డైరెక్టర్, క్రిటికల్ కేర్ విభాగాధిపతి డా.జి.భవాని ప్రసాద్ ఆధ్వర్యంలో అవసరమైన వైద్య సాయం అందించారు. న్యూరాలజీ, నెఫ్రాలజీ, ఇంటెన్సివిటీ,కార్డియాక్ విభాగాలు..సమన్వయంతో నిరంతర పర్యవేక్షణలో కఠినమైన ఫిజియోథెరపీతో కూడిన బహుళ వైద్య చికిత్స విధానాలను రోగికి అందించాయి. ఈ నేపథ్యంలో దాదాపు రెండు వారాల అనంతరం రోగి ఆరోగ్యం నిలకడగా ఉండి, అతను క్రమంగా కోలుకోవడం ప్రారంభించారు. అనంతరం రోగిని దాదాపు రెండు నెలల పాటు ఐసీయూలోనే ఉంచి అవసరమయ్యే వైద్య సహాయం అందించడంతో అతను పూర్తిగా కోలుకున్నారు. దాదాపు 75 రోజుల తర్వాత రోగి పూర్తి ఆరోగ్యంతో ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు' అని తెలిపింది.

ఈ సందర్భంగా కేర్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా.అజిత్ సింగ్ మాట్లాడుతూ... రోగి మరలా వైద్య పరీక్షల కోసం ఇటీవల కేర్ ఆస్పత్రికి వచ్చారని,అతని ఆరోగ్య పరిస్థితి పట్ల సంతప్తిని వ్యక్తం చేశారని తెలిపారు. ఆస్పత్రి సీఓఓ సయ్యద్ కమ్రాన్ మాట్లాడుతూ అసాధారణమైన రీతిలో రోగి కోలుకోవడం సంతోషంగా ఉందన్నారు. వివిధ వైద్య విభాగాలు సమన్వయంతో సంక్లిష్టమైన వైద్య విధానాల ద్వారా రోగికి అందించిన వైద్య సాయం అతని ప్రాణాలను నిలబెట్టిందని అభిప్రాయ పడ్డారు. వైద్య బృందం ఘనతను ప్రశంసించారు .రోగులకు అవసరమైన వైద్యసహాయం అందించేందుకు తమ ఆస్పత్రి ఎల్లప్పుడూ అంకితభావం కలిగి ఉంటుందన్నారు. అధునాతన వైద్య సంరక్షణతో ఏం సాధించవచ్చో ఈ కేసు ద్వారా వైద్య బృందం నిరూపిం చిందన్నారు. రోగి కోలుకోవడం అద్భుతమని వ్యాఖ్యానించారు.

బస్తీల్లో పర్యటించిన డిప్యూటీ మేయర్



నవతెలంగాణ-ఓయూ

తార్నాక డివిజన్ లోని ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని క్యాంపు నెంబర్ 6వ బస్తిలో మంగళవారం అధికారులతో కలిసి జీహెచ్ఎంసి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు, కాంగ్రెస్ నేత మోతె శోభన్ రెడ్డి దంపతులు పర్యటించారు. ప్రజలు, అధికారులతో కలిసి బస్తిలోని వీధుల్లో పర్యటిస్తూ.. రోడ్డు, విద్యుత్, పారిశుద్ధ సమస్యలను పరిశీలించారు. తక్షణమే పరిష్కారమయ్యే సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జటిలమైన సమస్యలకు సైతం శాశ్వత పరిష్కారం అయ్యే విధంగా చూస్తామన్నారు. ముఖ్యంగా విద్యుత్ సమస్యల గురించి ఓయూ ఇన్‌చార్జ్ వీసీ దాన కిషోర్‌తో మాట్లాడి పరిష్కారం చూపేందుకు, అలాగే సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి సైతం తీసుకెళ్ళి శాశ్వత పరిష్కారం అయ్యేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బస్తి మీద ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నందుకు బస్తీ మహిళలు హర్షం వ్యక్తం చేస్తూ డిప్యూటీ మేయర్ దంపతులను శాలువాలతో సన్మానించి కతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ రజినీకాంత్, రాంకీ ఇంచార్జి దశరథ్, ఎంటోమాలోజి ఇన్‌చార్జి రాజశేఖర్, అధికారులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

బోరబండ డివిజన్‌లో 'సమస్యలపై శంఖారావం'



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆధ్వర్యంలో బోరబండ డివిజన్ ప్రజా సమస్యలపై సైట్ 3 లోని ప్రొఫెసర్ జయ్ శంకర్ కమిటీ హాలో "సమస్యలపై శంఖారావం" అనే కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులతో నిర్వహించారు. ఇందులో భాగంగా బోరబండ ప్రజలు వాటర్, సివరేజీ, ఎలక్ట్రిసిటీ, సివిల్ సప్లై, రెవిన్యూ తదితర అధికారులకు ఫిర్యాదులు అందజేశారు. ఈ మేరకు ఫిర్యాదులకు తగిన పరిష్కారం చేయాలని అధికారులకు ఎమ్మెల్యే తెలియజేసారు. ఈ కార్యక్రమంలో డీఈ జీహెచ్ఎంసీ రామచంద్ర రాజు,ఖైరతాబాద్ ఎమ్మార్వో ఆఫీస్ సెక్షన్ ఆఫీసర్ గిరిధర్, సివిల్ సప్లై ఏఎస్ఓ సరస్వతి, ఎలక్ట్రికల్ అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులు, బోరబండ డివిజన్ నాయకులు కృష్ణ మోహన్, విజయ్ కుమార్, సర్దార్, ఖదీర్, ఫయాజ్ ఖాన్, ముక్రం, మేరీ తదితరులు పాల్గొన్నారు.

నేడు బ్రహ్మకుమారిస్ ఆధ్వర్యంలో రామోజీరావు సంస్కరణ సభ

నవతెలంగాణ-కంటోన్మెంట్

బ్రహ్మకుమారిస్ హైదరాబాద్ సెంటర్స్ ఆధ్వర్యంలో ఈ నెల 17న బుధవారం (నేడు) ఈనాడు స్థాపకుడు దివంగత రామోజీరావు సంస్కరణ సభ నిర్వహిస్తున్నట్లు బ్రహ్మకుమారి ప్రతినిధులు చెప్పారు. మంగళవారం మారేడుపల్లి లోని వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సికింద్రాబాద్ విభాగపు ఇన్‌చార్జి మంజు వివరాలను వెల్లడించారు.. బుధవారం 6 గంటల నుంచి 8 గంటల వరకు సిక్కి విలేజ్ ఇంపీరియల్ గార్డెన్‌లో రామోజీరావు సంస్కరణ సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమాజానికి రామోజీరావు చేసిన సేవలను గుర్తు చేస్తూ శ్రద్ధాంజలి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఈ సమావేశంలో సత్యనారాయణ, మమత తదితరులు పాల్గొన్నారు

ముగిసిన సీపీజీఈటి ప్రవేశ పరీక్షలు

నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి నిర్వహిస్తున్న కామన్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఎంట్రెన్స్ టెస్ట్ (సీపీజీఈటి-2024), 37 సెంటర్స్‌లలో మంగళవారం సాయంత్రంతో ముగిసినట్టు కన్వీనర్ ప్రో.ఐనవోలు. పాండు రంగారెడ్డి పేర్కొన్నారు. 45 విభాగాల్లో 73,342 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటే , దానిలో 64 ,765 (88.31 శాతం) మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షలు రాసినట్లు చెప్పారు. ఈ నెల 20 వరకు సబ్జెక్టుల వారిగా ప్రిలిమినరి కీ విడుదల చేసి 3 రోజుల పాటు కీలో ఎలాంటి చర్యలు అభ్యంతరాలు ఉన్నా స్వీకరించి, ఈ నెల 30 వరకు ఫలితాలు విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

మహంకాళి ఆలయానికి బోనాలు తీసుకురాము



- జోగినిలను, శివ శక్తులు, పోతురాజులపై లాఠీ చార్జి అమానుషం
- ప్రభుత్వం ప్రత్యేక సమావేశం నిర్వహించాలి
- జోగిని శ్యామల

నవతెలంగాణ-బంజారాహిల్స్

బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద జోగినిలు శివశక్తులు పోతురాజులపై జరిగిన లాఠి ఛార్జికి నిరసనగా మహంకాళి అమ్మవారి ఆలయానికి బోనాలు తీసుకురాబోమని జోగిని శ్యామల స్పష్టం చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా జరిపే బోనాల ఉత్సవాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తూ సాంప్రదాయాలను ముందు తరాలకు అందిస్తున్న తమ పట్ల ప్రభుత్వం తీరు తీవ్ర విచారకరమని అన్నారు. జోగినిలు పోతురాజులు శివశక్తులపై లాఠీ చార్జి చేయడం హేయమైన చర్య అన్నారు. తాము ప్రభుత్వాన్ని తమకు ఇది కావాలని అడిగిన సందర్భాలు చాలా తక్కువ అని అన్నారు. తాము పవిత్రంగా భావించే అమ్మవారి ఉత్స వాలకు తమను దూరం చేయడం ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు సంబంధం లేని వ్యక్తులు అక్కడ ఏం జరగాలో నిర్ణయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏడాదీ అమ్మవారికి ప్రత్యేక అలంకరణలతో బోనాలు సమర్పించడం అమ్మవారి ఊరేగింపు సందర్భంగా తమంత నృత్యాలు చేయడం మానవాహితగా వస్తుందని అన్నారు. అలాంటి ఆనవాయితికి విరుద్ధంగా వేడుకలు జరపడం ఆవేదన కలిగిస్తున్నదని అన్నారు. ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి తమ బోనాలు సమర్పించబోమని దానివల్ల జరిగే అరిష్టాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. ప్రభుత్వం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి తమకు సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చేంతవరకు తమ నిరసన ఉంటుందని చెప్పారు. లాఠి చార్జికి కారణమైన అధికారులు సిబ్బందిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్రవంతి యాదవ్,కళ్యాణ్,దుర్గ తదితరులు పాల్గొన్నారు.



బస్తీ దవాఖాన పక్కన చెత్త కుప్పలు తొలగించాలి

- సీపీఐ(ఎం) నాయకుల డిమాండ్

నవతెలంగాణ - జూబ్లీహిల్స్

వెంగళరావునగర్ యాదగిరి నగర్ బస్తీ దవాఖాన పక్కన ఉన్న చెత్త కుప్పను వెంటనే తొలగించాలని జీహెచ్ఎంసీ సర్కిల్ 19 యూసఫ్ గూడా డిప్యూటీ కమిషనర్ ఆఫీసులో మంగళవారం సీపీఐ(ఎం) జూబ్లీహిల్స్ జోన్ కమిటీ నాయకులు వినతి పత్రం అందజేశారు. అయితే అధికారులందరూ హెడ్ ఆఫీస్‌కు వెళ్లిన సందర్భంగా ఆఫీస్ బయట నిలబడి నిరసన తెలియజేశారు. చెత్తను తొలగించి వర్షాకాలంలో యాదగిరి నగర్ బస్తీ వాసులకు సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జూబ్లీహిల్స్ జోన్ కన్వీనర్ రాపర్తి అశోక్, టి. సాయి శేషగిరిరావు, వై యాదగిరి, పి కష్ణ పాల్గొన్నారు.

లష్కర్ బోనాల జాతరకు పకడ్బందీగా ఏర్పాట్లు

- డీసీపీ రష్మి పెరుమాళ్



నవతెలంగాణ-బేగంపేట్

సికింద్రబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాలకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్టు నార్త్‌జోన్ డీసీపీ రష్మి పెరుమాళ్ అన్నారు. మంగళవారం సికింద్రాబాద్ మహంకాళి పోలీసుస్టేషన్‌లో డీసీపీ రష్మి పెరుమాళ్, అడిషనల్ డీసీపీ అశోక్ మీడియాతో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ నెల 21, 22 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగే జాతరకు సుమారు 10లక్షల మంది భక్తులు రావచ్చుని అంచనా వేసినట్టు చెప్పారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం మూడు ప్రాంతాల నుంచి ఎంట్రీ, ఎగ్జిట్లు ఏర్పాటు చేశామన్నారు.ఆలయం వద్ద భక్తుల కోసం ఆరు క్యూలైన్లు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. అలాగే బోనాలతో వచ్చే మహిళా భక్తులు ఎక్కువ సమయంలో క్యూలో వేచి ఉండకుండా దర్శనానికి పంపించేందుకు వారికోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. బోనాలతో వచ్చే భక్తుల క్యూలైన్లు నిత్యం ఫ్లో జరుగుతూనే ఉంటుందన్నారు. ప్రతి నిమిషానికి 600 మంది భక్తులు దర్శనం చేసుకునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నా మన్నారు. అలాగే మంత్రులు, వీవీఐపీలు, వీఐపీల కోసం ప్రత్యేక క్యూ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ప్రొటో కాల్‌లో భాగంగా ఈ సారి ముఖ్యమంత్రి, సీఎస్ లకు మా త్రమే ప్రత్యేక దర్శనం ఉంటుందని తెలిపారు. అమ్మవారికి సీఎం రేవంత్‌రెడ్డి పట్టువస్త్రాలు సమర్పిస్తారని, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నంప్రభాకర్.. అమ్మవారికి బంగారు బోనం సమర్పిస్తారని చెప్పారు. కాగా ఈ సారి వీఐపీల దర్శనం కోసం ఇచ్చే స్పెషల్ పాసులను రూ. 50వేల నుంచి రూ. 25 వేలకు తగ్గించామన్నారు.

నా కార్యక్రమం జరగకుండా కుట్ర..



- **ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్**

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

తాను అధికారులతో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని జరగకుండా చేయుటకు కుట్ర చేశారని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆరోపించారు. బోరబండ డివిజన్‌లో మంగళవారం సైట్ 3 లోని ప్రొఫెసర్ జయశంకర్ కమ్యూనిటీ హాల్లో, ప్రజల సమస్యలపై శంఖారావం కార్యక్రమాన్ని అధికారులతో కలిసి ఏర్పాటు చేశారు. అనంతరం మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మంగళవారం జరిగే కార్యక్రమాన్ని 10 రోజుల ముందే ప్రభుత్వ అధికారులకు, అన్ని శాఖల వారికి తెలియ పరచానని, అయితే కావాలని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని అధికారులతో మేయర్ విజయలక్ష్మి సమావేశం ఏర్పాటు చేసి వారిని అక్కడికి పిలిపించుకున్నారని తెలిపారు. బోరబండ డివిజన్ మరో రాయల సీమగా తయారైందన్నారు. గత పది సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీలో ఉన్న నాయకులతో బీఆర్ఎస్ నాయకులకు ఎలాంటి విభేదాలు లేవని, ఇటీవల కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన బీఆర్ఎస్ నాయకులు డివిజన్‌లో ప్రతి ఒక్కరిపై తప్పుడు కేసులు పెడుతూ దౌర్జన్యాలు చేస్తున్నారని మండిపడ్డారు. 100 గజాలలో ఇల్లు నిర్మించుకున్నప్పటికీ బెదిరించి డబ్బులు వసూలు చేస్తు న్నారని, కాంగ్రెస్ పార్టీలోకి రావాలని లేదంటే ఇండ్లు కూల్చి వేయిస్తామని జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులతో నోటీసులు ఇప్పిస్తున్నారని, బహిరంగంగా మీడియా ఎదుట అనేకమంది ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఇలాంటి దుర్మార్గాలు ఆపకుంటే బీఆర్ఎస్ కార్యకర్తలు తిరగబడతారని, అప్పుడు కాంగ్రెస్ పరువు పోతుందన్నారు. వెంటనే కాంగ్రెస్ అధిష్టానం పార్టీలు మారి వచ్చిన వారిని వారి పార్టీకి చెడ్డ పేరు రాకుండా క్రమశిక్షణతో ఉండేటట్టు అదుపులో ఉంచుకోవాలని అన్నారు. ఇటీవల బోరబండ డివిజన్ మధురానగర్‌లో 209 ఇండ్లు ఉండగా ప్రతి ఇంటి నుంచి ఇంటి యజమానులు ఒక్కరు మాత్రమే ఒక ఓటు వేసి బస్తీ అధ్యక్షులను ఎన్నుకుంటారని తెలిపారు. అయితే ఓడిపోతామనే భయంతో ఒక వర్గం వారు పోలీసులను అడ్డుపెట్టుకొని అసలు మధురానగర్ బస్తీలో ఎన్నికలు పెట్టకుండా అడ్డుకుంటున్నారన్నారు. బస్తీలోని ఇంటి యజమానులు 150 మంది అధ్యక్ష ఎన్నికలు జరపాలని కోరుతుండగా, 59 మంది మాత్రమే ఎలక్షన్లు వద్దని అడ్డుకుంటున్నారన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకొని ఎంత దౌర్జన్యం చేసినా కోర్టు నుండి అనుమతి తెచ్చుకొని, బస్తీ ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. తప్పకుండా గెలిచి తీరుతామని బస్తీ ప్రజలు ధైర్యంగా ఉండాలని, మీకు నేను అండగా ఉంటానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
బుధవారం | జూలై 17, 2024 | www.navatelangana.com

ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించేందుకు కృషి

● మాజీ కార్పొరేటర్ పరమేశ్వరి సింగ్..



నవతెలంగాణ-ధూల్‌పేట్

స్థానిక బస్తీలలో ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని మంగళ్ హాట్ మాజీ కార్పొరేటర్ పరమేశ్వరి సింగ్ అన్నారు. ధూల్ పేట్ అర్జున్ దాస్ బాబా నగర్, డబుల్ బెడ్ రూం, శివలాల్ నగర్ నాలా పరిసర ప్రాంతాలలో జీహెచ్ఎంసీ సిబ్బందితో కలిసి పర్యటించారు. చెత్త తొలగించకపోవడం, దోమలు విజృంభిస్తున్నాయని, వీధిలైట్లు వెలగడం లేదని స్థానికులు వెలబుచ్చు కున్నారు. దీంతో వెంటనే ఆయా ప్రాంతాలలో పేరుకుపోయిన చెత్త, చెదారంను సిబ్బందితో తొలగిం చారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులకు సూచించారు.

తెలంగాణ సంస్కృతికి బోనాల పండుగ తలమానికం

● గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్



నవతెలంగాణ-అంబర్‌పేట

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ తలమానికమని గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్ అన్నారు. జీహెచ్ఎంసీ ఎంపాయిస్ ఆధ్వర్యంలో మంగళవారం గోల్నాక వార్డు కార్యాలయంలోని దుర్గామాత దేవాలయంలో జీహెచ్ఎంసీ మహిళలు బోనాలను సమ ర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ దూసరి లావణ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఆషాఢ మాసంలో నిర్వహించే బోనాల పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారని ఆమె పేర్కొన్నారు. తెలంగాణలో అంగరంగ వైభవంగా జరుపుకునే బోనాల పండుగకు దేశ, విదేశాలలో మంచి ఆదరణ ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్ హేమలత, బాలకృష్ణ, తిరుపతినాయక్, ఎల్లేశ్, రాంబాబు, అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

మంచినీటి లోప్రెషర్ సమస్యను వెంటనే పరిష్కరిస్తాం

● గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గం గాంధీనగర్ డివిజన్‌లో మంచినీటి లో ప్రెషర్ సమస్యను వెంటనే పరిష్కరిస్తామని గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ తెలిపారు. మంగళవారం డివిజన్‌లోని గిరి నగర్ బస్తీలో మంచినీటి లోప్రెషర్ సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఫిర్యాదు మేరకు బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్ కుమార్ తో కలిసి సమస్యాత్మక ప్రాంతాలలో కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సరఫరాలో లోప్రెషర్ ను నియంత్రించేందుకు, బస్తీ వాసులు నూతన పైప్ లైన్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరారని అందుకు కావాల్సిన కార్యచరణ సిద్ధం చేసి నూతన పైప్ లైన్ కి మంజూరుకు చర్యలు తీసుకుంటామని బస్తీ వాసులకు హామీ ఇచ్చారు. అధికారులు సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి నూతన పైప్ లైన్ ఏర్పాటు అయ్యే వరకు తాత్కాలికంగా సమస్యను పరిష్కరించే విధంగా సరఫరా సమయాన్ని పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ కృష్ణ మోహన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శంకర్ బస్తి వాసులు సాయి కుమార్, శ్రీనివాస్, సాయి, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

నాలాలో ప్లాస్టిక్ వ్యర్థాలను, థర్మకోలు చెత్తను వెంటనే తొలగించాలి



నవతెలంగాణ-అంబర్‌పేట

నల్లకుంట డివిజన్ ఓల్డ్ రామాలయం స్ట్రీట్ నెంబర్ 15లైన్‌లో ఉన్న నాలాలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, థర్మకోలు చెత్తను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ నల్లకుంట సిటిజన్ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం అంబర్పేట సర్కిల్ డీసీ మారుతీ దివాకర్‌నీ కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు ఎన్సీఏ ప్రధాన కార్యదర్శి మోహన్ నాయుడు, ఉపాధ్యక్షుడు భవాని శంకర్, నాయకులు శ్రీనివాసరావు, వీరయ్య, రమేష్ తదితరులు నాలా పరిస్థితిని వివరించారు. 47 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ నాలా పది ఫీట్ల వెడల్పు, 12 ఫీట్ల లోతులో ఉందని, భారీ వర్షం వస్తే వరద నీటికి పాత రామాలయం, పరిసర ప్రాంతాల్లోని ఇండ్లు నీటితో మునిగిపోతు న్నాయని చెప్పారు. ఈ నాలాలో ప్లాస్టిక్ వ్యర్థాలు, థర్మకోలు చెత్త మూడు ఫీట్ల వరకు పేరుకుపోయిందన్నారు. పూడికతీత చేపట్టకపోవడంతో వరదనీరు సాఫీగా వెళ్లకుండా బయటకు పొంగి ఇండ్లలోకి వస్తుందని డీసీకి చెప్పారు. నాలాలో ఉన్న వ్యర్థాలను వెంటనే తొలగింపజేయాలని కోరారు. స్పందించిన డీసీ ప్లాస్టిక్ వ్యర్థాలను, చెత్తను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కలుషిత నీటి సమస్యను వెంటనే పరిష్కరించండి



నవతెలంగాణ-అంబర్‌పేట

బాగ్ అంబర్‌పేట డివిజన్ పరిధిలోని మహంకాళి అమ్మవారి టెంపుల్ పక్క బస్తీలో మంచినీటిలో మురుగునీరు కలిసి వస్తుందని స్థానికులు కార్పొరేటర్ బి. పద్మ వెంకట్ రెడ్డి దృష్టికి తీసుకురావడంతో మంగళవారం వాటర్ వర్క్స్ డీజీఎం విష్ణువర్ధన్‌రావు, మేనేజర్ మాజిద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ లైన్‌మెన్ ప్రేమాయాదవ్లతో కలిసి కార్పొరేటర్ ఆ బస్తీలో పర్యటించారు. మంచి నీటిని పరిశీలించారు. కలుషిత నీటిని గుర్తించే పరికరంలో నాల్లాల్లో సరఫరా అవుతున్న నీటిని పరీక్షించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ కలుషిత మంచినీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మిర్యాల శ్రీనివాస్, గోవిందు అర్జున్, స్థానిక బస్తీపెద్దలు తోపు పృథ్వీగౌడ్, బిందె శ్రీనివాస్ గౌడ్, కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న విశ్వ బ్రాహ్మణులను ఆదుకోవాలి



నవతెలంగాణ-అంబర్‌పేట

విశ్వకర్మల్లో ఉన్న ఐదు కులాలు వృత్తులు ఆధారిత జీవనంలో ఉన్నారని, ప్రభుత్వం ఆదుకోవాలని గ్రేటర్ హైదరాబాద్ మనుమయ సంఘం అధ్యక్షుడు పోలోజు అశోకాచారి విజ్ఞప్తి చేశారు. ఈ నెల 21న విశ్వబ్రాహ్మణ మనుమయ ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ ధర్నాచౌక్ వద్ద తలపెట్టిన మహాధర్నాకు సంఘీభావం తెలపాలని మంగళవారం అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశు మనుమయ సంఘం ప్రతినిధులు వినతి పత్రం సమర్పించారు. అనంతరం పోలోజు అశోక్ చారి మాట్లాడుతూ కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న పంచ వృత్తులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేయూతనందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పి.అంజయ్యాచారి, శ్రీహరిచారి, సంజీవచారి, భాస్కరాచారి, వేణుగోపాల్, కృష్ణమాచారి, శ్రీరామ్ చారి, ఉల్లంగుల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశాల పెంపే లక్ష్యం..!

అమ్మ మాట-అంగన్ వాడీ బాటకు ప్రభుత్వం శ్రీకారం
వినూత్న పద్ధతుల్లో చిన్నారులకు ప్రీ ప్రైమరీ విద్య అందించేందుకు చర్యలు
అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ నెల 20 వరకు ప్రత్యేక కార్యక్రమాలు







నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రయివేటు పాఠశాలలకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీప్రైమరీ విద్యను అందించాలని సర్కారు నిర్ణయించింది. చిన్నారుల బంగారు భవిష్యత్తు కోసం వినూత్న కార్యక్రమాలతో పాటు సులభతరమైన పద్ధతుల ద్వారా వారిలో విద్యా ప్రమాణాలు మెరుగుపర్చేందుకు ఈ ఏడాది పూర్వ ప్రాథమిక విద్యను అందించనుంది. ఇందుకోసం జిల్లా మహిళ, శిశు సంక్షేమ శాఖ పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది. జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లకు అవసరమైన శిక్షణ పూర్తి చేసింది. ఈ క్రమంలో ప్రీ ప్రైమరీ విద్యను మరింత పటిష్ట పరుస్తూ.. ప్రవేశాల పెంపు లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో 'అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట' అనే ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఈనెల 20 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసి చిన్నారుల ప్రవేశాలను పెంచేందుకు ఐసీడీఎస్ (సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం) ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. బడిబాట కార్యక్రమం పూర్తయిన తర్వాత బస్తీలు, కాలనీలు, వార్డుల్లో బడికి రాకుండా మిగిలిపోయిన చిన్నారులను గుర్తించి వారిని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించనున్నారు. వారికి అక్షరాలు, అంకెలు, పాటలతో కూడిన విద్యను బోధించనున్నారు. ఇందుకోసం జిల్లాలో ఇప్పటికే పూర్వ ప్రాథమిక విద్యపై ఒక్కో బ్యాచ్‌కు మూడు రోజుల పాటు 24 బ్యాచ్‌ల్లో 801 మంది ఉపాధ్యాయులకు ట్రైనింగ్ ఇచ్చారు. పిల్లలకు పుస్తకాలతో పాటు యూనిఫాంలు అందించనున్నారు.

షెడ్యూల్ ఇలా...

అమ్మమాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఈనెల 15, 16 తేదీల్లో అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు, బాలికలు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, పాఠశాలల ఉపాధ్యాయులు, యువకులు, ఎన్జీవోలు, తల్లిదండ్రుల సాయంతో బస్తీలు, వార్డుల్లో ర్యాలీలు నిర్వహించి చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలని కోరనున్నారు. అదేవిధంగా పాఠశాల, కళాశాల విద్యకు దూరంగా ఉన్న బాలికలను గుర్తిస్తారు. స్థానిక ప్రజాప్రతి నిధులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తారు. 18న బస్తీలు, కాలనీల్లో ఇంటింటికీ తిరిగి రెండున్నరేండ్ల వయసు చిన్నారులను గుర్తిస్తారు. అంగన్‌వాడీలో చిన్నారుల వివరాలు నమోదు చేయడం, బోధనా పద్ధతుల గురించి సిబ్బంది చిన్నారులకు తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి ప్రీ అండ్ ప్రైమరీ విద్య గురించి వివరించి చైతన్యపరుస్తారు. అయిదేండ్లు పూర్తయిన పిల్లలకు అంగన్‌వాడీ నుంచి ప్రీ స్కూల్ ధ్రువపత్రాన్ని అందజేయనున్నారు. 19న అంగన్‌వాడీ కేంద్రాల్లో స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఇందులో భాగంగా మొక్కలు నాటడం, కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు, చిన్నారులకు మరుగుదొడ్ల సదుపాయం కల్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 20న ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ డెవలప్‌మెంట్ డే. ఆరోజు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం చేస్తారు. చిన్నారుల తల్లిదండ్రులు, బంధువులు, తాత, నానమ్మ, అమ్మమ్మలను అంగన్‌వాడీ కేంద్రాలకు ముఖ్య అతిథులుగా ఆహ్వానించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఆట వస్తువులను ప్రదర్శిస్తారు. హైదరాబాద్ జిల్లాలో మొత్తం అయిదు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉండగా.. ఇందులో చార్మినార్, గోల్కొండ, ఖైరతాబాద్, నాంపల్లి, సికింద్రాబాద్‌లో ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 970 అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం వీటిల్లో గర్భిణీ, బాలింతలు 10,670 మంది.. 7 నెలల నుంచి మూడేండ్ల వయసు పిల్లలు 55,449 మంది, మూడు నుంచి ఆరేండ్ల వయసు చిన్నారులు 12,550 మంది ఉండగా.. వారికి విద్యతో పాటు ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తోంది.

అక్షరాలు, అంకెలు, ఆటపాటలతో కూడిన విద్య బోధన



చిన్నారులపై ఒత్తిడి లేకుండా అక్షరాలు, అంకెలు, ఆట, పాటలతో కూడిన విద్యా బోధన అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తాం. వారిలోని నైపుణ్యాలు వెలికి తీసి భవితకు భరోసా కల్పిస్తాం. బడిబాట తర్వాత బస్తీలు, కాలనీలు, వార్డుల్లో బడికి రాకుండా మిగిలిపోయిన చిన్నారులను గుర్తించి వారిని అంగన్‌వాడీ కేంద్రా ల్లో చేర్పిస్తాం. అమ్మ మాట- అంగన్‌వాడీ బాట కార్యక్ర మంలో భాగంగా కేంద్రాల ప్రాముఖ్యత తెలిసేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తాం. ఈసారి ప్రవేశాలు పెరిగేలా చర్యలు తీసుకుంటాం.

అక్కేశ్వర్ రావు, సంక్షేమాధికారి, హైదరాబాద్ జిల్లా

నిరుద్యోగుల సమస్యలపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి

● బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్.కృష్ణయ్య



నవతెలంగాణ-ముషీరాబాద్

నిరుద్యోగుల సమస్యలపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం విద్యానగర్ బీసీ భవన్ లో నిరుద్యోగ జేఏసీ చైర్మెన్ నీలా వెంకటేష్ ఆధ్వర్యంలో నిరుద్యోగుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీ ఆర్. కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ నిరుద్యోగులు ముఖ్యంగా నాలుగు డిమాండ్లను కోరుతున్నారు. న్యాయమైన వాటిపై ప్రత్యేక చర్చ జరపాలన్నారు. గ్రూప్ వన్ మెయిన్స్ పరీక్షలకు 1:100 కోరుతున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు అన్యాయం జరిగిందని దీనిపై చర్చించాలన్నారు. గ్రూప్ వన్ లో 563 నుంచి 1600 కు పోస్టులను పెంచాలని గ్రూప్-2లో 780 నుంచి 2000 పోస్టులకు పెంచాలని గ్రూప్-3లో 1100 నుంచి 3,000 కు పెంచాలని కోరుతున్నామని తెలిపారు. టీచర్ పోస్టులు 11 వేల నుంచి 25 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ రెండు నెలల వాయిదా వేయాలన్నారు. నిరుద్యోగులైన న్యాయమైన డిమాండ్‌లని వాటి పరిష్కారానికి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి ప్రత్యేక చర్చ జరిపి పరిష్కరించాలని లేని పక్షంలో నిరుద్యోగులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు వేముల రామకృష్ణ, గోరేగే మల్లేష్, మోదీ రాందేవ్, మధుసూదన్ రావు, శివకృష్ణ, వీరన్న, మణికంత, గోరేగే మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేటకు చెందిన సీనియర్ న్యాయవాది, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముకుంద్ రెడ్డి తల్లి దివంగత నీలమ్మ సంస్మరణ కార్యక్రమం మంగళవారం అంబర్‌పేట ఎస్కేజీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ హాజరై... నీలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.
నవతెలంగాణ,అంబర్‌పేట



కార్పొరేట్‌కు దీటుగా పేద రోగులకు వైద్య సేవలు..

● కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.అరుణ



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

తెలంగాణ రాష్ట్రంలోని ఏకైక ప్రభుత్వ ఉస్మానియా దంత వైద్యశాలలో కార్పొరేట్‌కు ధీటుగా పేద రోగులక నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామని ఉస్మానియా దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అరుణ అన్నారు. ఇటీవలే రూ.85 లక్షల వ్యయంతో అత్యాధుని కమైన ఎక్స్ రే యంత్రాన్ని రోగుల సౌలభ్యం కోసం అందుబాటులోకి తీసుకువచ్చామని వివరించారు. తాను ఇదే కళాశాలలో బీడీఎస్ వైద్య విద్యార్థినని, నిరంతర కృషితో అత్యున్నతమైన ప్రిన్సిపాల్ స్థాయిలో ఎదిగానని, దంతవైద్య విద్యార్థుల సమనస్యల పరిష్కరంతో పాటు, సిబ్బంది సమస్యల సత్వర పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రిన్సిపాల్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించి రెండున్నళ్లు పూర్తి అయిన సంద ర్భంగా ఆమె మంగ ళవారం మీడియాతో మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు, కాలిన గాయాలు, వృద్ధాప్యం, అధిక రక్తపో టు, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే రోగులకు అమర్చే కృత్రిమ దంతాలు (సిరామిక్ ల్యాబ్) అందుబాటులోకి వచ్చిందని వెల్లడించారు. టెక్నీషన్ల కొరత కారణంగా ఆ సర్వీ సుల్ని పూర్తి స్థాయిలో వినియోగిం చలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం గా చేశారు. ప్రతి రోజూ సుమారు 600 అవుట్ పేషం ట్ రోగులు వైద్య చికిత్సల నిమిత్తం ఇక్కడికి వస్తుంటారని, స్థలాభారం వల్ల ఓపీ, ఫార్మసీ విభాగాలను సమీప కేంద్రాల కు తరలించామన్నారు. ఆస్పత్రి భవనం నిర్మించి నప్పుడు ఏర్పాటు చేసి రెండు లిఫ్టుల్లో ఒకటి పురాతన మైంది కాగా, మరొకటి తరచూ మరమ్మత్తులకు మొరాయి స్తుండడతంతో రోగులు అందుల్లో ఇరుక్కునే ప్రమాదం పొంచి ఉండడంతో వాటిని వాడుకల్లోంచి నిషేదించామ న్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సిబ్బంది హాజరును బయోమెట్రిక్ పద్ధతిలో ఖచ్చితమైన నిబంధన లు పాటిం చమని ఆదేశాలు జారీ చేయడంతో వైద్యులు, సిబ్బంది తనపై కక్ష్యతో నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని వాటిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

డంపింగ్ యార్డ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● సీఐటీయు జెండా ఆవిష్కరణలో మేడ్చల్ జిల్లా అధ్యక్షులు అశోక్



నవతెలంగాణ-ధూల్‌పేట్

డంపింగ్ యార్డ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయు మేడ్చల్ జిల్లా అధ్యక్షులు అశోక్ డిమాండ్ చేశారు. శివాజీ బ్రిడ్జి ఇమ్లిబన్ పార్క్ హైటీటీ డంపింగ్ యార్డ్ వద్ద సీఐటీయు సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్మికులతో ఏర్పాటు చేసిన జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని సౌత్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం. మీనా శ్రావణ్ కుమార్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డంపింగ్ యార్డ్ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగు ణంగా కార్మికులకు వేతనాలు పెంచాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. కార్మికులపై శ్రమదోపిడి విపరీతంగా పెరుగుతున్నదని, శ్రమకు దగ్గ ఫలితం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు న్నారన్నారు. ఈ మురికి, దుర్వాసన మధ్య పని చేస్తున్న కార్మికులందరికీ ఆరోగ్య సమస్యలు విపరీతంగా పెరుగుతున్న పరిస్థితులు ఉన్నాయన్నారు. యాజమాన్యం యూనియన్ ఉండకూడదు.. కార్మికులను విచ్ఛిన్నం చేయాలని, అగ్రిమెంటుకు వెళ్లకూడదని వీరి పట్ల కక్ష పూరితగా వ్యవహరిస్తున్న పరిస్థితులకు పూనుకోవడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. యజ మాన్యం వీరి సమస్యలను తక్షణ మే పరిష్కరించి వేత నాలు పెంచకపోతే, భవిష్యత్తులో సీఐటీయు ఎర్రజెండా ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు రుద్ర కుమార్, డంపింగ్ యార్డ్ యూనియన్ కార్యదర్శి రమేష్, సీఐటీయు సీనియర్ నాయకులు విట్టల్, ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు.

రాంకి సంస్థలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ధూల్‌పేట్

రాంకి సంస్థలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయు జిల్లా అధ్యక్ష, కార్యదర్శి మీనా, శ్రావణ్ కుమార్, డంపింగ్ యార్డ్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శి అశోక్, రమేష్‌లు డిమాండ్ చేశారు. సీఐటీయు సౌత్ జిల్లా కమిటీ అధ్వర్యంలో చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని బండ్లగూడ డంపింగ్ యార్డ్ వద్ద నూతనంగా సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులతో పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26వేలు పెంచాలన్నారు. రాంకి లో ఆఫీసర్ల గ్రేడ్‌లో పని చేస్తున్న వారు కార్మికులపై వేధింపులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పని చేస్తున్న కార్మికులపై వేధింపులు అపాలన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి వేధింపులకు గురి చేస్తే వారు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సంస్థ యాజమాన్యం వెంటనే స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు విఠల్, కిషన్, హనుమ, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

బహుముఖీన సాహితీవేత్త అమ్మంగి..

● మగ్దూం జాతీయ పురస్కార ప్రదాన సభలో డా.ముదిగంటి సుజాతా రెడ్డి



నవతెలంగాణ-ధూల్‌పేట్

ఆధునిక తెలుగు సాహిత్యంలో కవిగా, విమర్శకుడిగా, అనువాదకులుగా విశేషమైన సేవలందించిన డాక్టర్. అమ్మంగి వేణుగోపాల్ బహుముఖీన సాహితీవేత్త అని ప్రముఖ రచయిత్రి డాక్టర్.ముదిగంటి సుజాతా రెడ్డి అన్నారు. సిటీ కాలేజీ మగ్దూం మొహియుద్దీన్ జాతీయ పురస్కార ప్రదాన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. మగ్దూం మొహియుద్దీన్, అమ్మంగి వేణుగోపాల్‌కు అనేక విషయాలలో సారూప్యతలున్నాయని, వారిని ఈ అవార్డుకు ఎంపిక చేసి సత్కరించటం అత్యంత సముచితమన్నారు. మగ్దూం, గోపీ చంద్‌ల జీవితం, సాహిత్య వ్యక్తిత్వాలను విశ్లేషిస్తూ అమ్మంగి రాసిన రచనలు కేంద్ర సాహిత్య అకాడెమీ ప్రచురించటం గొప్ప విషయమని కొనియాడారు. సిటీ కాలేజీ పూర్వ అధ్యాపకులైన మగ్దూం పేరుతో జాతీయ పురస్కారాన్ని ఉత్తమ సాహితీ వేత్తలకు 2019 నుండి ప్రదానం చేస్తున్నారు. ఈ అవార్డు కమిటీ ఆధ్వర్యంలో 2024 సంవత్సరానికి డాక్టర్.అమ్మంగి వేణుగోపాల్‌కు సుజాతరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ అవార్డు ప్రదానం చేశారు. ఈ అవార్డుతో నగదు బహుమతి, జ్ఞాపికను అందజేసి వేణుగోపాల్‌ను ఘనంగా సత్కరించారు. సభకు అధ్యక్షత వహించిన బాల భాస్కర్ మాట్లాడుతూ.. మగ్దూం సాహిత్య వ్యక్తిత్వాన్ని, ఉద్యమ కృషిని, అధ్యాపకుడిగా మగ్దూం ప్రబోధించిన జ్ఞానతత్వాన్ని ఈ తరానికి అందజేయాలని అతని పేరిట ప్రతి ఏడాది ఈ జాతీయ పురస్కారం అందిస్తున్నామని తెలిపారు. ప్రముఖ కవి యాకూబ్ మాట్లాడుతూ.. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సౌభ్రాతృత్వం గురించి మగ్దూం చూపిన బాటలో ఇవ్వాళ అందరం నడవాల్సిన అవసరం ఉందన్నారు. పురస్కారాన్ని అందిస్తు న్న నిర్వాహకులు, అవార్డు గ్రహీతలు, సిటీ కళాశాల విద్యార్థులు మగ్దూం తాత్విక వారసత్వాన్ని కొనసాగించాల న్నారు. రాయారావు సూర్యప్రకాశ రావు మాట్లాడుతూ.. ఆరు దశాబ్దాల సాహిత్య జీవన యానాంలో అమ్మంగి వేణుగోపాల్ స్ఫూర్తిదాయకమైన విలువైన రచనలు అందించారని అన్నారు. ప్రారంభంలో పద్య కవిత్వం రాసిన అమ్మంగి గంధం చెట్టు, ముఖాముఖీ, పచ్చబొట్టు పటాన్ చెరువు లాంటి కవితా సంపుటులు వెలువరించారన్నారు. ఈ కార్యక్రమాన్ని అవార్డు కమిటీ కన్వీనర్ డాక్టర్.విప్లవ్ దత్ శుక్లా, సభ్యులు డాక్టర్.యాదయ్య, డాక్టర్.కోయి కోటేశ్వర రావులు సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో సుప్రసిద్ధ కవి, విమర్శకులు డాక్టర్.ఏనుగు నరసింహా రెడ్డి, ఉస్మానియా విశ్వ విద్యాలయం విశ్రాంత ఆచార్యులు లక్ష్మీనారాయణ, కందుకూరి శ్రీరాములు, జలంధర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమస్యలకు నిలయంగా సాధన కాలనీ



నవతెలంగాణ-పెద్దఅంబర్‌పేట్

పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీలోని పసుమాముల గ్రామం, సాధన కాలనీలో సిమెంటు రోడ్డు లేక వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడినప్పుడల్లా రోడ్డు బురద మయంగా మారుతుందని స్థానికులు వాపోతున్నారు. దీంతో పాటు డ్రైనేజీ లేకపోవడం వలన మురుగు నీరు కూడా రోడ్డుపై ప్రవహిస్తుంది. ఈ విషయమై అధికారులను, ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని కాలనీవాసులు వాపోతున్నారు.

జయమ్మకు మేయర్ నివాళి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అల్మాస్‌గూడ పరిధిలో ఉన్న జయశంకర్ కాలనీకి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు బోయపల్లి జయమ్మ అనారోగ్యంతో మరణించారు. ఈ మేరకు మంగళవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి మృతురాలి నివాసానికి వెళ్లి ఆమె పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తర్వాత ఆమె కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, నవారు మల్లారెడ్డి, దిండు శ్రీనివాస్ గౌడ్, జాజిర్ల తిరుమలేష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి'



నవతెలంగాణ-బడంగ్‌పేట్

బీటీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధి బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బడంగ్‌పేట్ నుండి రాజీవ్ గృహ కల్ప వరకు మారుతీ నగర్ కాలనీలో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్, ఫ్లోర్ లీడర్ సూర్ణగంటి అర్జున్‌తో కలిసి మంగళ వారం మేయర్ పరిశీలించారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ బీటీ రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయక త్వంలో పేద ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. ఇప్పటికే మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్ రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, ఏఈ వినీల్ గౌడ్, నాయకులు రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డి, గట్టు బాలకృష్ణ, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



నవతెలంగాణ - హస్తినాపురం

హస్తినాపురం డివిజన్ పరిధిలోని పోచమ్మ గడ్డ వద్ద సీఆర్ఎంపీ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్ బానోత్ సుజాతా నాయక్ మంగళవారం జీహెచ్ఎంసీ ఏఈ నాయక్ హేమ్ నాయక్ కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో స్థానికంగా నివసించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోచమ్మ గడ్డలో సీఆర్ఎంపీ నిధులు రూ.15 లక్షలతో చేపడుతున్న నిర్మాణ పనులను పారదర్శకంగా చేపట్టాలని అన్నారు. వారి వెంట స్థానిక నాయకులు గోపిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో రెండో రోజు కొనసాగుతున్న దీక్ష



నవతెలంగాణ-హయత్ నగర్

మధ్యాహ్న భోజనం పథకాన్ని అక్షయపాత్ర స్వచ్ఛంద సంస్థకు ఇవ్వొద్దని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో హయత్ నగర్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం ఎదుట చేపట్టిన దీక్ష మంగళవారం నాటికి రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సీఐటీయూ రంగారెడ్డి జిల్లా నాయకులు ఏర్పుల నరసింహ మాట్లాడుతూ...ఈ పథకాన్ని తీసుకొచ్చినప్పుడు వంట చేసే వాళ్ళకి ఎటువంటి బడ్జెట్, జీతం లేకుండా స్కూల్ పిల్లలకు వండి పెట్టాలని అన్నప్పుడు గ్రామాలలో డ్వాక్రా గ్రూపుల నుండి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఎటువంటి లాభాన్ని ఆశించకుండా వండి పెడతామని ఒప్పుకొని దాదాపు 23 సంవత్సరాలుగా వంట చేసి పెడుతున్న వారిని.. ఇప్పటి ప్రభుత్వం తొలగించి, స్వచ్ఛంద సంస్థ అయిన అక్షయ పాత్రకు ఇవ్వాలని కుట్ర చేస్తుందని ఆరోపించారు. కార్మికులకు కాకుండా స్వచ్ఛంద సంస్థలకు ఇస్తే ఊరుకునే లేదని, ఎంతటికైనా తెగించి పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నవనీత, మంజుల, స్వరూప, లక్ష్మమ్మ, రమాదేవి, రంగమ్మ, నిర్మలమ్మ, రాజమణి, రాములమ్మ, వెంకటమ్మ, మంగమ్మ, వనజ పాల్గొన్నారు.



నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గ పరిధి బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ నాదర్‌గుల్‌లోని 9వ డివిజన్‌లో అమ్మ మాట - అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి హాజరై చిన్నారులకు పౌష్టిక ఆహారం అందజేశారు. మేయర్ వెంట కార్పొరేటర్లు నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్, తోట శ్రీధర్ రెడ్డి, ప్రోటోకాల్ కార్యదర్శి బంగారి బాబు, నాయకులు సుబాన్ యాదవ్, బంగారి అశోక్, బంగారి మురళీ మోహన్, అంగన్ వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్లలో పార్కింగ్ సమస్య

- కొలిక్కి రాని హయత్ నగర్, ఎల్బీనగర్ స్టేషన్ల మార్పు

నవతెలంగాణ-హయత్ నగర్

జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఎల్బీనగర్, హయత్‌నగర్ పోలీస్ స్టేషన్లు విస్తరణలో వాటి పరిధిని కోల్పోతున్నాయి. దీంతో గతంలో హయత్ నగర్ పోలీస్ స్టేషన్ విజయవాడ జాతీయ రహదారిపై ఉన్నందున దానిని మార్చి హయత్ నగర్ మండల ఆవరణలో పాత ప్రభుత్వ కార్యాలయాన్ని తరలించే ప్రయత్నాలు చేయగా... అనివార్య కారణాల వలన జిల్లా కలెక్టర్ నుండి ఆదేశాలు రాకపోవడంతో ఆగిపోయింది. ఇక ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ కూడా రోడ్డు విస్తరణ ఉండగా పోలీసుల విజ్ఞప్తి మేరకు ఆగిపోయింది. అందుకు గల స్థలాన్ని సరూర్ నగర్ పరిధిలోని సివిల్ సప్లై గోదాంలోకి మార్చాలని చూడగా.. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నుండి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో అది కూడా ఆగిపోయింది. దీంతో ఈ రెండు స్టేషన్‌లలో ఫిర్యాదు దారులకు వాహనాల పార్కింగ్ పెద్ద సమస్యగా మారిందని చెప్పవచ్చు. పార్కింగ్ విషయంలో పోలీసులకు, ఫిర్యాదు దారులకు ఘర్షణలు జరిగిన ఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అన్నింటికి అనువుగా ఉండే స్థలంలో మార్చాలని కోరుతున్నారు.



రేషన్ కార్డుతో సంబంధం లేకుండా రుణమాఫీ చేయాలి

కొలన్ శంకర్ రెడ్డి

నవతెలంగాణ-బడంగ్ పేట్

గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్ రెడ్డి వెంటనే అమలు చేయాలని, రేషన్ కార్డుతో సంబంధం లేకుండా రైతులకు రూ.2లక్షల రుణమాఫీ అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు కొలన్ శంకర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బడంగ్‌పేట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత.. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని



మండిపడ్డారు. రేషన్ కార్డు ఉన్న వారికే రుణమాఫీ అమలు చేస్తామని చెప్పడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి నేటికీ 7నెలలు గడుస్తున్న ఇప్పటికీ ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోయిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రెండు నాలుకల ధోరణి అవలంబిస్తున్నారని మండిపడ్డారు. రైతులకు అండగా ఉండాల్సిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క రైతు రుణమాఫీ కోసం జీవోను విడుదల చేసి రేషన్ కార్డు ఉన్న వారికే అమలు చేస్తామని, వ్యవసాయ శాఖ మంత్రి ఒక రకంగా మాట్లాడడం ఏమిటని ప్రశ్నించారు. రైతుల రుణాలను రీ షెడ్యూల్ చేయాలని, రీ షెడ్యూల్ చేయకుండా రుణమాఫీ అమలు చేయమని చెప్పడం అవివేకమన్నారు. రైతులకు రుణమాఫీ అమలు చేయటంతో పాటు కౌలు రైతుల సంగతి ఏమిటని ప్రశ్నించారు .రైతులందరికీ రుణమాఫీ అమలు చేయని పక్షంలో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు రామిడి మహేందర్ రెడ్డి, నాగ భూషణ్, అనిల్ కుమార్, రవీందర్ గౌడ్, ఇబ్రహీం, బాల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మార్నింగ్ వాక్‌లో కాలనీ వాసులతో ముచ్చటించిన కళ్లెం



నవతెలంగాణ-వనస్థలిపురం

మార్నింగ్ వాక్‌లో భాగంగా హయత్ నగర్ డివిజన్ రఘవేంద్ర కాలనీలో కమ్యూనిటీ హాల్ వద్ద కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి మంగళవారం కాలనీ వాసులతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ వాతావరణం మార్పులపై, కాలనీలోని సమస్యల పై చర్చించినట్టు తెలిపారు. కాలనీలలోని పలు విధుల్లో భూగర్భ డ్రైనేజ్ సమస్యను స్థానికులు తన దృష్టికి తీసుకొచ్చినట్టు తెలిపారు. త్వరలోనే భూగర్భ డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి సంఘీ అశోక్, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు రవీందర్, ఎల్లారెడ్డి, చిన్నా మాలరెడ్డి, రామ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

సోదర భావంతో మొహర్రం జరుపుకోవాలి

చిలుక ఉపేందర్ రెడ్డి



నవతెలంగాణ - చైతన్యపురి

సోదర భావంతో మొహర్రం పండుగను జరుపుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ మొహర్రం పండుగ త్యాగానికి, స్ఫూర్తికి ప్రతీక అని అన్నారు. విశ్వాసం, నమ్మకం కోసం మహమ్మద్ ప్రవక్త మనవడు హజరత్ ఇమామ్ హుస్సేన్ చేసిన బలిదానాన్ని గుర్తు చేసుకోవడమే మొహర్రం పండుగ ప్రత్యేకత అని వివరించారు. మానవజాతి త్యాగం ఎంతో గొప్పదని మంచితనం, త్యాగాన్ని గుర్తు చేసుకోవడమే ఈ పండుగ ప్రత్యేకత అని పేర్కొన్నారు. అనంతరం ముస్లింలకు మోహరం పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

రోడ్డు పనులను పరిశీలించిన లచ్చిరెడ్డి



నవతెలంగాణ - వనస్థలిపురం

బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఆంధ్రకేసరి నగర్‌లో నూతనంగా చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అంతేకాదు ఎత్తు పల్లాలను సరిచూసుకొని రోడ్డు వేయాలని సంబంధిత అధికారులను కోరారు. కార్పొరేటర్ వెంట ఆంధ్ర కసరి నగర్ కాలనీ అధ్యక్షులు రవిశంకర్, శ్రీనివాసులు, వెంకటేష్ యాదవ్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



దయాకర్‌ను కలసిన కాంగ్రెస్ కార్యకర్తలు

నవతెలంగాణ-హయత్ నగర్

తెలంగాణ టీపీసీసీ జనరల్ సెక్రటరీ అద్దంకి దయాకర్‌ను మన్సూరాబాద్‌కు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు..ఫలక్‌నుమా వద్ద ఉన్న శ్రీ శ్రీ శ్రీ కట్ట మైసమ్మ మహంకాళి మాత టెంపుల్ ఎల్లమ్మ దేవస్థానం భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని రైల్ వే స్టేషన్‌కు ఆనుకుని ఉన్న గుడి స్థలాన్ని తమకే కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి బొల్లు పవన్, గుంటి అరుణ్, శ్రవణ్ కుమార్, చిప్పలపల్లి పవన్ తదితరులు పాల్గొన్నారు.

నేడే మొహర్రం

పోలీసుల ప్రత్యేక నిఘా


ఫైల్ ఫోటో

నవతెలంగాణ-సిటీబ్యూరో

నేడు మొహర్రం పర్వదినోత్సవం నేపథ్యంలో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. మొహర్రం ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసే విధంగా పోలీస్ అధికారులు అన్ని చర్యలు పూర్తి చేశారు. ముఖ్యంగా బీబీకా ఆలం ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఇప్పటికే నగర సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన సాలార్‌జంగ్ మ్యూజియంలో పీస్‌కమిటీ సభ్యులు, ముస్లిం మతపెద్దలు, షియా కమ్యూనిటీ సభ్యులతోపాటు పోలీసులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కో-ఆర్డినేషన్ సమావేశం జరిగిన విషయం తెలిసిందే. ఈ సమావేశంలో ప్రశాంత వాతావరణంలో మొహర్రం, బీబీకా ఆలం ఊరేగింపు పూర్తి చేయాలని, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ఈ క్రమంలో పాతబస్తీతోపాటు నగరంలో పలు ప్రాంతాల్లో భద్రతను మరింత కట్టుద్టిం చేశారు. ఏనుగులతో ఊరేగింపు ఉండడంతో గత అనుభవాలను దృష్టి పెట్టుకుని అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వివిధ ప్రాంతాలల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. పలు ప్రాంతాలల్లో ట్రాఫిక్ మళ్లింపులను చేశారు. టాస్క్‌ఫోర్సుతోపాటు సివిల్, క్రైమ్ పోలీసులు, షీ టీమ్స్ బృందాలను రంగంలోకి దించారు. అన్ని ప్రదేశాలల్లో పోలీసులు పెట్రోలింగ్‌ను పెంచారు.

ప్రశాతం వాతావరణంలో పూర్తి చేయాలి : సీపీ

400 ఏళ్లకుపైగా సంప్రదాయానికి గుర్తుగా దబీర్‌పూరా బీబీ-కా-ఆలం నుంచి ఈ కార్యక్రమం ప్రారంభించగా, ఈ ఊరేగింపులో వేలాది మంది పాల్గొటారని నగర సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి గుర్తు చేశారు. ఎక్కడకూడా ట్రాఫిక్‌కు ఇబ్బందులు కల్గకుండా చార్మినార్, గుల్జార్ హౌస్, పురాణి హావేల్, చాదార్‌ఘాట్ తదితర ప్రాంతాలల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించామని తెలిపారు. ప్రశాతం వాతావరణంలో మొహర్రం పర్వదినోత్సవాన్ని పూర్తి చేయాలని వారిని కోరారు.

ప్రజాస్వామ్య విలువలు లేకుండా పాలన చేస్తున్న కాంగ్రెస్

- ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ



నవతెలంగాణ - చైతన్యపురి

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రజాస్వామ్య విలువలు అడుగంటి పోతున్నాయని, విలువ లేకుండా పాలన చేస్తున్నారని మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద శర్మ అన్నారు. ఖిల్లా మైసమ్మ దేవాలయం ఆవరణలో బోనాల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రోటోకాల్ పాటించకుండా చెక్కులను పంపిణీ చేయడాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం గ్రీనీహిల్స్ కాలనీలోని కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, మూడుసార్లు మంత్రిగా సేవలందించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డిని కాంగ్రెస్ నాయకులు అవమానించారని, ప్రజాస్వామ్యంలో ఓటమిపాలైన కిచ్చేన్నగారి లక్ష్మారెడ్డిని ప్రోటోకాల్ లేకున్నా ప్రభుత్వ కార్యక్రమాల్లో స్టేజి పైకి పిలిచి చెక్కులు పంపిణీ చేయించడం సిగ్గుచేటని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోటోకాల్ పాటించకుండా ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని, ప్రజాపాలనలో కాంగ్రెస్ నాయకులు తెచ్చిన మార్పు ఇదేనా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో నిత్యం అత్యాచారాలు, దోపిడీలు జరుగుతుంటే ఈ ప్రభుత్వం కళ్లు మూసుకొని పరిపాలన చేస్తుందని విమర్శించారు. నిరుద్యోగులంతా రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేస్తుంటే ప్రభుత్వం వారిని అనగదొక్కేందుకు ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా ఒక్క హామీని కూడా అమలు చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. పదేండ్ల పాలనలో కేసీఆర్ తెలంగాణలో సంపద సృష్టించి ..దేశంలోని నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దారని గుర్తుచేశారు. కాంగ్రెస్ నాయకులు వెంటనే ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఉపాధ్యక్షులు లక్ష్మీ నరసింహా రెడ్డి, బడంగ్‌పేట కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ సురకంటి అర్జున్, బడంగ్‌పేట కార్పొరేషన్ అధ్యక్షులు రామిడి రామిరెడ్డి, నియోజకవర్గ ఉద్యమకారుల కన్వీనర్ న్యాల కొండ శ్రీనివాస్ రెడ్డి, బడంగ్ పేట కార్పొరేటర్ ఏనుగు రామ్ రెడ్డి, నాయకులు ఆకుల అరవింద్, కొండ్ర శ్రీనివాస్, పెంబర్తి శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

- మున్సిపల్ కమిషనర్ వాణిరెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

వర్షాకాల దృష్ట్యా ప్రజలు తమ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ వాణిరెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న న్యూ బాబానగర్, ఒకటో నెంబర్ గల్లీలో డెంగ్యూ పాజిటివ్ వచ్చిందనే సమాచారం రావడంతో మున్సిపల్ కమిషనర్ వాణిరెడ్డి వారి ఇంటిని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారిని పరామర్శించారు. తర్వాత వారి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ వారు వాడే నీటిలో లార్వా యొక్క మూలాలు ఉన్నట్టు గమనించినట్టు తెలిపారు. ఈ విషయంపై ఇంటిలోని వారికి, చుట్టు పక్కల వారికి డెంగ్యూ పైన అవగాహన కల్పించినట్టు చెప్పారు. కాలనీల్లో అంతర్గత రోడ్లుకు ఇరువైపుల చెత్త చెదారం లేకుండా, డ్రైనేజీలను శుభ్రం చేయడం, రోడ్లపై వర్షం నీరు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి సూచించారు. డ్రైనేజీలను ప్రతి రోజూ శుభ్రం చేయాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని అన్నారు. ఈగలు, దోమలు నిలువ ఉండకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని హెల్త్ అసిస్టెంట్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సిబ్బంది, వార్డ్ కౌన్సిలర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బోనాల చెక్కులు పంపిణీ

నవతెలంగాణ - వనస్థలిపురం

బోనాల పండుగను పురస్కరించుకొని ఎల్బీనగర్ నియోజకవర్గం వనస్థలిపురం డివిజన్‌కు సంబంధించిన చెక్కులను మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి.చిన్నారెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోడ్స్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మాల్ రెడ్డి రాంరెడ్డి, వనస్థలిపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుట్ల నర్సింహా యాదవ్, లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్, డివిజన్ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.





నవతెలంగాణ -నాగోల్

భవిష్యత్ తరాలకు మన సంస్కృతి, సంప్రదాయాలను చాటి చెప్పేలా బోనాల పండుగను నిర్వహించుకోవాలని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేంద్రనాథ్ యాదవ్ అన్నారు. ఆషాడమాస బోనాల దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మంగళవారం ఎల్బీనగర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో బోనాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనాల పండుగ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ప్రజలను కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
14
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
బుధవారం | జులై 17, 2024 | www.navatelangana.com

సీఐ అంజయ్యకు కాంగ్రెస్ నేతల సన్మానం



నవతెలంగాణ-కాప్రా

కుషాయిగూడ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.అంజయ్యను మంగళవారం కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలబొకే అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు విఠల్ నాయక్, జి. సత్యనారాయణ, పార్వతి, మధుమతి, అండాలు, లింగస్వామి, తన్నీరు శ్రీహరి, జి. రామ్ చందర్, బి. రాకేష్, జి. రాజు, జి. శ్రీకాంత్, కృష్ణ, డి. జశ్వంత్, జె. గౌతమ్, జి. అరుణ్ కిరణ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ చైర్మెన్ రియాజ్‌ను కలిసిన తుంగతుర్తి రవి



నవతెలంగాణ-బోడుప్పల్

తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ చైర్మెన్ రియాజ్‌ను ఆయన కార్యాలయంలో పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. "గ్రంథాలయాలు జ్ఞానభాండారాలు అని ఇవి సమాజానికి ఒక పెద్ద ఆస్తి అని అందరికీ తెలుసన్నారు. పీర్జాదిగూడ ప్రాంతంలో అన్ని వసతులతో కూడిన ఆధునిక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని చైర్మెన్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఓయూ విద్యార్థి నాయకులు వెంకట్ నాయక్ తదితరులు ఉన్నారు.

అధికారం లేకున్నా ప్రజల్లోనే ఉండాలి : కేటీఆర్



నవతెలంగాణ-ఉప్పల్

అధికారం ఉన్నా.. లేకున్నా ప్రజల్లోనే ఉండాలని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. మంగళవారం చిల్కానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. పదవులు ముఖ్యం కాదని, పాలకులు అనునిత్యం ప్రజలతోనే ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. వారి వెంట శ్రీనివాస్ యాదవ్, శ్యామ్ తదితరులున్నారు.

ఘనంగా జోగు శ్రీనివాస్ కురుమ పుట్టిరోజు



నవతెలంగాణ-మల్కాజిగిరి

బీసీ కులాల ఐక్య వేదిక కార్యదర్శి జోగు శ్రీనివాస్ జన్మదిన వేడుకలను అధ్యక్షులు కామల్ల ఐలన్న ఆధ్వర్యంలో ఓల్డ్ సఫిల్ గూడ, బీసీ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలన్న మాట్లాడుతూ.. జోగు శ్రీనివాస్ బీసీల అభివృద్ధికి, సంక్షేమం కోసం, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగడానికి తన వంతు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఆయన జన్మదినం జరుపుకోవడం తమ బాధ్యత అని తెలిపారు. ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్న శ్రీనివాస్ మరెన్నో పుట్టిన రోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీసీ కులాల ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శి రొయ్యల కృష్ణమూర్తి, నాయకులు పూలపల్లి సుందర్ యాదవ్, ఉపాధ్యక్షులు జినుకుంట్ల రమేష్ గౌడ్, కరణం గోపి, కార్యదర్శులు చేగూరి రామ్ మోహన్ కురుమ, కాసర్ల నాగరాజ్, పిట్టల భాస్కర్ నేత, పరందాములు కురుమ, జోగు కుమారస్వామి కురుమ, బొల్లు సంపత్ ముదిరాజ్, పేపర్ శ్రీనివాస్, కొండల్ గౌడ్, మక్తాల శంకర్ గౌడ్, కాశినాద్ యాదవ్, సంపత్, సుధాకర్, రమేష్, దశరథ్, లక్ష్మీనారాయణ, చంద్రభూషన్, ఎన్.వెంకటేష్, నర్సింహా చారి, తదితరులు పాల్గొన్నారు.

తోపుడు బండి అందజేసిన కార్పొరేటర్ శాంతి



నవతెలంగాణ-కాప్రా

నగరంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి నాచారం పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న ప్రహరీ గోడ కూలి సుజాతమ్మకు సంబంధించిన తోపుడు బండి పూర్తిగా ధ్వంసం అయ్యింది. దీంతో నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయి జన్‌శేఖర్ సోమవారం సంఘటనా స్థలానికి వెళ్లి బాధితురాలికి నూతన తోపుడు బండి ఇప్పిస్తానని మాట ఇచ్చారు. కార్పొరేటర్ ఇచ్చిన హామీ ప్రకారం మంగళవారం కొత్త తోపుడు బండి అందజేశారు. దీంతో బాధితురాలు కార్పొరేటర్ దంపతులను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సాయి చంద్రశేఖర్, భూపాల్ రెడ్డి, రామకృష్ణ, గద్ద యుగంధర్, రామచందర్, దానం కుమార్, రాజేష్, చిన్న శ్రీనివాస్, పాల్గొన్నారు.

రైల్వే వంతెన పనులు ప్రారంభం: కాంట్రాక్టర్



నవతెలంగాణ-ఘట్కేసర్

ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలోని రైల్వే వంతెన పనులు రెండు రోజుల క్రితం ప్రారంభమయ్యాయని చెప్పినా కొంతమంది రాజకీయ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కాంట్రాక్టర్ సత్తిరెడ్డి తెలిపారు. మంగళవారం కాంట్రాక్టర్ సత్తిరెడ్డి మాట్లాడుతూ.. రైల్వే వంతెన ఆగడానికి కారణం గత ఆరు నెలల నుంచి ఫిల్లర్ డిజైన్ కోసం మ్యాపింగ్ ఆలస్యమైందని తెలిపారు. ఫిల్లర్ డిజైన్ టర్నింగ్ ఉన్నందున దానికోసం తమ వర్కర్లు కలకత్తాలోని హెూల్డింగ్ ఫ్లెక్సీల పనులలో నిమగ్నమై రాలేకపోయారని తెలిపారు. రైల్వే వంతెన పనుల కోసం ఘట్కేసర్ మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్ ఫోన్ చేసి ప్రజలు అవస్థలు పడుతున్నారని, తొందరగా పనులు పూర్తి చేయాలని తనకు చెప్పారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మేడ్చల్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, ఘట్కేసర్ మున్సిపల్ నాయకుల సహకారంతో బ్రిడ్జి పనులు రెండు రోజుల క్రితమే మొదలు పెట్టామని పేర్కొన్నారు.

సీసీ రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్



నవతెలంగాణ-కాప్రా

నాచారం డివిజన్‌లోని కార్తికేయ నగర్ వీధి నెంబర్ 9,10లో వేస్తున్న సీసీ రోడ్డు నిర్మాణం పనులను కార్పొరేటర్ శాంతి సాయి జన్ శేఖర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సాయి జన్ శేఖర్, భూపాల్ రెడ్డి, మహేష్, దానం కుమార్, రాజేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడాలి



నవతెలంగాణ-ఘట్కేసర్

ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని ఘట్కేసర్ మున్సిపల్ ఒకటో వార్డు కౌన్సిలర్ చందుపట్ల వెంకటరెడ్డి అన్నారు. వన మహెూత్సవంలో భాగంగా మంగళవారం ఘట్కేసర్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో 1వ వార్డు ఎన్ఎఫ్‌సి నగర్‌లో కౌన్సిలర్ చందుపట్ల వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో మొక్కలను పంపిణీ చేశారు. ఇంటింటికీ ఐదు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు అభివృద్ధి కమిటీ సభ్యులు, మాజీ ఎంపీటీసీ జంపాల రమేష్, బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి ఇడెం చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు గంధమలా బాబురావు, శ్రీధర్, కిరణ్, కన్యాకుమారి, కాలనీ వాసులు, మున్సిపల్ అధికారులు మారుతీ, శంభు ప్రసాద్ తదితరులున్నారు.

రిటైర్మెంట్ @ 65 ఏండ్లు

- అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు పదవీ విరమణ
- ఈ నెల 1 నుంచి విధులకు రావొద్దని ఆదేశాలు
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ముగ్గురు టీచర్లు, 24 మంది హెల్పర్ల సర్వీస్ పూర్తి

నవతెలంగాణ-సిటీబ్యూరో

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పదవీ విరమణపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చింది. ఈ ఏడాది ఏప్రిల్ 30వ తేదీ నాటికి 65 ఏండ్లు దాటిన వారికి రిటైర్మెంట్ ఇవ్వాలని ఆదేశించింది. నిబంధనలు కఠినత్వం చేస్తూ అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ సంయుక్త సంచాలకులు కేఆర్‌ఎస్ లక్ష్మీదేవి జీఓ జారీ చేశారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా జిల్లా సంక్షేమాధికారులు, సీడీపీఓలు, ప్రాంతీయ సంయుక్త సంచాలకులకు గత నెల 31వ తేదీన ఉత్తర్వులు అందాయి. దీంతో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 65 ఏండ్లు దాటిన టీచర్లు, హెల్పర్ల రిటైర్మెంట్ అమలులోకి వచ్చింది. జిల్లాలో ఈ నెల 1వ తేదీ నుంచి 03 టీచర్లు, 24 మంది హెల్పర్లు విధులకు దూరమయ్యారు.



ముగ్గురు టీచర్లు.. 24 మంది హెల్పర్లు..

అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటైన నాటి నుంచి పనిచేస్తున్న టీచర్లు, ఆయాలకు ఇప్పటి వరకు ఎలాంటి రిటైర్మెంట్ విధానం లేకపోవడంతో వయస్సు పైబడిన వారు సైతం విధుల్లో కొనసాగుతున్నారు. ప్రభుత్వం ఈ ఏడాది పదవీ విరమణ వయసు విధానం అమలులోకి తెచ్చింది. దీంతో వయసు పైబడిన వారికి ఇష్టం లేకపోయినా రిటైర్మెంట్ కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ మేరకు తాజాగా ఈ రిటైర్మెంట్‌తో జిల్లాలో 03 టీచర్లు, 24 మంది ఆయాల పోస్టులు ఖాళీ అయ్యాయి.

రూ.150 గౌరవ వేతనంతో..

అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న టీచర్లు, ఆయాలు చాలా మందికి 40 ఏండ్లకు పైబడి అనుభవం ఉంది. అప్పట్లో కేవలం రూ.150 గౌరవ వేతనంతో విధుల్లో చేరారు. అరకొర జీతాలు, ఎన్నో ఇబ్బందులతో విధులు నిర్వహిస్తున్న టీచర్లకు ప్రస్తుతం రూ.13,650, హెల్పర్లకు రూ.7,800 వేతనం ఇస్తున్నారు.

ఆదేశాలు వచ్చాయి.. అమలు చేస్తున్నాం..

అంగన్‌వాడీ కేంద్రాల్లో 65 ఏండ్లు నిండిన టీచర్లు, ఆయాలకు రిటైర్మెంట్ అమలు చేయాలని ఉన్నతాధికా రుల నుంచి ఆదేశాలు వచ్చాయి. మా దగ్గర ఉన్న వివరాల ప్రకారం ప్రభుత్వానికి నివేదిక అందజేశాం. వారి వయసు ఆధారంగా రిటైర్మెంట్ ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం, మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారుల ఆదేశాలు, గైడ్‌లైన్స్ ప్రకారం అమలు చేస్తాం.

-కృష్ణారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మహిళా, శిశు సంక్షేమాధికారి

వెంటనే జీవో విడుదల చేయాలి



అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు గత ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు, టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్‌పై ప్రభుత్వం వెంటనే జీవో విడుదల చేయాలి. రిటైర్ అయిన టీచర్లు, హెల్పర్లకు పెన్షన్ (జీవో) ఇవ్వాలి. అధికారుల వేధింపులను అరికట్టాలి. ప్రతి నెలా 5వ తేదీలోపు వేతనాలు, స్కూల్ అద్దె చెల్లించాలి. **-ఉన్ని కృష్ణన్, సీఐటీయూ, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోశాధికారి**

'ఒకరి భూమిని మరొకరికి మ్యూటేషన్ చేసిన తహశీల్దార్'



నవతెలంగాణ-మేడ్చల్

ఒకరి భూమిని మరొకరికి మ్యూటేషన్ చేసిన సంఘటన మేడ్చల్ తహశీల్దార్ కార్యాలయంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మేడ్చల్ మండల పరిధిలోని గిర్మాపూర్ గ్రామానికి చెందిన బసురాది బాలయ్యకు గ్రామంలోని సర్వే నంబర్ 41లో 31గుంటల భూమి ఉంది. కాగా అట్టి భూమిలో 16 గుంటలు డాక్యుమెంట్ నంబర్ 3877/1999 ప్రకారం ఇతరులకు విక్రయించారు. మిగిలిన 15గుంటల భూమి బాలయ్య వారసులైన బసురాది వీరేశ్, బసురాది కళావతిలు విరసాత్ కోసం ధరణిలో దరఖాస్తు పెట్టుకోగా 8 గుంటలు వీరాసత్ సమానంగా జరిగింది. మిగితా 7గుంటల భూమి ఆర్ఎస్ఆర్‌లో ఉందని రెవెన్యూ అధికారులు తెలపడంతో మిస్సింగ్ సర్వే నంబర్ డేటా సరిచేయాలని వారు అర్జీ పెట్టుకున్నారు. ఇంతలో అట్టి భూమిని ఇతరుల పేర్లపై రెవెన్యూ అధికారులు ఎంట్రీ చేశారని బాధితులు తెలిపారు. మా భూమి ఇతరుల పేర్లపై ఎలా ఎంట్రీ చేశారని బాధితులు తహశీల్దార్‌ను అడగ్గా ఆ విషయాలన్నీ తమకు తెలియదని ఆమె నిర్లక్ష్యపు సమాధానం చెబుతున్నట్టు బాధితులు కళావతి, వీరేష్ ఆవేదన వెలుబుచ్చారు. మా భూమి మాకు దక్కేలా న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఇందిరా మహిళా శక్తి పథకంతో ఎదగాలి

- నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి



నవతెలంగాణ-కీసర

మహిళలు ఇందిరా మహిళా శక్తి పథకంతో అభివృద్ధి సాధించాలని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు మంజూరు చేయనున్నట్టు పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఆర్పీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఆర్పీలు అందరూ స్వయం సహాయక సంఘాల మహిళలతో గ్రూప్స్‌గా ఏర్పడి క్యాంటీన్స్, స్టిచ్చింగ్ యూనిట్స్, పిండి వంటల తయారీ వంటి యూనిట్స్ ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు. ఈ సమావేశంలో కమిషనర్ రాజేందర్ కుమార్, మేనేజర్ చంద్ర శేఖర్, ఏపీఎం నరసింహ, ఆర్పీలు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న మురుగునీరు



- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మున్సిపల్‌లో పరిధిలోని జాతీయ రహదారి 44 పక్కన సత్యసాయి పెట్రోల్ బంక్ వద్ద మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదని పలువురు వాహనదారులు మండిపడుతున్నారు. గత రెండు రోజులుగా అంతర్గత డ్రయినేజీ నీరు మ్యాన్ హెూల్ నుంచి లీకై జాతీయ రహదారిపై ప్రవహిస్తుంటే అధికారులకు కనిపించడం లేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. అదేవిధంగా మేడ్చల్ నుండి కిష్టాపూర్‌కు వెళ్లే ఆర్ అండ్ బీ దారిలో సైతం రోడ్డుపై నీరు ప్రవహిస్తుండడంతో అటువైపుగా వెళ్లే ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆ దారిలోని ఆర్ అండ్ బీ రోడ్డుకు సైతం సగం మరమ్మతులు చేసి మరో సగం అలాగే వదిలివేయడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు తక్షణమే డ్రయినేజీకి మరమ్మతులు చేపట్టి మురుగునీరు రోడ్డుపై ప్రవహించకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

చిన్నారులు ఆట వస్తువులను వినియోగించుకోవాలి

- నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి



నవతెలంగాణ-కీసర

చిన్నారులు ఆట వస్తువులను వినియోగించుకోవాలని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం నాగారం పురపాలక సంఘం పరిధిలోని బౌద్ధ నగర్ వార్డు నెం.05లో పురపాలక సంఘం సాధారణ నిధులు రూ.5 లక్షలతో నిర్మించిన పార్కు ప్రహరీ గోడ, చిన్న పిల్ల ఆట వస్తువులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీ వాసులు పిల్లలతో గడిపేందుకు ఆట వస్తువులను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జి.రాజేందర్ కుమార్, కౌన్సిలర్స్ లావణ్య శ్రీనివాస్, నాయకులు ,కాలనీ వాసులు పాల్గొన్నారు.

లైంగికదాడి కేసులో ఇద్దరి అరెస్టు



- మరో ఇద్దరి కోసం గాలింపు

నవతెలంగాణ-అల్వాల్

అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన లైంగికదాడి కేసులో ఇద్దరు నిందితులను అల్వాల్ పోలీసులు అరెస్టు చేశారు. మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కుటుంబ కలహాలతో అల్వాల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి ఆటోలో వెళుతున్న మహిళను సాయి కిరణ్ అనే వ్యక్తి ఆటోలో ఎక్కించుకుని బీరు బాటిల్ పగులగొట్టి పదునైన ఆయుధంగా తయారు చేసి ఆటో డ్రైవర్‌ను, బాధిత మహిళను బెదిరించాడు. తను చెప్పినట్టు వినాలని బెదిరించి ఆటోను గోల్నాకలోని శ్మశాన వాటిక సమీపంలోకి తీసుకెళ్లాడు. అక్కడ బాధిత మహిళను బొలెరో వాహనంలోకి తీసుకెళ్లి ఆమెకు బలవంతంగా మద్యం తాగించి, లైంగికదాడి చేసి పరారయ్యాడు. బాధితురాలు 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మంగళవారం సాయికిరణ్‌తో పాటు అతడికి సహకరించిన సలీంను అరెస్టు చేశారు. మరో ఇద్దరికోసం గాలిస్తున్నారు.

పీఎం విశ్వకర్మ పథకాన్ని ఉపయోగించుకోవాలి



నవతెలంగాణ-జవహర్ నగర్

రజకులు పీఎం విశ్వకర్మ పథకాన్ని ఉపయోగించుకోవాలని రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొలిపాక లక్ష్మణ్ రజక, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సాంబరాజులు అన్నారు. జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అంబేద్కర్ నగర్ దోభి ఘాట్ కమ్యూనిటీ హాల్లో మంగళవారం రాష్ట్ర రజక రిజర్వేషన్ సమితి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రజకులు పీఎం విశ్వకర్మ నైపుణ్యంతో నవ నిర్మాణ కల్పన ప్రక్రియలో భాగంగా 18 రకాల సాంప్రదాయ బద్ధమైన చేతి వృత్తుల వారి సంక్షేమం కొరకు దేశవ్యాప్తంగా రజక వృత్తిపై ఆధారపడి బతికే వాళ్ళు ఉన్నారని మోడీ ఈ పథకం ప్రవేశపెట్టరాని తెలిపారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఓరుగంటి రాజ్ కుమార్, జిల్లా యూత్ అధ్యక్షులు కన్నయ్య, దమ్మాయిగూడ మున్సిపల్ అధ్యక్షులు నర్సింహా, శోభన్ బాబు, కాప్రా మండల అధ్యక్షులు వెంకటేష్, జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సాయి, మేడ్చల్ జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి అశోక్ కుమార్, కృష్ణ, అంబేద్కర్ రజక సంఘం సహాయ కార్యదర్శి, దమ్మాయిగూడ మున్సిపల్ ఉపాధ్యక్షులు రాజు ఉన్నారు.

ప్రాథమిక విద్యను అందరికీ అందజేస్తాం

- ఐసీడీఎస్ సూపర్వైజర్ ధనలక్ష్మీ
- రాజీవ్‌గాంధీ నగర్‌లో అమ్మ మాట..అంగన్వాడీ బాట



నవతెలంగాణ-జవహర్‌నగర్

ప్రాథమిక విద్యను అందరికీ అందించేలా చర్యలు తీసుకుంటున్నట్టు ఐసీడీఎస్ సూపర్వైజర్ ధనలక్ష్మీ తెలిపారు. మంగళవారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్ అంగన్వాడీ పాఠశాల టీచర్ మున్నీసా ఆధ్వర్యంలో అమ్మమాట అంగన్వాడీ బాట కార్యక్రమం పిల్లలతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 15వ తేదీ నుంచి 20వ తేదీ వరకు మూడేండ్ల నుంచి ఆరేండ్లలోపు పిల్లలు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మీ పిల్లలను అంగన్వాడీలో చేర్పించి వారి బంగారు భవిష్యత్తుకు పునాదులు వేయాలని నినాదాలు చేశారు. పిల్లలు, వారి తల్లిదండ్రులతో కలిసి ఫ్లగ్ కార్డులతో కాలనీల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లలు, వారి తల్లిదండ్రులు ఉన్నారు.

తైక్వాండో గడ్డం నిర్వాన్‌కు బంగారు పతకం



నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని రాజశేఖర్ కాలనీలో నివాసం ఉంటున్న గడ్డం నిర్వాన్ విస్వ 1 ఓపెన్ నేషనల్ తైక్వాండో చాపియన్ షిప్ పోటీలలో 21 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించాడు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 2వ తరగతి చదువుతున్న నిర్వాన్ బంగారు పతకం సాధించడం పట్ల పాఠశాల యాజమాన్యం, తల్లితండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం కోచ్‌లు పి.భాస్కర్, చిరంజీవిలు మాట్లాడుతూ.. చిన్న వయస్సు నుండే సాధన చేయాడం ద్వారా మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. దీనికి ప్రభుత్వం నుంచి సహకారం కావాలని కోరారు.

లైంగిక దాడికి పాల్పడిన డ్యాన్స్ మాస్టార్‌ను శిక్షించాలి

- కిరణ్ ఇంటర్నేషనల్ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కార్తీక్, సంతోష్



నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్‌లోని కిరణ్ ఇంటర్నేషనల్ పాఠశాలలో విద్యార్థినిపై లైంగిక దాడి చేసిన డ్యాన్స్ మాస్టార్‌ను కఠినంగా శిక్షించాలని, పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కార్తీక్,రాథోడ్ సంతోష్ డిమాండ్ చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. చదువు కోసం పాఠశాలకు పంపిస్తే చదువు చెప్పాల్సిన టీచర్స్ లైంగిక దాడి చేయడం సిగ్గుచేటన్నారు. విద్యార్థిని తల్లిదండ్రులకు న్యాయం చేసి నిందితుడిని కఠినంగా శిక్షించాలన్నారు. అమ్మాయిలపై జరుగుతున్న వేధింపులపై అధికారులు పాఠశాలలను తనిఖీలు నిర్వహించాలని కోరారు. ఒకటో తరగతి చిన్నారిపై లైంగిక దాడి బాధాకరం అన్నారు. దీనికి స్కూల్ యాజమాన్యమే బాధ్యత వహించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పాఠశాలలో పని చేస్తున్న సిబ్బందిపై పర్యవేక్షణ ఉంచాలని తెలిపారు. ఇలాంటి ఘటనలపై ప్రభుత్వం అవగాహన సదస్సు నిర్వహించాలని కోరారు. ప్రత్యేక కమిటీ వేయాలని

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి : కార్పొరేటర్ శ్రీదేవి



నవతెలంగాణ-ఉప్పల్

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని రామంతాపూర్ కార్పొరేటర్ బండారు శ్రీదేవి అన్నారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఉప్పల్ సర్కిల్‌లోని చిల్కానగర్, హబ్సిగూడ, ఉప్పల్, రామంతపూర్ డివిజన్ల ప్రజలకు అవగాహన కల్పించారు. చిల్కానగర్ కమ్యూనిటీ హాల్, హబ్సిగూడ డివిజన్ స్ట్రీట్ నెంబర్ 8 మోర్ సూపర్ మార్కెట్, జేఎస్ఎన్ కాలనీ కమ్యూనిటీ హాల్, రామంతపూర్ డివిజన్‌లోని ఇందిరానగర్ కూడలిలో మలేరియా, డెంగ్యూ, మెదడువాపు వ్యాధులపై అవగాహన కల్పించారు. దోమలతో వచ్చే వ్యాధులను ఉప్పల్ సర్కిల్ ఎంటమాలజీ, శానిటేషన్ విభాగం ఏర్పాటు చేసిన సమావేశానికి కార్పొరేటర్ హాజరై మాట్లాడారు. దోమలు అభివృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అన్ని డివిజన్లలో అవగాహన కల్పిస్తున్నట్టు డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమాలలో శానిటేషన్ డిప్యూటీ ఇంజనీర్ సాలిడ్, వేస్ట్ మేనేజ్మెంట్ చందన, డీపీవో ఉమాదేవి, ఏఈ ఎంటమాలజీ నరేష్ రెడ్డి, సానిటరీ సూపర్వైజర్ రాజేశ్వర్ రెడ్డి, సుదర్శన్, కమ్యూనిటీ ఆర్గనైజర్ శ్రీధర్ రెడ్డి, మహిళా విభాగం ఆర్పీలు, ఎంటమాలజీ విభాగం సూపర్వైజర్లు, శానిటేషన్ విభాగం జవాన్లు, ఎస్ఎఫ్ఏలు పాల్గొన్నారు

రాంనగర్ కాలనీలో కార్పొరేటర్ పర్యటన



నవతెలంగాణ-అల్వాల్

అల్వాల్ 134 డివిజన్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి డివిజన్ పరిధిలోని రాంనగర్ కాలనీలో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు డ్రయినేజీ వ్యవస్థ, పారిశుధ్య నిర్వహణ, రోడ్లకు ప్యాచ్ వర్క్, దోమల బెడద నుండి కాపాడాలని కోరారు. ఎంటమాలజీ సిబ్బంది ఫాగింగ్ చేయాలని, రాంనగర్ కాలనీలో పార్కు స్థలానికి ఫెన్సింగ్ వేయాలని కాలనీవాసులు కోరడంతో కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈ లక్ష్మి, ఎంటమాలజిస్ట్ అనిల్ కుమార్, టౌన్ ప్లానింగ్ సాయి, మహేందర్, ఏఎస్ఎఫ్‌లు భాస్కర్, వెంకటేష్, కాలనీవాసులు ప్రకాష్ ,రాజశేఖర్, వేణు కుమార్ ,బాలసుబ్రహ్మణ్యం, సందీప్ తదితరులున్నారు.

అక్షరం మార్పు తెస్తుంది

ఇట్ల చేద్దాం

నాలుగైదు చుక్కల నిమ్మరసం అవసరమైనప్పుడు కాయను ముక్కలుగా కొయ్యవద్దు. సూదితో కాయకు రంధ్రం చేసి రసం పిండితే సరిపోతుంది.





ములుగు లక్ష్మీ మైథిలి... చిన్నతనం నుండి సాహిత్యమంటే ఎంతో మక్కువ. పిన్ని ప్రభావంతో చదవడం, రాయడం బాల్యంలోనే మొదలుపెట్టారు. మంచి సాహిత్యంతో సమాజంలో మార్పు తప్పకుండా వస్తుందని బలంగా నమ్మిన రచయిత్రి. కథలు, కవితలు, గేయాలు, గజల్స్, వ్యాసాలు, నానీలు ఇలా ఎన్నో ప్రక్రియల్లో తన రచనలను కొనసాగించారు. అక్షరానికున్న శక్తిని గుర్తించి సమాజానికి ఉపయోగపడే సాహిత్యాన్ని పాఠకులకు అందించాలని నితరంతరం తపిస్తున్న ఆమె పరిచయం ఆమె మాటల్లోనే...

మా సొంతూరు ఒంగోలు. అమ్మ సీతామహాలక్ష్మి, నాన్న నవులూరి శేషగిరిరావు, పోస్ట్‌మాస్టర్‌గా చేసి రిటైర్ అయ్యారు. వీళ్ళకు మేము నలుగురం పిల్లలం. నాకు ఓ అన్నయ్య, తమ్ముడు, చెల్లి ఉన్నారు. నాన్న ఉద్యోగ రీత్యా నా బాల్యం అనేక గ్రామాల్లో గడిచింది. నా బాల్యం మొత్తం చాలా సరదాగా సాగిపోయింది. ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు కర్నూలు జిల్లాలోని దొర్నిపాడు గ్రామంలో, 9వ తరగతి వరకు ఆకుమళ్ళ గ్రామంలో, 10వ తరగతి పేరుసోముల గ్రామంలో చదివాను. తర్వాత పాలిటెక్నిక్ ఎంట్రెన్స్‌లో సెకండ్ ర్యాంకు సాధించి డి.సి.పి. కోర్సులో జాయిన్ అయ్యాను.

నాన్న చనిపోవడంతో...

పాలిటెక్నిక్ పూర్తి చేసే నాటికి మా నాన్న హార్ట్‌ఎటాక్‌తో మాకు దూరమయ్యారు. ఆర్థిక ఇబ్బందులతో మా కుటుంబం మొత్తం ఒంగోలు వచ్చేసింది. ఇక రెగ్యులర్ కాలేజీలో చదవలేక దూరవిద్య ద్వారా బీఏ పూర్తి చేసాను. పెండ్లి తర్వాత నెల్లూరు వెళ్ళాను. అప్పట్లో మావారు యమ్. చంద్రశేఖర్ రావు, నెల్లూరు గవర్నమెంట్ స్కూల్ హెడ్ మాస్టర్‌గా చేసేవారు. అక్కడే నేను స్టాఫ్ సెలక్షన్ కమిషన్, గ్రూప్ ఎగ్జామ్స్ రాసాను. బి.ఈ.డి. కూడా పూర్తి చేసాను. కానీ ర్యాంకు రాలేదు. తర్వాత కొన్ని ప్రైవేటు స్కూల్స్‌లో టీచర్‌గా పని చేశాను. మా అబ్బాయి యమ్.వి.కె.విశ్వనాథ్, కోడలు గాయత్రి. ఇద్దరూ బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా చేస్తున్నారు.



సాహిత్యంతో పరిచయం...

రాయడంలో నాకు స్ఫూర్తి మా అమ్మ చెల్లెలు డా.దేశాయ్ విజయలక్ష్మి పండిట్. ఆవిడ సంస్కృతం లెక్చరర్, రచయిత్రి, కవయిత్రి. చాలా పుస్తకాలు రచించారు. మా పిన్ని ప్రభావంతోనే నేనూ రాయడం మొదలుపెట్టాను. చిన్నప్పటి నుంచి కవితలు రాయటమంటే చాలా ఇష్టం. ఎనిమిదవ తరగతి నుంచే కవితలు, గేయాలు రాసేదాన్ని. నా వయసుతో పాటే రచనల సంఖ్య కూడా పెరుగుతూ పోయింది. వివిధ పత్రికల్లో కథలు, కవితలు, నానీలు, గేయాలు వ్యాసాలు, ప్రచురించేవారు. అలాగే కొన్ని సంకలనాల్లో కూడా నా కథలు, కవితలు, వ్యాసాలు, నానీలు ప్రచురితమయ్యాయి.

పొందిన పురస్కారాలు

ఇప్పటి వరకు నా కథలకు, కవితలకు అనేక బహుమతులు, పురస్కారాలు వచ్చాయి. దేవులపల్లి కృష్ణశాస్త్రి స్మారక అవార్డు, బీబీసీ అవార్డు, ప్రతిభా పురస్కారం మొదలైనవి వచ్చాయి. ఇలా చెన్నై, బెంగుళూరు, ఢిల్లీ, హైదరాబాద్, విశాఖ పట్నం మొదలైన చోట్ల సాహితీ సంస్థల ద్వారా అందుకున్నాను.



ఇప్పటి వరకు చేసిన రచనలు

ఇప్పటివరకు మొత్తం 90 కథలు, వెయ్యి కవితలు, గజల్ ప్రక్రియలో 50, పద్యాలు 50, నానీలు- 200, వ్యంజకాలు 30, వ్యాసాలు 10, హైకూలు 50, మొగ్గలు 10, చందమామ పదాలు 10, గుణింతాల కవితలు 10, పంచపదులు పది వరకు రచించాను. వీటిలో చినుకులు, ఊహలు గుసగుసలాడే, కరచాలనం అనే మూడు కవితా సంపుటాలు వెలువడ్డాయి. ఇంకా 100 కథలు, 5 నవలలు పుస్తక రూపంలో ముద్రించాల్సి వుంది. అలాగే 'తెలుగు వైద్యుత మహా నిఘంటువు" కోసం నెల్లూరు మాండలిక(3000 పదాలు) పదకోశం కూడా రచించాను.

మార్పు తప్పక వస్తుంది

అక్షరాలకు ఎంతో శక్తి ఉంది. సమాజంలో మార్పుకు ఎంతో దోహదపడతాయి. కవితలు, కథలు, పాటలు సమాజంపై ఎంతో ప్రభావం చూపుతాయి. అయితే వీటిని జనాల్లోకి తీసుకెళ్ళడం చాలా ముఖ్యం. మనం రాసే రచనలు చదవాలే కానీ, చదివిన వారిలో మార్పు తప్పకుండా వస్తుంది. సాహిత్యానికి అంతటి శక్తి ఉంది. మన రచనలు సమాజానికి ఉపయోగపడినప్పుడే మన అక్షరాలకు విలువ, గౌరవం పెరుగుతుంది. అలాగే నేను రాసిన కథలు, కవితల వల్ల ఏ ఒక్కరిలో నైనా మార్పు రావాలని కోరుకుంటున్నాను.


సహకారం అవసరం

ఏదైనా ఓ రంగంలో మహిళలు రాణించాలంటే కచ్చితంగా కుటుంబ సహకారం చాలా అవసరం. అప్పుడే ఆమె అనుకున్నది సాధించగలుగుతుంది. నా వరకు నా కుటుంబంలో మావారు, పిల్లలు, బంధువులు అందరూ ఎంతో సహకరించే వారు. నా రచనలను ప్రోత్సహించేవారు. కాబట్టే నా రచనలను నేటికీ కొనసాగించ గలుగుతున్నాను. ఓ రచయిత్రిగా అందరి ముందు నిలబడగలుగుతున్నాను. నేను సుమారు పాతికేండ్లు ప్రైవేటు స్కూల్లో టీచర్‌గా పని చేసాను. తర్వాత మోకాళ్ళ ఆపరేషన్ చేయించుకోవడంతో ఉద్యోగం మానేశాను. కానీ పిల్లలకు చదువు చెప్పడమంటే నాకెంతో ఇష్టం. అందుకే ఇంట్లోనూ పిల్లలకు ట్యూషన్లు చెబుతూ నా రచనలు కొనసాగిస్తున్నాను.

భవిష్యత్ ప్రణాళిక...

నేను గజల్స్ పద్యాలు హైకూలు ఇంకా ఇతర ప్రక్రియల్లో కూడా రచనలు చేశాను. నేను రాసిన రచనలను పుస్తకం రూపంలో ముద్రించాలి. ఇప్పటి వరకు కేవలం మూడు కవితా సంపుటాలు మాత్రమే వెలువడ్డాయి. ఒక కథా సంపుటి, ఐదు నవలలు ముద్రణలో ఉన్నాయి. వీటిని కూడా త్వరలో పూర్తి చేసి పాఠకులకు అందించాలి.

- సలీమ



దానిమ్మతో లాభాలు...

మానవ శరీరంలో మెదడు చాలా కీలకమైన అవయవం. మెదడు ఇచ్చే సంకేతాల ఆధారంగానే శరీరంలోని ఇతర భాగాలు పనిచేస్తాయి. అందుకే మెదడు పనితీరు సరిగా ఉంటేనే మనిషి ఆరోగ్యంగా ఉన్నట్టు భావిస్తారు. అయితే బ్రెయిన్ పనితీరు మెరుగుపడాలంటే ఆహారం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. పోషకాలు, ఖనిజాలు పుష్కలంగా లభించే పదార్థాలు డైట్‌లో చేర్చుకోవాలి. అందులో కీలకమైనది దానిమ్మ. దానిమ్మ గింజలను డైరెక్ట్‌గా తినవచ్చు. లేదా జ్యూస్ చేసుకుని తాగవచ్చు. ఏవిధంగా తీసుకున్నా ప్రయోజనం ఉంటుంది. ఎందుకంటే ఇందులో సహజ చక్కెరలు పుష్కలంగా ఉంటాయి.

జ్ఞాపకశక్తి పెరుగుదల

దానిమ్మ గింజలు ఎరుపు రంగులో ఆకర్షణీయంగా కనిపిస్తూ రుచికరంగా ఉంటాయి. వీటిలో విభిన్న పోషకాలు, ఖనిజాలు లభిస్తాయి. తరచుగా దానిమ్మను తినడం వల్ల మెదడు పనితీరు మెరుగుపడుతుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది. ఈ పండ్లలోని సమ్మేళనాలు మంచి నిద్రను పెంపొందిస్తాయి. ఫలితంగా మెదడు మొత్తం ఆరోగ్యం బాగుపడుతుంది.

అల్జీమర్స్ ముప్పు తక్కువ

దానిమ్మలో ఎల్లాగిటానిన్స్ అనే ఒక రకమైన యాంటీఆక్సిడెంట్ ఉంటుంది. ఇది గట్ మైక్రోబయోటాగా పనిచేస్తుంది. ఇది అల్జీమర్స్ వ్యాధికి వ్యతిరేకంగా న్యూరో ప్రొటెక్టివ్ ప్రభావాన్ని చూపుతుంది.

మెరుగైన నిద్ర

మెగ్నీషియం అధికంగా ఉండే దానిమ్మను తినడం వల్ల శరీర కండరాలు సడలిస్తాయి. దీంతో నాడీ వ్యవస్థ శాంతపడుతుంది. మంచి నిద్రను ప్రోత్సహిస్తుంది. నిద్రలేమి లక్షణాలను తగ్గించడంలోనూ కీలకంగా పనిచేస్తుంది. ■

నిబంధనలు సవరించాలి

(మొదటిపేజీ తరువాయి)

గుర్తించి వారికీ రైతుభరోసా పంటపెట్టుబడి సహాయం ఇవ్వాలని కోరారు. గిరిజన రైతులనూ ఆదుకోవాలన్నారు.

'సీతారామ'ను పాలేరుతో అనుసంధానించాలి

దుమ్ముగూడెం ప్రాజెక్టు సాధన కోసం తాను మూడువేలకు కి.మీ పైగా రైతుయాత్ర చేశానని, ఆ నాటి ముఖ్యమంత్రి డిజైన్ మార్చి సీతారామ ఎత్తిపోతల పథకం నిర్మాణం చేపట్టారన్నారు. మొదటి డిజైన్ ప్రకారం సీతారామ ప్రాజెక్టు ద్వారా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల రైతులు లబ్దిపొందేలా చూడాలన్నారు. అందుకే దాన్ని ఏన్కూరు వరకే పరిమితం చేయకుండా పాలేరు రిజర్వాయర్‌తో అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు.

విద్యా, వైద్యరంగాలకు 10శాతమైనా నిధులు కేటాయించాలి

వచ్చే బడ్జెట్‌లో విద్యా, వైద్యరంగాలకు కనీసం పదిశాతం నిధులైనా కేటాయించాలని కోరారు. ఫీజురీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా డెంగ్యూ, వైరల్ జ్వరాల నియంత్రణకు తగిన వైద్యసిబ్బందిని, మందులు అందుబాటులో ఉంచాలని కోరారు. రోడ్లు, రైల్వేలైన్లు, కాల్వలు, వివిధ ప్రాజెక్టుల కింద భూములు కోల్పోతున్న నిర్వాసితులకు మార్కెట్ ధరల ప్రకారం పరిహారం చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

ఆ పది మందిపై చర్యలు తీసుకోండి

(మొదటిపేజీ తరువాయి)

విషయాన్ని సభాపతికి తెలిపామని అన్నారు. తమ పార్టీకి చెందిన పది మంది ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎమ్మెల్సీలు, ఒక రాజ్యసభ సభ్యుడు ఫిరాయింపులకు పాల్పడ్డారని గుర్తు చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ.. పార్టీ ఫిరాయింపులకు సంబంధించి సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పుల కాపీలను కూడా స్పీకర్‌కు అందజేశామని అన్నారు. కోర్టు తీర్పు ప్రకారం మణిపూర్‌లో పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్యామ్ కుమార్‌పై అక్కడి స్పీకర్ చర్యలు తీసుకుని, అతడి శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేశారని వివరించారు. రాష్ట్రంలో కూడా ఇదే పద్ధతిని అనుసరించాలని ఆయన స్పీకర్‌ను కోరారు. లేదంటే సభాపతి పదవికే మచ్చ వస్తుందని వ్యాఖ్యానించారు.

పార్టీ ఫిరాయింపులకు సంబంధించి సుప్రీంకోర్టు జడ్జిమెంట్‌ను కూడా స్పీకర్‌కు చదివి వినిపించామని కేటీఆర్ ఈ సందర్భంగా తెలిపారు. అలాంటి ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు ఉందంటూ సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసిందని వివరించారు. తమ పార్టీని వీడిన వారిలో మొదటగా దానం నాగేందర్ ఉన్నారనీ, ఆయనపై మార్చి 18న తొలి పిటిషన్ అందజేశామని తెలిపారు. ఇప్పుడు మరో తొమ్మిది మందిపై ఫిర్యాదు చేశామన్నారు.

రేవంత్ పాలనలో దుర్మార్గాలు

సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో దుర్మార్గమైన పరిస్థితులు నెలకొన్నాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలకు అక్కడి డీఎస్పీలు ఫోన్ చేసి పార్టీ మారండి.. లేదంటే ప్రాణాలకే ముప్పంటూ బెదిరిస్తున్నారని వాపోయారు. గతంలో బీజేపీని వాషింగ్ మిషన్ పార్టీగా విమర్శించిన కాంగ్రెస్ ఇప్పుడు రాష్ట్రంలో అదే పని చేస్తోందని ఎద్దేవా చేశారు. ఎవరైనా ఎమ్మెల్యే పార్టీ మారకపోతే బెదిరిస్తున్నారు, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంతో దాడులు చేయిస్తున్నారు, వారి ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో బడేభాయ్ (మోడీ), చోటాభాయ్ (రేవంత్)కు తేడా ఏమీ లేదని విమర్శించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలను రాబోయే రోజుల్లే ప్రజలే శిక్షిస్తారని కేటీఆర్ హెచ్చరించారు.

గురుకుల విద్యార్థిని మృతి

- సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలో ఘటన
- మృతికి కారణాలపై విచారణ జరపాలి : మంత్రి పొన్నం

నవతెలంగాణ-పెన్‌పహాడ్/హైదరాబాద్ బ్యూరో



బీసీ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థిని జ్వరంతో బాధపడుతూ మృతి చెందింది. ఈ ఘటన సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండల పరిధిలోని దోసపహాడ్ గ్రామంలో మంగళవారం జరిగింది. ఎస్ఐ పెరిక రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. నూతనకల్ మండలం మాశినపల్లి గ్రామానికి చెందిన కొంపెల్లి సోమయ్య- నవ్య దంపతుల కుమార్తె సరస్వతి(10) దోసపహాడ్ గ్రామంలో నిర్వహిస్తున్న సింగారెడ్డిపాలెం బీసీ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నది. హాస్టల్‌లో ఉన్న సరస్వతి సోమవారం రాత్రి నుంచి జ్వరంతో బాధపడింది. జీఎన్ఎం జ్యోతి పర్యవేక్షించారు. జ్వరం ఎక్కువవుతుందని మంగళవారం తెల్లవారు జామున స్థానికంగా ఉన్న ఓ ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. ఆర్ఎంపీ బాలికకు ఇంజెక్షన్ వేయడంతో.. ఫిట్స్ వచ్చింది. దాంతో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి 108 అంబులెన్సులో తరలించారు. డ్యూటీ డాక్టరు బాలికను పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. తమ కుమార్తె మృతిపై పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, సిబ్బందిపై అనుమానం ఉన్నట్టు బాలిక తండ్రి సోమయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పాఠశాలను సందర్శించిన అధికారులు

పాఠశాలను డీఎస్పీ రవి, ఆర్డీఓ వేణుమాధవ రావు సందర్శించారు. వారి వెంట సీఐ సురేందర్ రెడ్డి, తహసీల్దార్ మందడి మహేందర్ రెడ్డి, ఎస్ఐ బాలు నాయక్ ఉన్నారు.

సమగ్ర విచారణ జరపాలి : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్ వర్మ

సరస్వతి మృతి పట్ల సమగ్ర విచారణ జరపాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్ వర్మ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అనంతరం ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. గురుకులాల్లో వరుస ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. పాఠశాలలో జీఎన్ఎం ఉండగా ఆర్ఎంపీ డాక్టర్ దగ్గర చూపించడం ఏంటని ప్రశ్నించారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి.. ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బానోత్ వినోద్, అక్కినపల్లి వినయ్, యాతాకుల ప్రవీణ్, వినయ్, అజయ్, రవి పాల్గొన్నారు.

సరస్వతి మృతికి కారణాలపై విచారణ జరపాలి : మంత్రి పొన్నం

విద్యార్థిని సరస్వతి అకాల మృతిపై విచారణ జరిపించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ గురుకుల కార్యదర్శి బడుగు సైదులును ఆదేశించారు. ఆమె మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. తన సంతాపాన్ని ప్రకటించారు. విద్యార్థిని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి ఇంట్లో ఒకరికి బీసీ రెసిడెన్షియల్ సొసైటీలో ఉద్యోగాన్ని కల్పిస్తామని హామీ ఇచ్చారు.

సరస్వతి మృతి విషయాన్ని తెలుసుకున్న మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి ఆ కుటుంబానికి రూ.రెండు లక్షల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు.

విద్యుత్ కమిషన్ చైర్మెన్‌ను తొలగించాలి

(మొదటిపేజీ తరువాయి)

అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. అందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. ఈ లోపే కమిషన్ చైర్మెన్ రిటైర్డ్ జడ్జి ఎల్. నరసింహారెడ్డి తాను పదవి నుంచి తప్పుకుంటున్నట్టు సుప్రీంకోర్టుకు లేఖ పంపారు. అలాగే కొత్త చైర్మెన్‌ను సోమవారంలోగా నియమిస్తామని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. ఇప్పటి వరకు ఉన్న విచారణను కొనసాగించాలని, కొత్తగా మళ్లీ మొదటి నుంచి అవసరం లేదని సూచించింది.

మరోపక్క విద్యుత్ ఒప్పందాల్లో అవకతవకలకు సంబంధించిన ఆరోపణలపై విచారణ జరిపేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్‌ను రద్దు చేయాలంటూ మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు వేసిన పిటిషన్‌ను జులై 1న హైకోర్టు కొట్టేసిన విషయం తెలిసిందే. దీంతో ఆయన సుప్రీంను ఆశ్రయించారు. ఆ పిటిషన్‌పై మంగళవారం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ జెబి పార్థివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను తిరస్కరించింది.

విచారణ జరగాల్సిందే : సుప్రీంకోర్టు

విచారణ జరుగుతున్న సమయంలో కమిషన్ చైర్మెన్‌గా జస్టిస్ నర్సింహారెడ్డి విలేకరుల సమావేశం పెట్టి, తన అభిప్రాయాలు వెల్లడించడాన్ని ధర్మాసనం తప్పుపట్టింది. కచ్చితంగా విచారణ జరగాల్సిందేనని స్పష్టం చేసింది. మెరిట్‌లపై పరిశీలనలు, విచారణ నివేదిక ఒక వ్యక్తి ప్రతిష్టను ప్రభావితం చేయడమే సమస్య అని పేర్కొంది. "విచారణ కమిషన్ చైర్మెన్ మాజీ న్యాయమూర్తి స్థానంలో మరొక న్యాయమూర్తిని నియమించండి. ఎందుకంటే న్యాయం జరగాలి అనే అభిప్రాయం ఉండాలి. ప్రెస్ మీట్ పెట్టి విచారణ కమిషన్ చైర్మెన్‌గా మెరిట్‌లపై అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఇది అభ్యంతరకరమైంది.విచారణ జరుగుతున్నప్పుడు విచారణలోని రహస్యాలపై బహిరంగంగా మాట్లాడ కూడదు" అని ధర్మాసనం పేర్కొంది. న్యాయమూర్తి అయిన వ్యక్తికి ఇది కొంచెం ఇబ్బందికర మైనదని వ్యాఖ్యానించింది. ఆయన మెరిట్‌లపై నిర్దిష్ట పరిశీలనలు చేయపోతే, అప్పుడు కోర్టు జోక్యం చేసుకునేది కాదని స్పష్టం చేసింది.

మాజీ సీఎం కేసీఆర్ తరపు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపిస్తూ విద్యుత్ విచారణ కమిషన్ నియామకంలో పరిధిని అతిక్రమించారని, ట్రిబ్యునల్స్ ఉండగా, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపై ఎలా న్యాయ విచారణ చేస్తారని ప్రశ్నించారు. కొత్త రాష్ట్రం ఏర్పడిన నేపథ్యంలో విద్యుత్ సంక్షోభం నేపథ్యంలో విద్యుత్ కొనుగోలు చేశామని, మార్కెట్ రేట్ కంటే తక్కువగా యూనిట్ రూ.3.90 పైసలకు మాత్రమే కొనుగోలు చేశారని చెప్పారు. "ఆయన మాజీ ముఖ్యమంత్రి. ఇప్పుడున్న సీఎం ఈ అంశంపై అనేక సార్లు ఆర్టీఐ వేశారు. ఇది కక్ష సాధింపు చర్య. విచారణకు ముందే దోషిగా తేలుస్తున్నారు. కమిషన్ చైర్మెన్ మీడియా సమావేశం పెట్టి మరీ చెప్తున్నారు. రాజకీయ దురుద్దేశంతో చేస్తున్నారు" అని ముకుల్ రోహత్గీ వినిపించారు.

తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మను సింఘ్వీ, సిద్దార్థ్ లూథ్రా వాదనలు వినిపిస్తూ ఇది పక్షపాతంగా వ్యవహరించడం కాదని పేర్కొన్నారు. చాలా పారదర్శకంగా జస్టిస్ రెడ్డి వ్యవహరించారని తెలిపారు. ఆయన మాజీ న్యాయమూర్తి అని, మార్చి 14న ఇచ్చిన నోటిఫికేషన్‌లో న్యాయ విచారణ అనే అంశంపై వివరించారు. కమిషన్ చైర్మెన్ నరసింహారెడ్డి తరపున సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ వాదనలు వినిపిస్తూ పక్షపాత ఆరోపణలు తప్పుగా మోపుతున్నారని పేర్కొన్నారు. జస్టిస్ రెడ్డి తన బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్టు కోర్టురకు తెలిపారు.

21న అఖిల పక్ష సమావేశం

23న పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఈ నెల 22 (సోమవారం) నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. ఆగస్టు 12 వరకు జరిగే ఈ సమావేశాల్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ నెల 23న పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం జులై 21న అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. పార్లమెంట్ ఉభయ సభల్లోని అన్ని రాజకీయ పార్టీల పక్షనేతలను బడ్జెట్ సెషన్, సభా వ్యవహారాలపై చర్చించేందుకు సమావేశానికి ఆహ్వానించింది. సభ సజావుగా సాగడంతో పాటు ముఖ్యమైన అంశాలపై భేటీలో చర్చించే అవకాశం ఉంది. అయితే ఈ సమావేశానికి టీఎంసీ హాజరుకావడం లేదు. జులై 21న రాష్ట్ర అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఈ సమావేశానికి హాజరుకావడం లేదని టీఎంసీ వర్గాలు తెలిపాయి. అయితే ఈ సమావేశాల్లో ప్రతిపక్షాలు నీట్ పేపర్ లీక్, అగ్నిపథ్ పథకం రద్దు తదితర అంశాలపై లేవనెత్తనున్నాయి. లోక్‌సభ ఎన్నికలకు ముందు ఈ ఏడాది ఫిబ్రవరిలో మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఎన్నికల అనంతరం పూర్తిస్థాయిలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నట్టు ప్రభుత్వం అప్పట్లో తెలిపింది. ఈ నేపథ్యంలోనే కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో 2024-25 సంవత్సరానికి సంబంధించి పూర్తి స్థాయి బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సభలో ప్రవేశ పెట్టనున్నారు.

తుమ్మిడిహెట్టి వద్ద 160 టీఎంసీల నీటి లభ్యత

(మొదటిపేజీ తరువాయి)

అనుసంధానం టాస్క్‌ఫోర్స్ చైర్మెన్ వెదిరె శ్రీరామ్ అన్నారు. కానీ ప్రాణహిత చేవెళ్లను రీడిజైన్ చేసి కాళేశ్వరంగా మార్చారనీ, రిజర్వాయర్ నిర్మాణం తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు మార్చారని చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్‌లో కాళేశ్వరం న్యాయ కమిషన్ చైర్మెన్ రిటైర్డ్ జస్టిస్ పీసీ ఘోష్ ఎదుట హాజరయ్యారు. దాదాపు అరగంటపాటు విచారణ జరిగింది. ఈసందర్భంగా కమిషన్ చైర్మెన్‌కు తన దగ్గర ఉన్న వివరాలను అందజేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు సాంకేతిక అంశాలు, డిజైన్లు, తదితర అంశాలపై మాట్లాడారు. ఎన్‌డీఎస్ఏ ఇప్పటికే ఇచ్చిన రెండు నివేదికలు, సంఘటన జరిగిన తర్వాత తాత్కాలిక నివేదికపై చర్చించినట్టు మీడియాతో చెప్పారు ఎన్‌డీఎస్ఏ ఇచ్చిన నివేదికలపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు తదితర అంశాలపై కూడా చర్చించారు. మేడిగడ్డ, తుమ్మిడిహెట్టి రెండు ప్రాంతాల్లో నీటి లభ్యత వివరాలను కమిషన్‌కు సమర్పించినట్టు చెప్పారు. దాదాపు పది అంశాలపై పూర్తిస్థాయిలో నివేదికను కమిషన్‌కు వెదిరె శ్రీరామ్ ఇచ్చారు. అలాగే స్లైడ్స్ ద్వారా కూడా చైర్మెన్‌కు విపులంగా చెప్పారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మెన్ పీసీ ఘోష్ పలు ప్రశ్నలు అడిగినట్టు తెలిసింది. డీపీఆర్ దగ్గర నుంచి పనుల ముగింపు వరకు ఎవరెవరి పాత్ర ఎంతమేరకు ఉందో అడిగి తెలుసుకున్నట్టు సమాచారం.

కవితకు అస్వస్థత

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్టై తీహార్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం మధ్యాహ్నం వరకూ బాగానే ఉన్న ఆమె ఒక్కసారిగా అనారోగ్యం పాలయ్యారు. దీంతో తీహార్ జైలు సిబ్బంది, ఉన్నతాధికారులకు సమాచారం అందించగా ఆమెను వెంటనే దీన్ దయాల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ కవితకు చికిత్స అందించారు. తొలుత కవితకు ఏమైంది..? ఏ విషయంలో ఆస్పత్రికి తీసుకెళ్లారనే దానిపై క్లారిటీ రాకపోవడంతో కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణులు, నేతలు ఆందోళన చెందారు. జ్వరం అని తెలియడంతో ఊపిరి పీల్చుకున్నారు. మంగళవారం రాత్రి లేదా బుధవారం ఉదయం బీఆర్ఎస్ అగ్రనేతలు కేటీఆర్, హరీశ్‌రావు కవితను పరామర్శించనున్నారు.

కవిత ఆరోగ్యంపై దీన్ దయాల్ ఆస్పత్రి వైద్యులు ఆస్పత్రిలో చేరిన రెండు గంటల అనంతరం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని ప్రకటించారు. అనంతరం ఆస్పత్రి నుంచి కవితను డిశ్చార్జి చేశారు. ఆస్పత్రి నుంచి నేరుగా ఆమెను మళ్లీ తీహార్ జైలుకు తరలించారు. కాగా..కవిత రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు. మంగళవారం నీరసంతో కండ్లు తిరిగి పడిపోవడంతో ఆస్పత్రికి తరలించారు.

నవచిత్రం

మాస్ బీట్‌తో మార్ ముంత..



రామ్, కావ్యా థాపర్

రామ్ పోతినేని, పూరి జగన్నాథ్ కాంబోలో రూపొందిన సెన్సేషనల్ హిట్ 'ఇస్మార్ట్ శంకర్' సినిమా థియేటర్లలో విడుదల కాకముందే మ్యూజికల్ హిట్ అయ్యింది.
అలాగే ఈ డెడ్లీ కాంబినేషన్‌లో సెకెండ్ మూవీ ఆల్బమ్ కూడా విడుదలకు ముందే చార్ట్‌బస్టర్‌గా మారింది. 'ఇస్మార్ట్ శంకర్'కి సీక్వెల్ అయిన 'డబుల్ ఇస్మార్ట్' చిత్రానికి మ్యూజిక్ అందిస్తున్న మణిశర్మ మరో మాస్-అపీలింగ్ చార్ట్‌బస్టర్ ఆల్బమ్‌ను స్కోర్ చేశారు.
'ఫస్ట్ సింగిల్ 'స్టెప్పా మార్..'కి థంపింగ్ రెస్పాన్స్ వచ్చింది. మంగళవారం సినిమాలోని సెకెండ్ సింగిల్ 'మార్ ముంత చోడ్ చింత..' విడుదలైంది. కాసర్ల శ్యామ్ రాసిన లిరిక్స్ పెక్యూలర్‌గా ఉన్నాయి. హైదరాబాద్ యాసలో అద్భుతంగా ఆకట్టుకున్నాయి. ఇది దేశీ పార్టీ నెంబర్‌కి వైబ్‌ని యాడ్ చేస్తోంది. మణి శర్మ కంపోజిషన్ వెరీ నేటివ్ ఫోక్‌తో ఆకట్టుకుంది. బీట్స్ చాలా హైగా ఉన్నాయి. రాహుల్ సిప్లిగంజ్, ధనుంజన్ సీపాన, కీర్తన శర్మ త్రయం ఈ పాటకు వోకల్స్ అందించారు. వారి వోకల్స్ పాటలోని ఎనర్జీకి పెర్ఫెక్ట్‌గా మ్యాచ్ అయ్యాయి. రామ్ ఎనర్జీ నెక్స్ట్ లెవల్‌లో ఉంది. ఆయన డ్యాన్స్ కన్నుల పండువగా ఉంది. హుక్ స్టెప్ ఇన్‌స్టంట్‌గా పాపులర్ అయ్యింది. రామ్‌తో పాటు కాలు కదిపిన కావ్య థాపర్ ఈ పాటలో పెర్ఫెక్ట్ గ్లామర్‌ని యాడ్ చేశారు, లైవ్లీ సెట్స్‌లో షూట్ చేశారు. దేశీ పార్టీస్ టైంలో ఈ పాట ప్రతి ఒక్కరికీ ప్రైమ్ ఛాయిస్ అవుతుంది అని చిత్ర బృందం తెలిపింది. పూరి కనెక్ట్స్ బ్యానర్‌లో పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్ నిర్మించిన ఈ సినిమాలో సంజయ్ దత్ పవర్ ఫుల్ పాత్రని పోషించగా, రామ్ సరసన కావ్య థాపర్ హీరోయిన్‌గా నటించింది. ఈ పాన్ ఇండియా మూవీ ఆగస్ట్ 15న గ్రాండ్‌గా విడుదల కానుంది.



కిచ్చా సుదీప్

విజువల్ ట్రీట్‌గా మాక్స్ టీజర్

హీరో కిచ్చా సుదీప్ నటించిన 'మాక్స్' టీజర్‌ను మంగళవారం మేకర్స్ విడుదల చేశారు. యాక్షన్ జోనర్ లవర్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన ఈ 'మాక్స్' టీజర్ ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటోంది.
పాన్-ఇండియన్ సినిమాగా రాబోతోన్న ఈ సినిమా మీద ఇప్పటికే భారీ అంచనాలు ఏర్పడ్డాయి. కిచ్చా సుదీప్ చాలా కాలం తరువాత మళ్లీ మాస్ అవతార్‌లో కనిపిస్తున్నారు. టీజర్‌లో ఆయన డెమి-గాడ్ లుక్ అభిమానులకు ఐ ఫీస్ట్‌లా ఉంది. మాస్, యాక్షన్ లవర్స్‌ను ఆకట్టుకునేలా సినిమాను తీయబోతోన్నారని టీజర్ చూస్తేనే తెలుస్తోంది. ఒక్కమాటలో చెప్పాలంటే విజువల్ ట్రీట్‌గా అందరినీ మెస్మరైజ్ చేస్తోంది అని చిత్ర యూనిట్ తెలిపింది. విజయ్ కార్తికేయ దర్శకత్వంలో రాబోతోన్న ఈ చిత్రంలో వరలక్ష్మి శరత్‌కుమార్, సంయుక్త హోర్నాడ్, ప్రమోద్ శెట్టి తదతరులు నటించారు. అజనీష్ లోక్‌నాథ్ చిత్రానికి సంగీతం అందించారు. వి క్రియేషన్స్ బ్యానర్‌పై కలైపులి ఎస్ థాను, కిచ్చా క్రియేషన్స్ బ్యానర్‌పై కిచ్చా సుదీప్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

డార్లింగ్ బ్లాక్‌బస్టర్ ఖాయం : నాని



ప్రియదర్శి, నభా నటేష్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'డార్లింగ్'. అశ్విన్ రామ్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై కె.నిరంజన్ రెడ్డి, శ్రీమతి చైతన్య నిర్మించిన ఈ చిత్రం ఈనెల 19న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ నిర్వహించిన ప్రీరిలీజ్ ఈవెంట్‌కి హీరో నాని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "డార్లింగ్' టీజర్, ట్రైలర్ చాలా ఎంటర్‌టైనింగ్‌గా ఉన్నాయి. ఈ మధ్య యాక్షన్ సినిమాలు ఎక్కువైపోయి కామెడీ, లవ్ స్టోరీలను మిస్ అవుతున్నాం. ఈ సినిమా పెద్ద బ్లాక్ బస్టర్ కావాలి. దర్శి లాంటి ట్యాలెంటెడ్ యాక్టర్ ఇలాంటి డిఫరెంట్ సబ్జెక్ట్స్ సెలెక్ట్ చేసుకోవడం చాలా హ్యాపీగా ఉంది. స్ప్లిట్ పర్సనాలిటీ కాన్సెప్ట్ అదిరిపోయింది. లేడి అపరిచితుడు. ఇలాంటి కాన్సెప్ట్‌తో సరిగ్గా చేస్తే ఎంత లాఫ్టర్ జనరేట్ చేయవచ్చో ఊహించగలను. ట్రైలర్ చూస్తుంటే పర్ఫెక్ట్ ఎంటర్‌టైనర్ అనిపిస్తుంది. నిరంజన్ , చైతన్య 'హనుమాన్' అంత సక్సెస్ డార్లింగ్ కావాలని కోరుకుంటున్నాను. డైరెక్టర్ అశ్విన్‌కి ఆల్ ది వెరీ బెస్ట్. నభా 'డార్లింగ్'తో న్యూ చాప్టర్ స్టార్ట్ చేస్తున్నారు. నా వాల్ పోస్టర్ బ్యానర్ నెక్స్ సినిమాలో దర్శినే హీరో. జగదీశ్ ఈ మూవీకి డైరెక్టర్. జోనర్ మిగతా వివరాలు త్వరలో చెప్తాం' అని తెలిపారు.
'చిన్నప్పుడు చిరంజీవిని చూసి యాక్టర్ కావాలని ఇన్స్పిరేషన్ అయితే ఇప్పుడు నాని ఇన్స్పిరేషన్. ప్రేక్షకుడు ఇచ్చిన టైమ్‌కి వాల్యూ యాడ్ చేయాలని అనుకుంటా. ఒక మంచి సినిమా మీకు మళ్ళీ తిరిగివ్వాలి. మీరు మాకిస్తున్న ప్రేమని రెండింతలు తిరిగివ్వాలని నేను అనుకుంటున్నాను. ఈనెల 19న మీతో కమ్యునికేట్ చేస్తా, మిమ్మల్ని ఎంగేజ్ చేస్తా. మీరు థియేటర్ కి వస్తే మా టీం తరపున మీరు అనుకున్నదాని కంటే ఎక్కువ ప్రేమ ఇస్తా' అని అన్నారు.

రోటి కపడా రొమాన్స్



సృజన్ కుమార్ బొజ్జంతో కలిసి నిర్మాత, లక్కీ మీడియా అధినేత బెక్కెం వేణుగోపాల్ నిర్మించిన చిత్రం 'రోటి కపడా రొమాన్స్'. హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువ్వేక్ష, మేఘలేఖ, ఖుష్బూ చౌదరి హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి విక్రమ్ రెడ్డి దర్శకుడు. ఆగస్టు 2న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్రంలోని 'గలీజ్..' సాంగ్ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి హీరో విశ్వక్‌సేన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
నిర్మాత సృజన్ కుమార్ బొజ్జం మట్లాడుతూ,'ఇటీవల ప్రివ్యూ వేశాం. సినిమా అందరికి బాగా నచ్చింది' అని అన్నారు. 'ఏదో ఒక కొత్త పాయింట్‌ను ప్రేక్షకులకు చెప్పాలనే ఉద్దేశంతో ఇలాంటి ఓ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌ను తీశాం' అని నిర్మాత బెక్కెం వేణుగోపాల్ చెప్పారు.
దర్శకుడు విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ, 'సినిమా విజయంపై చాలా విశ్వాసంతో ఉన్నాం. తప్పకుండా హిట్ కొడుతున్నాం' అని తెలిపారు.

పేక మేడలు రిలీజ్‌కి రెడీ



అనూష కృష్ణ, వినోద్ కిషన్

క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ సంస్థ నుంచి రాకేష్ వర్రే నిర్మాతగా వ్యవహరించి హీరోగా నటించిన సినిమా 'ఎవరికీ చెప్పొద్దు' థియేటర్, ఓటీటీలో మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు అదే ప్రొడక్షన్ హౌస్ నుంచి రెండవ సినిమాగా 'పేక మేడలు' రాబోతోంది.
ఈ సినిమాతో తెలుగులో హీరోగా వినోద్ కిషన్ పరిచయం అవుతున్నారు. అనూష కృష్ణ హీరోయిన్‌గా నటిస్తున్నారు.
ఇటీవలే విడుదలైన ట్రైలర్‌కి మంచి స్పందన లభించింది. కామెడీతో పాటు మధ్యతరగతి ఫ్యామిలీ ఎమోషన్స్‌ని చాలా బాగా చూపించారు. ఉమెన్ ఎమ్‌పవర్‌మెంట్‌ని బేస్ చేసుకున్న సినిమా ఇది. ఇంతకుముందు వినూత్న రీతిలో క్యూఆర్ స్కాన్‌తో, బంతితో హీరో చేసిన ప్రమోషన్స్ బాగా వర్క్ అవుట్ అయ్యాయి. ఇక ఇప్పుడు అదే తరహాలో ప్రమోషన్ చేస్తూ పెయిడ్ ప్రీమియర్స్ టికెట్ రేట్‌ను 50 రూపాయలకే పెట్టి వైజాగ్, విజయవాడ, హైదరాబాద్‌లో ప్రత్యేక షోలు వేస్తున్నారు. కొత్తగా చేస్తున్న ఈ ప్రమోషన్స్ చూసి ప్రముఖ డిస్ట్రిబ్యూటర్స్ ముందుకు వచ్చి సినిమాని విడుదల చేయడానికి సిద్ధమయ్యారు. ఈ నెల 19న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.
ఈ సందర్భంగా డైరెక్టర్ నీలగిరి మామిళ్ల మాట్లాడుతూ, సినిమా ట్రైలర్‌కి చాలా మంచి స్పందన లభిస్తుంది. ప్రొడ్యూసర్ రాకేష్ వర్రే చాలా సపోర్ట్ చేశారు. కంటెంట్ ఉన్న సినిమాలను తెలుగు ప్రేక్షకులు ఎలా ఆదరిస్తున్నారో మా సినిమాని కూడా అలాగే ఆదరిస్తారని ఆశిస్తున్నాం' అని అన్నారు.

మా ఊరి జాతరలో..



అమృత అయ్యర్, అల్లరి నరేష్

అల్లరి నరేష్ నటిస్తున్న యూనిక్ మాస్, యాక్షన్ ఎంటర్‌టైనర్ 'బచ్చల మల్లి'. మేకర్స్ ముందుగా అనౌన్స్ చేసినట్టుగా సెప్టెంబర్‌లోనే ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఫస్ట్ లుక్, అల్లరి నరేష్ బర్త్ డే స్పెషల్ గ్లింప్స్ సినిమాపై చాలా క్యూరియాసిటీని పెంచాయి. మేకర్స్ ఇప్పుడు మ్యూజిక్ జర్నీ స్టార్ట్ చేశారు. ఇందులో భాగంగా ఈ సినిమాలోని ఫస్ట్ సింగిల్ 'మా ఊరి జాతరలో..' పాటని రిలీజ్ చేశారు.
ఫోక్, ఫంక్ బ్లెండ్ చేస్తూ పాటను సంగీత దర్శకుడు విశాల్ చంద్రశేఖర్ స్కోర్ చేసారు. ఈ మెలోడీని సింధూరి విశాల్‌తో కలిసి హను-మాన్ కంపోజర్ గౌరా హరి మెస్మరైజింగ్‌గా పాడారు. ఈ పాటలో అల్లరి నరేష్, అమృత అయ్యర్‌ల అద్భుతమైన బాండింగ్‌ని గీత రచయిత శ్రీమణి చాలా ఆకర్షణీయంగా అందించారు. లీడ్ పెయిర్ ఒకరినొకరు ఎంతగా ప్రేమిస్తున్నారో ఈ పదాలు వివరిస్తాయి.
ఈ చిత్రానికి సోలో బ్రతుకే సో బెటర్ ఫేమ్ సుబ్బు మంగదేవి దర్శకత్వం వహిస్తున్నారు. సామజవరగమన, ఊరు పేరు భైరవకోన వంటి బ్లాక్ బస్టర్‌లను అందించిన హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, బాలాజీ గుత్తా నిర్మించారు.

ఆటలు

కొత్త కెప్టెన్ ఎవరు?

- సెలక్షన్ కమిటీకి సరికొత్త సవాల్
- పొట్టి ఫార్మాట్‌కు హార్దిక్, సూర్య పోటీ
- వన్డే జట్టు పగ్గాల రేసులో రాహుల్
- నెలాఖరులో భారత జట్టు శ్రీలంక పర్యటన

ఆధునిక క్రికెట్‌లో టీమ్ ఇండియా తీయని తలనొప్పులు ఎదుర్కొంటుంది. భారత జట్టు నూతన నాయకత్వం ఎంపిక అందులో ఒకటి. టీ20 ప్రపంచకప్ విజయంతో పొట్టి ఫార్మాట్‌కు రోహిత్ శర్మ వీడ్కోలు పలికాడు. దీంతో ఈ ఫార్మాట్‌లో నాయకత్వ బాధ్యతలు అందుకునేందుకు వారసులు ఉవ్విళ్లూరుతున్నారు. 2025 చాంపియన్స్ ట్రోఫీ రేసులో సీనియర్ క్రికెటర్లు విశ్రాంతి లభించే ద్వైపాక్షిక సిరీస్‌ల్లో వన్డే జట్టు పగ్గాలు సైతం మరొకరికి అప్పగించాల్సి ఉంది. ఈ నెల 27 నుంచి శ్రీలంకతో మూడు టీ20లు, మూడు వన్డేల సిరీస్ ఆడనున్న టీమ్ ఇండియాకు కొత్త కెప్టెన్ల ఎంపిక ఇప్పుడు సెలక్షన్ కమిటీ ముందున్న కఠిన సవాల్!.

నవతెలంగాణ క్రీడావిభాగం

పొట్టి ఫార్మాట్ వారసుడు ఎవరో?

ఐసీసీ 2024 టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టుకు వైస్ కెప్టెన్ హార్దిక్ పాండ్య. దీంతో సహజంగానే రోహిత్ శర్మ తర్వాత ఈ ఫార్మాట్‌లో హార్దిక్ పాండ్య సహజ వారసుడు. కానీ హార్దిక్ పాండ్య ఆల్‌రౌండర్. అతడి కెరీర్‌లో గాయాల బెడద ఎక్కువ. 2018 నుంచి భారత్ ఆడిన 122 వన్డేల్లో హార్దిక్ పాండ్య కేవలం 54 మ్యాచుల్లోనే ఆడాడు. వచ్చే ఏడాది కీలక ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ నేపథ్యంలో బీసీసీఐ పని ఒత్తిడి మేనేజ్‌మెంట్ ప్రణాళికలు చేయనుంది. ఈ ఫార్మాట్‌లో హార్దిక్ పాండ్యకు ఎక్కువగా విశ్రాంతి అందించే అవకాశాలు ఉన్నాయి. ఇక్కడే సూర్యకుమార్ యాదవ్ పేరు తెరపైకి వస్తుంది. గత ఏడాది నవంబర్‌లో ఆస్ట్రేలియాపై 4-1తో టీ20 సిరీస్ విజయం సాధించిన భారత జట్టుకు సూర్య సారథ్యం వహించాడు. దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్‌లో నాయకత్వ పగ్గాలు చేపట్టి 1-1తో సిరీస్‌ను సమం చేసుకున్నాడు. వన్డే జట్టులోనూ సూర్యకుమార్ యాదవ్ క్రియాశీల సభ్యుడు కొనసాగే అవకాశం ఉంది. అయినప్పటికీ.. స్పెషలిస్ట్ బ్యాటర్‌గా సూర్యకుమార్ యాదవ్‌పై పెద్దగా పని ఒత్తిడి ఉండే అవకాశం లేదు. ఇది సూర్యకుమార్ యాదవ్‌కు టీ20 ఫార్మాట్ కెప్టెన్సీ అందించేందుకు దోహదం చేసే అవకాశం లేకపోలేదు. హార్దిక్, సూర్యతో పాటు బుమ్రా సైతం పోటీపడుతున్నా.. బుమ్రా వర్క్‌లోడ్‌తో అతడిని సెలక్షన్ కమిటీ పరిగణనలోకి తీసుకునే అవకాశం కనిపించటం లేదు.

ఆ ఇద్దరు శ్రీలంక వెళ్తారా?

భారత క్రికెట్ జట్టు చీఫ్ కోచ్‌గా గౌతం గంభీర్ నియమితులయ్యాడు. శ్రీలంకతో సిరీస్ నుంచి గంభీర్ బాధ్యతలు అందుకోనున్నాడు. ద్వైపాక్షిక సిరీస్‌లకు కీలక క్రికెటర్లు విశ్రాంతి తీసుకోవటంపై గతంలో గంభీర్ విమర్శలు చేశాడు. ఇప్పుడు చీఫ్ కోచ్‌గా గంభీర్ క్రికెటర్ల రొటేషన్, విశ్రాంతి అంశంలో ఏ నిర్ణయం తీసుకుంటాడో తెలియదు. ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి జనవరి వరకు భారత్ పది టెస్టు మ్యాచులు ఆడాల్సి ఉంది. ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ రేసులో టీమ్ ఇండియా ముందుంది. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, జశ్‌ప్రీత్ బుమ్రా పది టెస్టులకు అందుబాటులో ఉంటారు. దీంతో రానున్న శ్రీలంకతో వన్డే సిరీస్ సహా పలు 50 ఓవర్ల ఫార్మాట్ సిరీస్‌లకు ఈ ముగ్గురు క్రికెటర్లు దూరంగా ఉండే అవకాశం లేకపోలేదు. చాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టుకు రోహిత్ శర్మ కెప్టెన్సీ వహిస్తాడని బీసీసీఐ కార్యదర్శి ఇదివరకే ప్రకటించాడు. రోహిత్ శర్మ అందుబాటులో ఉండని వన్డే సిరీస్‌లకు టీమ్ ఇండియాకు నాయకుడు అవసరం. సెలక్షన్ కమిటీ రానున్న శ్రీలంక సిరీస్‌కే కొత్త వన్డే కెప్టెన్‌ను ఎంపిక చేయాల్సి ఉంటుంది.

కెఎల్ రాహుల్‌కు ఛాన్స్ ఉందా?

భారత జట్టు చివరగా డిసెంబర్‌లో వన్డే ఫార్మాట్‌లో ఆడింది. దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో భారత్‌కు కెఎల్ రాహుల్ సారథ్యం వహించాడు. పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తే, రానున్న శ్రీలంక సిరీస్‌కు మిడిల్ ఆర్డర్ బ్యాటర్‌గా కెఎల్ రాహుల్ జట్టులో చోటు సాధించే అవకాశం ఉంది. 2023 వన్డే వరల్డ్‌కప్‌లో వికెట్ కీపర్ బాధ్యతలు చేపట్టిన రాహుల్.. ఇక ఆ బాధ్యతలను రిషబ్ పంత్‌కు అప్పగించాల్సి ఉంటుంది. గతంలో రాహుల్, గంభీర్‌లు ఐపీఎల్ ఫ్రాంచైజీ లక్నో సూపర్‌జెయింట్స్‌కు పని చేశారు. ఇది రాహుల్‌కు ఉపయోగపడే అవకాశం ఉంది. యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్ సైతం రేసులో నిలిచాడు. ఇటీవల యువ జట్టుతో జింబాబ్వే పర్యటనలో 4-1తో టీ20 సిరీస్ విజయం సాధించాడు. వన్డే జట్టులోనూ శుభ్‌మన్ గిల్ కీలక ఆటగాడు. దీంతో ఈ ఫార్మాట్‌లో రోహిత్ శర్మ వారసుడిగా శుభ్‌మన్ గిల్‌ను సైతం పరిగణించే పరిస్థితులు ఉన్నాయి.

అయ్యర్ వస్తాడా?

బీసీసీఐ సీనియర్ సెలక్షన్ కమిటీ ముందు మరో కఠిన సవాల్ ఉంది. వన్డే వరల్డ్‌కప్‌లో రెండు సెంచరీలు, మూడు అర్ధ సెంచరీలతో 500 పైచిలుకు పరుగులు సాధించిన శ్రేయస్ అయ్యర్.. ఆ తర్వాత బీసీసీఐ ప్రకటించిన వార్షిక కాంట్రాక్టు జాబితాలో చోటు గల్లంతు చేసుకున్నాడు. వెన్నునొప్పి బాధను జట్టు మేనేజ్‌మెంట్ అర్థం చేసుకోకుండా.. దేశవాళీ క్రికెట్‌లో ఆడాలని ఒత్తిడి చేసిందని గతంలో అయ్యర్ ఆవేదన వ్యక్తం చేశాడు. కోల్‌కత నైట్‌రైడర్స్ కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ తన కెరీర్‌ను భిన్న స్థాయికి తీసుకెళ్లాడు. కోల్‌కత నైట్‌రైడర్స్ మెంటార్ గంభీర్ ఇప్పుడు భారత చీఫ్ కోచ్ కావటంతో శ్రేయస్ అయ్యర్ కోసం అతడు పట్టుబట్టే అవకాశం లేకపోలేదు. వికెట్ కీపర్‌గా రిషబ్ పంత్ వన్డే జట్టులోకి వస్తాడా? లేదా సంజు శాంసన్‌కు అవకాశం ఇస్తారా? అనేది తెలియాల్సి ఉంది. ఇక ఇటీవల ముగిసిన జింబాబ్వే పర్యటనలో యువ క్రికెటర్లు రాణించారు. శ్రీలంకతో సిరీస్‌లో సైతం కుర్రాళ్లకు అవకాశం ఇస్తారా? లేదంటే సీనియర్ క్రికెటర్లను ఎంపిక చేస్తారా? అనేది ఆసక్తికరం. భారత్, శ్రీలంక తొలి టీ20 మ్యాచ్ జులై 27న ఆరంభం కానుండగా.. తొలి వన్డే ఆగస్టు 2న షురూ కానుంది. ఈ నెల మూడో వారంలో సమావేశం కానున్న సీనియర్ సెలక్షన్ కమిటీ శ్రీలంక పర్యటనకు భారత వన్డే, టీ20 జట్లను ఎంపిక చేయనుంది.





నగాల్ నం.68

ఏటీపీ టెన్నిస్ ర్యాంకింగ్స్

న్యూఢిల్లీ : ప్రపంచ టెన్నిస్‌లో భారత వర్ధమాన క్రీడాకారుడు సుమిత్ నగాల్.. ఒక్కో మెట్టు ఎక్కుతూ ఎదుగుతున్నాడు. తాజాగా విడుదల చేసిన ఏటీపీ టెన్నిస్ ర్యాంకింగ్స్‌లో సుమిత్ నగాల్ ఐదు స్థానాలు ఎగబాకాడు. 68వ ర్యాంక్‌తో కెరీర్ అత్యుత్తమ స్థానం సాధించాడు. టెన్నిస్ ఓపెన్ శకంలో ర్యాంకింగ్స్ 1973లో ఆరంభించగా.. అప్పటి నుంచి భారత్ నుంచి ఉత్తమ ర్యాంక్ సాధించిన జాబితాలో శశి మీనన్ (71)ను సుమిత్ నగాల్ అధిగమించాడు. ఈ ఏడాది రెండు ప్రతిష్టాత్మక గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్లలో పోటీపడిన సుమిత్ నగాల్.. కెరీర్ భీకర ఫామ్‌లో ఉన్నాడు. ఫ్రెంచ్ ఓపెన్ సహా గత ఐదేండ్లలో వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ ఈవెంట్‌లో పోటీపడిన తొలి భారత ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. విజయ్ అమృత్‌రాజ్ (18), రమేశ్ కృష్ణన్ (23), సోమ్‌దేవ్ దేవ్‌వర్మన్ (62) మాత్రమే సుమిత్ నగాల్ కంటే ముందున్నారు.



పారిస్ 2024 ఒలింపిక్స్‌కు ఎంపికైన సుమిత్ నగాల్.. విశ్వక్రీడల్లో మరోసారి టైటిల్ వేట సాగించనున్నాడు. లియాండర్ పేస్ తర్వాత వరుసగా రెండు సార్లు ఒలింపిక్స్ టెన్నిస్ సింగిల్స్ ఈవెంట్‌లో పోటీపడుతున్న తొలి ఆటగాడిగా సుమిత్ నగాల్ నిలిచాడు. ఈ ఏడాది హీల్‌బ్రాన్ చాలెంజర్, చెన్నై ఓపెన్ ఏటీపీ చాలెంజర్ ట్రోఫీలను సుమిత్ నగాల్ గెల్చుకున్న సంగతి తెలిసిందే.

సిడ్నీలో సూపర్‌కింగ్స్ అకాడమీ

సెప్టెంబర్ నుంచి కోచింగ్ ఆరంభం

చెన్నై : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) అత్యంత విజయవంతమైన ఫ్రాంచైజీ చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) ఈ ఏడాది ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో క్రికెట్ అకాడమీ ఆరంభించనుంది. ఇప్పటికే రెండు అంతర్జాతీయ సూపర్ కింగ్స్ అకాడమీలు నడిపిస్తున్న సూపర్‌కింగ్స్ యాజమాన్యం కంగారూల దేశంలో మూడోది మొదలుపెట్టనున్నారు. డల్లాస్ (యుఎస్‌ఏ), రీడింగ్ (బ్రిటన్)లో ఇప్పటికే సూపర్‌కింగ్స్ ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీలు విజయవంతంగా నడుస్తున్నాయి. సిడ్నీ ఒలింపిక్ పార్క్ సమీపంలోని క్రికెట్ సెంట్రల్‌లో సూపర్ కింగ్స్ అకాడమీ ఏర్పాటు చేయనున్నారు. ప్రపంచ శ్రేణి మౌళిక సదుపాయాలతో ఏర్పాటు కానున్న క్రికెట్ అకాడమీలో ఇండోర్, అవుట్‌డోర్ శిక్షణ ఏడాది పొడవునా కొనసాగనున్నాయి. బాలురు, బాలికలకు ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి క్రికెట్ కోచింగ్ ఇవ్వనున్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.